UNIVERSAL LIBRARY
OU_204226
UNIVERSAL LIBRARY

Approved by the Government Text Book Committee
Fort St. George Gazette page 565 of 21-10-1913.

RANI SAMYUKTA

(AN HISTORICAL NOVEL)

BY

V. SUBBA RAO.

FOURTH EDITION

PRINTD AT CHANDRIKA PRESS, GUNTUR.

PUBLISHED BY

V. V. K. LAKSHMAJI RAO,

GUNTUR.

1915.

Price Rs. 12.

Copy-Right

THE SACRED MEMORY

OF

THE LATE

Srimati Velala Lakshmi Narasamma Garu

MY KIND & BELOVED MOTHER

This Story of an Indian Princess is respectfully

DEDICATED.

శ్రీ

రాణీ సంయుక్త.

మొదటి ప్రకరణము.

రమారమి యెనిమిదివందల సంవత్సరములక్రిందట ఢిల్లీపట్టణమునకును గన్యాకుబ్జనగరమునకును నడుమనున్న యమునాగంగాప్రాంత కాంతార ప్రదేశంబు లొకనాఁటి సాయంకాలమునఁ జూపరులకపరిమితానందభయ దాయకములగు రంగస్థలములై యుండెను. మూర్ఖమతులగునో ఆర్యావర్తవాసులారా! మదోన్మత్తులై, సత్యవిద్యావిదూరులై, కుమతాచారములంబట్టువడి, యైకమత్యాభావమున మెలంగుచు, మాతృభూమియగు నార్యావర్తముపై నించుకైన నభిమానముంచక, పరస్పరద్వేషంబుల జనింపఁజేసికొని దుష్కృత్యములఁ గావింప సమకట్టితిరి కావున నందఱకు బుద్ధివచ్చునటుల మీపైఁ దాడి వెడలఁ బరరాజు నొకనిఁ బ్రోత్సాహపఱచెదనని కోపారుణితలోచనుండై యవనదేశమున కేగుచున్నాఁడోయన రవి పడమటిసముద్రమునఁ గ్రుంకుచుండెను. అట్టి సంధ్యాకాలమందు యమునానదికిఁగొంచెముదూరములోనున్న మథురానగరమున కొకమైలుక్రిందుగా నదికొక ఫర్లాంగుయెడములోఁ గొన్నిబండ్లు నడిచిపోవుచుండెను. బండ్లన్నియు నెద్దులుమోయఁగలిగినన్ని సరకు బస్తాలతో నింపఁబడి, వర్షము వచ్చినను దడియకుండుటకై యరచేతిమందములగు పెద్దపెద్దమైనపు గుడ్డలతోఁగప్పఁబడి త్రాళ్ళచే బిగింపఁబడియుండెను. ప్రతిబండియొక్క పైభాగమునఁ దుపాకులఁ ద్రాళ్ళయందుదోపి నడుమనఁగట్టుకొని

యున్న బారుకత్తులు క్రిందికి వ్రేలాడుచుండ నిద్దతిద్దఱుసిపాయిలు పడియుండిరి. బండ్లవారందఱు ఆసాయంకాలమున కుత్తుకనిండఁ ద్రాగిన సారాయిమైకము వలన నొడలుమఱచి తలలు వ్రాల్చుకొని పోవనూఁగులాడుచు మిట్టపల్లములుగానున్న నేలపై నడచుచుండుటచే బండ్లదరి పడినప్పుడెల్లఁ దామును నదరిపడి లేచి యెడ్లనదలించుచుఁ దోలుకొనిపోవుచుండిరి. పైభాగమునఁ బడియున్న సిపాయిలుసహితము వారితోసమానమగు నవస్థయందుండుటచే వారును దమకు మెలఁకువగల్గినప్పు డంతయు బండ్లవారల నదలించుచుండిరి. రౌతు మెత్తనివాఁడైన గుఱ్ఱమొంటికాలితో నడచునను రీతి వారందఱు నట్టిస్థితియందుండ నెద్దులెట్లునడచుచుండినదియుఁ జదువరులే యూహింపఁగలరు. బండివాఁడు కోలతో దెబ్బఁదీసినప్పుడెల్ల రెండుమూఁడడుగులు ముందుకులాగుచు మిట్టవచ్చినవెంటనే యాగిపోవుచుండెను. ఆగి పచ్చికమేత కాసపడి తమ యిష్టమువచ్చినట్లెల్ల లాగికొనిపోవుచుండెను. కావునఁ బండ్లన్నియు సిపాయిలేర్పఱచుకొన్న మార్గముఁదప్పి ఈవలావలఁజెదరి నిలచియుండెను.

ఆతరుణమునఁ దూర్పుదిక్కున నించుకమబ్బుపట్టి చల్లనివాయువులు వీవనారంభించెను. మేఘములు క్రమక్రమముగా వృద్ధియగుచున్నకొలఁది గాలియుమిక్కుటమగుచుండెను. పరోపకారార్థముఘనులు సల్పు కార్యములకు విఘ్నములు సంభవించుచుంట ప్రస్తుతకాలమందుఁ గూడ సహజమేయైయున్నదిగదా! రానురాను గాలి ప్రబలమై మహాసత్వములగు వృక్షముల నల్లలనాడించుచుఁ దనప్రకంపననామమును సార్థకఁ బఱచుకొనుచుండెను. అమితమగు నెండవేడిమివలనఁగాలి యనేకజంతుసంచారములచే ద్రస రేణువులుగమారిన భూభాగమందలి ధూళియంతయు, ఝంఝూనిలవశంబున నేలనంటవ్రాలి యూగు

లాడు తీగెలయొక్క రావిళ్ళమూలమునఁ బైకిలేచి ప్రబలమగుచున్న జలదసంఘమును మఱింతదట్టముఁ జేయుచుండెను. పండినేలరాలి యెండిపోయియున్న యాకులన్నియు గాలిచేఁగొట్టుకొనిపోవునపుడుఁ బుట్టు గలగలయనురొదలును, వెదుఱుమ్రాఁకు లొండొంటితోడ నొరసికొని యుఱ్ఱూతలూఁగుతఱిఁగలుగు కిఱ్ఱుమనురావములును, నతిదీర్ఘములై చువ్వలంబలెమింటినంటఁ బెరిగినవృక్షజాతులఁ జుమ్మనుశబ్దములును, బవనవేగమునకు నిలువంజాలక విఱిగి నేలంగూలు వివిధతరుశాఖాసమూహంబుల ఫెళఫెళారావములును, గాలితాఁకుడ వలన నత్యున్నతములుగలేచి నురుగులుగట్టఁ దీరములంగొట్టుకొను యమునా తరంగముల యార్భాటములును, యెండవేడిమివలనఁ దాపంబతిశయింపనుమ్మలికనొంది యాకస్మికముగ బొడమినట్టిమేఘములఁగాంచి యాహ్లాదమున గాలిచేఁ బింఛములువిరియ నాడునెమిళుల క్రేంకారములును, వర్షధారలకాశించి కాచుకొనియున్న చాతకపోతంబుల సంతోషారావములును, గమలాగారసంఘముల స్వచ్ఛందసంచారములసల్పు పరమహంసలమగు మేమువిషధరుండగు వీనింజూడనోపమని మలంగిపోవుచున్న వనమేఘోదయమునకు వెఱచి యమునయందలి శతపత్రంబుల నృత్యంబుఁజాలించి యాకసమునకెగయురాయంచలసందడులును, వనతలంబునెల్లెడలఁ బ్రతిధ్వనులుపుట్టబొబ్బలిడు శార్దూలాదిక్రూరమృగభయంకరధ్వానములును, దమతమనెలవులఁజేరంజను నానావిధపతంగకుల కలకలంబులును, నేకమై యరణ్యమంతయు నల్లకల్లోలమగుచుండెను. ఎవరుగాని తమలోఁదాము కలహించుకొని యైకమత్యవిహీనులై మెలఁగుటచే నట్టివారలెంత బలవంతులైనను దుదకు మొదలంటనాశనమగుదురని లోకమునకంతయు నెఱుకపఱచుచున్నవియోయనఁ గ్రిక్కిఱిసి యొండొంటితోడఁ బెనవైచుకఁబోయిన వృక్షజాల

ములుతప్పఁ దక్కిన గొప్పగొప్పమహీరుహములు సహితము వాయు పురములోనై కూకుపు వ్రేళ్ళతోఁగూడఁ బెల్లగిలి నేలఁగూలుచుండెను. పరులెంద ఱెన్నిగతుల నాటంకపఱచుచున్నను ఘనులు తాము పూనిన కార్యముల విడనాడకసల్పుచునేయుండి, యవితీరినవెంటనే యత్యుత్సాహమున నెరవేర్చిగెలుపుఁగొందురనురీతి, దుమ్మెగరిపోవు నట్లు గాలివీచుచున్న సమయమందే చినుకులునునారంభమై గాలి యడగినతోడనే వర్షమెక్కువగాసాగెను. క్రమక్రమముగ వృద్ధియై సంవర్త-కాలఘనాఘనముల చందంబున వాఁగులువాఱఁగురియఁగడఁ గెను. మేఘుఁడు ధారాప్రవాహ పూర్వకంబుగఁ గాళిందీకన్య కకు మౌక్తికముల సమర్పించుచున్నాఁడోయనఁ బలువిధములగు మల్లెలు జాజులతోడంగూడిన లతావితతులు వాఁగులవెంటఁ గొట్టు కొని పోయియమునయందుఁజేరుచుండెను. ఆర్యావర్తమునకిఁక ముం దురాఁబోవు దుర్దశలందలంచి పంచమహాభూతంబులు జాలింబడికాలు వలుగట్టవిలపించుచున్నవియోయన ధారలత్యంతములై జోరున వర్షము కురియుచుండెను.

అల్లెగడియలకొలఁది నాకసముచిల్లిపడినట్లుఁ, గడవలతోఁ గ్రు మ్మరించినగతి వానకురియుచుండ హాలారసపాన మత్తులై శరీరము తె ఱుఁగక పడియున్న సైసిపాయిలును, బండ్లవారలును నగము తడిసిన పిదపఁ గలిగిన చలివలనఁదెలివినొంది నలుదిక్కులఁబరికించు నప్పటికిదిశ లగుపడనియంత దట్టముగ వర్షముకురియుచుండెను. అందున కాశ్చర్య మగ్నులై బండ్లనొక మహావృక్షముక్రింద నాపియందఱును వానియ డుగుభాగమునకుఁజేరిరి. అనంతరమించుకసేపున కావర్షసంరంభమడఁగి జల్లుపడుచుండ బయటికేతెంచిచూచి తాముదారితప్పి వేరొకచోట నుండుటఁదెలిసికొనిరి. అందులకొకసిపాయి కోపోద్దీపితుడై తనలాఁతికత్తిఁ

జేఁబూనిబండ్లవారినందఱి జావఁదన్న మొదలుపెట్టెను. మఱికొందఱాసి పాయిని శాంతఁబఱచి యావలకుఁ గొంపోయి బండ్లుకట్టుఁడని యాజ్ఞాపింప వారలు "అయ్యా! నేఁడు వర్షముమిక్కుటముగ గురిసినందున నేలయంతయు నానియున్నది. కాన బండ్లు నడువఁజాలవు. మరల రేపునాలుగుగంటలకేఁదప్ప యిప్పుడుకట్టుటకు వలనుపడ" దనివిన్నవించుకొనిరి. అందులకు సిపాయిలును సమ్మతించి నాలుగుగంటలవేళ భోజనములు చేసికొనియే బయలుదేరిరి. కావున నారాత్రి యింతవర్షములోవేరొకచోటికిఁబోవ నేటికని యావృక్షముక్రిందనే మఱునాఁటివరకునుండ నిశ్చయించుకొనిరి. చలి యమితముగ నుండుటచే బండ్లవారలచేఁదడిసిన యొండుకట్టెలఁదెప్పించి ప్రోవువేయించి తాము వెంటఁగొని తెచ్చినయాముదముబోసి మంటఁజేసిరి. ఆముదపుఁబ్రభావమున నాకట్టెలెగాదిగ మండుచుండ నందఱును దానిచుట్టుఁజేరి చలికాచుకొనసాగిరి. కొందఱువర్షముకురియుచుండ బండ్లయడుగునఁ గూరుచున్నపుడు మీఁదఁబడిన మంటిజల్లులఁగడుగుకొన దుస్తులఁదీసి లంగోటీలబిగించుకొని నదికేగ బయలువెడలిరి.

రెండవ ప్రకరణము.

కొంతవడికటు లాసిపాయిలు నదిఁజేరి యందఱు నీదనేర్చియున్న వారగుటవలనఁ దమయిష్టమువచ్చినట్లు నీళ్ళలోఁజెర్లాటమాడుకొనసాగిరి. నాఁడుకృష్ణపక్ష పాడ్యమియగుటయునప్పటికి చంద్రమండలము బాగుగ ప్రకాశింపుచు నెక్కివచ్చుచుండెను. వానసంపూర్ణముగ వెలిసి ధూళిలేక నిర్మలమైన వాయువులు వీచుచుండెను. నదీతీరమంతయు హోరుమను గప్పలరొదలతోనిండియుండెను. ఇవి కాక క్రిమికీటకములు కీచుమని శబ్దించుచుండెను. ఆకసమునందేభాగమునను నించుకైన మబ్బులేక ప్రకాశమానమై వెన్నెలకాయుచుండ నాసిపాయిలునదియందొండొరులపై నీరములఁజిమ్ముకొనుచుఁ గొట్టుకొనివచ్చుదుంగలు మొదలగువాని నొడ్డునవైచుచు నింకను ననేకగతులవర్తించుచుండిరి. నీటఁబడివచ్చువానిఁ బట్టుకొనిబయటఁ బారవేయుచున్నతరి నొకనిచేతికి వెండ్రుకలుదగులఁ జప్పుననుల్కిపడి మరలధైర్యముఁ దెచ్చుకొని పరికింప మనుష్యునితల స్పష్టముగఁగన్పించెను. వాఁడును దానిఁబట్టుకొని యీడ్చుకొనివచ్చి తీరమునవైచియాసంగతిఁదక్కినవారల కెఱుకఁబఱుపనందఱు పరువెత్తుకొనివచ్చి యాశరీరముచుట్టుఁజేరి పరీక్షింపసాగిరి. అత్తరినీక్రిందిసంభాషణ ప్రారంభమయ్యెను.

ఒక మహమ్మదీయుఁడు.—అరె! ఎవఁడురా వీఁడు? కాఫరువలె నున్నాఁడు.

ఇంకొకఁడు.—ఎవండైననేమి? బ్రతికియున్నాడా?

మఱియొకఁడు.—ఏమో!

వేరొకఁడు.—నీకెక్కడ దొరకినాఁడు?

శరీరమును దెచ్చినవాఁడు.—అల్లదే! యావైపునఁ గొట్టుకొనిపోవు చుండ మొదటచూచి కుండబొచ్చెయని పట్టుకొనఁబోవ వెం

ట్రుకలు చేతికిఁ దగిలినవి. తరువాతఁ దిన్నఁగఁ బరిశీలింపమనిసి.

ఆసమయమున వేరొకఁడు శరీరమును సమీపించిపొట్టపైఁ గాలుపెట్టి ద్రొక్క లోపలనున్న నీళ్లన్నియు రంధ్రములద్వారా జిమ్మనగొట్టములనుండి వచ్చునట్లు బయటి కేతెంచెను. అంతఁగొంద ఱా కాయమును జలిగాచుకొనుచున్న నెగడినద్దకుఁగొంపోయి ప్రక్కనఁబరుండఁ బెట్టి తమశరీరములఁదుడిచికొని క్రొత్తవస్త్రులఁ దాల్చియందఱును దానిఁజూచుచుఁ జుట్టుఁ గూరుచుండియుండిరి. కొంతవడికా శరీరముకదలెను. దానింగాంచి యొకఁడు „అరేవీనిదెంత మొండిప్రాణము? ముండవాడింతనదిలోఁ బడికొట్టుకొనివచ్చియు బ్రతికినాఁడే.„

అత్తరి నీసమూహామునకుఁ గొంచెము దూరమున నుండిన మఱియొకఁడు దగ్గఱకువచ్చి „ఏమి! ప్రాణమున్నదా?' యనియడుగ నున్నదనివచించిరి. అంతనాసిపాయి

„అట్లయినమరల నెత్తుఁడు. నీటఁబారవైచివత్తము." „ఛీ! దుర్మార్గుఁడా! ప్రాణినిఁగాపాడిన నెట్టిమోక్షసుఖములు కల్గునో తెలియవా?" అనితక్కినవారు వచించిరి. అప్పుడువారందఱకు నాయకుఁడుగానున్న వానికిని నాతురకకును ఈ క్రిందిసంభాషణజరిగెను.

సిపాయి.—ఇప్పుడెట్టిసౌఖ్యముకలిగినను,నీవార్తసుల్తానుగారికి తెలిసిన పిదపఁ గలుగు సౌఖ్యము తరువాతనే!

నాయకు.—ఈసంగతి సుల్తానుగారి కేల తెలియవలయు?

సిపా.—దొంగతనము దాగియుండునని తలఁచెదవా?

నాయ.—ఏడిచినావులే! సేనాపతికూడనామాట జవదాటఁడు. ఈ వార్తసుల్తానుగారి కెఱుకఁబఱపవలదంటే తెలుపనే తెలుపఁడు, ఇఁక నీవంటివారలుండినసరి.

సిపా.—నాఁబోటివారల మాటనటుండనిమ్ము. సుల్తానుగారి యాజ్ఞల

బాలింతువా ? లేదా? కాఫర్ కంటఁబడినట్లైనఁ దత్క్షణము వాని జంపివేయుమనికదా వారియుత్తరువు.

నాయ.—నీయధికప్రసంగముఁ జాలించియావలకుపో!

సిపా.—సరియే. సమయమువచ్చినపుడు మాత్రము నేనుసహాయమునకు వచ్చువాఁడనుగాను.

నాయ.—పోరా! నీలాటిదివానాలు సహాయ మొనరించిన నెంత! యొనరింపకున్న నెంత!

అనవాఁడావలకు వెడలిపోయెను. కొంతసేపటికి నీటదొరకిన వాఁడు కనులుదెఱచిచుట్టుపట్లనున్న వారినవలోకించుచు బొట్టఁజూపించి సైగఁజేయనదివారు గ్రహించి తమదగ్గరనున్న గోదుమపిండినిఁ దెచ్చి యానెగడిమీఁదనే జావగాఁగాచి వేడివేడి జావవానినోటఁ బోయ మ్రింగసాగెను. అట్లు వాఁడువలదనునంతవఱకుఁ బోసిపిదప గిన్నెనావల నిడి యొండొరులతోఁ ముచ్చటించుకొనుచుఁ గూరుచుండియుండిరి. జావకడుపులోఁబడిన కొంతసేపటికిశక్తివచ్చి యామనుజుఁడు బాగుగఁ గనులఁదెఱచి చెంతనున్న సిపాయిలఁగాంచి భయంపడసాగెను. అందులకు వారుభయపడవలదనివానితోఁజెప్పి నీవెవఁడవనియడిగిరి. అందుపై వాఁడదివరకు దప్పించుకొని వచ్చినసిపాయిల వేషములును వీరి వేషములును నొకటిగఁగాన్పించినందున వారు వీరొకటియేయనితలఁచి తననిజవృత్తాంతము వెలిబుచ్చినచోఁ దనకిక్కడనే మృతికలుగునని యీ క్రిందిరీతిగఁ దనసంగతి వచింపసాగెను.

“అయ్యా! నేనుమధురానగరమున నొకగొఱ్ఱెలకాపరిని. నది యెండిపోయియుండు కాలమున దానిదాటి యావలిగట్టున ననుదినము నామందను మేపుకొనుచుందును. ఈదినమునను నట్లేగొఱ్ఱెలఁదోలుకొనిపోయితిని. సాయంకాలమగు నప్పటికి మబ్బుపట్టి చినుకు

లారంభమయ్యెను. పెద్దవర్షము కాకమునుపే కొంపఁజేరుకొనుట మంచి దని మందను నదిలోఁగుండ నడిపించుకొనుచు నింటికేగుచుంటిని. అత్తరిఁబ్రవాహమునకు నిలువలేక రెండుమూఁడుగొఱ్ఱెపిల్లలు నీటఁబడి కొట్టుకొనిపోవుచుండ వానిఁదక్కించుకొన నేనును నీటదుమికి యీదుకొనిపోవుచుండ నదివరకారంభించిన చినుకులు మిక్కుటమై యాకస్మికముగఁ బెద్దవర్షముకురిసెను. చీకటులును గ్రమ్మెను. ఆచీకటియందు గొఱ్ఱెలఁగన్గొనలేక విసిగి తుదకు తీరమున కీదసాగితిని. ఎంత యీదినను గార్యము లేకపోయెను. క్రమక్రమముగఁ బ్రవాహమధికమై నన్ను వెనుకకే నెట్టివేయుచుండెను. కొంతసేపటికినాయవయవములన్నియు బలహీనములైనందునఁ గదలింపఁజాలక మిన్నకుండవలసినవాఁడనైతిని. అనంతరమేమైనదియు నాకుఁదెలియదు. మరలఁ దెలివి గలిగి చూచునప్పటికి మీరగుపించితిరి. మీరలే నాప్రాణదాతలని తలఁచెదను,,.

అనివచించి తన యాలుబిడ్డలఁ దలఁపునకుఁ దెచ్చికొని కపట దుఃఖము నభినయింపసాగెను. అదిచూచియొకసిపాయి ,,అరే!దివానా! ఇంచుకసేపు క్రింద మేముపైకిఁదీయకపోయియుండిననీపాటికిమృతినొంది యుందువే. అప్పుడీ భార్యాపుత్రులేమగుదురో!,, యనియడిగెను. అంతవాఁడు మరల ,,అయ్యా! బ్రతికియుండగనేకదా! యీచింతలన్నియు,'' ననిపల్కెను. అప్పుడింకొకఁడు ముందటికివచ్చి తక్కినవారితో ,,అరే! వీఁడుగొఱ్ఱెలకాపరికదా! వీని నెట్టులైన లోఁబఱచికొని యుంచుకొంటిమా మాంసము దొరకక చచ్చిపోవుచున్న మనకీదేశమునఁ గావలసినంత పలలము పుష్కలముగ లభింపఁగలదు,,. అని నందఱు నియ్యకొని గొఱ్ఱెలకాపరితో నిట్లుమాటలాడసాగిరి.

సిపా.—అరే! నీవుమావద్దనుండి రోజుకు మాకుఁగావలసినన్ని మేకలఁ దెచ్చియిచ్చెదవా?

కాపరి.—మీకుగొఱ్ఱెలతో నేమిపని? పాలకొఱకేకదా?

సిపా.—పాలెవరికిఁగావలయును? వాని మాంసముకొఱకు దినమున కిరువదినుప్పది గొఱ్ఱెలనిచ్చితివా యొక్కొక్కదానికి నాలుగైదు వరహాలవంతున నిచ్చెదము.

సిపాయిలట్లు వచించినవెంటనే జీవహింసయనినఁ గంటగించుకొనునట్టి యాయుత్తమబ్రాహ్మణుఁడు చింతాక్రాంతుఁడై "హా! పవిత్రవంతమగు నార్యావర్తమునకెంత గతిపట్టినది. ఇదివరకు జరుగుచున్న వామమార్గులయల్లరులకే పడలేకయుండ నిప్పుడీదుష్టులుఁగూడ ప్రాప్తించినారు. హా! నోరులేని మృగములఖండించి వాని పలలమునావీరలు దినఁగోరుట! ఇంతకన్నఁ దమఁగోఁగొందఱి నధించియేల భక్షించరాదు? ఇప్పుడు వీరివాక్యములకు సమ్మతింపకున్న నన్నిక్కడనే కడఁదేర్తురు. దైవమా! ఈకఠినాత్ముల హృదయముల వజ్రములతో నిర్మించితివా ఏమి? లేకున్న వీరలకిట్టి దుర్వాంఛయేలపొడమును? పూజనీయంబగునో యార్యావర్తమతల్లి! నీకైననువీరలపైఁ గినుకజనింపదా? సాధువులగుఁ బశువులు నీయెడఁగావించిన యపకారమింతైనఁ గలదా? ఒక్కపర్యాయముగ నీదుష్టులందఱిని నేలమ్రింగివేయవు?" అనియింతసేపు విచారించియప్పటి కట్లేయనిసిపాయిలతో నొప్పుకొనెను. అంత రాత్రి విస్తారము ప్రొద్దుపోవుటవలన శయనింపఁదలఁచి వారలువృక్షముక్రింద మైనపుగుడ్డలఁబఱపించి వానిపైఁబ్రక్కలవేయించి కాపరినినడుమఁబరుండఁబెట్టుకొని తాముచుట్టుఁబరుండి నిదురపోయిరి.

మూఁడవప్రకరణము.

మధురా నగరమునకుఁ దూరుపుదిక్కున నాలుగైదుమైళ్లదూరములో నొక చిన్నపర్వతముకలదు. దానినెత్తుమతివిశాలమై చదరముగ నుండుటవలన భక్తులుకొందఱు పెద్దదేవాలయమొకదానినిగట్టించి యందుశివలింగమును స్థాపించియుండిరి. ఈగుడిచుట్టు సుమారు పది యడుగులయెత్తుగలిగి యొకమైలుచుట్టుకొలతగల ప్రాకారపుగోడయొకటియుండెను. సింహద్వారముపైఁ బెద్దగాలిగోపురముగలదు. కొండ యడుగుననుండి పైవరకును సోపానములు గట్టఁబడి వానికిరుప్రక్కల దేవతాదర్శనార్థమెక్కు భక్తులకెండ తగులకుండునట్లు పలువిధములగుఁజెట్లుపెంచఁ బడియుండెను. ఈవృక్షములపై నెల్లప్పుడు గుంపులు గుంపులుగ కోతులునసింపుచు వచ్చుపోవువారిచేతులయందలి వస్తువుల దామె నైవేద్యముఁ గొనుచుండును. మెట్లకు మొదట విఘ్నేశ్వర దేవాలయముకలదు. ఈక్రిందనున్న గుడికిని పైయాలయమునకును నడుమఁ గాళికాశక్తిగుడియొకటియుండెను. ప్రాకారముయొక్క లోపలి భాగమున నరుసగా విఘ్నేశ్వర, కాలభైరవ, వీరభద్ర, కామాక్షీమందిరములునుఁగలవు. ఇవిగాక గోడలకంటనిర్మింపఁబడిన చిన్నచిన్నగదులనేకములు బారులుదీరియుండెను. ఈశివాలయమంతయు ననగా గర్భగుడియంతయు నల్లనిరాళ్లచే నిర్మింపఁబడియున్నది. గర్భగుడియెదుట విశాలమగునొక గొప్పమంటపముగలదు. ఈ పెద్దమంటపమున కిరుపార్శ్వములఁజిన్నచిన్న మంటపములు రెండుకట్టఁబడియున్నవి. ఇందొకటి కళ్యాణమంటపము. పెద్దమంటపములో విగ్రహమున కెదురుగ సాధారణపుమానవుఁడు పరుండఁగలిగినంత విశాలమగుబొడ్డుగల పెద్దనంది యొకటియుండెను. ఇచటఁబ్రతిసంవత్సరము శివరాత్రినాఁడు గొప్ప

యుత్సవము జరుగుచుండును. ఆదినమున యాత్రికులు వేనవేలుగఁ జనుదెంచి స్వామిసేవఁ జేసికొని కానుక లర్పించిపోవుచుందురు. క్రింద నున్న వినాయకుని గుడిప్రక్కఁ దిప్పకంటుకొని కోనేరొకటియుండెను. ఈకోనేరతి యగాధమగులోతుగలదై పైనుండి నీటిమట్టమువరకును మెట్లనొప్పియున్నది. ఇందలినీటికిఁగ్రమమగువాఁకలేని కారణమునను, దగినంత సూర్యరశ్మితగులని హేతువునను బచ్చపడి యొకవిధమగు దుర్గంధమును వెలువరించుచుండును. అచ్చట ననారతము సేవఁజేయు చుండు భక్తులగు నర్చకులుకొందఱు ఆలింగమాగస్త్యమహాముని స్థాపించినదనియు, నాపుష్కరిణి దేవనిర్మితమనియు, నందులోని నీరుదక్క వేరొండభిషేకార్థము శివుఁడంగీకరింపఁ డనియువచింపుచు నుత్సవమునకు వచ్చినయాత్రాపరులనందఱి నాపాడునీటయందే ముంచుచుందురు. మఱియు నాపుష్కరిణియందు మునిఁగిపోయిన గాశీవిశ్వేశ్వరుని గుడియందుఁ దేలుదురని ప్రతీతియొకటిగలదుగాని యటులొనర్చినవాఁడు మాత్రమొకఁడును గానరాఁడు. కన్యాకుబ్జమునుండి డిల్లికిఁ బోవు రాదారి కొండప్రక్కగాఁ బోవును. శివరాత్రినాఁడు మాత్రమేగాక యితరసమయములందును నాబాటనుఁబోవఁ దటస్థించిన భక్తులెల్లరుగుడికేగి స్వామిదర్శనముఁ జేసికొని పోవుచుందురు. ఇంతప్రఖ్యాతివడసి మహోన్నతస్థితియందుండిన యీక్షేత్రము మనచరిత్ర ప్రారంభమగునాఁటికి సంపూర్ణముగ శిథిలమైయుండెను. పదునొకండవ శతాబ్దారంభమున గజనిమహమ్మదు మధురా పట్టణముపై దండెత్తివచ్చి నప్పుడుకొండనెక్కి విగ్రహములనన్నింటిని ధ్వంసము చేసి మితిలేనిద్రవ్యమును గొనిపోయెను. నాఁటినుండియు నచటిమహత్వము చెడినందునఁ దైర్థికులచటికేగుటమానివేసిరి, కానితమదారప్రియజనకుండని జాలిబూని మూషికవ్రజము మాత్రము శివలింగముమంచి

స్థితియందుండునప్పుడు భక్తులనేకులువచ్చి యుపచారములు సలుపుచుం దురు గధాయుని కొంచెము శ్రద్ధఁజేయుచు వచ్చినను భక్తుఁడొక్కఁడై నరాని యిట్టిదీనస్థితియందుఁ దాముమాత్రము వదలక దమ జాతివార లనింకననేకులఁగూర్చుకొని యభిషేకార్ఘ్యపాద్యనైవేద్యాదిక్రియ లఁగ్రమముగనొనర్చుచునేయుండెను. మఱియుగుడ్లగూబలు మొదలగుఁ బక్షులును దమశక్త్యానుసారముగ నుడుతబత్తిఁజేయుచుండెను. గాలి గోపురము సగముకూలి దివాంధములకును గొండచిలువలకును నానా సమై వానియారావములతో నిండియుండెను. ప్రాకారపు గోడలన్ని యు నెక్కడినక్కడకూలి నేలతోఁజదరమగుచుండెను. గుడివెలుపటి భాగమున ననగా ప్రాకారపులోపలిభాగమున నున్నగుళ్ళన్నియుఁ బసు లకాపరులజంతువులు వైచినపెంటలతో రోతగలుగఁజేయుచుండెను. కొండంతయు నిట్లుపాడుపడియున్నను మధ్యనున్న కాళికాలయముమా త్రము శక్తిపూజాధురంధరులగు వామమార్గమతస్థులవలన జాగరూక తతోడఁ గాపాడఁబడుచుండెను. గజినీచే మొండిగఁజేయఁబడిన దేవీవిగ్ర హమునకు వెండికన్నులు మొదలగునవి యలంకరించి శిథిలములైన గోడలబాగుపఱచికొని ద్వారమొకదాని నేర్పఱచికొని యందుఁ దమ పూజలయథావిధిగఁ జేసికొనుచుండిరి. మఱియుఁగొండపైనున్న సగ ముపడిపోయిన గదులకుఁ బాషండులగు బైరాగులు కొందఱప్పుడప్పు డు దర్శనమిచ్చుచుందురు. కొండదరికేగిన గంజాయియొక్కయు గబ్బి లపుఁబెంటలయొక్కయు మురికికంపు తక్క వేరొండుశుభ్రమగువాయువు లేనికారణమున సజ్జనులగువారలచటికేగుట మానివేసిరి. అట్టియాపా డుపడిన మెట్లమీఁదుగ నొకనాఁటిసాయంకాల మాఱుఘంటలవేళ బా టసారియొకండు కొండపై కేగియచటి స్థలమంతయుఁ గూరుచుండుట కుఁ గూడఁదగనిదిగనున్నందున మరల క్రిందికిదిగివచ్చుచు గొల్లైము

తగిలింపఁబడియున్న కాళికాలయముఁగాంచి తలుపుదెఱచికొని లోని కేగి పైనఁ దాను జూచినదానికంటె నక్కడ బాగుగనున్నందున నారాత్రినచటనే గడుపనిశ్చయించుకొని గుడియవతలివైపునకుఁబోయి యక్కడివసారాలోఁ బైగుడ్డఁబఱచికొని పరుండినిదురపోయెను. నాఁటి దినమమావసయగుటఁ గొంతసేపునకు దిక్కులు దెలియరాక మిట్టపల్లములేకములగునట్లు గాఢాంధకారము గ్రమ్ముకొనెను. అర్ధరాత్రమగునప్పటికి నాకటికి చీఁకటియందుఁ గొందఱు స్త్రీపురుషులు చేతులయందుఁ గాగడాల వెలిగించుకొనివచ్చి కొండనెక్కి కాళికాలయముఁ బ్రవేశింపఁదొడఁగిరి. కొందఱు మద్యభాండముల మోసికొనివచ్చుచుండిరి. మఱికొందఱు బలిసినగొఱ్ఱెల వెంటఁగొనివచ్చుచుండిరి. వీరందఱు గుడిలోఁ బ్రవేశించుతఱిఁ గలిగినరొదలకు వెనుకవైపుననున్న బాటసారి మేల్కొనిలేచి యవతలిగుండఁ బారిపోవఁబ్రయత్నించెఁగాని యాప్రక్క ద్వారములేక గోడలెత్తుగనుండెను. అంతనే మైనఁగానిమ్మని గుండెరాయిఁజేసికొని మరల నెప్పటిచోటికివచ్చి నఖశిఖపర్యంతము ముసుఁగిడుకొని కదలక పరుండియుండెను. మతస్థులును గుడికిఁ బ్రదక్షిణ మొనర్పసాగిరి. కాగడాలఁ బట్టుకొనికొందఱుముందు వెన్కలనడచిరా నోట వచింపరాని బూతుపాటలఁబాడుచుఁ బ్రదక్షిణము సేయఁదొడఁగిరి. అట్లువారందఱాలయము వెనుక కేగి యట భీతిచేఁ గపటనిద్రాభిరతుఁడైయున్న బాటసారింగాంచి యతనిచుట్టుఁజేరి నాల్గు తన్నులతోలేపి కూరుచుండఁబెట్టి "నీవెవఁడ" వనియడుగ నతఁడింతమంది నడుమనొంటిఁజిక్కితిఁగదాయని యేమియుఁదోచక మాట్లాడక యూరకుండెను. అప్పుడు వారందఱిలోఁ బెద్దయగుఁ బురోహితుఁడు ముందుకేతెంచి "వీఁడతిదుర్మార్గుఁడు. మనరహస్యంబులఁ బరీక్షింపనిచటికి వచ్చియున్నాఁడు. వీని నిపుడుకాళికి సమర్పింపవలయు"ననెను. అందు

మీఁద నలుగురు వానినివిఱిచికట్టి తమతోఁగూడఁ బ్రదక్షిణముసేయిం చికొనివచ్చి దేవియెదుట నిలువఁబెట్టితమవిధ్యుక్తక్రియలనొనరింప మొదలిడిరి. విగ్రహమునకెదుటఁ బదిమండలములురచించి వానియందుఁ దాము వెంటఁ గొనితెచ్చిన మద్యభాండములనుంచి గొరియెలఖండింప నారంభించిరి ప్రాణిహింసయనినఁ గంపమందు నాపాంథుఁడా దారుణ కృత్యములఁ జూడఁజాలక మూర్ఛనొంది పడిపోయెను. తోడనేకొంద ఱాతని మొగముపైఁజన్నీళ్లుపోసి మూర్ఛఁదేర్చుచుండిరి. తక్కినవారు దెచ్చినజంతువులనన్నింటిఁ దెగటార్చివానికళేబరముల భాండములప్రక్కనుంచి యీక్రిందిమంత్రముల నుచ్చరించుచుఁ బూజసేయఁగడఁగిరి.

"బ్రహ్మ శాపంవిమోచథా"

అనఁగా ఓమద్యమా! నీవుబ్రహ్మ మొదలగు వారిశాపముల నుండి కూడరహితమవై యున్నావు. మఱియు,

"మద్యం మాంసంచ మీనంచ ముద్రా మైథునమేవచ, ఏతే పంచమకారాః స్యుర్మోక్షదాహి యుగేయుగే." కాళీతంత్ర గ్రంథము.

"ప్రవృత్తే భైరవీచక్రే సర్వేవర్ణా ద్విజాతయః,
నివృత్తే భైరవీచక్రే సర్వేవర్ణాః పృథక్ పృథక్."

కులార్ణవతంత్ర గ్రంథము.

"పీత్వా పీత్వా పునఃపీత్వా యావత్పతతి భూతలే,
పునరుద్ధాయ వైపీత్వా పునర్జన్మ నవిద్యతే.

మహానిర్వాణతంత్ర గ్రంథము.

"మాతృయోనిం పరిత్యజ్య విహరేత్ సర్వయోనిషు,
వేదశాస్త్రపురాణాని సామాన్యగణికా ఇవా."

జ్ఞానసంకలినీతంత్ర గ్రంథము.

,,న మాంసభక్షణే దోషోనమద్యేనచ మైథునే,

ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలః,,

మను, అధ్యా 6

,,సౌత్రామణ్యాం సురాంపిబేత్ ప్రోక్షితం,
భక్షయేన్మాంసం వైదికీహింసాహింసానభవతి ,,

మను, అధ్యా 5

,,ఏకైవశాంభవీముద్రా గుప్తాకులవధూరివ,,
,,పాశబద్ధోభవేజ్జీవః పాశముక్తస్సదాశివః.,,

జ్ఞానసంకలినీతంత్ర గ్రంథము.

జారగ్రామణులును, స్వార్థపరాయణులును, సత్యవిద్యావిహీనులునగు దుష్టులు రచించిన తంత్రగ్రంథములలోని యిట్టిమంత్ర నామకతుచ్ఛ శ్లోకములఁబఠించుచు శాంభవీ, భైరవీ, కాళీ, చాముండా! యనునామంబు లుచ్చరించుచుఁ బూజసేయుచుండిరి. అంతవరకును మూర్ఛఁదేరి, యాక్రూరకర్మలఁజూచుచున్న పాంథుఁడు తనమనమున నిట్లు తలపోయఁగడఁగెను.

,,అయ్యో! ఇల్లువెడలినదాది నాకన్నియుఁ గష్టములేప్రాప్తించుచున్నవిగదా! నేటితోనిక్కడ నాచావునిశ్చయము. నాగతియెట్లయినఁగానిమ్ము. నాకొఱకై దినములు లెక్కపెట్టుకొనుచు నిరీక్షించుచుండు నాకన్యకగతియేమికాఁగలదు? ఆహా! ఈదుర్మార్గుల హృదయములందావంతైనఁ గరుణయనునది లేదుకాఁబోలు? వీరలనెట్టి పాపకర్ములనఁదగును. ఇట్టిస్వార్థపరులగు కుమార్గగాములు ప్రబలియుండ నిఁక నార్యావర్తము బాగుపడు టెట్లు? కట్టా! దుర్మార్గులారా! మీ కీవిధియంతయు నెవరుబోధించిరి? పాషండులారా! మద్యమాంసములనా

వైశ్లోకములు స్వామి దయానంద సరస్వతివిరచితమగు సత్యార్థప్రకాశమునుండి కైకొనఁబడినవి.

మీరు పూజించునది? హా! నేనేమిసేయుదు! ఓ రాజపుత్రీ! నీకోరిక నెరవేర్పఁజాలనైతినని నన్నునిందించెదవుసుమీ? విధివశంబున బెట్టిదములగు చిక్కులంబడితిఁగాని నాయజాగరూకతవలనఁగాదు. పరమేశ్వరా! నీకించుకైన సజ్జనులగు వారిపైదయగలుగదా?,, అని కడువిలపించితన కష్టకుటజరుగుచున్న యసహ్యాపుఁబనులఁగాంచి కనులుభైరవులు గ్రమ్మ నరలఁగ్రిందఁబడిపోయెను. అంతవానికి మరలఁ గొందఱుపచారములు సలుపసాగిరి. ఇంతవరకు జరిగినసంగతులన్నియుఁజూచుచు వామమార్గులంగలసి మూలఁగూరుచుండియున్న పురుషుఁడొకఁడు తనకార్యము నెరవేర్చికొనమంచిసమయము దొరకెఁగదాయని యున్నట్టులుండియూగులాడసాగెను. చెంతనున్న కొందఱేమ్లాగెదవనియడుగ మారువల్కక మఱింతతలఁద్రిప్పుచు నాపాదమస్తకముగడగడవడకింపుచుఁ బండ్లుపటపటఁగొఱుకుచుఁ గన్నులెఱ్ఱఁజేసిచూడ మొదలుపెట్టెను. దానిఁగాంచి యందఱువానిచుట్టుఁజేరి దేహముస్పృశించి యేమని యడుగ వారిఁజావమోదుచు ,,అరే! దుర్మార్గులారా! మీరునన్నెఱుఁగరా,,? యనిగద్దించిపల్కెను. అంతనెల్లరుఁగాళికాదేవి పూనినదని నిశ్చయించి సాంబ్రాణి గుగ్గిలపు ధూపములువేయుచు వానిపాదములపైఁబడిమ్రొక్కి "అమ్మా! దేవి! శాంతింపుము. మావల్లయేమపరాధమువచ్చినదో చెప్పు" మనిబద్ధాంజలులై ప్రార్థింపనాధూర్తుండు "ఛీ! మూర్ఖులారా! మీకావంతైనజ్ఞానములేదు. నీచజాతిసంభవుఁడగు మానవునొకని నాకుబలినొసంగఁదలచియున్నారు. మిమ్మందఱిభక్షించెద. చూడుఁ" డని భయంకరముగ హుంకరించుచుఁబలికిన 'అమ్మా! భగవతీ! శాంతింపుము. ఎఱుకలేనితనమున నిట్టికార్యము సేయఁబూనుకొంటిమి. క్షమించినీయభీష్టమేమో తెలిపిన నెరవేర్చెద" మనిరి. అంతనాపురుషుండు "బుద్ధిహీనులారా! నాకు సకలకళావతియు, సౌందర్యవతి

యునగు రాకొమారికం దెచ్చి సమర్పించితిరా సరి. లేకున్న మిమ్మందఱనాశనముగావించెద" ననిపల్కెను. దాని కెల్లరు సమ్మతించి "తల్లీ! నీయిష్టానుసారమటులే సమర్పించెద" మనియొప్పుకొని సాష్టాంగనమస్కారములాచరించిరి. కొంతసేపైన తరువాత నాశినము త్రినవానికిఁ గుత్తుకబంటిగఁగల్లుఁబోసియొకచోఁబరుండఁబెట్టి తామును ద్రావసాగిరి. కొందఱు శాటసారి కడకేతెంచి కట్లువిప్పి "నేఁడు నీవు మాదేవీప్రసాదమువలన బ్రతికిపోతివి పొమ్మనిబయటికిగెంట నతఁడును బులినోటఁజిక్కిచావక బయటఁబడిన మేకవలె లోలోన సంతసించుచుఁ బురిదారిఁబట్టిపోయెను. ఇటగుడియందలిదుష్టులెల్లరుఁ దెల్లవాఱునప్పటికి తమగార్యములనన్నింటి నెరవేర్చికొని దేవీవాంఛితమునకు నేరాజకన్యక తగియుండునాయని యాలోచించుకొనుచుఁ దమదారింబోయిరి.

" పురుషార్థప్రకాశము. "
మానవుని జన్మరాహిత్యమునకు మార్గము.
వలయువారు:—వి. వి. కే. లక్ష్మాజీరావు,
బుక్ సెల్లర్ అండు పబ్లిషర్, గుంటూరు.
అని వ్రాయవలయును.

నాల్గవ ప్రకరణము.

అనేకసంవత్సరములకుఁబూర్వ మార్యచక్రవర్తియగు యుధిష్ఠిరుని కాలమున నిర్మింపఁబడి యింద్రప్రస్థమను ప్రసిద్ధనామంబునఁ బ్రఖ్యాతిఁ గాంచి యేడెనిమిదివందల సంవత్సరములక్రిందటివరకు నార్యచక్రవర్తుల స్వాధీనమందేయుండి తదనంతరము మ్లేచ్ఛసుల్తానులపాలఁబడిన ఢిల్లీనగరముఁగూర్చి మీరందఱువినియేయుందురు. మహోన్నతములగు సౌధప్రాకారసంచయముల చేతను, నతివిశాలమనోహరములగు నుద్యానవనవాటికల చేతను, వినుతికెక్కి క్రీస్తుశకము పదునెనిమిదవశతాబ్దాంతమువఱకుఁ జక్రవర్తులకే వాసభూమియగుచువచ్చిన ఢిల్లీనిఁగూర్చి వేరుగవచింపనేల? ఈనగరముయొక్క దక్షిణదిశనుండి మధురాపురమునకొక గొప్పరాదారి బాటనిర్మింపఁబడియున్నది. ఈదారిపట్టణము వెలుపట మూఁడుమైళ్లదూరమున ఢిల్లీనిఁజుట్టుకొనివచ్చు యమునతోఁగలసికొంతదూరమువరకు నదీతీరముననేపోవుచుండును. ఈత్రోవ ప్రయాణీకులు పథశ్రమంబాపుకొనుటకై పెంచఁబడిన వృక్షముల చేఁగాక, పురము వెలుపట అడవిలో వేయఁబడియుండుటవలన, నానావృక్షలతాగుల్మముల చేఁ బరివృతమైయుండెను. అట్టియాచిన్న యడవిమార్గముగుండనొకనాఁటి మిట్టమధ్యాహ్నకాలమందు మనుజుఁడొకఁడు కాషాయపురంగుగల పొడుగుపాటి యంగరఖానుధరించి, యట్టివర్ణమేగలపాగ నొకదానిఁ దలకుఁజుట్టుకొని కమండలువు మొదలగు వస్తువులు గలిగినయడప మొకటి భుజముపై వ్రేలాడుచుండఁ జేతిలోని దండమును ద్రిప్పుకొనుచు దీర్ఘాలోచనపరుండై వచ్చుచుండెను. ఇతనికిసుమారు నలువది వత్సరములుండును. ముప్పదియేండ్లువచ్చునప్పటికే ముసలితనమువహించి మూలగూరుచుండ నలవాటుగల దుర్బలులగు కొందఱఁబలెఁగాక యీమనుజుఁడు మంచి

పిక్కబలిమిఁగలిగియుండెను. అతని మొగముఁజూడ ననేకకష్టముల ననుభవించి వానినుండి తప్పించుకొనివచ్చినట్లును, నొక కార్యభారము నుదలధరించి యహోరాత్రములు దత్సాధనమునిమిత్తము పాటుబడుచున్నట్లులును దోఁపక మానదు. మిటమిటలాడుచుండు వేసవికాలమందు దీర్ఘప్రయాణము సేయుచువచ్చిన యాపాంథుఁడు చల్లనినీడలచేఁ బ్రాణము లేచివచ్చినట్లులున్న యా యడవిమార్గమున నొక పెద్దవృక్షపునీడఁ గొంతతడవు విశ్రమింపఁదలఁచి చేతియందలి దండమును, భుజముమీఁదినుంచిన క్రిందనొక చోటఁబెట్టి యుస్సురని నిట్టూర్పులవిడుచుచుఁ దొడిగికొనిన చొక్కాయుంతయుఁ దడిసి పిఁడునకొనుకొని పోవఁబెట్టిన చెమటచిదరపలన దానిఁదీసి యెదుటనున్న చిన్నచెట్లు కొమ్మలకుఁదగిలించి చెమటనార్చుకొనుచుఁ బచారుసేయుచుండెను. అట్టిసమయమున నక్కడకుఁబిలుపుమేర దూరములోనున్న యొకచిన్నగుట్టయడుగుభాగమున మనుష్యులు మాటలాడుచున్నట్లు వినరా నింతవఱకు నానిర్జనప్రదేశమందుఁదానుతప్ప యితరులెవ్వరు లేరని తలఁచుచుండిన యాబాటసారిమనుష్యుల యలికిడి విన్నతోడనే శీఘ్రముగఁ దనవేషమును ధరించుకొని మెల్లననాదిప్పనుజుట్టిపోవ మొదలిడెను. నలుదిక్కుల నతిశ్రద్ధమెతిలకించుచునడచి యవతలి కేగిచూడ నటనొక మానవుఁడైనను గన్పింపక పోయెను. అందులకాశ్చర్యమందుచు గుట్టపైకిబోయి నాల్గుమూలలఁబరకించియుఁ గార్యముఁగానక మరలనాశబ్దమేవచ్చిన స్థలమునకు వచ్చి ప్రతిపాదయందునుఁ బరిశీలింపగాఁ దట్టముగఁదీగెలచే నల్లుకొనియున్న యొక లతాగృహమునఁ దలుపొకటి క్రిందఁబరుండఁబెట్టియుండుటఁగాంచి దానిఁబరీక్షింప లోనికేగి తలుపుఁబైకెత్తనెక్కిదిగుట కనుకూలముగానుండునట్లు త్రవ్వఁబడిన మెట్లఁగూడుకొనియున్న గుహ కానిపించెను. దానిఁజూచినతోడనే విస్మయముకలిగి మెట్లదిగికొంచెము

దూరముపోవ గుహావిశాలమైకనుపడెను. అత్తరిమనస్సున కించుకభయ
ముదోప మరలి గుహాద్వారముకడకువచ్చి యిట్లాలోచింపఁ గడఁగెను
"ఆహా! ఇదియేమిచిత్రము? మానవులుతఱచుగ సంచరింపని యీరహ
స్యపుఁజోటనిట్టిసారంగముండుట కేమి కారణము? అడవిజంతువుల యా
వాసమనుకొందునా! అటులెన్నటికిఁగాఁజాలదు. రహస్యాలోచనము
లొనరించుకొనవచ్చి పోవువారి కేవిధమైనయాటంకములుఁ గలుగకుం
డునట్లుచమత్కారముగనిర్మింపఁబడియున్నది. విచారింపనిది రాజశాస
నంబులకువెఱచి తమదుష్కార్యముల బహిరంగముగ సలుపుకొనవల
నులేక రహస్యముగఁగావించుకొనుటకై కట్టుకొన్న తుచ్ఛులగు వామ
మార్గులకృత్యమైనఁగావలయును. కానియెడల చక్రవర్తిని రాజ్యభ్రష్టు
నిఁజేయఁ గుట్రలఁబన్నుచున్న యేయధికారుని కృత్రిమమైనఁగావల
యును. ఎటులైన దీనినిజముఁగనుగొనకతప్పదు. ఛీ! బయలుదేరినవాఁడ
నట్లుపోవక వెనుకకేల మరలితి? చేతనొక చిన్నకత్తియైన లేనిసమయ
మునఁదప్ప గృహము వెడలినదాడి నిట్టిపిరికితన మెప్పుడుఁబూననైతిఁగ
దా. కానిమ్ము. మరలఁబ్రవేశించి దీని నిక్కమరసివచ్చెదను.,, అని
దృఢనిశ్చయుఁడై పరులకగపడకుండ లోనబెట్టుకొనియున్న ఖడ్గము
నుజేతధరించి పరమేశ్వరునిపై భారమువైచి బాసిగుండ నడచిపోవ
నారంభించెను.

అయిదవ ప్రకరణము.

అట్లా బాటసారి గుహఁ బ్రవేశించి యెంతదూరమునడచినదియు నెఱుఁగఁజాలముగాని గడియయగునప్పటి కవతలిమెట్లు కాలుఁదగిలెను. వానిమీఁదుగ నెక్కివచ్చి యొకయుద్యానవన మధ్యమునఁదేలెను. అటనేమిఁ జేయుటకును దోఁపక నలుదిక్కులు పాఱఁజూచుచు నిలువఁబడియుండఁ జెట్లసందులనుండి దివ్యభవన మొండు దృగ్గోచరమయ్యెను. కనుపడిన యాసౌధముదగ్గరకుఁ బోవఁదలఁచి చెట్లమాటునడాఁగుకొనుచు నిశ్శబ్దముగఁ గొంతదూరమేఁగ వాక్యములు వినవచ్చెను. మాటలసవ్వడిఁబట్టి మఱింతదగ్గర కేఁగ నటనొక మందిరప్రాంగణమున దీర్ఘకాయుఁడును, నెఱ్ఱమామిడిపండుఁబోలిన మొగముగలవాఁడును నగుమనుజుఁడొకండు సందేశముంగొనివచ్చిన నలుగురుభటులతో సంభాషించుచుండెను. ఆమనుజుఁడు సోఫాపైగూరుచుండియుండెను. భటులుప్రక్క నొదిగినిలిచియుండిరి. సోఫామీఁదియతఁడు కొంచెమించుమించుగ నేబదివర్షములుసూచించుచుండెను. జల్తారుమయమైనపాగను ధరించిబంగారు చెమ్కీపనిచేసిన షేర్వాణీని దాల్చి రేష్మీపాయిజామాదొడిగి పాదములకు మేజోళ్లఁబూనియుండెను. మఱియు దూరముగనున్న హుక్కాగొట్టముద్వారా మాటిమాటికిఁ బొగఁబీల్చిముక్కులవెంట నోటివెంట వదలుచుఁ దనకట్టెదుటనున్న నలువురు మనుష్యులపైఁ గోపదృష్టివఱపి గద్దించి పలుకుచుండెను. భటులునల్గురు నల్లనిలాగులఁ దొడుగుకొని యెఱ్ఱబనారస్‌చొక్కాలఁదాల్చి పసుపురంగుపాగలనెత్తిధరించి నడుమున కాకుపచ్చరంగుగల కాశలఁజుట్టుకొని నయభక్తుల నాపెద్దమనుష్యునితోఁ దమసమాచారములవిన్నవించుచుండిరి. సోఫాపైఁగూరుచున్న మనుజుఁడు వీరల ధిక్కరించి మాట

లాడుచుండుటంబట్టి యంతడే ప్రభువని యాబాటసారి గ్రహించిపొంచి యుండి వారిమాటల నాలింపసాగెను. అప్పుడాదొర భటులపైఁ గోప దృష్టింబఱపుచు "ఛీ! దుర్మార్గులారా! మిమ్మునింతింత కండలుగఁ గోసి కాకులకు వైచినను బాపములేదు! మీకింతస్వతంత్రమా? బుద్ధి హీనులారా! మీకున్న యాలోచన సుల్తానుగారికి లేకుండెను గాఁ బోలు. పరుఁడగుపడిన తత్క్షణమే చంపక యంతశ్రద్ధతోఁ గాపాడుచున్నను నెట్లో గికురించి తప్పించుకొనిపోయి మనరహస్యముల వెల్లడిసేయునని యేకదా గోరీగారగుపడిన వాఁడగుపడినప్పుడే చంపవలసినదిగ నాజ్ఞాపించినారు" అనిపల్కెను. అంతలఁ గావల్గురు చేతులఁజోడించుకొని మొగములపై దీనత్వము దోఁప "మహాప్రభో! రక్షింపుఁడు. చేతఁజిక్కినవాఁడెందుఁబోవునను ధైర్యమునను వానివలన మనకేమైనసహాయము దొరకఁగలదనియు నుపేక్షచేసినారము" అనివిన్నవింప నుగ్రుండై యాదొర "ఛీ! మూఢులారా! నేఁగావించుచున్న పన్నుగడలకన్నిటికి విఘ్నములు సేసితిరి. వాఁడు చావక బ్రదికియేయుండెనా మన కీయార్యావర్తమున నిలుచుటకావంతయు నవకాశముండదు. నేనెన్నిటక్కులఁబన్ని పృథ్వీరాజునొద్ద నేమిసేయుచున్నదియు మీ కేమెఱుక? ఆహా! ఎంతపనిఁ గావించితిరిరా దుర్మార్గులారా!' అని దీర్ఘనిశ్వాసమువదలి మిక్కుటముగఁగలిగినకోపమువలన నొడలెఱుంగక చేతనున్న హుక్కాగొట్టము నావలఁబారవైచి సోఫాకుఁజేరగిలఁబడి కూరుచుండియుండెను. అత్తరి లోపలినుండి పరిచారకుఁడొకఁడే తెంచి "సర్కార్! ఇదే మీయాజ్ఞప్రకారము భట్టుగారిఁగొనివచ్చినాఁడ"నని పొడుగుపాటిబక్కపలచని నల్లని మనుజునిదెచ్చిచూపించెను. వెంటనే యజమాని లేచి యావచ్చినమనుజునకు సలామొనరించి "రండు, భట్టుగారు! వచ్చికూరుచుండుఁ"డని యాసనముఁ జూపింప నతఁడు దానిపైనాసీనుఁడయ్యెను. అప్పుడువారిరువు రీవిధమున మాటలాడసాగిరి.

భట్టు.—ఈదినమున నీరలేమైనఁ గ్రొత్తవార్తలు దెచ్చినారా ?

యజ.—త్వరలో మాకందఱను నిక్కడినుండి యుద్వాసనగునట్టి యుపాయము గనిపెట్టుకొని వచ్చినారు.

భట్టు.—ఏమి! అట్లనెద రేల?

యజ.—అయినదికానిండు. తరువాతవచించెదను. ఇప్పుడీజాబునఁగల వృత్తాంతములేమో చూచిచెప్పుడు. అని లేఖ నొకదానినందియ్యఁగైకొనిభట్టుగారిట్లు చదువఁదొడఁగిరి.

"మనోహరా ! తరణిసందర్శనంబులేనిచోఁ బద్మిని ప్రాణముల భరింపనోపదు, దీనికై యనేకములగు నితరమదగజములు కాచుకొని యున్నవి. లోకబాంధవసమానుండవగు నీవీపద్మినింగరుణించి పరనాగముల వాతఁబడకుండ రక్షించుకొనవలయునని వేడుకొనుచున్నదానను.

"సంయుక్త"

జాబునందలి సంగతులవిని పొంచియున్న బాటసారి విస్మితుఁడై తాను పోయినదనుకొనినవస్తువు తనకెంతమాత్రము సంబంధములేని పరులవద్ద నగుపడినచో మానవుం డెట్టి స్థితియందుండునో యట్టియవస్థఁబూనియుండెను అంత మరల భట్టుగారు యజమానుఁడును ఇట్లు మాటలాడసాగిరి.

యజ:—భట్టుగారూ! దానియందుఁగల సంగతులేమి?

భట్టు:—మరేమియులేదు. కన్యాకుబ్జనగరమేలుచున్న జయచంద్రునకు సంయుక్తయను నొక కూతురుగలదు. ఆమె మన చక్రవర్తిని వలచియున్నది. ఈయుత్తర మామె లిఖించినదే!

యజ.—ఏమని? ఎవరి పేర?

భట్టు.—చక్రవర్తికే. తన్నెటులైనఁ బెండ్లియాడుమనియు లేకున్నఁ బ్రాణములఁ ద్యజించెదననియు వ్రాసియున్నది.

యజ.—ప్రాణముల వదలునంతటి మోహము గలిగియున్నదా ఆకన్నియ?

భట్టు.—సందేహమేమి?

యజ.—మరి చక్రవర్తి కామెపై నింత ప్రేమమున్నదా?

భట్టు.—ఆహా! ఇంతకన్న నెక్కువే!

యజ.—నిక్కము వచింపుము.

భట్టు.—నిశ్చయమే చెప్పుచున్నాను చక్రవర్తి కామెపై నింతకన్న నెక్కువ మక్కువగలదు.

యజ.—అట్లైనఁ జక్రవర్తి యింతకాల ముపేక్ష చేసియుండుటకేమి కారణము?

భట్టు.—జయచంద్రునకుఁ దనకుఁ గల వైరము వలన చక్రవర్తి కొంచెము వెనుదీయుచున్నాఁడు. కాని యెప్పుడో యొకసారి పెండ్లి యాడక మానఁడు.

యజ.—అయిన మనమిప్పుడు చక్రవర్తిని సులభముగ నీ తుదముట్టింప వచ్చునే?

భట్టు.—ఎట్లు?

యజ.—ఏకరణినైన మన మాసంయుక్తనుఁ జంపించవలయును. అందువలనఁ జక్రవర్తి నశించును. పిదప మనము రాజ్యమాక్రమించుకొనవచ్చును. సంయుక్తనుఁ జంపించితిమన్న వార్త యొకవేళ జయచంద్రునకుఁ దెలిసినను అతఁడు మనపైనెత్తి రాఁడు వచ్చినను నతనినొక్కనిఁ బారదోలు సామర్థ్యము మావద్దగలదు. ఇన్నినాళ్ళనుండియుఁ బ్రసిద్ధివడసిన ఢిల్లీ కనూజ్ రాజ్యములు రెండు మైత్రితో నున్నందున మాకిచ్చటఁ గాలుపెట్టుటకు వీలుకలుగక పోయినదిగాని లేకున్న నీదేశము నీపాటికే మావశముఁ గావించుకొని యుండక

పోదుమా. కానింక ప్రస్తుతవిషయముగూర్చి యేమాలో
చించెదరు?

భట్టు — మహాప్రభో! ఏలినవారిదయ చల్లగనుండవలెగాక దానికిదివర
కే యేర్పాటుఁ గావించియున్నాను.

యజ. — ఏమికావించియున్నారు.

భట్టు. — సంయుక్తను జంపు నేర్పాటులే.

యజ. — ఎట్లు.

భట్టు. — ఇక్కడికిఁ గొన్ని మైళ్లదూరమునయున్న మధురానగరము చే
రువ నొకగుట్టపైఁ బ్రసిద్ధికెక్కిన కాళికాలయముగలదు. ఆప్రాం
తములనుండు వామమార్గులనువారు తఱచుగనాదేవికి నరబలు
లర్పించుచుందురు ఆమతస్థుల నెటులైనఁ బ్రోత్సాహపఱచి
సంయుక్తం జంపునుపాయముఁ జేసిరమ్మని నానమ్మినసేవకుని
నొకని నిదివఱకేపంపియున్నాను. వాఁడన్ని కార్యములు చక్కఁ
బఱచియే యుండును.

ఈ పైమాటలు చెప్పఁబడినవెంటనే పొంచివినుచున్న పాం
థున కారాటమును, రోషభయసంభ్రమంబులును ఒక్క పర్యాయ
మేకలుగ వారి చెంతకేగ రెండడుగులు ముందుకువైచి సమయము
కాదనుకొని యాగి తాను వచ్చినదారినే బయలువెడలి పోవ
నుంకించి మరల నేమనుకొందురో యనునాసఁబోవుటమాని యాం
దోళనమున నేమియుదోఁపక నిలువఁబడియుండెను. అత్తరి భట్టుగారు
వచించిన వాక్యములకు డిల్లీరాజ్యము తనకుఁ జేకూరినంత సంతోష
మునొంది యజమానుండు "వహవా! ఎంతటిబుద్ధిశాలులండి మీరు?
మీకెట్టి యుపకారముఁజేసినను మీఋణమును మాత్రము దీర్చుకొనఁ
జాలము" అనిస్తోత్రముసేయఁ దొడఁగెను. అంతభట్టుగారు పట్టరాని
సంతోషమున "మీరు నన్నింతపొగడవలయునా? నాపై సంపూర్ణ

కటాక్షముంపుఁడు. ఇఁక నేను సెలవుఁబుచ్చుకొనెద" నని యతనికి సలా
ములుగొట్టి వెడలిపోయెను. అంత నాయజమానుఁడు భటులఁ గాంచి
"ఈదినమున నీసంతోషవార్తవినుటఁ జేసి మిమ్మందఱ క్షమించితిని.
ఇఁక ముందిట్టి యకార్యముల సల్పితిరా మీప్రాణములఁ దీయించెద"
నని కఠినముగఁ బలికి వారిలో నిరువురికిఁ దనవద్దనుండ నాజ్ఞాపించి త
క్కిన వారితో "మీరీక్షణమున మనదండు విడిసియున్న స్థలమున కేగి
యిప్పుడున్న తావువదలి వేరొక చోటి కేగవలసినదిగా సేనాపతితో
వచింపుఁడు. వేవేగఁబొం" డని సెలవొసంగ వారలును బయటరా
నుద్యుక్తులై యుండిరి. అత్తరి నిట దాగియున్న పాంథుఁడు తానున్న
చోటు వదలి త్వరితగమనంబున సొరంగమార్గముగుండ బయటికేతెంచి
జాగరూకుఁడై లోపలనుండి వచ్చువారల కగుపడకుండునట్లు గుహా
ముఖమున దాగియుండెను. లోపలి యిరువురు దమయజమానికి సలా
ములొనరించి గుహామార్గమున బయటికేతేర నొకనితరువాత నొకఁడు
వచ్చుచుండిరి. మొదటివానితల బయటి కగుపడిన నిముసమున దాగి
యున్న పాంథుఁడు తనఖడ్గముతో దానినెగురఁగొట్టెను. రెండవవాఁడు
దిగ్భ్రమఁజెంది వరలోనున్న తనకత్తినిఁ బైకిఁదీసికొనఁబోవునంతలో
వానిపై కురికి పట్టుకొని క్రిందఁబడఁదన్ని రొమ్ముపై కాలువైచి "దుష్టు
లారా! మీకక్కడ మరణము తప్పినను ఇక్కడఁ దప్పుననుకొంటిరా?
అధర్మాలోచనపరులగు వారి దైవమెక్కడనైన శిక్షింపక మానఁడు".
అనుచు వానిఁగూడ మొదటివానికిఁదోడుగఁ బంపి యారెండు కళేబర
ములచటనే పడియున్న నాదారివచ్చిపోవువారికి సంశయముకలుగునని
చేరువనున్న యమునం బాఱవైచి తనశరీరము శుభ్రపఱచుకొని తా
నుగావించిన సాహసకృత్యమునకుఁ బరవశుండగుచు నాలుగు గంటలు
మీఱినందునఁ బురముదారిఁబట్టి పోయెను.

ఆఱవ ప్రకరణము.

సకలకళాపరిపూర్ణుండై హిమాంశుండు తన శ్వేతకాంతులచేఁ గన్యాకుబ్జనగర సౌధములకు వెండినీరుఁబోయుచుఁ బ్రకాశించుచుండెను. పరస్పరసంఘట్టనంబుల లేచు యమునాతరంగ తుషారసముదయములం దడిసి, నెత్తమ్ముల పుప్పొళ్లంజిందులాడి, వనమల్లికాప్రసవసౌరభములఁగొల్లగొని, కేతకీగర్భపరిమళముల హరించి, పొగడతావులంగలసి మందయానంబున శీతలములయి మారుతుండు పాంథజనముల పరితాపం బపనయించుటకో యనఁ బురంబు నెల్లెడల సంచరించుచుండెను. రాత్రి పదునొకండుగంటలగుటచే మనుష్యసంచార మెచ్చటను లేకపోవుటయే కాక పక్షులకలకలంబులును సడఁగి యూరంతయు మాటుమణఁగియుండెను. కొన్ని గొప్పగొప్పవృక్షములపై నివసించియున్నపక్షులు మాత్రము మేల్కనినవు డంతయుఁ జంద్రాతపమునుం గాంచి తెల్లవారినదను భ్రమను ఱెక్కల విదుల్చుకొనుచు గూండ్ల వదలి బయటికేతెంచి యిటునటు గొంతదూరమేగి మరలివచ్చి తమతమనెలవులఁ జేరుచుండెను. అట్టిసకలలోకాహ్లాదకరమై పిండియారఁబోసినట్లు కాయుచున్న పండువెన్నెలలోఁ గన్యాకుబ్జరాజ్యమునం దనుపమానమని ప్రఖ్యాతికెక్కిన యొకశశికాంతశిలావినిర్మిత సౌధోపరితలంబున బాలికయొకర్తుతన ప్రియవయస్యలంగూడి వెన్నెలవిహార మొనరించుచుండెను. ఆకన్నియ నూతనముగఁ బ్రాప్తించిన నిండుజవ్వనముచే రూపొందిన సౌందర్యరాశియోయన రాజిల్లుచుండెను. స్నిగ్ధమై బంగారుచాయలం గేరు కాంతిగలపచ్చని శరీరమును, గుండ్రని మొగమును, వాలికలగుఁగనుదమ్ములుం గలిగి నాఁటిదినమున నాకన్యక చెవులఁదాల్చిన రవలకమ్మలవెలుఁగులు పలుచని చెక్కుటద్దములఁ బ్రతిఫలింపఁ, గొమ్ముడి సడలి యవటుతలం

బునఁబడి నర్తన మొనరించుచుండ, హాసన్ముఖియైన నవమోహినీదేవత యోయన సంచరించుచుండెను. అర్ధరాత్రముకావచ్చువఱకు నట్లే విహరించుచుండి పిదపఁ గొంతవడికి మంజరియను ప్రాణసఖిందక్కఁదక్కినవారల వారివారినెలవుల కనిచి నెయ్యంపుసఖిం జేరఁబిలిచియిట్లనియె.

కన్యక.—సఖీ! ఇపుడెంతకాలమైయుండును?

మంజ.—కొంచెమించుమించుగ నర్ధరాత్రము కావచ్చినది. ఇంకను బండ్రెండుగంటల ఫిరంగి వినఁబడలేదు గదా?

కన్య.—అవును. చెలీ! ఈపండువెన్నెలలో నాకెంత చరించిననువిసువు జనింపకున్నది. ఆహా! ఎల్లఁగడల నిశ్శబ్దముగనుండ నాకసమునం దెచ్చటను మబ్బులేక నక్షత్రము లలరారుచుండ సంపూర్ణకాంతుల రాజిల్లు నీ చంద్రమండలము చూపరుల కెంతయాహ్లాదము గొల్పుచున్నదే.

మంజ.—అవును. దేశమం దేకల్లోలములులేక ప్రజలందఱుహాయిగ సుఖింప ధీపరాక్రమవంతుఁడై తేజశ్శాలియై కువలయపాలన మొనరించు రాజుంగాంచిన నెవరికానందము గలుగకుండును?

కన్య.—ఈకాలమున నట్టివార లే రైనఁగలరా?

మంజ.—లేకేమి?

కన్య.—చెలీ! అట్టి మహాత్ముని నామాక్షరములచే నాశ్రవఃపుటములు నలంకరించెదవా?

మంజ.—ఆహా! ఎంత తెలియనిదానివలె నటించెదవే? నానోటఁజెప్పింపవలెననియా?

కన్య.—అటుకాదు. నీయుద్దేశ మేమో చెప్పుము.

మంజ.—మన యిద్దఱి యుద్దేశములకెప్పుడు భేదముగలుగ లేదుగదా.

కన్య.—లేదుగాని యిపుడునీవు వచింపరాదా?

మంజ.—కానిమ్ము. నీవాంఛిత మేల నష్టపఱుపవలయు? చెప్పుటకు నాకును వినుటకునీకును విసుగుకలుగదు లే. ఏరాజుసద్గుణపుంజముల కాటపట్టని సమస్తప్రజలచే నుతులందుచుండునో, యెవని పరాక్రమశౌర్యములు వైరిరాజులకు గుండెదిగులుఁ బుట్టించుచుండునో, యెవని రూపరేఖావిలాసములు సౌందర్యవతులని ప్రఖ్యాతివహించిన కన్యకామణుల స్తోత్రము లందుచుండునో, యెవనినామ మెన్నిపర్యాయములు విన్నను నీకు దృప్తియుండదో—

కన్య.—అబ్బ. పేరు సెప్పుమన్న నీప్రసంగమంతయు నేటికి?

మంజ.—ఇంతచెప్పి పేరుసెప్పక మానుదునా? ఏమి, ఇంతలో నడ్డము తగిలితివి; కానిమ్ము. సూర్యగ్రహమునకు తొమ్మిదికోట్ల, పది నాలుగులక్షల, ముప్పదివేలమైళ్ళ దూరముననుండు గ్రహమేది?

కన్య.—భూమి.

మంజ.—దాని కేకచక్రవర్తి వలన గలిగినపేరేమి?

కన్య.—పృథివి.

మంజ — మనదేశమందలి కవులు నృపాలునకుఁ జంద్రునకుఁగలిసి వచ్చునట్లు శ్లేషాలంకారమున వాడుపద మేది?

కన్య.—కువలయపతి.

మంజ.—ఏకపదముఁ జెప్పుము.

కన్య.—రాజు.

మంజ.—ఆరెంటిఁ గలిపిచెప్పుము. అతఁడే.

అనఁ బట్టరాని సంతసమున మోము కలకల లాడుచుండ నేమియుఁబలుకక వాల్జూపుల మంజరిఁజూచుచు నాకన్నియయూరకుండెను. అప్పుడు మంజరి యిట్లుపలుకరించెను.

మంజ.—నెచ్చెలీ! అనిమేషమునఁ జంద్రబింబముఁగాంచుటకంటె నీవ దనముఁ జూచిన నెక్కువ సంతోషము కలుగుచున్నదికదా?

కన్య.—ఎందువలన?

మంజ.—మనోహరనామప్రశంసచే సంతోషము పొంగి మొగముపై వెలిబాఱుచుండుటవలన.

కన్య.—చాలు లెమ్ము నీమాటలు. అయిన నా రాజునుగుఱించి యింకేమైన నూతనవృత్తాంతములున్నవా?

మంజ.—వలచియున్న దానవు నీకుమాత్రము తెలియదా?

కన్య.—ఆయనసుగుణగణముల విని వలచితినిగాని ప్రస్తుతమతఁడొనరించుచున్న కార్యములఁగూర్చి నాకేమియు బాగుగఁదెలియదు.

మంజ.—అటులైన నెలరోజులక్రిందట మాపినతల్లిగారి గ్రామమునకేగినప్పుడటఁ నొకబాటసారివలనఁ గొన్ని సంగతులువింటిని. వాని సారాంశముఁదెలిపెద వినుము. ఋషిజనసేవ్యమానమై, ప్రఖ్యాతికెక్కిన మన యార్యావర్తమునకు మాంసఖాదనులగు కొన్ని జాతులవారిమూలమున లేనిపోని బెడదలు సంభవించినవి. మొట్టమొదటఁ బాంచాలమునఁ బశ్చిమప్రాంతముల నుండుప్రజలు కొందఱాఫగన్ దేశస్థులగు మ్లేచ్ఛులఁగలసి పలలముఁదిన నలవాటుపడినారు. వారివలన స్వార్థపరులగు మఱికొందఱు మతాధిపతులలవాటుపడి వామమార్గులనుపేరున దేశమునం దెల్లెడల బోధించుచు ననేకప్రజలఁ దమలోఁ గలుపుకొని దురాచారములఁగడఁగ నారంభించిరి. అప్పటికె నూఱువర్షముల నుండి దేశమున నుత్తములగు రాజ్యపాలకులు లేనందునఁ బాఠశాలలన్నియు ధనలోభులగు నధికారులమూలమున నాశ

నమైయుండుటచే జనులును విద్యావిహీనులై యుండిరిగాన మూర్ఖులై తమ పురోహితులమాటలే విని మోసపోవుచు వచ్చిరి. ఇటులుండఁ జక్రవర్తి సింహాసనమునకు వచ్చినపిదప నతఁ డుత్తమవిద్యావంతుఁ డగుటచేఁ దన రాజ్యమున జరుగు చున్న హాత్యల కసహ్యముఁజెంది తన దేశమునందట్టి దుష్కార్యము లొనరింపఁగూడదని గట్టియుత్తరవుగావించి సత్యవిద్యావిదూరులగుటచేఁ బ్రజలిట్టి యకార్యముల నొనర్పఁగడఁగిరి గదా యని యోచించి ప్రతినగరమునందుఁ బాఠశాల లేర్పఱిచి మాసిపోయిన చదువుల మరలఁ బైకిఁదెచ్చినాఁడు. అందువలన నుత్తమవిద్యావంతులై జనులు కొంద ఱట్టి దురాచారములు చేయుట మాసివేసిరి. మఱియు పదునొకండవ శతాబ్దమునఁ గలిగిన మ్లేచ్ఛుల యార్భాటములచే జను లందఱు నొకక్రొత్తమార్గమునుద్రొక్కుచున్నారు. తమతమ కాంతలు మ్లేచ్ఛులవాతఁ బడకుండ సంఘమం దనేకమార్పులఁ గలిగించుకొనుచున్నారు. అవి నేఁటివఱకును జరుగుచునేయున్నవిక దా?

కన్య.—అవును. పాపము మనతోటికాంతల మ్లేచ్ఛులు పెట్టిన బాధలు గణింప నలవికాకుండెనఁట.

మంజ.—"ఉండెనఁట" యనియనుచున్నావా? ఇప్పుడు మరల వచింప నలవికాని యల్లరులు జరుగుచున్నవఁట. గడచినశతాబ్దమందే మ్లేచ్ఛులపోరు దప్పించుకొనుటకుఁ గొందఱు సంఘసంస్కారకర్తలు గ్రామములమీఁద బయలుదేరి యూరూర నాఁడుబిడ్డల కెనిమదవయేఁడు రాకమునుపే వివాహముఁ జేయవలయుననియు,బురుషుఁడు గతించిన స్త్రీని మగని శరీరముతోడనే దహానము సేయవలయుననియు, నారులకు విద్యనెప్పించి బహి

రంగముగఁ దిరుగనీయఁగూడదనియు బోధించుచుండిరని నీవె ఱింగియే యున్నావుకదా.

కన్య.—అయ్యో! మఱచియున్న యాదుర్దినములందలి సంగతులన్నియు జ్ఞాపకమునకుఁదెచ్చితివా? ఆవిషయాములగురించి వ్రాసియున్న గ్రంథములఁ జదువునపుడంతయు నాకు భరింపనలవికాని వేదన గలుగుచుండును. ఆపాడుదినములు పోయినవనియే తలంచితి. అయిన నురలనిపుడెవ్వరైన సంస్కారకర్తలు బయలుదేఱినారా?

మంజ.—బయలుదేఱకున్న నెట్లు? మనవారందఱు మాపెద్ద లేర్పఱచిన పూర్వాచారముల మానఁజాలమని తమబిడ్డలకు పదియాఱవయేఁటివఱకు వివాహ మొనరింపక యుంచినచో నిలోపలనే యేమ్లేచ్ఛుఁడో తనవాత వేసికొనిపోవుచుండు; పురుషవిహీనయగుకాంత బ్రతికియున్న నెప్పుడో యొకనాఁడు రాక్షసుని పాలు కావలసినదే. విద్యావతియై బహిరంగముగ సంచరించుచుండుకామిని యేమహమ్మదీయునకో యాహారమగుననుట తథ్యమే.

కన్య.—కట్టా! మనజాతి కాంతలకెట్టి యిక్కట్టులు సంభవించినవే? అవును. ఇట్టియెడఁ బూర్వాచారమని పట్టుపట్టిన నెట్లు?

మంజ.—మాపూర్వాచారము వదలఁజాలమని కూరుచున్నవారు తమవారల మ్లేచ్ఛులకే యొప్పగించుచున్నారు.

కన్య.—అయిన సంస్కారకర్తలిపుడేమి చేయుచున్నారు?

మంజ.—ప్రతిగ్రామమునకేగి యందు మీమీస్త్రీల రక్షించుకొనఁదఁలచితిరా బాల్యమందే వివాహములు సేయుఁడనియు, లేకున్న మ్లేచ్ఛుల బారిఁ ద్రోయవలసివచ్చుననియు, నుపన్యాసము లిచ్చుచున్నారు.

అందులకుఁ గొందఱు సమ్మతించుచున్నారఁట. కొందఱు "మాపిల్ల లెట్టులైనఁ గానిండు, మా పెద్దలేర్పఱచిన యాచారముల వదల" మని వచించుచున్నారఁట మఱికొందఱు సంస్కారపక్షమవలంబించియు లోలోపలఁ దమ పూర్వాచారముల విడువకున్నారఁట. ఇంకఁ గొందఱు మనఃపూర్వకముగ సంస్కారపక్షము పైకొననభిలాషగలిగియుండియుఁ దమ పెద్దలకు జడిసి యూరకొనుచున్నారఁట. ఇప్పుడందువలన దేశమంతయు నానావిధములైయున్నది. మఱియుఁ గొన్నిగ్రామములందలిప్రజలు తమమాటవినక ధర్మశాస్త్రముల నవైన ప్రమాణములఁజూపుడనికోర సంస్కరణసమాజమువారు గొన్ని శ్లోకములఁ గల్పించి చెప్పుచున్నారఁట.

కన్య.—ఆశ్లోకము లేవో నీకుఁదెలియునా ?

మంజ.—నాకన్నియుఁదెలియవుగాని రెండుమూఁడుమాత్రము నాకోటికివచ్చును. వచించెదవినుము.

స్త్రీలకు వేదాదివిద్యల నేర్పకుండుటకు
"స్త్రీశూద్రానాధీ యామితిశ్రుతేః" అనియు
వారలకు బాల్యమందే వివాహములొనరించుటకు గాను,
"అష్టవర్షా భవే ద్గౌరీ నవవర్షాచరోహిణీ
దశవర్షా భ వేత్కన్యా తతఊర్ధ్వం రజస్వలా"
"మాతా చైవ పితా తస్య జ్యేష్ఠో భ్రాతా తథైవచ,
త్రియస్తే నరకంయాంతి దృష్ట్వా కన్యాం రజస్వలాం."
అనునవి పారాశర్యము మొదలగు స్మృతులలోని వని చెప్పిరొప్పించుచున్నారఁట.

కన్య.—అయ్యో! ఈపాడు శ్లోకములే ముందుకుఁ బ్రామాణికములై యప్పటివారి కంఠములఁ బట్టుకొనునేమో కదా!

మంజ.—మఱి కాలముననుసరించి సంఘమును మార్పులఁగావించు కొనకున్న నెట్లు! ఈ మ్లేచ్ఛుల క్రౌర్యములన్నియు నడఁగి యుత్తములగు రాజులు పాలించి దేశమంతయు నెమ్మదిగ నున్నతరి మరల యథాప్రకారము కావచ్చును.

కన్య.--అప్పటివారల కివి కల్పితశ్లోకములను జ్ఞానము గలుగక నమమ ప్రబలమగు దురాచారముల మగ్నులై మా యాచారముల నూనఁజాలమని కూరుచున్నచో నాకల్పాంతము మనతోడి కాంతలెల్లరు మూర్ఖురాండ్రై యుండవలసినదేకదా ?

మంజ.—అటు లెందు కగును? ఆచారమువలన దేశకాలస్థితులననుస రించి పరమేశ్వరగుణ కర్తానుకూలముగఁ బ్రజలందఱు నడుచు కొనవలసిన విధులేకదా! ఒకవేళ మనదేశము నీవువచించినట్టి స్థితికి వచ్చిన బుద్ధిమంతులగు కులాచారసంస్కరణకర్త లప్ప టికెవరైన బయలుదేరకుందురా?

కన్య.—అవును లెమ్ము. మనదేశమున కెట్టింటక్కట్టులు మూడవలసి యున్నవో యెఱుఁగము. నాజనకుండు చక్రవర్తితో నింతవై రముఁబెట్టుకొనకున్న దేశమిట్టి గతికి వచ్చియుండదుగదా?

మంజ.—అవును. మూర్ఖమతులమనసు ద్రిప్పనెవరితరము?

కన్య.—చెలీ! ఇప్పుడీసంగతులన్నియు ముచ్చటించుకొనుటవలన నామ నసు కలఁత నొందినది. మన గృహారామములోనికిఁ బోయి వత్తము.

మంజ.—ఒంటిగంట కావచ్చినది. ఇప్పుడేమి?

కన్య.—అటుకాదు. త్వరలోమరలి చనుదెంతము రమ్ము.

అన మంజరి తనచెలిమాటఁ ద్రోయఁజాలమి నటులేయని సమ్మ తించెను. అంతనాకన్నియ లిరువురు మందిరారామములోనికేగ వెడలిరి.

ఏడవ ప్రకరణము.

పూర్వకాలమున నార్యావర్తమునందు ఢిల్లీనగరముతరువాత నంతప్రసిద్ధికెక్కినపట్టణము కన్యాకుబ్జనగరము. దీనినేఁడిప్పుడు "కనూజ్" యని వాడుచున్నారు. పండ్రెండవశతాబ్దమున నసఁగా మనచరిత్ర కాలమున జయచంద్రుఁడనురాజు దానిబాలించుచుండెను. ఇతఁడు సద్గుణవంతుఁడేకాని యొక్కదుర్గుణము మాత్రముకలిగియుండెను. ఆదుర్గుణమేదనఁ దన ప్రాణము మీఁదికివచ్చుచున్నను లెక్కగొనక ముందు వెనుకలరయక మంచి చెడ్డలవిచారింపక తాఁబట్టిన మూర్ఖపుఁబట్టును నెగ్గించుకొనుట. అనేకసద్గుణగణచంద్రతారావిరాజితుఁడయ్యు మౌర్ఖ్యమను ఘోరజీమూతసంఛన్నుండై మనదేశము నన్యులపాలఁ బడవైచిన దీమహాత్ముఁడే. ఇతఁడు రాజ్యముసేయుకాలమున ఢిల్లీనిదీపసింహునివంశస్థుండగుజీవనసింహుఁడుపరిపాలించుచుండెను. జయచంద్రజీవనసింహులిరువురుమైత్రికలిగియుండి పరదేశములవారి నార్యావర్తము ద్రొక్కకుండఁ జేయుచువచ్చిరి. ఇటులుండ జీవనసింహుఁడు కారణములేకయే తన సేననంతయుహిమాలయప్రాంతములకనుప చౌహాన వైరాట్వంశస్థుఁడగుపృథ్వీరాజుతనసేనతో నాకస్మికముగఢిల్లీపైఁబడి యారాజునునోడించిరాజ్యమునుతనవశముచేసికొనెను. ఈసంగతిజయచంద్రుఁడు తెలిసికొని తనమిత్రునిఁ జంపెననియు సామంతుఁడగువాఁడు చక్రవర్తియయ్యెనని యుఁ బృథివీరాజుపైఁ గోపమును అసూయనుబూని నాఁటినుండియు నతని చక్రవర్తిపదభ్రష్టునిఁ జేయఁగనుపెట్టుకొనియుండెను. చదువరులారా! మన యార్యావర్తమన్యులపాలగుట కీవిరోధమే కారణము. మనదేశమున బాల్యవివాహములు సహగమనములు మొదలగునవి ప్రబలుటకీ జయచంద్రుని మూర్ఖత్వమే కారణము. వేయేల? మనకుఁగల

స్వాతంత్ర్యముల నన్నిటి నేటఁగలిపి యస్వాతంత్ర్యవుఁ బ్రతుకుఁగలుగఁ జేసినది జయచంద్రునిఁబట్టిన యసూయయే. పృథ్వీరాజుపై విరోధము నీర్ష్యయు వహింపక తనమూర్ఖపుఁబట్టుదల మానియుండినయెడల నెంతబాగుండును? పూజనీయమై మునిజనసేవ్యమానమై విదేశీయగణ్యమై ధనధాన్యరాశులకాగారమై మహోన్నతపదవియందుండిన నీయార్యావర్తము భ్రష్టము కావించి వదలినమూఢుఁడీ జయచంద్రుండె యనినొక్కివక్కాణింపనగును. పైప్రకరణమున సౌధోపరితలంబున విహరించి గృహారామమున కేగఁదలఁచిన కన్యక యీజయచంద్రుని కూఁతురు. ఈమెయే మన కథానాయికయగు "సంయుక్త". అట్లిరువురు కన్యలు గృహారామమున కేగ నెడలి పైయంతస్థునుండి సంయుక్త శయనమందిరములోనికి దిగిరి. ఈగది విశాలమై చదరముగ నుండెను. పైభాగమునఁ దెల్లపట్టుతానులతో చాందినీ యమర్పఁబడియుండెను. క్రిందఁ దలవరుసగ స్థాపింపఁబడిన పటికంపురాలపై ముఖ్మల్ మెత్త పరుపఁబడియుండెను. చాందినీకి మూరెఁడు క్రిందుగఁ జిత్రవిచిత్రములగు గులోబులు, పెద్దపెద్ద పాదరసపుబుడ్లు, మెఱుపుదీపములుంచుట కనువగు నద్దపుగిన్నెలు వ్రేలాడుచుండెను. గోడలలోపలి భాగమంతయు నిర్మలమగు నద్దములకూర్పుగలిగి యుండెను. ఇవికాక నానాదేశముల చిత్రపటముల నక్కడక్కడ వ్రేలాడఁదీసి యుంచిరి. మెత్తపైస్వదేశ పరదేశ నిర్మితములగు చలువరాలకుర్చీలు వట్టువబల్లలు, సోఫాలనేకములు అలంకరింపఁబడియుండెను. మందిరమునడిమిభాగమునఁ దూగుటుయ్యేలలును, వానిమధ్య హంసతూలికాతల్పమును నుండెను. ఈప్రాసాదము నాల్గువైపుల విశాలములగు కవాటములు గలిగియుండెను. కవాటములనుండి బయటికేగ పిట్టగోడలచే నావృతమైన గొప్పహర్మ్యోపరితలము గాన్పించును. అందు బారులుగఁ దీర్పఁబడిన పలురకముల పూలచెట్లతొట్లును వానిమధ్యభాగమునఁ దీవెలతో దట్టముగ

నల్లుకొనిపోయి లతాగృహమువలెనుండు చలువపందిరియుఁ జూపరుల కాహ్లాదముఁ గొలుపుచుండును. వారిరువురుఁ గొంతవడి చలువపందిరివద్దఁ దిరిగి యక్కడనుండి క్రిందియంతస్థునకు దిగసాగిరి. ఈ క్రింది నికేతనము సంయుక్త ధరించునట్టి యమూల్యములగు వస్త్రాభరణముల మందసములుగలిగి పైప్రాసాదమున కొంతమాత్రము దీసిపోవకుండెను. అందుఁ బ్రవేశింపకయే వారిద్దఱు దానిక్రిందియంతస్థునకు దిగ నారంభించిరి. ఇదిసంయుక్త దేహపరిశ్రమఁ జేయునట్టిగది. ఎల్లపుడు ధరించునట్టివస్త్రములుగాక యస్త్రవిద్య నలవర్చుకొనుటకుఁ బ్రత్యేకముగదాల్చునట్టి యుడుపు లనేకములక్కడక్కడ వ్రేలాడుచుండెను. గోడల కొకవైపునఁ దళతళలాడు గత్తులును మఱియొకవైపున తుపాకులు మొదలగునవి తగిలించియుండిరి. మొదటఁబేర్కొన్న ప్రాసాదమునకుంబలె దీనియందు నొకవిశాలమగు బహిరంగప్రదేశముగలదు. సంయుక్తతన చెలిఁగోనందుఁ బ్రవేశించి వయ్యాళికేగునప్పుడు మామూలుగ ధరించునట్టి చేకత్తి నొకదానిఁ గైకొని క్రిందియంతస్థునకు దిగసాగెను. ఈక్రిందియంతస్థు సంయుక్త విద్యాభ్యాసమొనరించుకొనుహర్మ్యము. వరుసలుగఁదీర్పఁబడి బీరువాలు లెక్కింపనలవికాని గ్రంథరాజములఁ గూడుకొనియుండెను. సంయుక్త పుస్తకాగారముఁ బ్రవేశింపకయే దాని క్రింది యంతస్థునకు దిగి యటనిద్రాపరవశలైయున్న దాసీనికరంబుల కెఱుకరాకుండ మెల్లన నడుగులిడుచుఁ గ్రిందికిదిగి యటనుండి తోటలోనికిఁ బోవు తలుపుఁ దెఱచుకొని వనములోని కేగి విరియఁబూచి వెన్నెలలో మఱింత మనోహరములుగనున్న బొండుమల్లియల విలాసంబున కానందమందుచు నటకుఁగొంచెము దూరమున నున్న మాధవీలతా మంటపము లోనికేగి యక్కడనుండి వెడలి యుత్తరపుదిశనున్న లవలీలతా మంటపముఁ బ్రవేశించి యా చేరువనున్న కప్పురంపు దిన్నెల యామోదమున కామోదమందుచుఁ

బిన్నట బ్రాగ్దిశయందలి నవమల్లికాలతామంటపముఁజేరి, యాప్రాంతములనున్న సంపెఁగవనము నుండివచ్చుకమ్మ తావులకుసమ్మోదమంది, యావలఁగడచి చలువరాలచే నిర్మింపఁబడి, నిండువెన్నెలలో నిగనిగలాడుచున్న కేళాకూళిం జేరి జలయంత్రముల విప్పవ నించుకసేపటికి నీరునిండి వెల్లువయై పారఁదొడఁగెను. కొంతతడవు దానిగట్టుపైఁగూరుచుండి మృగములున్న వైపునకేగఁదరలిరి. ఈ మృగశాల తోఁటయందుత్తరమున నుండెను. తూర్పువైపుగోడనుండి పడమటికడ్డముగ వల యొకటిగట్టఁబడియుండెను. వలదాటి లోపలికిఁబోవ వరుసలుదీరి యున్న శాలలనేకములు కాన్పించును. అందు మొదటివరుసయందు సింహవ్యాఘ్రాది జంతువులును, రెండవవరుసయందు బలురకముల కోతిజాతులును, వానికావల నానావిధపక్షులును, దదనంతర మనేక సర్పజాతులును, వేరువేరుశాలలయం దుంచఁబడియుండెను. ఇందుఁ బ్రతిశాలకెదుట నంతఃపురస్త్రీలుకూరుచుండి జంతువులచేష్టలు వీక్షించుటకై మంటపములు కట్టఁబడియున్నవి. ప్రతిమంటపములోఁ దూగుటుయ్యేలలు, సోఫాలమర్పఁబడియుండెను. తోఁటయందన్ని భాగములను, మంటపములందును, జంద్రకాంతులఁగ్రిందుపఱుపఁజాలు విద్యుద్దీపములు పెట్టుటకనువగు సన్నని గొట్టములడుగడుగునఁ బెట్టఁబడియున్నవి. వెన్నెల దినములలో మంటపములందలి దీపములమాత్రమే వెలిగించుచుందురు. మఱియు నాయావరణమందు నాలుగువైపుల స్ఫటికశిలావినిర్మితములగు కేళాకూళులుగలవు. ఇవి చిన్నచిన్న సోపానములనొప్పి పూలవృక్షములతోట్లచేఁ గడుమనోహరముగ నుండును. ఈనాలింటిలోపలఁ దూర్పుప్రక్కనున్నది. దట్టముగఁ దీఁగెలతోఁ నల్లుకొని మనుష్యులుదాగియున్నను నగుపడకుండఁ జేయుచుండును. అట్టి యావరణమం దాయిరువురుకన్నియలుఁ బ్రవేశించి మొదటిశాలలవరుసదాటి రెండవశ్రేణియందలి కోతులచేష్టల దర్శింపఁగోరి యొకమంట

పమునఁజేరి యొకసోఫాపై నాసీనులై వానితోఁ జమత్కారముగ ముచ్చటించుచు నాడుకొనుచుండిరి. ఆతరుణమున దీర్ఘకాయుండగు నల్లని మానవుఁడొకఁడు పుట్టగోచిని బెట్టుకొని శరీరమునందు యాముదము కారుచుండఁ దీక్ష్ణమగు మూరెఁడుపొడుగుగుదియ నొకదానిఁ జేతఁ బట్టుకొనిచూచువారలకుఁ బ్రత్యక్షయముఁడోయను భయముగలిగించుచుఁ దూరుపుప్రక్కనున్న కేళాకూళిమాటున కేగెను. తనయాకార వేషములతోఁ దులదూగఁగల మఱియొకని నటఁగలసికొని యామనుజుఁ డిట్లుమాటలాడసాగెను.

మొదటివాఁడు — అరే! వచ్చినటులున్నదే.

ద్వితీయుఁడు.—ఆ! ఇన్నిదినములకు మనకష్టము లీడేరుసమయము వచ్చినది.

ప్రథముఁడు.— అందులో నెవనై రాజుకూఁతురు?

ద్వితీ.—అదియేమోనాకుఁ దెలియదు.

ప్రథ.—మఱేమిచేయుదము?

ద్వితీ.—వారి మాటలవలనఁ గనుగొందము, నివించుకతాళి యుండుము.

అనవాఁడేమియుఁ బలుకక నిలచియుండెను. అత్తరిసంయుక్త వదన మించుకవాడియుండుట దీపములవెలుతురునఁ గనుగొనిమంజరి యిట్లనియె.

మంజ.—నెచ్చెలీ! ఇప్పటికి రెండుగంటలు కావచ్చినవి. నీకింకను నిద్ర వచ్చుటలేదా? నిద్రలేమి దేహమునకెట్టి యనారోగ్యము కలుగునో యెఱుఁగవా? సకలమెఱిఁగిన విద్యావతివి రాకొమారి తవు నీవే యిట్లొనరించుచున్న నిఁకమాబోంట్లకు బుద్ధులు గఱపు వారెవరు?

అన నదివఱకె కొంచెము నిద్ర వచ్చుచుండుటవలన నబ్బుమాటలతో సంయుక్త "చెలీ; ఈదినమున నాకేమో యారాటముగ నున్నదే. నాకోర్కె నెఱవేర్చుకొనని వచించిపోయిన నాగురువుగారి వార్తయించుకైనఁ దెలియలేదుగదా! అందుచే నత్యంతపరితాపము కలుగుచున్నది" యనివచించుచు నట్లే సోఫాపైఁబరుండి నిదురవోయెను. మంజరియు వనవిహారముచే బడలికఁజెంది నిద్రించినసంయుక్త నప్పుడే మేల్కొలుపుట కిచ్చగింపక యొకగడియ వెనుక మేల్కొల్పెదనని యనుకొనుచు నట్లే తానును నిదురవ్వోయెను. ఇక్కడ వీరిట్లు నిద్రించుటఁగాంచి దాగియున్న యిరువురు నిశ్శబ్దముగ నామంటపములోనికేతెంచి వారలమాటలవలన రాకుమారికం గుర్తించుకొనియుండిరి గావున నామెపరుండియున్న సోఫానెత్తుకొని తామదివఱకె తెఱచియుంచుకొన్న ద్వారముల దాటి తమదారింబోయిరి.

"పురుషార్థప్రకాశము"
ప్రాచీనఋషిసమ్మతమైన మార్గము.
వి. వి. కే. లక్ష్మజీరావు,
పబ్లిషర్, గుంటూరు.

ఎనిమిదవ ప్రకరణము.

అంతఁ దెల్లవాఱుజామున నాలుగుగంటలగుటయు నిదురఁజెంది యున్న సింగములు లేచి "మందబుద్ధులగు నోద్వారపాలకులారా! జయచంద్రునకుఁ బ్రాణసమానురాలగు సంయుక్తను దస్కరు లెత్తుకొని పోవుచుండ నజాగ్రతతో నిద్రించుచుంటిరి గాన మిమ్మందఱ నిప్పుడే మ్రింగివైచెదము చూడుఁడు" డని హుంకారములు సలుపుచున్నవో యన నొక్కపెట్టున భయంకరముగ గర్జింపసాగెను. అత్తఱి నా గర్జనముల కులిక్కిపడి లేచి మంజరి తనకట్టెదుట సంయుక్తను గానక సంభ్రమమంది పేరులుపెట్టి పిలిచియుఁ బ్రత్యుత్తరము గానక యొకవేళ తన నిద్రాభంగము సేయుట కిచ్చగింపక వేఱొకచోటి కేగినదేమో యని మృగశాలలన్నింట వెతకి యచట నుండగానక దిగులొందుచుఁ ద్వరితగతి నారామముఁ బ్రవేశించి నల్గడలఁ బరికించి యెందును బొడగానరామి భయార్తయగుచు నేమియుఁ దోఁపక బిరబిర మేడ నెక్కి ప్రతియంతస్థునందును రోయుచు, శయనమందిరముఁ జేరి యచ్చోటను గానరానందునఁ బొంగి వచ్చుచున్న దుఃఖభారమున మొదలునఱకిన తరువువలె నిలువున నేలఁ గూలి "హా! ప్రాణసఖీ! నన్నొంటిదానిఁ జేసి నీ వెచటి కేగితివి? మనకు శరీరములు వేఱైనను బ్రాణ మొక్కటియే యని యదివఱ కనేకమారులు వచించియుంటివే. అయ్యో! సగముప్రాణముతోఁ బోవ నీకు మన సెట్లు వచ్చెను? ఈ దుర్వార్త మీ వారల కేమని వచింపుదు? ప్రాతఃకాల మగునప్పటికి నీ తల్లి చనుదెంచి సంయుక్త యెక్కడని యడుగ నేమని చెప్పుదును? కట్టా! సంయుక్తను నా పొట్టను వైచుకొంటినని వచింపుదునా? నాపై నింత కాఠిన్య మేల పూనితివి? నీ సౌఖ్యమున కాశించియే గదా! నిన్ను రమ్మనిన చోటి కెల్ల వచ్చుచుంటిని. ఇయ్యెడ నన్ను వెంటఁ

గోసిపోయిన నీయుద్దేశమునకుఁ బ్రతిబంధకమగుదునని వదలిపోయి తివా? హా! ఇంకెందుఁబోవుదాన" నని బిగ్గరగ నేడ్చిన వారువీరు లేచి వచ్చెదరను భయమున లోలోపలనె కృశించుచు సముద్రతరంగముల వలె పొర్లి పొర్లి వచ్చుచున్న దుఃఖమున నేమిసేయుటకుఁ దోఁపక మరల నారామముఁ బ్రవేశించి వెదకినచోటే వెదకుచుఁ బిచ్చియెత్తిన దాని వలె వనమంతటఁ గలయఁబరికించి మితిమీఱినశోకమున నటనుండ మనసొప్పక "హా నాప్రాణపదమగు సంయుక్త నెడబాసి నేనేల యొంట రిగ నుండవలయును? నానెయ్యంపుఁ జెలియెక్కడనో యేయిడుములో పడుచుండ నేనింట సౌఖ్యముగ నుండఁగలుగుదునా? నేనును దదన్వే షణార్థ మెచటికైనఁబోయెదఁగాక" యని దృఢచిత్తయై తత్క్షణంబ యాయుధాగారమున కేగి యటఁగల కొన్నియాయుధములతోఁ బురుష వేషము వేసికొని లోపల నడుమున రెండు కత్తులఁబదిలపఱచుకొని కావ లివార లెవరును లేనకమున్నె యారామద్వారములన్నియుఁగడచి చింతా సాగరంబున మునిఁగి తేలుచు నెక్కడికో పోయెను. అంతఁ గొంత వడికిఁ బక్షులకలకలారావములు మిన్నుముట్ట జల్లని ప్రభాతవాయువులు మెల్లనవీవఁ దొడఁగెను. ముందు జరుగఁబోవు రణమునందిట్టి రక్త సిక్తములగునని సూచించుభంగిఁ బూర్వదిక్కునందలి యరుణమరీచులు కన్యాకుబ్జనగరప్రాసాదతలములపైఁ బ్రసరించుచుండెను. కావలివా రెల్లరుఁ దమ్మునావేశించియున్న నిద్రాపిశాచముల నతికష్టము మీఁద వదలించుకొని ఖడ్గపాణులై జాగరూకతతోడ ద్వారములఁ గాచుచుం డిరి. కాని రాత్రిఁదాము పడుండఁబోవునపుడు మూసినద్వారము లిపుడు తెఱువఁబడియుండుట కేమిహేతువో యని యొక్కఁడైన దలఁపఁ డయ్యెను. అత్తఱిఁ జెలికత్తెలెల్లరు మేల్కని సంయుక్త శయనమందిరము లోని కేగి యామెఁ గానక మంజరియు లేకుండుటవలన నిరువురుఁ దమ కన్నముందుగ లేచి ప్రాతఃకాలవనవిహారమున కేగియుందురనుదలఁపున

వారిఁగలసికొనుటకై క్రిందికివచ్చి తోఁటయందుఁ బ్రవేశించి యన్ని మూలలవెదకి వారిఁ బొడగానక ద్వారముకడ కేగి "ఓరీ ! మంజరీసంయుక్తలెక్కడికైనఁ బోవుటఁ జూచితిరా?" యని యచటి కావలివారల నడుగ "అమ్మలారా ! రాత్రియంతయు నిద్రేప్రకారము గాచుకొని యున్నాము. మాకెవ్వరుఁగాన్పించలే" దనిన వింప నందఱుసంభ్రమాక్రాంతహృదయలై వేవేగ నంతఃపురమున కేగి రాణి కాసమాచారమెఱిఁగించిరి. ఆమెయుఁదల్లడమంది లేచిపోయి జయచంద్రునకు విన్నవింప భయాకులుఁడై యేమిచేయుటకును గాలు సేతులాడక కోట నాల్గుమూలల వెదకించియుఁగార్యముగానక భటులఁ గొందఱి నన్నికడలఁ బురములోపల వెలుపల రోయఁబంచి యాందోళనమున నుండెను. రాణివాసమంతయు నల్లకల్లోల మగుచుండెను ఈసమాచార మప్పుడె నగరమంతట వ్యాపింపఁ బౌరజనంబు లెల్లరును విచారపడసాగిరి. పట్టణమందలి జనంబు లెల్లరు నామె సుగుణములకును, విద్యకును, జక్కఁదనమునకు నావాసమని వేనోళ్ళశ్లాఘించుచుందురు. మఱియుఁ గన్యాకుబ్జమున రూపొందివెలసిన లక్ష్మియని భావించుచుందురు. పౌరులెల్లరు దమస్వంతబిడ్డలుపోయినట్లు విలపింపసాగిరి. ఇఁక రాణియొక్కయవస్థ నేమని చెప్పనగు ? జయచంద్రుఁ డించుక ధైర్యవంతుఁడగుటచే మంజరియు లేనందున వారిద్దఱుఁగలిసి యెక్కడికో పోయియుందురనియు, నిరువురుఁగలసియున్నంతవఱకువారి కేయిక్కట్టులు సంభవింపవనియు నెంచుకొనుచుఁ గంటికి మంటికి నేకధారగా విలపించుచున్న రాణినోదార్చి, కొలువుకూటమున కేగి చారులనేకులనన్ని దిక్కులవెతకఁబంచి పురమునందంతట సంయుక్తను గొనితెచ్చువారికి బహుమానములియ్యఁబడునని చాటింపించెను. ఆచాటింపువిని పలువురు బీదలు నగరము వెడలి యనేకగ్రామములు వెతకి యెచ్చోటనుంగానక తిరిగివచ్చుచుండిరి. మఱికొందఱు రాకుమారికను గనుగొన కేలమరలిపోవల

యుండని పట్టుపట్టి మఱింతదూరదేశముల కేగుచుండిరి. రాణి వాస మిట్టి కారవస్థనుండ నైదురాత్రులు గడచెను. ఒక్కరును సంయుక్తవార్తం దేరరైరి అనుదినమును జూడనిదే ప్రాణముల నిలుపనోపని రాణి తనముద్దుకూఁతురుపోకడవలన మంచముపట్టి నిద్రాహారములుమాని యహోరాత్రము లొక్కతీరున విలపించుచుండెను. "హా! కుమారీ! నవశిరీష కుసుమకోమలాంగివగు నీ వెక్కడనున్నావు? నిర్దయురాలా! నాశోకమాకైనను వచింప కెచ్చటి కేగితివి? కష్టా! నవమాసములు మోసి, కని, యింత పెద్దదానిఁ గావించినందులకుఁ దుదకిది నా తల్లి మొడఁ గనఁబఱచు కృతజ్ఞత? అయ్యో పున్నమచందురుఁబోలు నీముద్దుమోమింకెన్నఁడు గాంచగలను? హా! నాదౌర్భాగ్యము! నాముద్దుకూన నెడబాసి నేనెట్లు ప్రాణముల ధరింపగలను?" అని గోలుగోలునఁ బలవించుచుండ నెల్లరుఁ జెంతఁ జేరి యోదార్చుచుండిరి. జయచంద్రుఁడును బుత్రికావార్త తెలియనందునఁ గొలువుకూటమున కేగుటమాని రాచకార్యము లన్నియుఁ జక్కఁబఱుప మంత్రికాజ్ఞాపించి తానంతఃపురంబు వదలక చింతాసాగరమున మునిఁగి కూఁతురుసమాచారమెవరుకొని తెచ్చెదరా యని దినములు లెక్క పెట్టుకొనుచుఁ గాలముఁ గడపుచుండెను.

"పురుషార్థప్రకాశము"
బ్రహ్మచర్య గృహస్థాశ్రమధర్మములు.
వి. వి. కే. లక్ష్మీరావు,
పబ్లిషర్, గుంటూరు.

తొమ్మిదవ ప్రకరణము.

మూఁడవ ప్రకరణమునఁ జేర్కొనిన మధురాపట్టణపుఁదిప్పమీఁది కాళికానిలయమునకు మఱియొకపర్యాయము మంచిదినములు గలుగుట సంభవించెను. అచ్చటివా రంద అమావాస్య పదిదినములున్నదనఁగనే గుడిని బాగుపఱచ నారంభించిరి. ప్రాకారపుగోడలకు, గర్భగుడి శిఖరమునకు సున్నమువైచి వానిపై మూఁతులు, ముక్కులు, పోయియున్న బొమ్మలఁ జక్కపఱిచి లోపలనున్న స్తంభముల కన్నింటికి రంగులువైచి యుంచిరి. గోడలమీఁదఁ జూచువారలు గుండెపగిలిచచ్చునంతటిభయంకరములగుబొమ్మలఁ లిఖించుటయేగాక యట్టివే పటముల నందందు వ్రేలాడఁగట్టిరి. ఆవరణమందు దుబ్బువలెఁ బెఱిగియున్న గడ్డినంతయు దోకి శుభ్రముచేసిరి. గజనీమహమ్మదుచే నవయవవిహీనగఁ జేయఁబడిన కారణమునఁ గాఁబోలు స్వశరీరమైనను శుభ్రపఱచుకొను శక్తిలేకయున్న దేవివిగ్రహమునకు భక్తులాదఱు మీఁదఁబడియున్న నెలుకపెంటలను దుమ్మును బోఁదుడిచి సీకాయరసముతో మడ్డినంతయుఁ గడిగి వెండికన్నులు మొదలగువాని నాయాచోటుల నలంకరించి తమకోరికల ఫలింపఁజేయునని తలఁచుచుండిరి. కాని యింతశక్తివిహీనమగు నాతివిగ్రహము మనవాంఛితముల నెట్లు నెరవేర్చునని యొక్కఁడును దలఁపఁడయ్యెను. అంతకుమునుపు మడ్డిపట్టియుండుట వలన నెటులున్నను కండ్లు మొదలగునవి చక్కఁగాఁదోమి యలంకరించిన పిమ్మట మాత్రము చూచినవెంటనే ఘాంతులుపుట్టి చచ్చునంతటిభయముఁ గొల్పుచుండెను. ఆముదముచేసంగుళమెత్తు మడ్డిపట్టియున్న దీపఁపుసెమ్మెలను, బ్రిమిదెలు బ్రయాసపడితోమి గుడిలోపల వెలుపలనున్న గూండ్లయందును గుడినుండి క్రిందవఱకున్న మెట్లకిరు

పార్శ్వములందలి పిట్టగోడలమీఁదను బెట్టియుంచిరి. మఱికొన్ని యగండముల నాలయములోపల శక్తియొకట వ్రేలాడఁ దీసియుంచిరి. ఖడ్గముల సానఁబెట్టించి లోపల నొకగదియందు వ్రేలాడఁగట్టిరి. ఇంతలో నమావసయు వచ్చెను. ఆనాఁ డా బాలగోపాల మభ్యంగనస్నానము లాచరించి నూత్నవసనధారణులై యుపవాసముండి సూర్యుఁడెప్పుడు క్రుంకునా యని వేచియుండిరి. ఆనాఁడు మిట్టమధ్యాహ్నమం దొకపెద్ద సభ గావించిరి. ఆసభయందు జారుఁడును, చోరుఁడును, విద్యావిహీనుండును, మూర్ఖాగ్రేసరుఁడును నగు వారి పురోహితుఁడు దేవి నిక్కముగఁ బ్రత్యక్షయగునని తలఁచి తత్ప్రసాదంబు దానొక్కఁడే పాలుగొను వాంఛను లేచి యిట్లని వచింపసాగెను.

“సభికులారా! మీరందఱు శ్రద్ధతో నే వచించువాక్యముల వినుఁడు. మనతరమం దిదివఱ కెన్నఁడు నొసఁగనట్టి నరబలియీదినమున నియ్యఁబోవుచున్నాము. అందు సాధారణపుమానవుండుగాఁడు సమస్త విద్యాసంపన్నురాలును సౌందర్యవతియు నగు రాజు కూఁతురై యున్నది. అట్టియెడ మనమందఱము గుమిగూడిన నాలయమున మిక్కుటమగు నల్లరియగును. అదియునుంగాక రాత్రి నాకలయందు దేవి ప్రసన్నయై ‘నాకు బలియిచ్చునపుడు నల్గురుమనుజులుతప్ప నెక్కువయుండఁగూడదు. అట్లున్న యెడల నాకన్యకనువదలి మిమ్ములనే మ్రింగెదనని వచించినది. కాన మీరందఱుఁ గొండయడుగుభాగమందే యుండుఁడు. దేవి ప్రత్యక్షమైన వెంటనే యామె యనుజ్ఞఁగొని మిమ్మందఱఁ బిలిపించెదను.’ అని నమ్మకకలుగునట్లు వచింప “ నెద్దు యీనినదన్న దూడనుగట్టివేయు” మను నంతటి బుద్ధిశాలులగు నామూఢులందఱు వల్లెయని యతనివాక్యములకు సమ్మతించిరి. అంతఁ గొంతవడికి సభ ముగింపుచేసి యెవరిండ్లకు వారుపోయిరి. సభ ముగియునప్పటికి నాలుగుగంటలయ్యెను. తరువాతఁ గొందఱు పెద్ద

మనుష్యులు లెక్కలేని మద్యభాండములు మోయించుకొని కొండ
మీఁదికేగి కొన్నింటి దేవిగుడియందుఁ బెట్టించి కొన్నింటి రాత్రికిఁ
దాము నిలువఁదలఁచుకొన్న స్థలమునఁ బదిలముసేయుంచి పరిచారకుల
కొందఱ నటఁ గావలియుంచి గృహములకు మరలివచ్చిరి. అనంతరమీ
దారుణకృత్యములఁ జూడనోపక కనుదోఁగిపోవునోయన రవి పడ
మటి సముద్రమునఁ గ్రుంకెను. బాగుగఁ జీఁకటిపడినవెంటనే నౌకరు
లేగి దీపములవెలిగించివచ్చిరి. రాత్రిఁ దొమ్మిదిగంట లగుడు మతస్థు
లెల్లరుఁ బురోహితుని యింటిదగ్గరఁ జేరిరి. నలుగురుమనుష్యులు లోనికేగి
యొకగది తలుపుఁదీయ దానిలోనుండు దివ్యమంగళవిగ్రహమురూపము
దాల్చినవగపునుంబోలె నేలకంటుకొని పడియుండెను. నా రామెను బైటికి
రమ్మని యాజ్ఞాపింప నాహారము లేక పోవుటవలనఁగాక పోయినను
మితిలేని శోకభారమున లేవనోపక కష్టపడియుండ నామెం గొనివచ్చు
టకు వ్యాఘ్రములవంటి నల్గురు స్త్రీలను బంపిరి. వారుపోయి యా
కన్యను లేపి చేతులతో నెత్తుకొనివచ్చి బయట సిద్ధముగనున్న నొక
పల్లకియందు గూరుచుండఁ బెట్టిరి. చెవులు బ్రద్దలగునట్లు రుంజా మొద
లగు భయంకర వాద్యములు తమభీకరధ్వానములచే దిశలఁ గలగుండు
వడఁ జేయుచుండ మేళతాళములతోఁ బల్లకి నెత్తుకొని యందఱును గుట్ట
వైపునకు బయలుదేరిరి. పాప మీసవారియందున్న కన్యక కెట్టిగతి
పట్టనో యూహింపుఁడు. తలిదండ్రులు, బంధువులు, తోడుకత్తెలు
మొదలగువారు కలిసిరా వివాహోచితవేషమున శుభవాద్యము
లతో నూరేఁగఁదగు నాకన్యక దుర్మార్గులగు బాపంతులు వెంటరా
మరణసూచక వేషముతో భయంకరవాద్యములు మిన్నుముట్ట నూరేగ
వలసివచ్చెఁగదా! దీనికంతయు సత్యవిద్యావిహీనతయే కారణము.
విద్యనెఱుంగనికతమున నీమతస్థులందఱు దమపురోహితు లెట్లు చెప్పిన
నట్లు నడుచుకొనుచుందురు. అట్లు కొండయడుగుభాగముఁ జేరినపిదపఁ

బైకేగ నేర్పఁబడిననలువురు పల్లకిబోయలుదప్పఁ దక్కినవార లక్కడే నిలచిపోయిరి. పురోహితుఁడాదిగాఁగల నలువురు పల్లకిని గుడిలోనికిఁ బట్టికొనిపోయి శక్తియెదుటఁ బెట్టించి బోయలవెళ్ళుఁడన వారలును నట్లె వెడలి పోయిరి. అంత నాకన్నియ పైనున్న ముసుఁగుఁదీసి వైచుటతోడనే యెదుటనున్న భయంకరమగు శక్తిఁజూచి భీతచిత్తయై మూర్ఛిల్లి లేచి తనదురవస్థ దలఁచుకొని యేడ్చుకొన్నను దాఁగక తెరతెరయై వచ్చుచున్న శోకమున నిట్లు విలపింప సాగెను. "దైవమా! నేను నీయెడఁగావించిన యపరాధమేమి? నిర్హేతుకంబుగ నాకిట్టివ్యథ నేలఁ దెచ్చి పెట్టితివి? కలనైన నిట్టి దుర్మరణంబు నొందుదునని తలంచితినా? హా! తలిదండ్రులారా! నావంటి నిర్భాగ్యురాలి మీ రేలఁగాంచితిరి? మిమ్ముఁదరిలేని శోకసాగరంబున ముంచివైచితిఁగదా! మీరలెంత పరితపించుచున్నారో! హా! మంజరీ! నీవంటి ప్రాణసమానురాలగు సఖి మఱియొకతె దొరకుట దుర్లభము. నీమాటవినక యే నెట్టిబెట్టిదములకు లోనైతిని. నీవు వచించిన ప్రకారము మందిరంబులఁ బరుండియేయున్న నాకీప్రాప్తి గలుగకుండును గదా! నేనెంతవిలపించి యేమిప్రయోజనము. తెగించి పోరాడదమన్నఁ జేత నొక కత్తియైనను లేదు. మనోహరా! నీయుత్సంగంబున వసించుభాగ్యము దౌర్భాగ్యురాలనగుట నాకు లేకపోయినది. పరమేశ్వరా! ఎన్నిజన్మములకైనను నాహృదయనాథుఁడగు పృథ్వీరాజునే ప్రాణకాంతునిగా నొసఁగుము" అని తనవారి నందఱిఁ దలఁచుకొని యొక్క పర్యాయమేడ్చి చేయునదిలేక నిరాధారయై వ్యాఘ్రముల మధ్యఁ జిక్కిన లేడివిధమునఁ బడియుండెను. పురోహితుఁ డాదిగాఁ గల తక్కిన నలువురుఁ దమదమ పూజాకార్యముల నెరవేర్పఁ దొడఁగిరి. పురోహితుఁ డెఱ్ఱని పుష్పములతోడను నక్షతలతోడను మంత్రముల జపించుచు విగ్రహమునకుఁ బూజసేయుచుండెను.

వేఱొకఁడు రెండుమూఁడు బిందెలయన్నమును గ్రుమ్మరించి దానిలో నెయ్యిని గంగుఁబోసి కలుపుచుండెను. ఇంకొకఁడు శక్తియెదుట నుండు గుండములో హీనవస్తువుల తుచ్ఛములగు మంత్రములఁబఠించుచు వ్రేల్చుచుండెను. అంతనర్ధరాత్రముగా వచ్చినంతనఁ జేయవలసినకార్యము లన్నియుఁ జేసి యిరువు రాకన్నియను దేవియెదుటకుఁ గొనివచ్చి నిలువఁబెట్టి యొరిగిపడకుండఁబట్టుకొనియుండిరి. నిర్జీవప్రతిమవలెనాకన్నియ నిలిచియుండెను ఒకఁడు శంఖముఁ బూరించుచు గంటవాయించుచుండెను. పురోహితుండతితీక్ష్ణమగు కత్తినొకదానిం గైకొని మంత్రోచ్చారణము సలుపుచు నామెశిరంబుఁ దెగవ్రేయ సిద్ధమైయుండెను. అట్టిమహోపద్రవమగు సమయంబున తేజశ్శాలియగు యౌవనవంతుఁ డొకఁడతిత్వరితగమనంబున గుడితలుపులు గుభాలున నెట్టుకొనివచ్చి తలఁదెగవ్రేయుటకు సిద్ధముగనున్న పురోహితునిహస్తమున నున్నదానినున్నట్లే తునుమాడెను. తోడనే విభ్రాంతుఁడైపురోహితుఁడునేలఁ గూల సంయుక్తంబట్టుకొనియున్న యిరువురు వేఱొకగది కేగి యాయుధములంగొని యౌవనవంతునిపై దుముకవచ్చుచుండిరి.

ఈలోపల నావచ్చినపురుషుండు "సంయుక్తా" యని కేకవైచి తనవద్దనున్న రెండవఖడ్గము నొసఁగెను. వెంటనే సంయుక్త ఖడ్గమునందుకొని యుత్తరప్రత్యుత్తరములకు సమయము లేనందున నావచ్చిన మనుజుఁ డెవరైనదియు నెఱుంగకపోయినను దనకుసహాయ్య మొనర్పఁ జనుదెంచెనని యూహించి తానును బోరాడసిద్ధమయ్యెను. వానుమార్గులిరువురిపై వారిరువురు లంఘించి యతినిపుణముగ వారిఁ దుదముట్టించిరి. ఆకల్లోలమంతయుఁ గాంచి శంఖముఁబూరించునతఁడు బిరబిరఁ గ్రిందికిఁ బరువెత్తి యక్కడివారలకీసంగతిఁ దెలియఁబఱుపఁ దత్క్షణంబ వారును హుంకారము లొనర్చుచు బయలుదేరి గుడిఁ బ్రవేశింపఁగడఁగిరి.

ఈలోపల గుడియందలి సంయుక్తాయౌవనవంతులు ద్వారమున కిరుపార్శ్వముల నిలచి వామమార్గుల నావరణముఁ బ్రవేశింపకుండఁ జేయుచుండిరి. అతిప్రయత్నముమీఁదఁ గొంతసేపటికి వామమార్గులు లోపలఁ బ్రవేశించి యాయుధములతోఁ గొందఱు, దండములతోఁ గొందఱు, పోరాడసాగిరి. సంయుక్తాయౌవనవంతు లిరువురు రతిచమత్కారముగ ననేకులఁ జంపుచుండిరి. దేవి ప్రత్యక్షమై తమకు వరమొసఁగి స్వర్గసౌఖ్యములనొసఁగూర్చునని తలఁచియున్న భక్తుల కందఱకు సంయుక్తాదేవి ప్రత్యక్షమై యట్టిసౌఖ్యమాతే యొనగూర్చుచుండెను. ఇట్లు వీరిద్దఱు హస్తలాఘవ మొప్పఁజిత్రవిచిత్రములుగ ఖడ్గములఁ ద్రిప్పుచు శత్రువుల వ్రేటులఁ దప్పించుకొనుచు హోరాహోరిగఁ బోరుచున్న తరుణమున నడిజవ్వనమందున్న రాజపురుషుఁడొకఁడు ఖడ్గపాణియై శీఘ్రగమనంబునఁ గొండనెక్కి వచ్చుచు "ఓరీ! బలిమొసంగఁ దెచ్చినకన్యకకు సాహాయ్యముగ వచ్చినపురుషునకుఁ గుడిచేతిపై బలమగుగాయముతగులుటచే వామహస్తమునఁ బోరాడుచున్నాఁడు. ఆకన్నియయుమిక్కుటముగ నలసియున్నది. కావున మీరందఱుత్సాహమునఁ బోరాడుఁడు" అను హెచ్చరికవాక్యములువిని యోడనేరివ్వునఁ బైకేతెంచి యచటనున్నవారినందఱి నొక్కుమ్మడినఱుక నారంభించెను. రాజపురుషునిధాటి కోర్వఁజాలక ద్వారముబయటనున్న వామమార్గుఁ డొకఁడు పోయినత్రోవను మఱియొకఁడెఱుఁగక చెల్లాచెదరై పాఱఁదొడఁగిరి. అంతనతఁడావరణమందుఁ బ్రవేశించి రెండుచేతుల రెండుకత్తులఁబూని విశ్రంఖలలీల శత్రుధ్వంసముఁ జేయ నారంభించెను. సంయుక్తాయౌవనవంతులును దమకు వేఱొకసాహాయ్యము దొరకినదని యుత్సాహమున విజృంభించి రిపుశాసన మొనర్చుచుండఁ జేయునది లేక లోపలివారునుఁ బిక్కబలిమిఁజూపి పరువెత్తసాగిరి. అట్లు పరువెత్తుతఱిఁ బ్రాకారపుగోడ లెక్కి దుముకఁబోయి చీకటియగుటచే నొకచోటనుకొని వేఱొక

చోటఁబడి యనేకులు ప్రాణముల వదలుచుండిరి. అంతఁ గొంతవడికిఁ దమ్మెదురించువా రెవరును లేకపోవుటచే సంయుక్తాయౌవనవంతు లిద్దఱొకచోఁ జేరినిలిచియుండ రాజపురుషుండును జేరి వారిచేఁ బ్రణతు లంది యాస్థలమంతయుఁ బీనుఁగుపెంటలతోఁ బీభత్సముగ నున్నందున వారిని వెంటఁగొని వేఱొక చోటికేగి యట యౌవనవంతుని వాస్తమునకుఁ జికిత్స సేయ నొకకళేబరముపై బట్టలాగి దానిఁదడిపి బిగించుటకై జలముకొఱకు వెతక నెచ్చోటను గాన్పింపదయ్యెను. అత్తరి సంయుక్తమరల గుడిలోపలికేగి యటఁబురోహితుఁడు దేవికిఁ బ్రోక్షింపఁ బెట్టుకొనియున్న జలకమండలువును గొని తెచ్చెను. ఆనీటియం దాగుడ్డను దడిపి గాయముపై బిగించికట్టిరి. అనంతర మా రాజపురుషుఁడు వారిద్దఱిందోడ్కొని కొండదిగి పురమువైపునం గొంతదూరమేగి యట నొకబయలు ప్రదేశమున నిర్మించియున్న డేరాలఁ బ్రవేశించి భటపరివృతమగు నొకగుడారమున యౌవనవంతునునిచి నవమునిర్మింపఁబడి యనేకులగుఁ గావలివారలతోఁ గూడుకొనియున్న మఱియొక గుడారమున నాకన్నియం దిగవిడచి వారిద్దఱివద్ద సెలవుగైకొని వెడలిపోయెను.

" పురుషార్థప్రకాశము "
స్త్రీ, శూద్రాదుల స్వాతంత్ర్యమునిచ్చునది.
వి. వి. కే. లక్ష్మీరావు,
పబ్లిషర్, గుంటూరు.

పదియవ ప్రకరణము.

అటు లారాజపురుషుండు డేరాయందు దిగవిడచి చనుటతోడనే సంయుక్త యట నమర్పఁబడియున్న నొక పాన్పుమీఁదఁ గూరుచుండి తనకిక్కట్టులు సంభవించుటయు వానినన్నిఁటిఁ గడచి బయటపడుటయు మొదలుగాఁగల తలంపులు మనస్సునకురాఁ గొంతసేపటివఱకు నేమేమొ యాలోచించుకొనుచు నలసియున్నది గావునఁ బ్రత్యూష వాయువులు మేనుసోకుచుండ సుమారైదున్నరగంటవేళ నించుక నిద్రఁగూర్కెను. వెంటనే మంజరి చనుదెంచి తనపార్శ్వమునఁ గూరుచుండి నట్లొకకలగని ,,హా! మంజరీ! ఎన్నిదినములకు నిన్నుఁజూడఁగంటినే,, యని పలవరించుచు మంచముపై లేచికూరుచుండెను. అట్లు లేచి కనులుదెఱచి వీక్షించినతోడనే యాకన్యకుఁగలిగిన సంతోషమేమని చెప్పుదును? నిజముగ మంజరవచ్చి తనకట్టెదుట నొకకుర్చీపైఁ గూరుచుండియేయుండెను. తోడనే సంభ్రమాన్వితయై మంజరిం గాఁగలించుకొని యబలకావున నించుక దుఃఖింపసాగెను. మంజరియుఁ గొన్ని యనునయంపువాక్యంబుల నోదార్పఁ గలఁకదేరి “చెలీ! నీవునిక్కముగ మంజరివగుదువా? నాకేమియు భ్రాంతి చేకూరలేదుకదా? నీవిక్కడికెట్లువచ్చితి?” యన,, సంయుక్తా! నీకింతభ్రమ యేటికి? నేను నిక్కముగ మంజరినే. నేనిక్కడికెట్లువచ్చినదియు వచించెద వినుము. ఆనాఁడు నీవట్లు సోఫాపైనిదురింపఁ గొంతసేపైన వెనుక మేల్కొలిపెదఁగాకయని తలఁచుకొనుచు నేనును నట్లే నిదురించితి. అనంతరము సింహగర్జనమువలన మేల్కనిచూడ నీవచ్చోటఁ గానుపింపవైతివి. వెంటనే వెతకవలసినచోట్లనెల్లను వెతకి యెక్కడనుగానక జీవములపై నాసవదలుకొని దేశములమీఁద వెడలి నిన్నెట్లయినఁగనుఁగొన నిశ్చయించి సూఫువేషమునఁ గ్రు

మ్మరుట సురక్షితము కాదని పురుషవేషముం దాల్చి సమయము పడినప్పుడు పనికివచ్చు ననుతలంపున రెండు చేతికత్తులం బదిలపఱుచుకొని యప్పుడే బయలు దేఱితిని. అట్లు వెడలి ప్రతిగ్రామమునందు, నడుమం దటస్థపడు నరణ్యములందును నెమకుచు నచ్చటచ్చటం గొందఱివలన గొన్ని సమాచారంబులం దెలియుచు సంచరించుచుంటిని. అట్లు రెండుమూడు దినములు గడచిన వెనుక నొకయూరిలో మధురానగరమునకుం జేరువనున్నతిప్పపైని కాళికాశక్తికి సకలకళాపరిపూర్ణయు సుందరాంగియునగు రాచకన్నియ నొకతెను బలియిత్తురను సమాచారమువిని యట్టి యదృష్టవిహీనయగు కన్యయెవతెయై యుండునాయని యనుకొనుచు శక్త్యనుసారము నామెను రక్షించుతలంపున బయలుదేఱి యొక్కరీతి నడచుచు నీసాయంతనముననే యొకపల్లియం జేరి యక్కడివారల మధురాపురవృత్తాంతము లడుగ నక్కడి కేనుమైళ్లదూరమున్నదని వక్కాణించిరి. ఆమాట విన్నవెంటనే మిక్కుటమగు నాకలియగుచున్నను,నంతవఱకు నడచియున్నందునం బాదములు సత్తువదప్పియున్నను లక్ష్యముచేయక సాహసమూని రాజమార్గమునంబడి నడుచుచువచ్చి యీనగరము తొమ్మిదిగంటలకుం జేరితిని. అక్కడివార లింతకుమునుపే వామమార్గులందఱుం గొండకేగిరని వచింప దుఃఖార్తనై నాకష్టము ఫలింపదను తలంపున నించుకయోచించి వెంటనే యొకమనుజుండు దారిం గనుపఱుప గుట్టం జేరవచ్చితిని. నేదగ్గరకేతెంచి చూచుటతోడనే తిప్పయంతయు దీపాలంకృతమై కడుమనోహరముగ నుండెను. కొందఱు గుంపుగం జేరి యక్కడడుగుభాగమునం దప్పందాగి గేలింతలగొట్టుచుండిరి. వారేమి చేయుదురోయని దూరమందు నిలచి చూచుచుండ వారిత్రోగుడేమో వారేమోకాని దేవికాని పూజకాని యేమియుం గనిపింపవయ్యెను. అంతట పైనొకగుడి దీపాకాంతిమైయుంటం గని యక్కడనేమిజరుగుచున్నదోయని క్రిందనున్న

వారికిఁ గొంచెము దూరముగఁ గొండనెక్కి గుడిని సమీపించుచుండ శంఖారావమును, జేగంటలచప్పుడులును నొక్కుమ్మడి వినవచ్చుచుండెను. గుడిఁజేరితలుపులు దగ్గరకు వేసియుండుటఁగాంచి యుంకఁ దెఱచుకొని వీక్షింతుఁగదా! ఏమనివచింతు! నాపంచప్రాణములు పైపై పైకెగిరిపోయెను. ప్రకాశమైనయఖండము కొంగున నీవుధరించియున్న వస్త్రమును గుర్తించితిని గుర్తించినవెంటనే గుభాలునఁ దలుపులు నెట్టుకొని వేఱొండాలోచింపక నిన్నుఁజంపఁగ త్రిప్పియున్న వానిచేతినట్లే నఱికితిని. తరువాత జరిగినసంగతులు నీకును విశదమేగదా" యనివచించిన వెంటనే పులకీకృతాంగనై సాయుక్తతన చేరిం గౌగలించుకొని "హా! నాప్రాణపదమా! మృత్యువునోటఁబడనున్న నన్ను రక్షించిన మహానుభావుండవు నీవేనా? నీ ఋణము నేనెట్లు దీర్చుకొనఁగలుగుదు? నీసాహసధైర్యములకే నేమని వచించుదానను. ఒక్కనిమిషమాలస్యమైన మనకిట్లు మరలఁ గలిసికొను భాగ్యముండకపోవుఁగదా! నీవంటి బుద్ధిశాలినియగు సఖింబడిసినఁగదా లోకంబునమనఃశోడి కాంత లెట్టి యిక్కట్టులనైనఁ దప్పించుకొనఁగలుగుట" అని యానందపారవశ్యమున మాటలు తడబడఁ బల్కినవిని "నీవింతగావచింపనేల ? మన మొకరినొకరు గాపాడు కొనకున్న నేటికి ? అదియటుండనిమ్ము. నీ వెట్టి కష్టములబారిఁబడితివో వచింపు" మన నాకన్నియ యిట్లనియె. "ఆనాఁడట్లు నీకనులమొగుటనే నిద్రించితిఁగదా. ప్రొద్దుపోయినందునను నాయాసము నొంది యున్నందువలనను వెంటనే గాఢముగ నిద్రపట్టెను. అంతనేమిజరిగినదో నాకుఁదెలియదు కాని మేల్కనిచూచునప్పటికి నొక గొప్పయరణ్య మధ్యమునఁ బాడుదేవాలయమందు నల్గురుస్త్రీలనడుమ నుంటిని. విభ్రాంతిగనుర 'నేనిక్కడికెట్లువచ్చితి ? మీరెవ' రనివారినడుగ నొక్కరును నామాటకుఁ బ్రత్యుత్తరమీయరైరి. ఎంతపలుకరించినను మాటలాడకున్న తటి బయటికేగుదమని బయలుదేఱ నన్ను రానీక పట్టుకొనిరి.

"ఛీ! పాపినులారా! నాతండ్రిగారితోడఁ జెప్పి మిమ్ము శిక్ష సేయించెద" ననినను బెదరక నావచనములకుఁ బ్రత్యుత్తర మీయక నేనొనరింపఁబోవు కార్యములకు మాత్రమాటంకపఱచుచు వచ్చిరి. అత్తఱివారి బెదరించి బయటఁబడుదమని నాఖడ్గమునకై వెదకికొన నదియెచ్చోటను గాన్పింపదయ్యెను. అంత నేమిసేయుటకును దోఁపక వారిపైఁ గలియఁబడి తప్పించుకొన నెంచియుండ భయంకరాకారులగు నల్గురు మనుష్యులు మఱికొందఱిస్త్రీల వెంటఁగొనివచ్చి యటనుంచి జాగ్రత్తగఁ గనిపెట్టియుండుఁడని హెచ్చరిక చేసిపోయిరి. నిరాయుధనై ప్రబలమగు నాపదయందుండుటఁ దెలిసికొని నాయుద్యాన వనమున మంజరిం గలసి స్మరించితిఁగదా! నన్నొంటరిగ నెట్లుకొనివచ్చిరి. ఒకవేళ నాసఖిం గడదేర్చి తెచ్చిరో లేక నామెయు నావలెనేనిమరింప మోసపుచ్చి తెచ్చిరోయని పలుగతులనిన్ను నాపితరులఁదలఁచికొని యేడ్చితప్పించుకొని పోవునుపాయము వెదకుచుండ మఱియొకతెకొన్ని యాహారపదార్థములఁ గొని తెచ్చి నాముందుఁ బెట్టి తినుమనియెను. ఆమెయైన నాప్రశ్నలకు జవాబునిచ్చునేమో యనియడుగ నన్నేటికిఁ దగిన ప్రత్యుత్తర మిచ్చినది కాని తామెవరైనది, నన్నేటికెక్కడకుఁ గొంపోవునది మొదలగువానికిఁ బ్రత్యుత్తరమీయదయ్యెను. ఈవిధ మంతయుఁగాంచి నన్నెదో మోసముచేసి చంపఁగొనిపోవుచున్నారని దుఃఖార్తనై యెదుటఁబెట్టినవానిఁ దాకనందునఁ గొంతసేపటివఱకుంచి పిదపఁదీసివైచిరి. తదనంతరము నాయంతనముందును నల్లేతెచ్చి యియ్యనపుడును నానినొల్లనైతిని. బాగుగఁ జీకటిపడినతరువాత నొక పాడుసవారియందు నన్నుఁ గూరుచుండఁబెట్టుకొని రాత్రియంతయుఁ బ్రయాణమొనరించి తెల్లవాఱునప్పటికి మఱియొక గ్రామము జేర్చిరి. అచ్చటి కొకమానవుండరుదెంచి నమ్మకము కల్గునట్లు నాతోడ

తాము ఢిల్లీపురవాసులమనియు నొకయుపకారి యాజ్ఞను జక్రవర్తికి బహుమానముగ నన్నుఁ గొంపోవుచున్నారమనియు వేఱొండపకారము సేయుటకుఁ గాదనియు దిగులుమాని యాహారము భుజించుచుండుమనియు వచించెను. వాఁడు చెప్పినదానివలన నాకునమ్మకము గలుగకపోయినను నాకలి మిక్కిలియగుటచే నానాఁడుఁదెచ్చిన యాహారపదార్థములఁ గొన్ని రుచిచూచితిని. ఇట్లు రాత్రులందుఁ బ్రయాణముసేయుచుఁ దెల్లవాఱినతోడనే యొకగ్రామమునందాగుచు నాలుగైదుదినములకు మధురాపురముఁ జేర్చి యందొక విశాలమగు నింటిలోఁ జీఁకటిగదియందె నన్నుంచిరి. ఆగదిలోనున్న దినములం దనేక పురుషులేతెంచి తిరునాళ్ల ప్రజలవలె ననుదినమును నన్నుఁజూచి పోవుచువచ్చిరి. మూఁడుదినములు గడచినపిమ్మట నల్గవనాఁడెవరు లేనితరుణమున నొకతపస్వి నాకడ కేతెంచి విచారముతో "అమ్మా! నీవెంత దురదృష్టవంతురాలవు. నీవంటి సౌందర్యవతికిట్టి దుర్మరణంబు గలుగఁ జేసిన యాపరమేశ్వరు నేమనవలయు? కట్టా? నీవెట్లు లీదుష్టులబారిఁ బడితివి? నిన్ను రేపమావాస్యనాఁడిక్కడికించుక దూరముననున్న కాళికాశక్తికిసమర్పింపఁగొని చనుదెంచియున్నారు. వీరందఱునిన్నమాటలాడుకొనుచుండవింటిని. నీవాహారమొల్లకుండి దారిలోనే మృతినొందుదువని యొకదురాత్ముఁడేతెంచి నీతోఁ గొన్ని మాయావాక్యములాడినాఁడఁట. అదంతయు నట్టియబద్ధము. అయ్యో! నిన్నుఁగాంచిన నాకువిచారము గలుగుచున్న "దని కన్నుల నీరుపెట్టుకొనెను. నేను నించుక దుఃఖించి మరల ధైర్యముఁదెచ్చుకొని యామెతో 'అమ్మా! నీవు నాపుణ్యవశంబున లభించితివి. నేనొకటివచించెద. అట్లు కావించితివా ధన్యురాల నగుదును. నాకుఁ జిన్నతనమునుండియుఁ గత్తిసామునందలవాటు గలదు. ఎట్లులైన నొకఖడ్గమును సంపాదించి తెచ్చియిచ్చితివా వీరందఱిపైఁదిరుగఁబడి తప్పించుకొనియైనఁ బోయెద. లేనిచోఁబోరాటమునఁ

ప్రాణములవిడిచెద. నా కీపర్మరణము మాత్రము తప్పిపోవు ' నని పల్లె యని మాకాంత వెడలిపోయెను. కాని మరల నింతవఱకును నాకంటికిఁ గానుపింపలేదు. ఆమె వెడలిపోవుటయు తడవుగ మఱికొందఱు నా దగ్గఱకు వచ్చిరి. ఆమెకొఱకయి కొంతసేపటివఱకు నిరీక్షించుచుంటి నెంతసేపటికి రానందున మాసంభాషణ మెవ్వరో విని మరల నావద్దకు రానీకుండ నామెనుబంధించిరో లేక యిట్టికుతంత్రములఁ బన్నినందులకు వధించిరోయని సాహాయ్యమొనరించువా రెవరును లేకుండుట వలన దుఃఖసాగరమున మునిఁగి తేలుచుఁ బడియుంటిని. అనంతరము గడచిన రాత్రి నను బల్లకీయందుఁ గూరుచుండఁ బెట్టుకొని గుడియొద్దకుఁ జేర్చిరి. గుడిలోవారు చేయఁగడఁగిన కార్యముల వీక్షింపనోపక స్మృతి దప్పిపడిపోతిని. తరువాత నాకేమికావించినదియు నాకుఁ దెలియదు కొంతసేపటికి గంభీరారావమొకటి నా చెవులంబడఁ గన్నులువిచ్చితిని అప్పుడె నీవు నా చేతికి ఖడ్గ మొసంగితివి పిదప జరిగినదంతయు నీకుఁ దెలిసియే యున్నదిగదా." అని చెప్పి పరస్పరాశ్లేషణ బులోనర్చుకొనుచుఁ, జెప్పినదానినే మరలఁ జెప్పుకొనుచుఁ దమకట్టియిక్కట్టులఁ గలుగఁజేసిన విధిని దూఱుచు నంభ్రమాన్వితలై మంజరీసంయుక్తలు తమ్మునిక్కడకుఁ జేర్చిన రాచపురుషుఁడెవఁడాయని యతనిఁ గూర్చి ముచ్చటించుకొనుచుండిరి

« పురుషార్థప్రకాశము »
తమసంతానముల బలపరచుకొను నుత్తమమైన మార్గము.
వి. వి. కే లక్ష్మీదేరావు,
పబ్లిషర్, గుంటూరు.

పదునొకండవ ప్రకరణము.

వారిద్దఱు రహస్యమాటలాడుకొనుచుండ బాగుగఁదెల్లవాఱి ప్రొద్దెక్కివచ్చుచుండెను. అత్తఱిదాసీనికరంబులు సంయుక్తకూరుచున్నగది లోకివచ్చి "అమ్మా! ఏమిసెల"వని ప్రతివారునడుగసాగిరి. అప్పుడీక్రింది సంభాషణ జరిగెను.

సంయుక్త.—మీరెవ్వరు?

దాసీ.—మీ కుపచారము లొనర్ప నియమింపఁబడిన దాసీలము.

సంయుక్త.—ఎవరియుత్తరువుప్రకార మిట్లేతెంచితిరి?

దాసీ.—మా రాజుగారి యానతివడువున.

సంయుక్త.—మీ రాజుగారెవరు?

దాసీ.—రాత్రి మిమ్ముఁ దోడ్కొనివచ్చినవారు.

సంయుక్త—ఆయన యేదేశపురాజు? ఇప్పు డెచటనున్నారు?

దాసీ.—ఆ సంగతులన్నియు వచించుటకు మాకధికారములేదు. కానిందు మీ కేమిచేయవలయునో తెలుపుఁడని సంయుక్తయాజ్ఞాపించి నట్లు సమస్తకృత్యముల నెఱవేర్చుచుండిరి. సంయుక్త యుత్కంఠతో నారాత్రి సహాయపడిన మహాత్ముని పేరు తెలియకపోయెనని విచారమున రెండురాత్రులుగడపెను. అంతమూఁడవనాఁడు కంచుకియొకం డరుదెంచి "అమ్మా! మీరు రేపు మీనగరమున కేగ వలయుఁగాన ప్రయాణమునకాయత్తమైయుండుఁ" డన "మీరాజుగారెక్కడ? ఆయనను సందర్శింపక మేమెట్లు పోవఁగల"మని మంజరీసంయుక్తలు పల్కిరి. అందులకుఁ గంచుకి "అమ్మా! మారాజుగారు వేఱొండవసరమగు పని మీఁదబోవలసి మమ్మందఱ నిక్కడనియోగించి రెండుమూఁడుదినములు గడచిన వెనుక మిమ్ముఁ గన్యాకుబ్జమునఁ జేర్పనాజ్ఞాపించి వార

ప్పుడే వెడలినారు. ఇఁక మనకు వారిదర్శనమగుట దుర్లభము. కావునఁ
బ్రయాణమగుఁ,,డని తెలుప నిరుత్సాహచిత్తలై ,,మమ్ము విపత్తునుండి
రక్షించినమహానుభావునిఁగాంచు భాగ్యము లేకపోయెనే,,యని చింతిం
చుచుఁ బ్రయాణమునకటులే యని సమ్మతించిరి. అంత మఱునాఁడు
ప్రయాణమునిశ్చయించినందునఁ గొన్ని దినములవఱకు సరిపోవునాహార
సామగ్రుల బండ్లపై నెక్కించి రాణివాసపుదాసీలకుఁగాను మఱికొన్ని
బండ్లు సన్నాహపఱిచి నౌకరులు సమస్తము సిద్ధము చేసియుంచిరి. ఆమ
ఱునాఁడందఱు భోజనము చేసి సాయంతనము మూఁడుగంటలకు బయలు
దేఱుదమనుకొనిరి. ఈలోపల మంజరీసంయుక్త లుచితవేషములూని
ప్రయాణమునకు సంసిద్ధలై యుండిరి. మూఁడుగంట లగుటతోడనే సవారి
వచ్చి తమయావాసమున కెదుట నిలువ వారిరువురందు నాసీనులైరి.
బోయిలా సవారి నెత్తుకొని ప్రయాణమైరి. ఈసవారికి నాల్గువైపుల
దాసీలు కూరుచున్న పల్లకీలు వచ్చుచుండెను. వీనియన్నింటికి ముందు
శూరులగు భటులు తమాశ్వములపై నడచుచుండిరి. వెనుకవై
పున మఱికొందఱు దాసీలు కూర్చున్న బండ్లును వానియనంతరము
సామానుబండ్లును నన్నింటివెనుక నాశ్వికులును వచ్చుచుండిరి. ముం
దు వెన్కలఁగాకఁ గుడియెడమలందును బ్రసిద్ధులగు నాశ్వికులు కత్తు
లును, దుపాకులను ధరించి చనుదెంచుచుండిరి. ఇట్టిమహావైభవ
ముతో నడుమ నక్కడక్కడాగుచు నాలుగవనాఁడు చీఁకటిపడి యొని
మిదిగంట లగునప్పటికి కన్యాకుబ్జనగరప్రాంతముఁ జేరిరి. అంతమరలఁ
గంచుకి సంయుక్త సవారివద్దకే తెంచి "అమ్మా! మనమిప్పుడు మీనగ
రమున కరుదెంచినాము. పట్టణ మింకొకమైలు దూరముగలదు. పల్లకీ
బోయిలును, మఱికొందఱు దాసీలుదప్ప నితరులెవ్వరుఁ బురముఁ
జొరవలదని మానృపుడాజ్ఞాపించియున్నాఁడు. మేమందఱ మిక్కడి
కైదుమైళ్ళదూరమున నిలిచియుండెదము. మీరు సురక్షితముగ నంతః

పురమునఁ జేరిన వార్త మీవెంటవచ్చిన దాసీలవలన మాకెఱుకపఱ
చుఁడు" అన "నాకింతటిసాయ మొనరించి మామన్ననలందకపోవుట
న్యాయమగునా? మీనృపుఁ డిట్టి కట్టడియాజ్ఞల నేయుద్దేశమునఁ గావిం
చెనోగదా?" యని సంయుక్తపలికిన "నమ్మా! ఎప్పటికైన మాపైఁ
గరుణయుంచుఁ డతియోజాలు"నని యతికష్టముమీఁద నామెనోడం
బఱచి యాసవారిని మఱినాలుగు పల్లకీలనుబురమునఁ జేరంబంచి కంచుకి
మరల తనవారిఁ గలయ వారందఱు వెన్కకేగి నగరమున కైదుమైళ్ళ
దూరమున నదీతీరమున విడిసియుండిరి. ఇఁట సంయుక్తయు పురమెల్లఁ
దనకొఱకై పరితపించుచున్న ప్రజలఁగోఁగూడి దీనదశయందు సాక్షాత్
లక్ష్మివలెనందుఁ బ్రవేశించి పోవుచుండెను. పౌరులందఱు పల్లకీలఁ
గాంచి వింతపడసాగిరి. రాజవీధియందుఁ గొంతదూర మేగినపిదపఁ
గోట బహిర్ద్వారము సమీపింపగాఁ బల్లకీల నటనిలిపి యందఱుం దిగుఁ
డని సంయుక్త చెప్పెను. వీరందఱు కోటముందు దిగుట వీక్షించి కావలి
వారలువచ్చి సంగతినడుగ సంయుక్తవచ్చినదని పరిచారకులు తెలిపిరి.
వెంటనేయామెను జూడనైనఁజూడక పరమానందమున ద్వారపాలకులు
లోనికిఁ బఱువెత్తి యాసంగతి రాణివాసమున నెఱుకపఱిచిరి. ఈమాట
విన్నవెంటనే తమకూఁతురెక్కడనో మృతినొందెనని తలఁచి తమప్రాణ
ములపై సహిత మాశవదలుకొని పడియున్న రాజదంపతులు చివాలున
లేచి "యెక్కడెక్కడ? నిజముగవచ్చినదా?" యని ప్రశ్నింపఁ బల్లకీ
వచ్చి ద్వారమెదుట నున్నదని చెప్పుటతోడనే సంతోషవార్తదెచ్చిన
యాద్వారపాలకులపైఁ దమకంఠములందలి హారములవిసరివైచి త్వరిత
గమనంబున బయటిద్వారము కడకుఁ జనుదెంచుచుండిరి. తక్కిన చెలి
కత్తెలు నీవార్తవిని యొడలెఱుఁగని సంతోషమునఁ బఱుగెత్తుకొని
వచ్చుచుండిరి. ఈలోపల నిటు సంయుక్తసవారిదిగి మొదటిద్వారము

గడచి కోటద్వారము సమీపించుచుండెను. అప్పుడందఱు నొక పర్యాయముగఁ జనుదెంచి సంయుక్తం గౌఁగలించుకొని గొల్లుమనిరి. కొంతసేపటికి కాసంరంభమణఁగి పట్టరాని సంతోషమున నానంద బాష్పములు రాలుచుండ నందఱు నంతఃపురముఁ జేరిరి. రాజదంపతులు మహోల్లాసంబునఁ బరవశత్వమందుచుఁ గొంతసేపటి వఱకుఁగూఁతును గౌఁగిలించుకొనియేయుండి ముంగురులు దిద్దుచు "అమ్మా! తిరిగివచ్చి మాకండ్లయెదుటఁబడి మమ్మందఱఁ బ్రతికించితివా? తల్లీ! ఇన్నిదినంబులు మమ్మెడబాసి యొంటరిగ నెటులుంటివి?" వనియడుగఁ "దలిదండ్రులారా! ముందు మంజరిని మన్నింపుఁడు. మంజరిమూలముననే మిమ్మెల్లర మరలఁగాంచుభాగ్యము గల్గిన"దని తనవృత్తాంతమంతయు నెఱిఁగింప మితిలేనిప్రేమంబున నామెం దగ్గరకుఁదీసికొని "మంజరీ! నీసాహసకార్యములకు మేమేమని పొగడువారము? ఆపత్కాలంబునకు మిత్రుఁడనుమాట నీవె సార్థకపఱచితివి. నాముద్దుకూనను రక్షించి మమ్మెల్లరఁ బ్రతికించితివి. మీనెయ్యమును సార్థకముగావించుకొంటివి. భూమిపై బ్రతికినంతకాలము మీకిట్టిస్నేహమే వర్ధిల్లుఁగా" కని పలువిధంబులనుతించి వెంటవచ్చినతక్కిన వారల కుపచారములొనర్పఁ దమపరిచారికాజనంబుల నియోగించిరి. ఇట్లు కొంతవడినిష్టగోష్ఠివినోదంబులఁగడపి యనంతరము మృష్టాహారములభుజించి యందఱు నొక్కస్థలమందే శయనించిరి. అదివఱకుఁ గంటినిండ నిద్రలేనందున నందఱు హాయిగనిదురింప సాగిరి; కాని సంయుక్తవెంటవచ్చిన నిపుణిక యనునది మేలుకొనియుండి రాజకొమారికం గనిపెట్టియుండెను. సంయుక్తయుఁబరున్నను నిద్రరానందునఁ దనమంచముపై లేచికూర్చుండి తమ కటసహాయపడిన మహాత్మునిఁ దిరిగిసందర్శించుభాగ్యము గలుగకపోయెనే యని చింతించుచుఁ బ్రక్కపైనుండిలేచి యిటునటు సంచరించుచు మరలఁ బాన్పుఁజేరి పవళించి వెండియు లేచి తిరుగుచు

నాందోళమున నుండెను. ఈవిధమంతయుఁ గాంచుచున్న నిపుణిక లేచి రాజపుత్రికను సమీపించి ,,అమ్మా! నీవింకను మేలుకొనియేయున్నావా?,, అనియడిగెను. అందులకు సంయుక్త ,,అవును నాకింకను నిదుర రాలేదు. ఇటురమ్మ,,ని తనదగ్గరకుఁ బిలచెను. అప్పుడు వారిట్లు సంభాషింపమొదలిడిరి. నిపు: "అమ్మా! ఇంతసఱకు నేమాలోచించుచుంటివి?,, సంయు: ,,ఏమియు లేదు. నిద్రవచ్చునేమోయని యిటునటుఁ దిరుగుచున్నాను. అంతియేగాక మమ్ము ఘోరవిపత్సముద్రమునుండి దరిఁజేర్చిన యాపరోపకారపారీణుఁ గన్నులారఁ గాంచుటకైనను వీలుకలుగక పోయెఁగదాయనుచింత నామనంబున దృఢముగ నాటుకొనియున్నది. తుదకాయుత్తముని పేరైన విననోచుకోనైతిగదా!" అని హీనస్వరంబునఁ బలుక నంతవఱ కాతస్వపడుచున్న సంతాపముఁ జూచుచున్నది గాన జాలినొంది మెల్లగ నిపుణిక యిట్లనియె.

,,అమ్మా! ఇత్తఱి నీయవస్థఁజూడ నాకువిచారము గలుగుచున్నది తమసంగతి మీతో వచింపవలదని మారాజుగారు గట్టియుత్తరువు సేసియున్నారు. అయినను నీతో నిపుడు వచించెద; ఈరహస్యమెచటను బయలుపెట్టకుము. ఆరాత్రి మిముఁదోడ్కొనివచ్చినయతఁడు ప్రస్తుతము ఢిల్లీనిఁ బాలించుచున్న పృథివిరాజు. ఉన్నట్టులుండి యొకనాఁడు కొంతసేన నెచటికో పంపి యాక్షణమందే మమ్మందఱ వెంటఁగొని మిమ్ము దిగవిడచినచోటి కారాత్రియేవచ్చి పనివారెల్లరు డేరాలు మొదలగునవి నిర్మించుతొందరలో నుండ మాలో నెవరికి వచింపకెక్కడికో పోయి సుమారు నాలుగు గంటలవేళకు మిమ్ముఁగొనివచ్చి యటడించి మీకు సకలోపచారములుసేయ మాకాజ్ఞాపించి రెండు మూఁడుదినములు గడచినపిమ్మటఁ గన్యాకుబ్జముఁ జేర్పవలసినదిగాఁ గంచుకి మొదలగువారికిఁ దెలిపి తానప్పుడె కొంత సైన్యమును వెంటఁగొని యెచటికో పోయినాఁడు. ఎక్కడికేగినది నిజము మాకుఁ దెలియదు

కాని మనవెంటవచ్చిన సేనాపతులకు మాత్రము తెలియును." అని పృథివీరాజువృత్తాంత మెఱుకపఱపగా సంయుక్త విచారమునఁ దనలో "హా! నేనెంతమందభాగ్యురాలనైతి! చేతికందిన నిధానమును బోఁగొట్టుకొన్నటులయ్యెఁగదా నాబ్రతుకు! ఇన్నిదినములపర్యంత మేమహానుభావునిదర్శింప నభిలషించియుంటినో, యట్టి నామనోకాంతుఁడు చేరువకే తేరఁదిన్నగఁజూచుకొను భాగ్యముకూడ లభింపకపోయె. ఛీ! నాజడబుద్ధి! కానిమ్ము. గడచినదాని కింతగ వగవనేల?" అని లోపలిగుట్టును నిపుణిక తెలిసికొనఁ బోవునను తలఁపున నప్పటికేమియు మాటలాడక నిద్రవచ్చుచున్నదని నిపుణికను బంపి తానును గొంతతడవునకు నిదురించెను. తరువాత జయచంద్రుఁడు కూఁతురువచ్చినదను సంతసమున నామఱునాఁడు మొదలనుదినమును బండుగ లొనరించుచుఁ ద్వరలో నామెకు వివాహముగావింప నిశ్చయించుకొని సమస్తదేశాధిపతులకు లేఖలపంపఁదొడఁగెను. సంయుక్త వెంటవచ్చిన పరిచారిక లిఁక మేము మానగరముకేగెదము సెలవొసంగుఁడని రాణి మొదలగువారి నడుగ స్వయంవరమగు వఱకునుండుఁడని నిర్బంధించిరిగాని కొన్ని యాటంకములు చెప్పి సమ్మతింపక సముచితసత్కారములంది సంయుక్త మొదలగువారూరిబయటివఱకువచ్చి సాగనంప బయలుదేఱిపోయి దారిలోఁదమకొఱకై కాచుకొనియున్న వారలఁగలసి జరిగినసమాచారములన్నియు సేనాపతులకుఁ దెలియఁబఱిచిరి. అంత నక్కడిసేనాని కొందఱుభటులఁ దోడితెచ్చి యాపరిచారికాజనంబుల స్వపురంబునకుఁ బంచి మిగతసేన నుంగూడుకొని తన రాజునకుఁ దోడ్పడఁబోయెను.

పంద్రెండవ ప్రకరణము.

పై ప్రకరణమున వచించిన వృత్తాంతములు జరుగు కాలమందే మధురాపురమున కెగువ రెండామడల దూరమందలి కాళిందీతీర ప్రదేశము లతిభయంకరయుద్ధమున కావాసములై యుండెను. ఆ ప్రదేశములందు సుమారు ముప్పదివేల సైన్యముతో నెప్పుడు సమయము దొరకునా యెప్పు డార్యావర్తమును మ్రింగివేయుదునా యని కుతుబుద్దీ నను మహమ్మదీయ సేనానాయకుఁడు గాచుకొనియుండెను. ఆ ప్రదేశము యమునకొండలగుండఁ బ్రవహించుచున్నందున నడుమఁ గొన్ని కొండలు ద్వీపకల్పములుగ మాఱియుండెను. ఎప్పుడుపట్టినను శత్రువులు ప్రవేశించుటకు సులభముగానట్టి ద్వీపకల్పముగనున్న నొకకొండపై ముప్పదివేల సైన్యముండుటకుఁదగినంత విశాలమగు నావరణముఁగట్టించి కుతుబుద్దీ నందు నివసించియుండెను. ఈయావరణమునకు దక్షిణఁపుఁ బార్శ్వమునమాత్ర మొక గొప్పబలిష్ఠమగు ద్వారముకలదు. శత్రువులెవ్వరైన లోపలఁ బ్రవేశింప నెంచినచో నది నీది దక్షిణఁపువాకిట బోవలయుఁగాని వేఱొండుమార్గము లేదు. ఆవరణపుగోడ నాగజెముడు మొదలగుముండ్లదుబ్బులచే నిర్మింపఁబడి నాలుగుగజముల యెత్తు గలిగి యుండెను. దక్షిణమందలి ద్వారముమాత్ర మడుసుతోఁ గట్టబడి యుండెను. అచట శూరులగు భటు లనేకులు గావలియుందురు. మఱియునావరణములోపలఁ గంచె కొకగజమెత్తుగ నుండునట్లు మట్టిబురుజులనందందు గట్టించి వానిపై ఫిరంగులఁ బెట్టించి యనేకసిపాయిలఁ గావలియుంచియుండెను. ఈకట్టుదిట్టములవలన సైన్యమంతయు నొకబలిష్ఠమగు దుర్గమున నున్నట్లేయుండెను. వెండియు సైన్యమునకు వలసిన యాహారసామగ్రుల లోనఁ జేర్చుకొనుటకును దమవారి ననాయాసముగ

దాటించుకొనుటకును వీలుగనుండునట్లు తేలికలగు పెద్దపెద్ద వృక్షముల ననేకముల నఱకించి తెప్పించి తెప్పలుగట్టించి నీటఁద్రోయించి వానిపై ననేకభటుల గావలియుంచియుండిరి. ప్రతితెప్పయు రెండువందల మనుష్యులభారమును మోయఁగలిగినదిగా నుండెను. దూరమందున్న గొప్పగొప్పగ్రామములకనిచి భటులచేతఁ గావలసిన సామగ్రులఁ దెప్పించుకొనుచు వేగులవారివలన నార్యావర్తపురాజుల తెఱంగుఁదెలియుచు నతిజాగరూకుఁడై యెప్పటివార్త లప్పుడు సుల్తాను గారి కెఱుకపఱచుచు రణమునకై కుతుబుద్దీను వేచియుండెను. అట్టితఱుణమున నొకనాఁటినిశీథమున రెండుగంటలవేళ నార్యసైన్యములు కొన్ని నదియందుదిగి నిశ్శబ్దముగఁ దీరముఁ జేరవచ్చుచుండెను. అదివఱకాస్థలమున మ్లేచ్ఛులు రెండునెలలనుండి విడిసియుండ నేతొందరలును గలుగకపోవుటచే సేనాపతి హాయిగ ద్రాగిపరుండెను. తక్కుంగల సైన్యభటులును దమతమశస్త్రాస్త్రముల నెక్కడివక్కడఁ బాఱవైచి నిద్రాపరవశులై యుండిరి. తెప్పలపైఁ గావలిగాచువారుసహిత మొకరిద్దఱినన్నింటికి గావలింబెట్టి తాములోపలఁజేరి పరుండియుండిరి. ఆ యొకరిద్దఱును నదీతీరముననొకయిసుకతిన్నెపైఁబరుండి చల్లగాలికి హాయిగ నిదురవోయిరి. బురుజులన్నియు భటవిహీనములై నిద్దురఁబోవుచుండెను. అట్టి సమయమున పైనిచెప్పిన యనార్యసైన్యములు నదీతీరమున బారులుదీఱి నిలిచియుండఁ గొందఱుభటులు నది నీది మ్లేచ్ఛులున్న వైపుఁజేరి యట నిదురించియున్న నిద్దఱ దీర్ఘనిద్రాసౌఖ్యమను భవింపుఁడని నీటఁబాఱవైచి తమ్మునాటంకపఱచువా రొక్కరును గానరానందునఁ దెప్పల నవతలకుఁగొంపోయి తమసేనాభటుల నెక్కించుకొనివచ్చి మహమ్మదీయుల ప్రాకారముచుట్టుఁ జేర్చుచుండిరి. ఆర్యసేనాపతి దానిద్వారముఁగనిపెట్టి సేనయందు మూఁడవవంతుదక్షిణమును ముట్టడింపఁబంపి తక్కినసైన్యమును దక్కినమూఁడు పార్శ్వముల

ముట్టడింప నాజ్ఞాపించెను. మఱియు బయటనుండి మహమ్మదీయులకు సహాయ మొనర్పవచ్చినవారి నడ్డగించుటకు గాను మఱికొంత సైన్యము నవతలితీరముననే యుంచెను. ఏర్పఱుచుకొన్న ప్రకార మొక్కడివా రక్కడఁ జేరియున్న పిదప సేనాపతి సంజ్ఞనొనర్ప నార్యభటులందఱు నొక్కపర్యాయముగఁ దుపాకుల ప్రయోగించి దక్షిణద్వారపు ముట్టడినిఁ బ్రారంభించిరి. తుపాకుల మ్రోతలకు లోపలివారెల్లరు భయభ్రాంతచిత్తులై లేచి తమ తమ యాయుధములఁ దుపాకులఁబూని ద్వారముకడ కేగిరి. బురుజులపై నుండవలసినవారును మేల్కని నిద్రకండ్లతో మెల్లక్కఁ బోవుచును నతిప్రయత్నముమీఁదఁ బైకిచేరి బందూకులతో నార్యసేనలఁ గాల్పసాగిరి. బురుజుపైనుండివచ్చు బందూకుల ప్రేటుల కనకులు నీటంబడి కొట్టుకొనిపోవుచుండిరి. ఎటులయినను లోపలవారి నుక్కడించుకోరికచే నార్యులు శత్రువుల ప్రేటులకు లక్ష్యము సేయక తమ వారలు కుప్పలుగఁగూలుచున్నను ధైర్యము వీడక సాహసముతో మ్లేచ్ఛులపై నగ్నివర్షము గురిపించుచు మహాఘోరముగ యుద్ధమొనరించుచుండిరి. లోపలివారు ప్రయోగించు బందూకులగుండ్లన్నియు యమునంబడి మహాభయంకరముగ శబ్దించుచుండెను. ఆవరణములోపలఁ జేరుటకై దక్షిణమందలివారలును హాహా రాహారిగిఁ బోరాడుచుండిరి. ఈతరుణమందే మహమ్మదీయులకొఱకు సామానుబండ్లుకొన్నివచ్చి యవతలిగట్టుఁ జేరెను. అక్కడనున్న వారు వచ్చినవారి ననాయాసముగ నోడించి బండ్లనన్నింటిఁ దమవశముగావించుకొనిరి. ఈప్రకారము మూఁడుదినములవఱ కతిఘోరముగఁ బోరాడుచుండ లోపలివారల కాహారపదార్థములు తక్కువగుటచే వారందఱు భీతినొందసాగిరి. అట్లయ్యును రెండుమూఁడుదినములవఱకు మ్లేచ్ఛులు పరాక్రమముతోడనే పోరుచుండిరి. ఎట్లును బయటివస్తువులు లోపలికివచ్చుమార్గము లేనందునఁ దమ కపజయము కలుగు

ననియే కుతుబుద్దీన్ తలపోయుచుండెను. మఱిరెండు దినములకు రణసంరంభమువలనను క్షుద్బాధవలనను సైన్యములో మూఁడు వంతులు నష్టమయ్యెను. ఆసమయమునందే రాజపురుషుండొకఁడు మఱికొంత సేనతో నార్యులకుఁదోడ్పడవచ్చి హెచ్చరికఁ గలుగఁజేసెను. రాజదర్శనమువల్లనుప్పొంగి యార్యసేనా గరము విజృంభించి పనిఁజేయుసాగెను. ఎట్టకేలకు దక్షిణమందలివారు ద్వారమును నాశనముఁజేసి లోపలఁ బ్రవేశించి మ్లేచ్ఛులధ్వంసముఁ జేయఁజొచ్చిరి. తనవారందఱిట్లుమృతి నొందుచుండుట వీక్షించి యిఁకనాలస్య మొనరించిన బ్రాణాపాయము గలుగునని కుతుబుద్దీన్ శత్రువులకంటఁబడకుండఁ దప్పించుకొని పరువెత్తెను. హెచ్చరికఁగలుగఁజేయువారు కానరానందున మ్లేచ్ఛులునుజెల్లాచెదరై యిష్టమువచ్చినట్లు పరువెత్తసాగిరి. కొందఱు కంచెలంబడి మడసిరి. మఱికొందఱు బయటికేతెంచి యట కాచుకొనియున్న ఆర్యులవాతఁబడి చచ్చిరి. కొంతసేపగునప్పటికి శత్రుసైన్యము నాశనమై యెదిరించువారు లేకపోవుటచే యుద్ధ మాపుదలచేయఁబడెను. మూఁడువేలమహామ్మదీయభటులుఖైదీలుగఁ బట్టుకొనఁబడిరి. శత్రువుల తుపాకులు, నాయుధములుఁ, దక్కినయుద్ధసామగ్రులన్నియు నార్యుల పాలఁబడెను. ఇట్టి మహావిజయముతో నారాజచంద్రుఁడు తనసైన్యముం గూడుకొని నిజరాజధానికిఁ బయనమైపోయెను.

“ పురుషార్థప్రకాశము ”

సురాపపాతాళములకేగినవారికొక స్వాతంత్ర్యమునిచ్చునది.

వి. వి. కే. లక్ష్మాజీరావు,

పబ్లిషర్, గుంటూరు.

పదుమూఁడవ ప్రకరణము.

"అబ్బబ్బ! ఈదినముదయమున నే లేచి యెవరిముఖముగాంచితినో కాని నాకన్నియుఁ జిక్కులే సంప్రాప్తములైనవి. మాకక్కడఁ బల్లెలందు మ్లేచ్ఛులొనరించుచున్న యార్భాటములెటులున్నవో యిక్కడ నీ స్వయంవరమునకు వచ్చిన రాజులయార్భాటము లటులున్నవి. సుమారు రెండుజాముల వేళఁ దూర్పువీధివదలితి. మూఁడుజాములు తిరిగిపోయినవి. ఇంతవఱకు రాజద్వారముచేరుటకు వీలుపడలేదుగదా? కొండలవలె తండతండములై పరువెత్తుకొనివచ్చు నీ పాఁడుబగ్గిలు నేఁడు నాదుంపఁద్రెంపినవి. గోడ్లమీఁదనీళ్లుచల్లుబండ్లత్రొత్తుకొడుకులెప్పుడుచల్లిరోగాని యీగుఱ్ఱముల రాపిడివలన నేలంతయు నెండిపోయి దుమ్ము వెదఁజల్లుచున్నది. శకటములసంరంభముచే నెగురుధూళియంతయు వీధులనిండఁ గ్రమ్ముకొని దారిఁగాన్పింపకుండఁ జేయుటయే గాక ముక్కులలోఁగన్నులలోఁ జొఱఁబడి దృష్టినిఁగూడ నాశనముఁజేసి వైచినది. రాత్రియంతయునిద్రఁగాచిన వానికింబలెఁ గన్నులు భగ్గున మండుకొని పోవుచున్నవి. ఈయెడ తెగనిగుఱ్ఱముల గిట్టెలవలనఁగలుగు పటపటధ్వనులచేఁ జెవులు గడియలుపడిపోయినవి. ఒక్కొక్కవరుస వచ్చి కడచిపోవువఱకు నీ మిడియెండలో నిలువవలసివచ్చుటచే నాతాతలుదిగివచ్చుచున్నారు. పైని నెత్తి క్రిందకాళ్లు మలమలమాడుచుండ వచ్చినసవారీలవరుస పోవువఱకుఁ బ్రాణములబిగఁబట్టుకొని నిలువవలసినదేగాని కొంచెమిటునటుఁగదలిన నేగుఱ్ఱముల కాళ్లక్రిందఁబడి యీల్గుదునోయనుభయమే. పోనీ యేపంచనైనఁ జేరుదుమూయన్న నన్నింటియందు ద్వారపాలకులె. దూరముననుండఁగనే 'యెవరువా'రని కేకలువైచుచు వెడలగొట్టుదురుగాని పాపమెవఁడో ముసలిబ్రాహ్మణుఁ

డని దయఁదలఁచిపిలుము ముందవాఁడొక్కఁడుఁ గానరాఁడు. అయ్యో! రాకరాక వివాహసమయములో మేమేలవచ్చితిమి? ఇప్పుడీజయచంద్రుఁడు మావాక్యములాలించి మమ్ముఁబీడించుచున్న మ్లేచ్ఛులఁ బాఱఁదోలునని తోఁచదు. దేశమందలిప్రజలు క్రూరులగు మ్లేచ్ఛులబారింబడి ప్రాణమానములఁ గోల్పోవుచుండ నీరాజేమియుఁ బట్టించుకొనకుండ నిట్లుత్సవములలో మునిఁగియుండుట మాబోటిపౌరులదురదృష్టమే కాని వేఱొండుకాదు. అయ్యో! ఈరోజున నాగ్రహచారము బాగుగనుండలేదు. నేనిటు మొత్తుకొనుచుండఁగనే మఱియొకసైన్యము సంప్రాప్తమైనదే. నాయనో! ఇవియెక్కడిగుఱ్ఱాలు! రాజమార్గముపట్టకుండఁజనుదెంచుచున్నవి. ఇంతకుముందు చనుదెంచిన కోసలపతి సేనాసంరంభములో నావెంటవచ్చిన యితరగ్రామస్థులు వేఱైపోయినారు. ఈసంరంభములో నాకు నాజీవములకు నెడఁబాటుకలుగునట్లున్నది. ఓయిదేవుఁడా! ఈసంకులమునుండి తప్పించి నావారిఁగనుబఱచికొంపఁజేర్చితివా యీవివాహమై నగరమంతయు నెమ్మదిపడువఱకు బయటనెక్కడ యడుగైనఁ బెట్టను. ఓహో! అప్పుడే చేరువకువచ్చినవే గుఱ్ఱములు" అనియొకముసలిబ్రాహ్మణుఁడు తనచేరువనున్న వారివలన మార్గమునఁజనురాజవరులవృత్తాంత మడిగి తెలిసికొనుచు నాయాసమును దీనత్వమును దోఁపఁగ న్యాకుబ్జనగర రాజవీథిఁ ద్రిమ్మరుచుండెను. తిరుగుచు నప్పుడు వచ్చుచున్న రాజుగా రెవరనియడుగఁ జెంతనున్న యొకఁడు కాశ్మీరపు రాజని బదులుచెప్పెను. అంతనాన్నృపునివీక్షించు నభిలాషతోఁ దాను ప్రక్కకొదిగి నిలచియుండెను. తరువాత నొకబలిష్ఠమగు నశ్వముపై కాతుకూరుచుండి వీథివెడల్పున నాడించుకొనుచువచ్చెను. వానివెమ్మట నొకయుత్తమపారసీకంబుపై సేనాపతివచ్చుచుండెను. వానియనంతరము బారులుగట్టి యాశ్వికులు కొందఱరుదెంచుచుండిరి. వారివెన్నంటి మఱియొకసేనాని కాంభోజమునెక్కి చనుదెంచుచుండెను.

తదనంతరము శ్వేతాశ్వముల నారోహించి భటులనేకులు ఖడ్గపాణులై యేతెంచుచుండిరి. వీరివెనుక శ్రేష్ఠములగు వనాయుజములపై నక్షౌహిణీపతులు ముందునడువఁ గొంతసైన్యము శివిమై చనుదెంచుచుండెను. ఈసేనానంతర మాజానేయము లెనిమిదింటిచే బంధింపఁబడిన రాజుగారి బగ్గివచ్చుచుండెను. ప్రతియశ్వముపై నొక్కొక్కభటుఁడు కూరుచుండి తోలుచుండెను. అందుఁదనప్రధానమంత్రితోఁ గన్యాకుబ్జనగరవైభవమునుగూర్చి ముచ్చటించుకొనుచు కాశ్మీరమహారాజుగారాసీనులైయుండిరి. వీరియనంతరము ఉపమంత్రులు, రాజ్యమందలి ముఖ్యాధికారులు మొదలగువారు కూరుచున్న బగ్గిలు వరుసలుదీఱి వచ్చుచుండెను. వీనికన్నిఁటిజివర మఱియొకసేనాసియుఁ మఱికొంతసేనయుఁ బాహ్లీకములపై వచ్చుచుండెను. ఈసందడి తగ్గువఱకు పైనఁబేర్కొన్న బ్రాహ్మణుఁడు తా నున్నచోటనేయుండి యది తగ్గిపోయినతోడనే మరల బయలుదేఱి నడచుచుఁగొంతదూరమేగి పిదపఁదనకొఱకై నలుదిక్కులఁ బరికించుచు నిలువంబడియున్న తనవారలఁగలసికొని, "నాయనలారా! నాయదృష్టమున నేఁడు మిమ్ముఁ గాంచఁగల్గితి. ఇక్కడ నిబగ్గిలక్రిందఁబడ చచ్చుటకింకు మనగ్రామములందు మ్లేచ్ఛులు పోయుఁ వేడనూసియలచేతఁ జచ్చుటె మేలనితోఁచుచున్నది. మనకిఁక నెట్లును బ్రతుకు తెరువు లేదు. అతని కేమి? ఏచింతలేక పౌరులు మొరలాలకింపక జయచంద్రుఁడు హాయిగి బెండ్లిఁగావించుకొనుచున్నాఁడు. ఇట్టరాజు బ్రతికిననేమి? చచ్చిననేమి? మనమీ రాజ్యము వదలిపోయినబ్రతుకుదుమేమోకాని యిక్కడేయున్నటులైన వట్టిదే. మీ కేమైన రాజుగారి దర్శనము లభించినదా?

పౌరు.—లేదు. ఈతొందరలన్నియుఁ నడఁగినతర్వాత నేమైన యీ రాజు మనదిక్కు చూచునేమొ.

బ్రాహ్మ.—ఈ కల్లోలము లణఁగవలసిన యవసరమేమి? ఈలోపలనే బూడిదెరాసులతోఁ గూడుకొని మనపల్లెలన్నియు నెమ్మదిగ నుండఁగలవు.

పౌరు.—అయిన మనమిప్పు డేమిచేయుదము?

బ్రాహ్మ.—అందఱముఁ గట్టఁగట్టుకొని యొక్కపర్యాయముగ యమునలో దూకుదము.

పౌరు.—కాసిందు. మనఘోషలు ప్రధానితో విన్నవించుకొందము పదండి. అతఁ డేమైన సాహాయ్య మొసరించిన సరి, లేకున్న నీవుచెప్పినట్లే నదిలో దుముకుదము.

అని మాటలాడుకొని వారందఱుఁ బ్రధానింజూడ వెడలిపోయిరి. కూఁతురువచ్చినదను సంతోషమునఁ ద్వరలో నామెకు వివాహ మొనర్ప జయచంద్రుఁడు సకలదేశములనృపులకు లేఖలనంపుచుండె నని యిదివఱకే లిఖించియుంటిఁగదా. తన్మహోత్సవమునకైఁ గన్యాకుబ్జము బాగుగ నలంకరింపఁబడెను. అత్యున్నతములై వరుసలుతీఱియున్న సౌధపంక్తులు క్రొత్తగ వేయఁబడిన సున్నముచే స్వచ్ఛమగు వెండికొండల బారును దలఁపునకుఁ దెచ్చుచుండెను. ప్రతిమందిరమునకు వేఱ్వేఱుగగాక రెండుప్రక్కలసౌధంపువరుసల యొకకొననుండిమఱియొకకొన వఱకు బచ్చనియాకుతోరణములు వ్రేలాడఁగట్టిరి. రాజవీధియందుబండ్లు మొదలగునవి నడచునట్టి మధ్యమార్గమునందుగాక ప్రత్యేకముగ మనుష్యులుమాత్రమే నడుచుటకుగాను సౌధపంక్తుల కంటుకొని యుండునట్లు నిర్మింపఁబడిన ప్రక్కదారులపొడుగున దాళ్వారము (అనగా గ్యాలరీ)లఁ బెట్టించి వానిపై క్రిందినుండి మీఁదివఱకుఁ జెక్కలగపడని యంతదట్టముగ బలురకములగు బూలచెట్లతొట్లుంచఁబడియుండుట చేవీధి యందొకవైపున నిల్చి చూచువారలకుఁ బచ్చనిపొదలతోఁ గూడుకొని

యుండుకొండలలోయ తలఁపునకు వచ్చుచుండెను. ప్రక్కదారులు పూలమొక్కలచే నిండియుండుటవలన మధ్యమార్గమందిటునటునొక గజముమేర జనులరాకపోకలకు వదలి వీథిపొడుగునను దగ్గఱదగ్గఱగ నెత్తైన స్తంభములఁబాతి వానియగ్రములకు సమాంతరముగ నుండునట్లుతీగెల బిగించిరి. మెండియు నొకవరుసయందలి మొదటికంబపు చివరకును దానియెదుటివరుసయందలి రెండవ స్తంభాగ్రమునకును మరల మొదటి వరుసయందలి మూఁడవదానికొనకును నిట్లుక్రమముగ నన్ని స్తంభముల యగ్రములకు గొంచెము మందములగు తీగెల నంటగట్టిరి. అట్లు కట్టి నతీగెల ప్రతియడుగునందు మైనపువత్తులతో గూడుకొన్న గుండ్రములగు నాకుపచ్చరంగుగల చిన్నచిన్న యద్దపుఁగలశములు వ్రేలాడదీయుటయేగాక చివరల బిగించినతీగె లొండొంటితో గలియుభాగమున గాలిదీపము లుంచుటకు వీలైన పెద్దపెద్ద గులోబులు వ్రేలాడ గట్టి యుంచిరి. కలశములు గులోబులు నాకుపచ్చరంగుగల వగుటచే గాత్రులందు దీపములు వెలిగించుటతోడనె వానికాంతులునుపూలమొక్కల కాంతులును నేకమై వీథియంతయు శోభాయమానమై లక్ష్మీ విలాసస్థానమో యన రాజిల్లుచుండును. రాజుగారి దివాణమునందేగాక నగరమం దెక్కడఁజూచినను చెవులు గింగురుమన శుభవాద్యములు మ్రోగుచుండెను. తక్కినవీథులును గొంచె మించుమించుగ నిటులే యలంకృతములై యుండెను. జయచంద్రుఁడు సమస్తదేశాధిపతులకు శుభలేఖలనంపెగాని తన పూర్వవైరము తలఁచి డిల్లీపతికిమాత్రము పత్రిమాన మంపక తిరస్కారభావముననుండెను. అటులుంచుటయే కాక చక్రవర్తిని మఱింతయవమానపఱచుటకై రాతివిగ్రహము నొక దానిఁ జేయించి దానికి డిల్లీపతినామమిడి కోటబహిర్ద్వారమునఁ గావలి వానివలెఁ బెట్టించెను. ఈవార్తవిని నగరమంతయు నల్లకల్లోలము

కాసాగెను. కొందఱు జయచంద్రునకిది యేమి వెఱ్ఱి? ఇట్లు చేయుట తగునా యనువారును, కొందఱు వీనికిఁ బోవుకాలము సమీపించినది కావుననే యిట్టిబుద్ధిపుట్టిన దనువారును, కొందఱు మనకిక రణముదప్ప దనువారునునై జనులెల్లరు వీధులందు గుంపులుగుంపులుగఁ గూడి మాటలాడుకొనఁజొచ్చిరి. దుర్మార్గులగువారు మాత్రమతని మఱింత ప్రోత్సాహము చేయుచుండిరి. నృపుఁడును దుష్కంగలకార్యముల సన్నాహము చేయించుచుండెను.

" పురుషార్థప్రకాశము "
బాలుర కుత్తమ నీతిప్రదాయిని.

వి. వి. కే. లక్ష్మాజీరావు,
పబ్లిషర్, గుంటూరు.

పదునాల్గవ ప్రకరణము.

జయచంద్రుని వృత్తాంత మటులుంచి యిఁక సంయుక్తగూర్చి కొంతవిచారింతము. ప్రాణోపద్రవమునుండి తన్నుఁగాపాడిన మహాత్ముఁడు పృథివీరాజని నిపుణికవలన విన్న నాఁటంగోలెఁ బంచప్రాణములతనిపై నిడుకొని స్వయంవరమున కతఁడువచ్చునో రాఁడో యనుతలఁపున వగలఁ బొగులుచు నిద్రాహారములయెడ సహితమనాదరణఁ జూపుచుఁ దనయుపాధ్యాయుని సంగతిగూడ తెలియనందున నుత్కంఠయై దినములు గడపుచుండెను. బయటికేగివచ్చు ప్రతిపరిచారికను జక్రవర్తి యేతెంచెనాయని యడుగుచుండెను. ఇట్లు ప్రాణపదముగ నెంచుకొనుచున్న నారాజునెడలఁ దనతండ్రికావించిన యకార్యముఁ గూర్చి తెలిసినటులైన నామెహృదయ మెట్టిదశయందుండునో వచింప నలవిగాదుగదా? ఇటులుండ మంజరి చనుదెంచి జరుగుచున్న సంగతులన్నియు వచింప నిశ్చేష్టితయై కొంతసేపటివఱకు మాటలేకనిలువఁబడి తుదకు "కట్టా! నాజనకుం డిట్టికట్టిడి యయ్యెగా! నేనిఁక నెవరితో మొరలిడుకొందు? ఎవరు నావేదనఁ దీర్చువారలు? ఎవరు నాప్రాణకాంతుని నన్నుఁ గూర్చువారలు? నన్ను ఘోరమగు విపత్తునుండి తప్పించి రక్షించిన యాజగన్మోహనాకారునకుం దక్క పరుల కీశరీరమెటు లర్పింపఁగలుగుదు. హా! జనకా! నాయిష్టములేని యొవనికో యొకనికి నన్నంటగట్టి యందులకే ననారతము వలపింపుచుండ నీవు చూచి భరింపఁగలవా? ఇట్టియుద్దేశము నీవు కలిగియున్నప్పు డీస్వయంవరసంరంభమంతయు నేటికి? స్వయంవరమనఁ గన్నియ దనకిష్టమగు వరునిఁ జేపట్టవలయుఁగదా! ఆర్యావర్తమునంగల రాజులనెల్ల రప్పింప కిట్లేల పక్షపాతము గావించితి" వని పలుగతులఁ జింతించి తండ్రిని

దూరుచు నెట్టకేల కొకసాహసకృత్యమును గావింప నిశ్చయించుకొని మంజరికిఁ గొన్ని రహస్యములు బోధించి తా నానాఁడురాత్రిఁ దిన్నగ నాహారమునైనఁగుడువక చాలప్రొద్దుపోయినపిదప నెట్లో శయనించెను. అంత బాలభానుండు దన బాలారుణదీప్తులచే నలంకృతములగు రాజ వీధులకు నూత్నశోభ గల్పించుచు నుదయపర్వతముపైఁ దోఁచెను. ఆనాఁడు పనిపాటలవారందఱు దమతమ వ్యాపారములకుఁ బోవుట మాని గృహములందే వసించియుండిరి. నగరమునం దెల్లడల ప్రభాత కాలవాద్యములు మ్రోఁగుచుండెను. సంయుక్తయుమేల్కాంచి తా నా దినమునఁ జేయఁబూనుకొన్న కార్య మతిదుర్ఘటంబు గావునఁ దండ్రి నెట్లు దిరస్కరింతునాయని కొంతతడవును, దిరస్కరింపనిచోఁ దన కోరిక నెఱవేఱుటకు వేఱొండుమార్గము గలుగదని కొంతసేపును విచారించి తుదకెట్లయినఁ దనయిష్టమే నెరవేర్చుకొనఁ దలచియుండెను. అంతఁ గొంతసేపటికి రాణియానతిఁ జెలికత్తెలు మున్నగువార లేతెంచి నామెకభ్యంగస్నానాదికములఁ జేయించి యలంకరించి తల్లిదగ్గఱకుఁ గొంపోయివిడిచిరి. ఆనాఁ డెనిమిదిగంటలకుస్వయంవర ముహూర్త మేర్పఱుపఁబడియుండెను. దివాణములోపల స్ఫటికశిలావినిర్మితమగు నొకవిశాలచతుశ్శాలామంటపము స్వయంవర కార్యమున కుద్దేశింపఁ బడెను. ఈమంటపాంతరమునఁ దూర్పుప్రక్క జయచంద్రుఁడు నతని సంతతియు,నుత్తరమున రాజ్యమందలి ముఖ్యులును,పశ్చిమపార్శ్వమున స్వయంవరాగతరాజమండలియు, దక్షిణమున బరరాజులవెంటవచ్చిన ప్రధానులు మున్నగువారును నాసీనులగుటకుఁ బీఠము లమర్పంబడి యుండెను. తెల్లవారినదిమొదలు లొక్కరొక్కరు వచ్చి యుచితాసనములఁ బరివేష్టింపసాగిరి. వీధులయందు శకటముల రాకపోకలకు వీధివిరగడ లేకుండెను. అంతఁ బ్రతీహారు లేగి సకలమును విన్నవింప జయచంద్రుఁ

పు పురోహితులు ముందునడువ మంటపమున కేతెంచి సింహాసన మధిరోహించెను. పురోహితునానతి బరిచారికలుచని పిలువ సంయుక్తయుచితాభరణభూషితురాలై తల్లింగూడి దివ్యమంగళవిగ్రహముంబలె నుందయానంబున నరుదెంచి సభలో నాసీనయయ్యెను. ఉబ్బెత్తుయద్దపుబిళ్లను సూర్యునిమొకటం బెట్టినతోడనే నలుదిక్కులం బ్రసరించియుండు కిరణములన్నియు దానితేజఃకేంద్రమునకే చేరులీల స్వయంవరోత్సవముం జూడవచ్చిన సమస్తజనులచూపులు సంయుక్తముఖముమీఁదనే వ్రాలెను. ఎనిమిదిగంటలగుడు పురోహితుఁడు పుష్పహారమొకదానిని సంయుక్త చేతికొసంగి నీయిష్టమువచ్చిన రాజవరునికంఠమున వ్రేయుమనిచెప్పి రాజుల వేఱుపఱచి చెప్పుట కెవరు దగుదురని యాలోచించుచున్నతరి మంజరి నేనని ముందు నిలచెను. అందుపై నామెనే నియోగించిరి. అత్తరి సంయుక్త తనసహజారుణములగుహస్తముల హారమునుధరించి లజ్జానతాననయై రాజలోకంబు నెదుటకువచ్చుచుండఁ బ్రతివాఁడును దననే వరించునని గుటకలుమ్రింగుచుండెను. మంజరియొక్కొక్కని జూపించి తెలియఁజెప్పుచుండెను. ముఖసంజ్ఞలచే వ్యతిరేకభావమును సూచించుసంయుక్త ముందుచూపులు చూచుచుండెను. ప్రతిరాజకుమారుఁడును దనపై వానివదలి తనదగ్గఱకేతెంచుతరి నిఁకఁ దన్నే వరించునను సంతోషమున మొగము కలకలలాడ గూరుచుండి వ్యర్థమగుటతోడనే విన్నదనంబు నొందుచుండెను. అటనున్నవారి నందఱుఁ దెలియఁజెప్పెనుగాని సంయుక్త యెవ్వని వరింపదయ్యెను. సభయందలివారెల్లరు విభ్రాంతివహించి కూరుచుండి యుండిరి. అంతమంజరి పృథివీరాజునువర్ణించి బహిర్ద్వారమున శిలావిగ్రహుఁడై యున్నాఁడన సంయుక్త సభలోనివారల నెవ్వరి లక్ష్యపెట్టక త్వరితగతి నాశిలావిగ్రహముకడకేగి దానికంఠమున పుష్పహారమువైచెను. చెంతనున్నవారు

కళవళమందసాగిరి. రాజకుమారులు విషణ్ణులై తమచోటులఁబాసి లేవసాగిరి. ఎక్కడకేగునో యనిచూచుచు కూరుచున్న జయచంద్రున కావార్త తెలిసినతోడనే మధ్యందినమార్తాండునింబోలె రోషభీషణాకారుఁడై సంయుక్తను లోపలికిఁ గొనిపొండని పరిచారికలకుఁ దెలియఁ బఱచి తాను రాణీసమేతుఁడై యంతఃపురమున కరిగెను. ఆశాభంగ మగుటచేఁ దక్కిన రాజులును దమ తమ నివాసములకేగిరి.

I read this book, and found very good.
It teaches us how to win freedom.
We should not lose our courage at any time.

“ పురుషార్థప్రకాశము ”

సత్పురుషుల కొంగుబంగారము.

వి. వి. కే. లక్ష్మీరావు,

పబ్లిషర్, గుంటూరు.

పదునేనవ ప్రకరణము.

కన్యాకుబ్జనగరమందలి వృత్తాంతము లటులుంచి యించుక ఢిల్లీ నిగూర్చి విచారింతము. చౌహాణవంశస్థుఁడగు పృథ్వీరాజాపురమును బాలించుచుండెనని యిదివఱకే తెలిపియుంటిమిగదా! ఇతఁడార్యమతావలంబకుఁడును, న్యాయపరిపాలకుఁడును, బుద్ధిశాలియు, నతిభోగశాలియునై రాజ్యమేలుచుండెను. ఇతఁడార్యమతము వాఁడగుటచే సమస్తకులములవారిని వారివారి యోగ్యతానుసారము మన్నించుచు వచ్చెను. అందులకు నిదర్శనముగ మనకథాసందర్భమున వచ్చువారి నిరువుర వర్ణించెదను. ఈశ్వరభట్టను నతఁడు జైనమతస్థుఁడు. ఇతఁడు త్రివిష్టపమునుండి చనుదెంచి రాజు నాశ్రయించి మొదట నొక చిన్న యధికారిగనుండి క్రమముగ యుక్తిచాతుర్యములవలన నొకముఖ్యాధికారి యయ్యెను గొప్పయధికారము చేకూరినదిమొదలు రాజ్యమునందు గొన్నిదుష్కార్యము లొనరింప మొదలిడె తుదకొక స్త్రీని గామించి యామెకుఁదనవాంఛ నెఱింగింప నందున కామె సమ్మతింపదయ్యె. ఇటులుండ నామెభర్త కార్యాంతరమున మఱియొక గ్రామమున కేగి మఱలి స్వగృహమునకువచ్చుచుండ దారిలో గొందఱు తలారుల నుంచి వానిఁజంపించి యాశవము నీమెయింటి ముంగిటఁ వేయించి తెల్లవారినవెంటనే కొందఱుభటులఁనంపి పతినిజంపినదని యామెం దెప్పించి యాసంగతి దానే విచారణసేసి యామెకు మరణదండన విధింపవలసినదిగఁ జక్రవర్తికిఁ దెలియఁబఱచెను. చక్రవర్తి స్వయముగ మఱల విచారణసేసి తనకుఁ దృప్తికరముగ ఋజువుకానందున దానిని గొట్టివేసెను. అందులకాభట్టుగారీర్ష్యవహించి నృపాలునెటులైన రాజ్యపదభ్రష్టునిజేయ నాయోపాయముల వెదకుచుండెను. ఇతని కుట్రల

కన్నింటికి నానగరమందె మఱియొక ముఖ్యాధికారపదవియందున్న కరీమను మ్లేచ్ఛుఁడు తోడుపడుచుండెను. ఈకరీమ్ ఆఫగన్ దేశస్థుడు. ఈతరుణమున సుల్తాన్ మహమ్మద్ గోరీ యనునతఁడు లాహోరుల రాజ్యముచేయుచుండెను. పదునొకండవ శతాబ్దారంభమున మహమ్మద్ గజినీ యార్యావర్తముపై దండెత్తి లాహోరురాజగు జయపాలుని నోడించిపోయెను. జయపాలుఁడు తనకుఁగలిగిన యవమానమును భరియింపజాలక తన పుత్త్రుఁడగు నానందపాలుని సింహాసనమునుంచి తా నడవికిఁ బోయెను. ఎనిమిదిసంవత్సరములు కడచినపిదప మఱల గజినీవచ్చి యానందపాలుని నోడించెను. అనంతర మానందపాలుఁడును దనతండ్రిచేసిన ప్రకారము తనకుమారునకుఁ బట్టముఁగట్టిపోయెను. తరువాత క్రీస్తుశకము పదివందల యిరువదియొకటవ వత్సరమున మఱల గజినీ దండెత్తివచ్చి యానందపాలుపుత్త్రు నోడించి రాజ్యము దనస్వాధీనము జేసికొనెను. నాఁటినుండియు లాహోరున మహమ్మదీయ రాజ్యము స్థాపింపఁబడెను. గజినీ మరణానంతరముకూడ నారాజ్యము మహమ్మదీయుల వశమందే యుండెను. పండ్రెండవ శతాబ్దమున సుల్తాన్ మహమ్మద్ గోరీ యనునతఁడు దానిఁ దన వశముగావించుకొని పరిపాలించుచు నార్యావర్తమునంతయు జయింపఁదలఁపూనియుండెను. అట్టితలంపున విదేశమందలివారల కెఱుక లేకుండ గొన్నిచిన్నచిన్న సేనల నక్కడక్కడనుంచి రాజులసమాచారము దెలియఁజేయుటకై నిపుణులగువారి ననేకస్థలములకంపెను. పైకరీమును నిట్లు పంపఁబడినవారిలో నొకఁడు. ఇతఁడతికుయుక్తుఁడు. తన పైయధికారుల యెడల నెట్లు వినయముతో నడుచుకొనవలసినదియు, వారికనుల నెట్లు దుమ్ముగొట్టవలసినదియు నితనికి బాగుగఁదెలియును. చక్రవర్తి మతవివేచన బాటింప కెల్లరగౌరవించుచునని తెలిసికొని పురమునందె యొకయధికారిగనున్న నెక్కువరహస్యములు కనుగొనుటకు వీలగునని యూహించి

చక్రవర్తినాశ్రయించి కొద్దికాలముననే యొకముఖ్యాధికారిపదవినం దెను. ఇతఁడు భట్టుగారు జేయుచున్న కుతంత్రముల దెలిసికొని యతని కడ కేగి తనకుసాహాయ్యపడవలయుననియుఁ దనకోరికలు నెఱవేఱిన తోడనే ఢిల్లీయం దర్ధరాజ్య మిప్పింతుననియు వాగ్దానముచేసెను. నాఁటి నుండి వారిరువురిపోకలకు మేరయే లేదు. చక్రవర్తినాశనమైనతన కర్ధరాజ్యము రానున్నదని భట్టుగారువ్విళులూరుచు మహమ్మదీయునకుఁ జేదోడువాదోడుగ మెలఁగుచుండెను. చదువరులారా! ఈ భట్టుగారివంటి స్వార్థపరులమూలముననేగదా యనేకస్వతంత్రరాజ్యములు మన్నుఁగలసిపోయినవి. స్వార్థపరత్వమనుగుణ మెంతచెడ్డదియో బాగుగ నాలోచింపుఁడు. ఈయవగుణరాజమును బూనియున్నవాఁడు దనకుదాను లక్షలకొలంది ద్రవ్యమును సంపాదించి బాగుపడవలెనను పట్టుదలగలిగి పరులకనేకగతుల నపకార మొనర్చుచుఁ దుదకు తానునష్టపడి దేశమునంతయు నాశనముకావింపఁ బాల్పడుచున్నాఁడు. ఒకవేళ నట్టికుబుద్ధులకుఁ దాత్కాలికముగఁ గొన్ని సౌఖ్యములు గలిగినను గాఁబోవు నిజసంతతులకుఁ జెప్పరానినష్టము గలుగఁజేయుటయేగాని లాభముగలుగఁజేయుటెన్నటికిఁ గాదు. ఎనిమిదివందలయేండ్లక్రిందటి యీభట్టుగారివంటి దుర్మార్గులమూలముననేకదా స్వరాజ్యమన్యరాజ్యమైనది. ఈభట్టుగారు మొదలగువారి కాదినములలో సౌఖ్యమేకలిగినదని యనుకొందము. కాని దానిఫలిత మాలోచింపుఁడు. తరువాత వారిసంతతివారందఱు మ్లేచ్ఛులచేత నెన్నికష్టములందిరో యెవరికెఱుక? ఇప్పటికిని మనదేశమందీగుణము పూర్తిగనే పాతుకొనియున్నది. ఎవనికొఱకు వాఁడు చూచుకొనుటయేగాని పరోపకారమన్న లేశమైన లేదు. తెల్లవారినది మొదలొండొరుల దూషించుకొనుచు నొకరిపై నొకరునిందను మోపుకొనుచుఁ బోరాడుచుండుటయేగాని దేశోపకారముకొఱకు బాటుపడుదమనువారలు మిక్కిలియరుదు. ఇట్టివారలకుఁదుదకు దుఃఖరూపకనరక

మేగాక వేఱొండుకలుగునా? స్వార్థపరత్వమూని పుగాశాబద్ధులై యెడ తెగని మనోచింతచే గృశించుచు నుపకారమనుమాట లేక లోభులై ధర్మ హీనులై తుదకుముక్తికిఁ దూరులగుచున్నారు. సోదరులారా! ఇట్టి యిహ పరలోకములకుఁ గొఱగాని స్వార్థపరత్వము నేల త్యజింపరు? మీకు మీకే కాక స్వదేశమునకు సంఘమునకు నట్టి భాగ్యవంతముగాఁ జేయఁ బ్రయత్నింపుఁడు స్వార్థపరత్వమును మీ హృదయములనుండి పాఱఁదోలుఁడు. ఐకమత్యము వహించి మీ దేశక్షేమమునకై పాటుపడుఁడు.) ఇఁక గథాంశమునకు వచ్చెదను. రాజ్యమందు వీరిరువురు దప్ప తక్కిన ప్రధానులు మంత్రులు నక్షౌహిణీపతులు మొదలగువారు తమ ప్రాణములసహితము జక్రవర్తి కర్పించు నంతటి భక్తితో నుండిరి కాన నతని కేవిధమైన చిక్కులు గలుగకుండెను. పైని వచించిన దుష్టద్వయమునకుఁ జెరియొక దేవిడి కలదు. అందు మహమ్మదీయుఁడు తనకోటకై యేతెంచు మ్లేచ్ఛభటులు నగర మందలి తక్కిన యధికారులకంటఁబడినచో హానియగునని యూరిబైట నాలుగైదు మైళ్ల దూరమునుండి తన దేవిడిలోనికొక సొరంగము ద్రవ్వించి దానిగుండ దనవారలు రాకపోకలు చేయ నేర్పఱుచుకొని చేతనైనన్ని కుట్రలఁ బన్నుచుండెను. "ఇంటిదొంగ నీశ్వరుఁడైన బట్టఁజాలఁ"డను నట్లు తనకొలువునందే యుండి యెదుటముఖస్తుతులు సేయుచు లోలోపలఁ గుట్రలఁబన్నుచున్న వీరిద్దఱి నడవడి నెంతమాత్రము గుర్తింపఁ జాలక చక్రవర్తి రాజ్యమేలుచుండెను. ఇటులుండ వేదవేదాంగ షట్ఛాస్త్రపారంగతుఁడగు బైరాగి యొకఁడరుదెంచి చక్రవర్తికి దన విద్యానైపుణ్యముం గనుబఱిచి మన్ననలంది యతనినానతి గొన్ని దినము లక్కడనేయుండి నృపులకు వేదానుకూలమగు రాజనీతు లుపదేశించుచు మైత్రిసంపాదించి యేకాంతముగ గొన్ని నూతనవృత్తాంతము లెఱుకపఱిచి నిదర్శనములఁ జూపింపఁ జక్రవర్తియు నాశ్చర్యమగ్నుఁడై వెంటనే బైరాగి మార్గదర్శిగాఁ గొంత సైన్యమునంపి

రాజ్యము ప్రధానుల కొప్పగించి జాగ్రత్తగలిగియుండుడని నియమించి తానును మఱింత సైన్యమును గొందఱు దాసీలను వెంటఁగొని వెడలి పోయెను. దుష్టద్వయము రాజునగరమున లేనితరిఁ గొన్ని యల్లరులు చేయఁ గడఁగిరి. కాని ధీవిశారదులగు మంత్రిప్రముఖులచే నవన్నియు నడఁచివేయఁబడెను. కుతుబుద్దీను నడంచిన దీబైరాగి మార్గదర్శిగఁ బోయినసేనయే. తరువాత వారికి సహాయుపడవచ్చిన రాజపురుషుఁడు చక్రవర్తియని చెప్పనక్కరలేదు. అప్పుడట్లు కుతుబుద్దీను నోడించి సంపూర్ణజయముతో మూఁడువేలమహమ్మదీయ ఖైదీలవెంటగొని చక్రవర్తి రాజధానిఁ జేరవచ్చినవార్త కరీమునకుఁ దెలిసినవెంటనే యతనికిఁ గలిగినయారట మింతింత యని చెప్పనలవికాదు. మొట్టమొదట సైన్యవృత్తాంత మరసివచ్చుటకై పంపఁబడినచారులు తిరిగి రానందున నేలకో జాగుసేసిరని కరీము మఱియిద్దర నంపెను. వారును సమాచారముఁ గొనిరారైరి. అందులకనుమానగ్రస్తుఁడై రేయింబవళ్లు చింతించుచు నాకులుఁడైయున్నతరుణమునఁ జక్రవర్తి కుతుబుద్దీను నోడించి ఖైదీలఁ దెచ్చినాఁ డన్నవార్త చెవింబడ దొంగలు పడినకొంపకు నిప్పంటుకొన్నటులయ్యెను. పాప మామ్లేచ్ఛుఁడు నిలిచినచోట నిలువక తనవారితోఁగూడ మాటలాడుటమాని యెవరే మడిగినను బరధ్యానముగనుండి సరియగు ప్రత్యుత్తరమీయక పిచ్చి యెత్తినవానివలె శరీరమునందంతట వేలకొలది తేళ్ళు జెఱ్ఱులు ప్రాకి నట్లగుచుండ నేమిసేయుటకును దోఁపక పరస్థలమునకేగి వచ్చుచున్న చక్రవర్తి కెదురుబోయి కొనివచ్చుట యటులుండఁ గొలువునకేతెంచినప్పుడైన నతనిదర్శనార్థము వెళ్ళుటమాని విచారశోకములకుఁ దావలుఁడై రెండుమూఁడు దినములవఱకు సెలవుగైకొని యింటనే వసించి యుండెను. చక్రవర్తి రాజధానిఁ జేరిన మఱుసటిదినమున నొంటరిగఁ గరీ మొక గదియందు గూరుచుండి భట్టుగారిఁ గొనిరమ్మని సేవకుల

నంప వాఁగుపోయివచ్చి భట్టుగారు గడచినరాత్రినుండి గాన్పింపనందున నింటివారంద ఱేమ్చుచున్నారని తెలుప దిగ్భ్రమనంది చెంతనున్న వారి నందఱి నావలకంపి తనకోరిక లన్నియు వ్యర్థములగు సమయము ప్రాప్తించినదని చింతించుచుఁ గూరుచుండియుండెను. అట్లు మతిపోయి కూరుచుండియున్న సమయమున మఱియొక సేవకుఁ డరుదెంచి రాజభటులు దేవిడీచుట్టుఁ గ్రమ్మి తన్ను వెదకుచున్నారని వచింప నులిక్కిపడి లేచి చెంతనున్న బాకునొకదానిఁ గైకొని సొరంగమార్గమునఁ బారిపోవుటకు దిడ్డిగుమ్మము దగ్గరకుఁ బోఁబోవ నప్పటికే యచట భటులు నిలిచియుండిరి. మఱియొక ద్వారముకడకేగి చూడ నక్కడల్లే మూఁగియుండిరి. వేఱొండు కవాటమువద్దకేగ నక్కడ నంతకన్న మిక్కుటముగ నుండిరి. ఇల్లు మందిరము నాల్గువైపుల రాజభటులావరించియుండుట దెలిసికొని యొడలెల్లఁ జెమ్మటలు గ్రమ్మ గజగజ వణఁకుచు నిశ్చేష్టితుఁడై నోటమాటలేక నేలకొరగెను. వాఁడనయక్కడకు వచ్చినభటు లాపిఱికిపందను విఱిచికట్టి తమయేలికయొక్కయాజ్ఞానుసారము గావింపఁ గొంపోయిరి.

పదునాఱవ ప్రకరణము.

అటఁ గన్యాకుబ్జనగరమందు జయచంద్రుఁడు తనకూఁతురు చేసినపనికి మండిపడుచు నంతఃపురముఁ జేరి రోషసంభ్రమములు ముప్పిరిగొన "హా! తానొకటితలఁచిన దైవ మొకటితలఁచుననుట తథ్యమయ్యె. ఆ నిర్భాగ్యునెడల నే సలిపినదానికి నాకూఁతు రిట్లువ్యతిరేకముగ మన్నించునని కలయందైనఁ దలఁచితినా? దీనికిట్టి దుర్బుద్ధి పొడమనేల? సాటిరాజులలో నాకు తలవంపులు తెచ్చినదిగాదా యీరాకాసి. దీని నేమికావించినను పాపమగునా? దీని నింతింతకండలుగఁ గోసి కాకులకు వైచినను పాపము కలుగదు. దీనికి నే నేమి విషము పోసితిని. ఇది పుట్టకుండిన నా కేచింతయు లేకపోవుఁగదా? ఇదినఱకుఁబోయిన దట్లే పోక మరల నేటికి దాపరించినది? ఆహా! నాహృదయమంతయు రవులుకొనిపోవుచున్న దేమి సేయుదు?" అని తలపోసికొనుచు తన భార్యం బిలచి కూఁతురుసమాచార మెటులున్నదో కనుగొనిరమ్మని పంపెను. ఆమెయు నటులేయనిపోయి కొంతసేపునకు మఱలివచ్చి, "ఆర్యా! అది మూర్ఖపుఁబట్టు బట్టియున్నది. ఎంతచెప్పినను బృథివీరాజును దక్కనన్యువరింప ననుచున్నది. పోనిండు. దాని యిష్టప్రకారమేలఁ జేయరాదా? ఆచక్రవర్తియెడల మీకుమాత్ర మింతవైరమేల?" అని యింకను నేమో చెప్పఁబోవుచుండ నడుమనడ్డమువచ్చి "ఓసీ! నిన్ని వెధవశిఫారసులు చేయుమని యెవరు మొఱపెట్టిరి. పాపము కూఁతును వెనుక వేసికొనివచ్చుచుంటివా? మీరిద్దఱుఁ గలిసి యేగంగలోనైనఁ బడుఁడు. అంత నాప్రాణము నెమ్మదిగ నుండును." అని తన ప్రియురాలిఁగూడ గసరికొట్టి బిరబిర సంయుక్తయున్న స్థలమునకుఁ బోవఁజొచ్చెను. ఆహా! అసూయాపరుండగువాఁ డెట్టిదుష్కృత్యము

లోనరింప సమకట్టునో యోచింపుఁడు. పృథ్వీరాజుపైఁగల యీర్ష్యయే గదా! జయచంద్రు నింతదురాత్మునిగఁ జేసినది. అసూయ స్వార్థపరత్వమునకు జన్మకారణమని చెప్పవచ్చును. కన్నబిడ్డలయందును, ప్రియురాండ్రయెడలనుగల మోహమునుగూడ బాఱఁదోలుఁగదా! ఈపాపగుణము. ఈదౌర్భాగ్యపుగుణ మున్నంతవఱకు మనదేశము మంచిస్థితికి రాదనుట నిర్ధారణము. జయచంద్రుఁడట్లుపోవుచుండ రాణియు'హా! కూఁతురాయని యాక్రందనముసేయుచు నతనివెంటనే యరిగెను. మందిరములోనికేగి పరధ్యానముతో నొకసోఫాపై గూరుచున్నకూఁతు నొక్కచరుపుజరువ నులికిపడిలేచి సంయుక్త తలిదండ్రులకు వందన మొనరింపఁబోవ మరల నొకతన్నుఁదన్ని "ఓసి! దౌర్భాగ్యరాలా! నీ కేమిపోవుకాలము వచ్చినది? నావంశమునుఁ జెఱుప దాపరించితివటే? ఇన్నినాళ్లు పోషించినందులకుఁ దుదకు నీతల్లిదండ్రులతోడనే వైరమూనసాహసించితివా? ఓసి పాపిష్టిదానా! నీచదువుఁజట్టుబండ లేమన్న గలసిపోయినవి? ఇంతవఱకును గుణవంతురాలవనితలఁచి యుంటినిగాని యింతగయ్యాళివని యెఱుఁగనైతి. నే వలదన్నవానివరించి నామీఁదనే కత్తిఁగట్ట సాహసించితివా? నాహృదయమునకు జిచ్చిడితివిగదే. నిన్నే మొనరించినను నాకసితీఱ" దని యదివఱకెన్నఁడో మృదుమధురముగ మాటలాడు స్వభావము కలవాఁడయ్యు, నదంతయుఁబోయి రోషమువలన నోటవదింపరాని యశ్లీలవాక్యంబుల బుత్రికను దూషించి తుదకు "ఓసీ! ఇంతవఱకైనది కానిమ్ము. క్షమించెద. ఇఁకనైన నాదౌర్భాగ్యునివదలి నాయాజ్ఞానుసారము వర్తించెదవా? లేదా?" అన నాకన్నియతలవంచుకొని తిన్నని యెలుంగున "తండ్రీ! నీ కింతకోపమేటికి? మనస్సుచే వరించినవానినే చేపట్టుట యుత్తమపతివ్రతాలక్షణముగదా! అందులకు వ్యతిరేకముగ నడుచుకొనుమని తండ్రివగు నీవేబోధించుచున్న నిఁక నేనేమనుదానను? అది

యుంగాక నన్ను ఘోరకష్టములనుండి గట్టెక్కించి ప్రాణముల నిలిపిన వాఁడు చక్రవర్తి. అట్టి ప్రాణదాతయగువాని వలదని వేఱొకని నెట్లువరింపఁగలను? పోనిమ్ము! నీ కామహానుభావుని యెడగల వైరము నావల నిడి యాతనియం దేసుగుణములు కలవో నిదర్శనపూర్వకముగఁ జూపింపుము. అప్పుడు నీయిష్టానుసార మవశ్యము వర్తిల్లెద." అని పలికిన "ఓసీ! గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్లు నీవు నాకు బుద్ధులగఱపుచుంటివా? నీ కాతని సద్గుణములఁ గనుబఱుపవలయునే? అట్టే చూపెదనుండు" మని పలుకుచుండఁ గాలుసేమి యచ్చోటువదలి వెళ్లెను. అప్పటినుండి రాజు రహస్యాలోచనసభలయందు కొన్ని తగువారల రావించి వారితో జరుగుచున్న సంగతులెల్లఁ జెప్పి యెట్లైనఁ జక్రవర్తిపై దండెత్తి యతనిఁ గడతేర్చవలయునని పలికెను. అందులకందఱు సమ్మతించి యేదైన నొకచిన్న నెపము పెట్టుకొని యుద్ధమునకుఁ బోవుట మంచిదనిరి. కారణమేదొరకునా యని విచారించుచున్న సమయమున దౌవారికుఁ డరుదెంచి యొకఁడు ఢిల్లీనుండి వచ్చి తమదర్శనార్థము ద్వారముకడ వేచియున్నాఁడనిన వానివెంటనే కొనిరమ్మని రాజుగారు సెలవిచ్చిరి. వాఁడు నట్లేపోయి వచ్చినమనుజుని వెంటఁగొని తెచ్చి వారివద్ద విడచిపోయెను. ఆవచ్చిన పురుషుఁడక్కడ నున్న వారలకందఱకు నమస్కారములు సేసి యిట్లు వచింపసాగెను. "మహారాజా! నేను ఢిల్లీనగరమునందొక ముఖ్యాధికారిని. నే నాచక్రవర్తియెడ విశ్వాసముగలిగి నా కార్యములన్నియు న్యాయానుకూలముగ నెఱవేర్చుకొనుచుండ నాశత్రువులగు తక్కిన కొందఱధికారుల వాక్యములాలించి యతఁడు నాయెడ నిరాదరణయే సూపుచు వచ్చెను. అటులయ్యు స్వామిద్రోహము సలుపరాదని యతని కెన్ని విధముల నుపకారములు గావించుచు వచ్చినను మహాప్రభో! తుదకతని మనోవాంఛ నన్నుఁ జంపి నా కాంతం జెఱపట్టవలెనని తలఁచునంత దుస్థితికి వచ్చినది. జనుల నందఱ న్యాయమార్గాను

గాములుగ నొనర్చి పాలింపఁదగినరాజే యిట్టి క్రౌర్యములు చేయ నె డిగట్టిన నిఁక నానగరమున వసించుట ప్రాణాపాయకరమని యెంచి యొకనాటి రాత్రి నిల్లువెడలి తమవంటి మహాత్ములదయయున్న యెడల నెక్కడనైన నింతపొట్టబోసుకొనవచ్చునని యిట్లు వచ్చినాఁడను. ఇఁక దేవరవారి చిత్తానుసారము దాసుఁడనై మెలఁగ సిద్ధముగా నున్నా"నని వచించెను. జయచంద్రుఁడు డతనిఁదన దగ్గఱ నుంచుకొనుటకు శత్రువువద్దనుండి చనుదెంచినాఁడే యని సంకోచించుచున్న సమయమున, నతనివలెనే ఢిల్లీనంతయుఁ బాడుచేసి కనూజిఁజేరి యారాజుగారి దయకుఁ బాత్రులైయున్న మఱియిద్ద రావచ్చినమనుజుని వృత్తాంతము సరియని చెప్పిరి. దాన సంశయనివృత్తి యగుడు జయచంద్రుఁడతనిఁగూడ నాయిరువురితో సమానముగ నుంచుకొంటకు సమ్మతించెను. పైప్రకరణమున నీశ్వరభట్టు కన్పింపలేదని కరీముతో సేవకులు వచించినట్లు చెప్పియుంటిగదా. ఆభట్టుగారే యీవచ్చినక్రొత్తమనుజుఁడు. ఇతనికిని నాసాక్ష్యమొసంగిన సిరువురు మనుజులకును ఢిల్లీయందున్నపుడే పరిచయముండెను. వారు ఢిల్లీని వదలునపుడే భట్టుగారును విడచియుందురుగాని వారికివలెగాక రాజ్యము సంపాదింపవలెనను వాంఛ యితనిమనసున దృఢముగ నాటుకొని యుండెను. ఆకారణముచేతనే ఢిల్లీ నింతవఱకు వదలక పైకి చక్రవర్తితో నిష్టముగ నున్నట్లు నటించుచు లోలోపలఁ గుట్రలు పన్నుచుండెను. చక్రవర్తి మ్లేచ్ఛుల జయించివచ్చిన దినమున తమగుట్టంతయు నతని కెఱుకపడెనని విని కరీముగారితోనైన వచింపక మధ్యరాత్రి బయలుదేఱివచ్చి యిటఁజేరెను. ఇటు లీనగరముఁజేరి చక్రవర్తిపై నెపము వెదకుచున్న జయచంద్రునకు మహోపకారము గావించినవాఁడయ్యెను. మఱునాఁడు కొలువుదీఱియున్న సమయమునఁ జక్రవర్తి వ్రాసినది కాకపోయినను అతనిహస్తలిఖితమని జాబు నొకటి జయచంద్రునకుఁ జూపింప దానియం దిట్టులుండెను.

"స్వస్తిశ్రీ జయచంద్రునకు.

నీ గారాబుకొమార్తె సంయుక్త నన్ను వలచియున్నదని యనేకులవలన వినియుంటి. నాకును నామెపై మిక్కుటమగు మోహముకలదు. నాతో మైత్రిఁ బాటింపఁదలఁచితివా శీఘ్రముగ నామెను నాకొసంగి వివాహముఁ జేయుము. లేకున్న రాక్షసవివాహమునన్నైనఁ జేకొన నిశ్చయించియున్నాను." అని చదువుకొన్న వెంటనే దెబ్బతిన్న త్రాఁచుపామువలె దీర్ఘనిశ్వాసాన్వితుఁడై కన్నులెఱ్ఱచేసి లేచి "ఔరా! వీనిదుర్మదము. వీనికినాగారాబుకూఁతు నర్పింపవలయు గా లేకున్న రాక్షసవిధి గైకొనుపాటివాఁడా? చక్రవర్తిపదవి లభించెనని కన్నులు నెత్తికెక్కినవిగాఁబోలు. ఇంతవఱకుఁ దగుకారణము లేనందున నూరకుంటిని." అని యవలోకనమాత్రమున రణమునకు వెడలివచ్చునంతటికఠినముగఁ బృథ్వీరాజునకు లేఖవ్రాసిపంపించి యుద్ధమునకు సంసిద్ధులై యుండవలసినదని దండనాయకుల కాజ్ఞాపించి వెడలిపోయెను.

పదునేడవ ప్రకరణము.

యమునాతీరమున గలిగిన యుద్ధజయము వలన బైరాగికిని జక్రవర్తికిని మైత్రి ప్రబలముకాసాగెను. పృథివీరాజతని ప్రాణస్నేహితునిగ నెంచుకొనుచుఁ బ్రధానులతో సమానముగఁ గారవించుచుఁ దనవద్దనే యుంచుకొనెను. ఇట్లు కొన్నిదినంబులు జరుగ నొకనాఁ డాయోగి చక్రవర్తి నేకాంతస్థలమునకుఁ గొనిపోయి యతనితో "మహారాజా! నేను తమయెడలఁ గావించిన యీచిన్న నేరమును క్షమింపుఁడు. దేవరవారితోడ నేనన్నిసంగతులు వచించితినిగాని యొకటి మాత్రము చెప్పక దాచితిని. ఆనాఁడు కాళికాలయమున మీరు రక్షించినకన్య జయచంద్రునికూఁతు రనిమాత్రము వచించియుంటిఁ గాని యామె విషయమై మఱేమియుఁ జెప్పలేదు. ఆచిన్నదాని పేరు సంయుక్తయందురు. ప్రపంచమునందంతట సౌందర్యమున నగ్రగణ్యాలని ప్రఖ్యాతిఁగాంచిన కన్యకారత్నములలో నొకతెయైయున్నది. ఆమె గుణగణంబుల నేమని వక్కాణింతును. గురులయెడల నమ్రతయుఁ, దోడివారలయెడ విశ్వాసమును, బేదవారలయందుఁ గరుణయు, నందఱపై సమదృష్టియుం గలిగి మూర్తీభవించిన సద్గుణపుంజమో యన నొప్పుచుండును. విద్యయం దామెతోఁ దులఁదూఁగఁగలకాంత లిక్కాములన లేరనియే వచింపనగును. ఇంతియేగాక శత్రుసమూహంబులు పురుషుఁడని భ్రమనొందునట్లు యుద్ధమున రణప్రావీణ్యముఁ జూపఁ గలదు. మఱియు చిత్రలేఖనమునఁ గడునేర్పరి. చూపరులు ప్రకృతిసిద్ధములని భ్రమించుగతి పలురకముల వస్త్రాళి నిర్మించుటలో ముందామెనుజెప్పి తరువాత నింకొకరిఁ జెప్పవలయు. ఆకన్నియ యిప్పుడు సుమారు పదునాఱుసంవత్సరములది. అట్టి సంపూర్ణకళానిధియై రాజిల్లు

నాజవ్వని తన పంచప్రాణముల మీాపైనిడుకొని రేయింబగళ్లు మీా నామస్మరణయే చేసికొనుచు నిద్రాహారములు సైతము మాని కృశించి పోవుచున్నది. జయచంద్రుఁడు స్వయంవరవిధి నామెకు వివాహముఁ గావింప నెంచియున్నాఁడు. ఈవార్తనే మీాతో నవుడు చెప్పకదాచితి. వామమార్గులనుటంకోడనే మీారు కత్తిగట్టి బయలు వెడలుదురనియుఁ దన్మూలమున నాకన్నియకు రక్షణగలుగు ననియు సావకాశముగ నీ వార్త దెలియపఱచెదఁగాక యని యూహించి యప్పటి కూరకుంటిని. ఎట్లైన నాకన్నియ మనోవాంఛితంబు నెఱవేర్పుఁడు. మీాకును జయచంద్రునకునుగల వైరము నెంచి యుపేక్షచేసినచో నిక్కముగ నాకన్నియ యాశాభంగమయ్యెనని ప్రాణములఁ ద్యజించుంగాని బ్రతికి యుండనేరదు. ఈవృత్తాంతము మీాకెఱుకపఱుచుటకై నే నెన్నియో కష్టము లందివచ్చితి. ఇఁక నాలుగుదినములుమాత్ర మీానగరమున నుండెద. అనంతరము నాకు సెలవొసంగ వలయు"నని వేడెను. ఇంత వఱకుఁగను తెప్పలు వాల్చక బైరాగివంకనే చూచుచు నతఁడు వచింపుదానిని వినుచున్న చక్రవర్తి దిగ్గునలేచి యతనిహస్తములు పట్టుకొని "మహాత్మా! నీవు కేవలము నాపాలిభాగ్యదేవతవుగాని వేరొండుగాదు. కొంచె మెడమైననట్టేటం గలిసిపోవునట్టి నారాజ్యాను నుద్ధరించి పుణ్యంబుగట్టుకొంటివి. సంయుక్తగుణసౌందర్యములఁగూర్చి వినియున్నందున నిదివఱకే ప్రేమంపుబీజము మొలకలెత్తియుండెఁగాని యాకోరిక యీానకును నాకన్నియమనంబు తెలియమిని, మారెండురాజ్యములకుఁ గల వైరమునను నించుక వాడఁబారియుండెను. ఇత్తరి మీావాక్యామృతధారలచే మఱల రేకెత్తుచున్నది. మీావంటి యుత్తములేకడకేగిన నేకొదువలు గలుగవుగాని యైనను నామనవిఁ జిత్తగించి నారాజ్యమందే వసింపుఁడు." అని నెయ్యముతొలుకాడఁబలికిన యజువాక్యములకు సంతుష్టమానసుఁడై బైరాగి మరలనిట్లనియె.

"రాజచంద్రా! నీరాజ్యమునం దుండుటకు నాకేయాటంకములు లేవు గాని నేనింకను గొన్ని కార్యములు నెరవేర్పవలసియున్నది. నే మరల మిమ్ముఁ గలసికొనియెదను. నీవుమాత్రము జాగరూకుఁడవై సకలసైన్యముల నాయత్తపఱుచుకొని యుంచుకొనుము. మహమ్మదీయుల యార్భాటములుచూచినను జయచంద్రుని మూర్ఖత్వముఁజూచినను నీయార్యావర్తమునకు ఘోరసంగ్రామంబు పొడమునను యూహ కలుగుచున్నది. ప్రస్తుతము నిలువయున్న సైన్యములనే నమ్ముకొనియుండక నీరాజ్యమందలి యౌవనవంతుల నందఱరప్పించి వారికి యుద్ధశిక్ష నేర్పించి యుంచుకొనుము. నేనెట్లును పోవకతప్పదుగాన నాకు సెలవొసంగు"మన నెట్టకేలకు నాలుగుదినము లుండిపోవుటకు సమ్మతించెను. సంయుక్తసమాచారము వెలిబుచ్చినపిమ్మట నారాజునకామెపైననురాగము కలిగినదిలేనిది తెలిసికొనుటకై నాలుగుదినములవఱకు నుండి యతనిరహస్యవృత్తములవలన నామెయందు బద్ధానురాగుఁడైనట్లు గ్రహించి యావల నతని యనుమతంబు గొని బైరాగి వెడలిపోయెను. అతఁడేగిన దాది జక్రవర్తియు జింతాకులుఁడై మనమునంతయు సంయుక్తమీఁద నిడుకొని యామె నెట్లుబెండ్లాడవలనుపడునా యనితలపోయుచుండెను. ఇట్లు దీర్ఘాలోచనపరుండై కాలమెట్లోగడపుచుండ నదివఱకే దేశములమీఁదఁ బోయియున్న చారులు కొంద ఱరుదెంచి కన్యాకుబ్జమున జరిగిన సమస్తవృత్తాంతముల నెఱుకపఱిచిరి. అత్తరి జయచంద్రుఁడు చేసినపనికిరోషమును సంయుక్తకావించినదానికి మహానందమును గలుగ మఱునాఁడు కొలువుకూటమున మంత్రులు, దండనాయకులు మొదలగు వారందఱు పరివేష్టించియుండ వేగులవారుతెచ్చిన సమాచారముల వెల్లడించి యేమిసేయుదమన గొందఱు దండనాయకులు జయచంద్రునిపై దాడివెడలుద మనిరి. అత్తరి వారినాపి ప్రధానియగు విజ్ఞానశీలుఁడులేచి "రాజా! పట్టుపట్టుమని తలఁచుకొన్నపుడెల్ల

యుద్ధమున కేగుచుంటిమా యందువలన సమితమగు నష్టమగును. గౌరవము చెడును. అనుకొన్నపుడంతయుఁ బోవుచుండుటవలన నొకవేళ నపజయముగలిగిననుఁ గలుగవచ్చును. సామదానభేదదండము లందు సామమున నెప్పటికిఁగార్యములు చక్కపఱచుకొననగును గాని ముందుగ దండమునకు దిగుటుచితముకాదు. మఱియు రణకారణమున ద్రవ్యనష్టమును వేలకొలఁది ప్రజానష్టమును గలుగును. మొన్న మొన్ననే మహమ్మదీయులపై నెత్తివచ్చితిరి. మరల నింతతొందరపడనేల? అదియుంగాక స్వదేశమందలిరాజు లొకరితోనొకరు పోరాడుకొనుచున్న పరదేశములవారికి మిక్కిలి యలనగును. కావున జయచంద్రుని సమాచారమేమో యింకనుఁ గనుగొందము. ఇంచుక యోపికపట్టియుండుఁడు. అని వచింపఁ జక్రవర్తి వేరొండు వలుక నోడి యూరకున్న సమయమున ప్రతీహారి యొకఁడేతెంచి కన్యాకుబ్జమునుండి రాయబారివచ్చి ద్వారమునఁ గాచుకొనియున్నాఁడని తెలుప నతని గొనిరమ్మనఁ బ్రతీహారి యట్లేయొనరించి వెడలిపోయెను. వచ్చినరాయబారి యుచితాసనం బంగీకరించి జయచంద్రుఁడంపిన లేఖ రాజుగారి కొసఁగెను. చక్రవర్తి తనదగ్గరనున్న వేరొకని కిచ్చిచదువుమన నాతఁ డిట్లుచదువ నారంభించెను.

"నూతనముగ డిల్లినింగొని చక్రవర్తియను పేరుపెట్టుకొన్న పృథివీరాజుగారికిఁ గన్యాకుబ్జ నగరాధీశుండగు జయచంద్రుఁడు తెలియపఱుచు విషయములు:—

నీవు రాజ్యమం దల్లరులుసాగించి జనసంచయముల హింసించుచున్నావని వినియు, దానికి నాకు నేమాత్రము సంబంధములేనందున నూరకుంటిని. ఇప్పుడు నాకడ కంపినలేఖవలన నీసమాచారమంతయుఁ బూర్తిగ వెల్లడియైనది. "నీవు నాతో మైత్రిఁబాటింపఁదలచితివా సం

యుక్తను నాకొసంగుము. లేకున్న రాక్షసవివాహమున నైనఁ గైకొనెద,"నని బింకములు వలికి వ్రాసియున్నావు. నీతో మైత్రి వాటింపకున్న నాకుఁ బ్రతుకుదెరువు లేదనిదలఁచితివా? చేతనైనపక్షమున వట్టిమాటలతోఁగాక క్రియఁగనుబఱచి నాకూఁతుఁగైకొనుము. అందులకు నే వెనుదీయువాఁడఁగాను. సర్వసిద్ధుఁడనైయున్నాను.

"జయచంద్రుఁడు."

అని చదువుచున్నంతసేపు నక్షౌహిణీపతులు రోషావేశులై చూచుచుఁ గూరుచుండిరి. చక్రవర్తియు నాగ్రహవ్యగ్రుఁడై కోపము బైటరాకుండ నాపుకొని "విజ్ఞానశీలా! ఇప్పుడు నీవేమనియెదవు?" అన "నిత్తరి నే మఱియొకవిధముగ విన్నవింతునే? దేవరచిత్తానుసారము చేయవచ్చును. ఇంతకు మనదేశమున కిడుములు ప్రాప్తింపనున్నవి కాఁబోలు? అందువలననే జయచంద్రున కిట్టిబుద్ధిపుట్టినది." అని వచించి విజ్ఞానశీలుఁ డూరకుండెను. అంత జక్రవర్తి లేచి యక్షౌహిణీపతుల నవలోకించి "మీమీసేనల సన్నాహపఱచుకొని యప్రమత్తులరై నే లేనికాలమున మనదుర్గమతిజాగ్రత్తతోఁ గాపాడుచుండుఁడు. ప్రస్తుతము నాతోఁగూడ నాతతాయి చనుదెంచు"నని మంత్రులవంక దిరిగి "మీరు యుద్ధమునకు వలసిన వస్తుసామగ్రుల ముందుఁబంపి దారియందచ్చటచ్చట నాగియుండవలయునని సేవకులకుఁ జెప్పిపంపుఁడు. నే లేనితరి మహమ్మదీయఖైదీలను, కరీమును జాగ్రత్తమై కాపాడుఁడు. అని తగినట్లు లందఱకాజ్ఞాపించి మూఁడుదినములకు యుద్ధప్రయాణ మేర్పఱచి వెడలిపోయెను.

పదునెనిమిదవ ప్రకరణము.

ఈశ్వరభట్టు కన్యాకుబ్జముఁజేరి కొన్నిదినములు జననిచ్చి మరలఁ దనపూర్వపు దుర్మార్గములఁజేయ నారంభించెను. ఎటులైన జయచంద్రునిచేత బృథివీరాజు నోడించి యతనిచే డిల్లీనందు కొంత భాగము బహుమానముగఁ బడయు నభిలాషఁ గలిగియుండెను. అట్టి యుద్దేశముతో ననారతము జక్రవర్తిపై లేనిపోనివార్తలఁ గల్పించి చెప్పుచు జయచంద్రునకుఁ గోపమెక్కించుచుండెను. వీనినడతగుఱించి సాక్ష్యమొసంగిన తక్కిన యిద్దఱు వీనితోఁగలసి పనిచేయుచుండిరి. ఈదుష్టత్రయము రాజుచే నమితముగఁ బ్రేమింపఁబడుచుండుటవలన రాజ్యమందలి గొప్పగొప్పయధికారులు సహితము వీరికి వెఱచుచుండిరి. అధికారులసంగతియే యటులుండ నిఁక తక్కినప్రజలగుఱించి వచింపనేటికి? దుష్టత్రయము గనూజియందంతటఁ దమప్రభావమే సాగుచుండ మెలంగుచున్నతఱి వారికడనున్న నొకముదుసలి కంచుకి మాత్రము వారలుకావించుపనుల కిష్టములేనివాఁడైయుండెను. లోపల నిష్టములేనివాఁడయ్యుఁ బైకిమాత్రముగుపడక శాంతమువహించియుండి యాదుష్టుల కెఱుకలేకుండ చేతనైనంతవట్టుకు వారికుట్రలకు విఘ్నములఁ గల్పించుచుండెను. బహిరంగముగను నీదుష్టులయెడల వైరమూని రాజు నన్యాయముగ నాశనముసేయుచున్నారని తలఁచి ప్రధానమంత్రియగు వినయశీలుఁడనేకపర్యాయములుజయచంద్రునకుమంచిమార్గముపదేశించుచు వచ్చెఁగాని చక్రవర్తియెడ రోషమువహించి యసూయాపరుఁడైయున్న నతనిమనసున నామాటలునాటవయ్యెను. దుష్టత్రయమును బ్రధానమంత్రి తమయెడఁజేయుచున్న ద్రోహమున కతని దొలఁగించుమని రాజుతో ననేకపర్యాయములు వచించిరిగాని తండ్రి

నాఁటినుండివచ్చుచున్న మంత్రిని దీసివేయుట కతఁడును సమ్మతింపఁడయ్యెను. అట్టియెడ వీరలుగావించుతంత్రము లెప్పటివప్పుడు వినయశీలునకుఁదెలియపఱిచి యతఁడు చెప్పునట్లు విఘ్నములు కల్పించుచు దుష్టత్రయమునకుమాత్ర మావంతయైనఁ దనపై సందేహము పొడమకుండునట్లు కంచుకి ప్రవర్తించుచుండెను. ఈసమయమునందే గ్రామాంతరమునకేగి కొద్దిదినములలో మఱలివచ్చెదనని చెప్పి కొన్నిమాసములు కడచినను రానట్టిదేవశర్మయను బ్రాహ్మణుఁ డేతెంచెను. ఈదేవశర్మయే సంయుక్త విద్యాగురువు. ఇతనియెడ నామె కమితముగు ప్రేమయు, భక్తియుగలదు. జయచంద్రుఁడుసహిత మితనివిద్యానైపుణ్యమునకు మెచ్చియందఱికన్న నెక్కుడుగ గౌరవించుచుండెను. ప్రధానమంత్రికి నితనికి నమితస్నేహము. దేవశర్మమున్ముందు వినయశీలుని మందిరమున కేగ నతఁడును గాంచినంతనే లేచివచ్చి యాలింగనమొనరించుకొని లోనికిఁ గొంపోయి కూరుచుండఁబెట్టుకొని యాదరణ పూర్వకముగ క్షేమసమాచారము లడగి తెలిసికొని కొంతతడవునకు "దేవశర్మా! నీవింతకాలమైనను రాకుండుటవలన నా కేమేమో యాలోచనలు పోయినవి. నిన్ను సురక్షితముగ మరలనాకగపఱచినందులకా దైవమున కనేకవందనములు. నీవేయేస్థలములందింత కాలమువఱకుఁ గ్రుమ్మరుచుంటి"వన "నావృత్తాంతమంతయునిపుడు చెప్పుటగాదు. సావకాశముగఁదెలిపెదను. నగరమందలివిశేషము లేమి? సంయుక్త బాగుగనున్నదా" యని దేవశర్మయడిగెను. అంత వినయశీలుఁడు "రాజ్యమందలి వృత్తాంతములన్నియుఁ బెద్దభారతముగనున్నవి. నీవుపోయిన తరువాత నీశ్వరభట్టనునతఁ డొకఁడు ఢిల్లీనుండివచ్చి మన జయచంద్రునిదయకుఁ బాత్రుఁడై దుష్టద్వయముతోఁ గలిసి యనేకదుష్కార్యములుఁ గావించుచున్నాఁడు. వారు ముగ్వురుఁగలసి చేయుచున్న కుతంత్రము లిట్టివని వచింపఁజాలను. నే నేమిచేయుదును. జయచంద్రుఁడును వారిస్తోత్రపాఠముల కుబ్బి

పోయి వారియిష్టానుసారమే నడచుకొనునుగాని నామాటఁ బాటింపఁడు. ఏమో పూర్వకాలపువాఁడను గావున నుంచినాఁడుగాని యనేకుల కిదివఱకే యుద్వాసనమైనది.” అని యీశ్వరభట్టునుగుఱించి వచించుటతోడనే దేవశర్మ యాశ్చర్యమగ్నుఁడై “ఆహా! ఆదుష్టుఁడు డిల్లీనంతయు నాశనముఁజేసి యిక్కడఁ జేరినాఁడా? ఇఁక జయచంద్రుఁడు బాగుపడుట దుర్లభమే. ఈ క్రూరుఁడిదివరకే ప్రాణహత్యఁగావించుకొనెనని తలఁచియుంటిని. ఇప్పుడీవార్తవలన నాకమితముగు చింతఁగలుగుచున్నది. ఆముప్వరను రాజున కెఱుక లేకుండ నెటులైనఁ గడముట్టింపవలయును. ఇప్పుడు వారు చేయుచున్నపనియే” మన “ఏమున్నది? ఆభట్టుగారు చక్రవర్తి లిఖించినదని యొకజాబునుఁ దెచ్చి జయచంద్రున కిచ్చినాఁడు. దానిఁజూచుకొని నృపుఁడు కోపోద్దీపితుఁడై వెంటనే చక్రవర్తికొడలు మండునట్టులొక లేఖ వ్రాసిపంపినాఁడు. అది చక్రవర్తికిఁ జేరియేయుండును. రేపోమాపో మననగరముపై దండెత్తిరాఁగలఁడు. అందుకొఱకే జయచంద్రుఁ డిప్పుడు రణమునకు వలయు సన్నాహంబులఁ జేయించుచున్నాఁడు.” అని వినయశీలుఁడు వక్కాణించెను. ఇక్కడవీరిరువు రిట్లు మాటలాడుకొనుచున్న సమయమున బయటద్వారము కడ నెవరోపిలుచుచున్నట్లు శబ్దమురా వినయశీలుఁడు చనితలుపుఁదీసి చూడఁ గంచుకివచ్చి నిలచియుండెను. అంత వారిద్దఱు మరల దలుపు పెట్టుకొని దేవశర్మదగ్గరకు వచ్చిరి. కంచుకి దేవశర్మను గాంచుటతోడనే యానందమునుంబొంది యతనికి నమస్కరించి నిలువ నావిప్రుఁడు నతనిక్షేమసమాచారమడిగి కూరుచుండ నియోగించెను. అత్తరి వినయశీలుఁడు దేవశర్మతో “ఈకంచుకిమనకు బరమాప్తుఁడు. ఇతఁడు పైకిదుష్టత్రయమునకు మిత్రుఁడుగనుండి వారిసమాచారములన్నియు నాకుఁదెల్పుచుండును.” అని కంచుకివంకఁదిరిగి “నేఁడేమైన నూతన వృత్తాంతములున్నవా? నీవెప్పుడును రాని యకాలమునవచ్చితి” వన

"మహాప్రభో! వారు చివరకు జయచంద్రునకే మోసముగావింపఁ బూనుకొన్నారు. ఇఁకేమున్నది? వారు సంయుక్తాదేవివివాహము జంపు ప్రయత్నములు చేయుచున్నారు." అని కంచుకి పలుక "ఎట్లు! సంయుక్తనే! నాప్రాణములుండ నా ముద్దుబిడ్డ కట్టియపాయము గాసిత్తునా? యని దేవశర్మ ధీరముగ వక్కాణించెను. అంత నాసంగతులేమో వివరముగ వచింపుమనఁ గంచుకి యిట్లనియె:—

"కడచిన రాత్రియందా దుష్టులుమువ్వురు నొకరహస్యంపుఁ జోటఁజేరి మూఁడుగంటలసేపు సంయుక్తను గడదేర్చుపన్నుగడలు పన్నుకొని యెవరిండ్లకు వారు వెడలిపోయిరి. ఈశ్వరభట్టు తెల్లవారినతోడనే నన్ను వెంటఁగొని సంయుక్తయుండు నంతఃపురమందిరములోనికిఁ జని ద్వారముకడ నన్నుంచి తాను లోపలికరిగెను. నేనును వానికిఁదెలియకుండ వెంటనేపోయి తలుపుచాటున దాగుకొనియుంటిని. సంయుక్త యొంటరిగ నొకసోఫాపైఁ గూరుచుండియుండెను. భట్టుగారామెను గాంచినంతనే సాగిలఁబడి నమస్కారము చేసెను. అత్తరి సంయుక్త "భట్టుగారూ! ఏ మిట్లుదయచేసితిరి? చక్రవర్తిగారివద్దనుండి మాతండ్రికడకు మఱేమైనజాబులు వచ్చినవా? యని నిష్ఠురముగఁబల్క నితఁడు ముసిముసినవ్వులునవ్వుచు "అమ్మా! మీనాయనగారికి నే నగుపఱచినలేఖను నీవును నిజమని నమ్మితివా? నాపై నెటులైన నమ్మకము కలుగుటకుగా నట్టి లేఖలఁగల్పించి చూపించితిగాని వేరొండుకాదు. ఇప్పుడు నీకడ ప్రమాణపూర్వకముగ నిక్కమగుదాని వచించెద వినుము. చక్రవర్తికిని నాకును బరమమైత్రి. అతఁ డహోరాత్రంబులు నిన్నుగూర్చితలఁచుకొనుచుఁ దుదకు నన్నుఁ బిలచి "మిత్రమా! నాకెటులైన సంయుక్తనుగూర్చి నావంతఁ దీర్పఁజాలవా? నీవంటి నెయ్యుఁడు నాకు మఱియొకండు దొరకఁడుగాన నీతో వచించుచున్నాను. అతిస్వ

వీక్షింపకున్న నాయసువుల భరింపనోప” నని దీనత్వము తోఁపఁబలికిన నతనిమాటలకు నాహృదయము కఱఁగి ‘ఛీ ! మిత్రునభీష్టంబు దీర్పఁ జాలని నాజన్మమేల’ నని కొంతతడవు విచారించి యతనితోఁ ‘గానిమ్ము నీకోరిక నెరవేర్చెదను. ఇటులే యింకను గొన్ని దినములవఱకు నోపిక బట్టియుండుము. నే గన్యాకుబ్జనగరమున కేగి సంయుక్తం గొనితెచ్చెదను. జయచంద్రుని దగ్గరనుండి యొకవేళ నీ కేవిధమైన యుత్తరములు వచ్చినను వాని లెక్కగొనకుము.’ అని యతని సమ్మతిపఱిచి యీ పురముం జేరితిని. మొదలే చక్రవర్తిపై వైరమూనియున్న నీతండ్రికి దగినట్లు మాట్లాడనిచో నాకీరాజ్యమున నిలువ వీలుకలుగదనియు, నిలువకున్న నీతో నామిత్రుసమాచారముఁ దెల్పుటకు వలనుకలుగదనియు, నీతో మాటలాడి నిన్నుఁగొనిపోవకున్న నామిత్రునికోరిక నెర వేరదన్న భయమునను నీతండ్రికిఁ గల్పితలేఖనొకదానిఁగనుబఱిచి మఱికొన్ని యిచ్చకములు పలికి యితనిదయకుఁ బాత్రుఁడనైతిని. నీతండ్రి చేయుచున్న సన్నాహములఁ జూచి చక్రవర్తిదాడి వెడలివచ్చుననితలఁచెదవేమో? జయచంద్రుఁడు వ్రాసిపంపినయుత్తర మప్పుడే యేపెంటలోనో కలిసిపోయియుండును. చక్రవర్తి మనయిద్దఱిరాకకొఱకై యెదురుచూచుచుండును. ఇప్పుడునీతో నున్న సంగతులన్ని యువచించితి. ఇఁకనీ యిష్టానుసారమేమిచేయుమన్న నట్లుచేయుటకు సిద్ధముగనున్నా” నని నమ్మకము కలుగునట్లు తియ్యనిమాటలతోఁ జెప్పెను. “ఆకన్నియ తానదివఱకు బూనియున్న కోపమును విడిచి మెల్లన”నయ్యా! మీరిదివఱకుఁ గావించుచున్న కార్యములవలన నే నన్యముగ భావించితి. కాని యిప్పుడు మీరు చెప్పినదంతయు నిక్కమేకదా? యని యడిగెను భట్టుగా రామె దారిలోనికి వచ్చుచుండుటఁగనిపెట్టి మరల “ తల్లీ! చక్రవర్తినివి కాఁబోవుచున్నావు కాన నీవు కేవలము ధీరమాతవగుదువు. నీయెడ ద్రోహముఁ దలపెట్టినవాఁ డెట్టిఘోర నరకమైన

నొందుఁగాక. నామిత్రునివాంఛ దీర్పనెంచి నే నెన్ని యోటక్కూలఁ బన్నితిని. అమ్మా! అట్లుచేయనియెడల నా కిచటఁబ్రవేశముఁగలుగనే కలుగదు." అని నుడివి యొకకమ్మ నామెకొసంగి 'అమ్మా! దీనిని మీరు నానెయ్యునకు వ్రాసిపంపితిరఁట. దీని నానవాలుగఁ గనుబఱచి మిమ్ముఁ దోడ్కొనిరమ్మని పంపినాఁ'డనెను. ఆలేఖనుఁజూచుకొని సంయుక్త సంతోషభరితయై భట్టుగారితో 'అయ్యా! మీయిష్టాను సారము నడచుకొన సిద్ధముగ నున్నా'నని పలికెను. కాముకజనంబు లకు యుక్తాయుక్తవివేచనము శూన్యంబుగదా! అంత మరలనతఁడు 'అమ్మా! మనమీరాత్రియే బయలుదేరిపోవలయును. సుమారు పండ్రెండుగంటలకు వెడలుదము. అప్పటికి సంసిద్ధురాలవై యుండు' మని చెప్పి తానువెన్కకు మరలెను. అతఁడు వచ్చువేళకు నేను ముందుఁ జని యతఁ డుంచిపోయిన ద్వారముకడనుండ నన్నుఁ గలిసికొని రహస్యముగ రాత్రికొకబండిని గుదుర్చుకొని రమ్మనిచెప్పి తనదారిం బోయెను. ఇందుకు మీ రేమిప్రతీకారముచెప్పెదరో యని వెంటనే యిక్కడికివచ్చితి,' నని యావృత్తాంత మెరుకపఱుప "ఔరా! కుట్రముండవాఁ డెంతపనిఁజేయఁబూనినాఁ డని యాశ్చర్యపడుచు దేవశర్మ బండిని గుదుర్చుకొనివచ్చితి నని భట్టుతోఁ జెప్పుమని కంచు కింబంపి "వినయశీలా! మననగరమం దెట్టి రాజద్రోహులున్నారో చూచితివా? కానిమ్ము. ఆదుష్టులు ముగ్వురువచ్చుట తటస్థించినచో నేఁడే కడముట్టించెద"నని మఱికొన్ని రహస్యము లతనిచెవిలోఁజెప్పి తాను వెడలిపోయెను.

పందొమ్మిదవ ప్రకరణము.

దేవశర్మ వచించినప్రకారము కంచుకిపోయి భట్టుగారినిఁబండిని గుదుర్చుకొని రాత్రిపదిగంటలైనపిదప మనమందిరమువద్దకుఁగొనిరమ్మనివచ్చితి నన నతనిబంపి దనకుఁ జేదోడుగనున్న మిత్రులనిరువురను బిలిపించి జరిగినసంగతులన్నియు వారితోఁజెప్పి చేయవలసిన కార్యమునకై వారిద్దఱికి మాఱువేషముల వేయించి ప్రొద్దుగ్రుంకిన పిదప బదిగంటలైన దాది బండికొఱకై కనుపెట్టుకొనియుండెను. అత్తరి సూతుఁడొకఁడు బండిఁదోలుకొనివచ్చి బయటనున్నాఁడని సేవకులెఱిఁగింప నాయిద్దఱు మిత్రులతోవచ్చియెక్కి బండి సంయుక్తయుండు ప్రాసాదమువైపునకు నడిపించి యక్కడ నాపి సూతునియొద్దకేగి వానిచేత కొంతధనమిచ్చి "ఓరీ! నీ కింకను గావలసినంత ధనమిచ్చెదను. నేఁడు నీబండియందు జరుగు సమాచారము లెక్కడను దెలియనీయవలదు. అటు లొనర్చితివా నీప్రాణములు నీవికా" వన "మహాప్రభో! ఏలినవారియాజ్ఞకు భిన్నముగ నడుచుకొందునా?" యని సమ్మతించెను. పండ్రెండుగంటలగుఁడు సంయుక్త మేడమీఁదనుండి బండి వచ్చి సిద్ధముగనుండుటఁ దెలిసికొని తానదివఱకేర్పఱచుకొని యుంచుకొన్న రహస్యమార్గమునఁ జనుదెంచి బండికడ నిలచెను. నిలచినవెంటనే భట్టుగారుచూచి నమస్కరించి లోపల నొకప్రక్క నాసీనంజేసి మిత్రులనుసూతునిస్థలమునగూరుచుండఁజేసి దీపములఁదీయించి తానును లోపలనొకవైపునఁ గూరుచుండి బండిని మధురాపురముదారి బోనియ్య నాజ్ఞాపించెను. మైలుదూర మరిఁగినపిదపఁ దానొకవస్తువు నింటికడ మఱచి వచ్చితి ననియు నొకనిమిషములో దానిఁ జేకొనివచ్చెద ననియు సంయుక్తకుఁజెప్పి బండినిమెల్లగఁ బోనిచ్చుచుండుమని సూతున కాజ్ఞా

వించి తాను వెనుకకుమరలిపోయెను. భట్టుగారుచనినపిమ్మట మఱియొకమైలువఱకుఁ బండినిబోనిచ్చి యప్పటికి నతఁడు తిరిగి రానందునఁ దన ప్రక్కనున్న వారి " ఏమి! మీయజమానుఁడుగారింకనురాలే " దని సూతుఁడడుగ నాయిద్దఱు రహస్యముగ "భట్టుగారిఁక రారు.నీవు త్వరితముగ బండినింకొకమైలు దూరము పోనిమ్ము. మన మీ బండియందలి కన్నియను జంపవలయు"నన సూతుండు తనలో "ఔరా! దుర్మార్గులారా! మీయూహ" యని భట్టుగారు తప్పించుకొని పోయినందులకు లోలోపల నొచ్చుకొనుచు ముందేగిన నేమగునో యనుతలఁపున దానక్కడ దిగవలయునని వారితోఁజెప్పి దిగి యించుక వెనుకకేగి బట్టమొదలగునవి బాగుగసవరించుకొని బండి వెనుకనుండి వచ్చియొక ప్రక్కనున్న వాని తల నెగరగొట్టెను. రెండనవాఁడు క్రిందికి దుమికి యెదురింప నచ్చుచుండ వానిని బట్టుకొని నేలంబడదన్ని గొంతుకపైఁ గాలువైచి " దుష్టాత్ములారా ! రాకుమారిక నన్యాయముగఁ జంపనెంచితిరా ! పరుల కెగ్గుసేయఁ దలపెట్టితిరి గావున నాప్రాప్తిమీకే చేకూరినది చావుఁ" డని వానినిగూడఁ గడదేర్చెను. ఇంతలో నీకల్లోలమంతయుం గాంచి బండిదిగివచ్చి సంయుక్త విస్మయాక్రాంతయై నిలచియుండెను. సూతుఁ డామె సమీపింపఁబోవఁ గోపమూని "దురాత్మా! ఇట్లేలఁజేసితివిరా" యని తనదగ్గఱనున్న యొకచిన్న కత్తితో నతని పొడువం బోవగా "ఆ! ఆగుము. నే దేవశర్మ" నని నిజకంఠస్వరమునఁ బలికెను. దేవశర్మ యనుటతోడనే కత్తినాపి "యీ చీకటిలో నేనెట్లు గుర్తిఁడఁగలను. దేవశర్మయైన నాకింతద్రోహముఁ గలుగఁజేయఁ"దని యాకన్నియపలుక బండిముందరిదీపమును వెలిఁగించి చూడుమని సూతుఁడు వక్కాణించెను. సంయుక్త దీపము వెలుఁగున సూతవేషముతోనున్న తనగురువును దేవశర్మం గుర్తించి తనచేతనున్న ఖడ్గము నవతలఁబారవైచి యతనిపాదములపైఁబడి "మహాత్మా!

ఎన్ని దినంబులకు భవదీయదర్శన మబ్బెను! మీచరిత్రముంజూడ నా కాశ్చర్యముఁ గలుగుచున్నది. మీకీబండివానివేషమేల చేకూరె? వీరల నేటికిట్లువధించితి” రన “బిడ్డా! నేనీదినముననే యీగ్రామమున కేతెంచితిని. వచ్చినవెంటనే యీశ్వరభట్టు మొదలగువారు చేయుచున్న కుట్రలు తెలిసినవి. వీరలు నిన్ను వధింపఁ గొంపోవుచున్నారనువార్తవిని సూతుని వేషమూని వచ్చితిని. అమ్మా! దుర్మార్గులు వచించు కల్లమాటలకులోనై యంతఃపురమువిడిచి యొంటరిగ నిట్లు రానగునా? నేను సమయమునకు వచ్చియుండ నిన్ను రక్షింపఁగలిగితి. లేకున్న నీవేమగుదు”వన నాశ్చర్యకలితయై యాదుష్టుఁడగు భట్టు పన్నినపన్నుగడకు విస్మయమందుచు “మహాత్మా! చక్రవర్తిపైఁగల మోహమున నిట్టియకార్యముం జేయఁ బొల్పడితిని. అదియుంగాక చక్రవర్తికడకు మీరు కొనిపోయిన లేఖను దెచ్చి యీశ్వరభట్టు నాకుఁగనుబఱచుటవలన రూఢియనినమ్మి మోసపోయితిని” మీరు కైకొనిపోయిన లేఖ యాదురాత్మునికడ కెట్లువచ్చినది?అని సంయుక్త యడుగ దానిసమాచారము సావకాశముగ దెలిపెదఁగాని నీ విఁక ముందెన్నటికి నిట్లురాకుము. ఈశ్వరభట్టు నీతో మాటలాడిన సంగతులన్నియు వానికడనుండు కంచుకివలన వినియున్నాను. వాఁడు చెప్పినదంతయు వట్టి యబద్ధము. చక్రవర్తి రేపోమాపో యుద్ధమునకు రానున్నాఁడట. ఘోరసంగ్రామంబు జరుగనున్నది. పురుషవేషమూని నీవాచక్రవర్తిసేనకు దోడ్పడుచు సంగరమున నీమనోకాంతుం మెచ్చుకొనుకార్యమేదైన సలిపితివా యతఁడు నిన్ను డిల్లీకిఁ గొనిపోవును. నేను మరల డిల్లీ కేతెంచి నీ మనోవాంఛితంబు నెరవేర్చెదను. నేనువచ్చువఱకు నీవృత్తాంతమెవరికిఁ దెలియపఱుపవలదు” అని బోధించి మరల నాబండియందే కూరుచుండఁబెట్టుకొని యామె నంతఃపురముఁ జేర్చి తాను వెడలిపోయెను.

ఇరువదియవ ప్రకరణము.

చక్రవర్తికి లేఖనంపినదినము మొదలు కనూజియందు జయచంద్రుఁడు దుర్గము బాగుచేయించుట మొదలయిన రణసన్నాహములగు కార్యములలో మగ్నుఁడైయుండెను. ఈనగరమందలి కోట చదరమై పంద్రెండుమైళ్లచుట్టుకొలతఁ గలిగియున్నది. ఇది పెద్దపెద్ద నల్లరాళ్లచే నిర్మింపఁబడి నేలమట్టమున నాలుగుగజముల వెడల్పును నగ్రమున గజమున్నరవెడల్పునుఁ గలిగి పరిఘాసమావృతంబగు పదునొకండు గజముల యెత్తుఁగల ప్రాకారపుగోడచేఁ గూడుకొనియుండెను. గోడలచుట్టు పదిగజములయెత్తున తుపాకులు ఫిరంగీలు మొదలగునవి ప్రయోగించుట కనువగు గవాక్షము లడుగడుగునకుఁ బెట్టఁబడియుండెను. ఈగోడలతోఁ గలిసియే లోపలిభాగమున మూఁడుగజముల మందమును తొమ్మిదిగజముల యెత్తునుగల మఱియొకరాతిగోడ కలదు. యుద్ధసమయమందు భటులీచిన్నగోడ పైభాగమున బారులుదీరి నిలచి పెద్దగోడ గవాక్షములగుండ శత్రుసేనలపై నగ్నివర్షముఁ గురిపించుచుందురు. మఱియు నఱపర్లాంగున కొకపెద్దబురుజుఁగలదు. బురుజులన్నియు బలిష్ఠములై యెల్లవేళల ఫిరంగులతోఁ గూడియుండును. ఈకోటలోపల నుచితస్థలంబుల నెనిమిది చిన్నకోటలుఁ గలవు. జయచంద్రుని సైన్యమంతయు చిన్నకోటలందనారతము నివసించుచుండును. కోటయొక్క బహిర్ద్వారము బలవత్తరమై నాల్గుబురుజుల మధ్యనుండెను. ఈద్వారమారు గజముల వెడల్పును పంద్రెండుగజముల యెత్తునుఁ గలిగియుండెను. దీని తలుపులు స్వచ్ఛమగు నినుముతో నిర్మింపఁబడి మూరెడున్నర మందముగలిగి ముందఱిభాగమున దీక్ష్ణములగు గుబ్బలచే దాపటములైయుండెను. ఈద్వారముపైవిశాలమగు నొకరాతికట్టడముఁ గలదు. అందుఁ

ప్రవీణులగు ఫిరంగులఁగాల్చువారు జాగరూకులై యెల్లపుడుఁ గాచుకొని యుందురు. దీనితరువాత నిట్టివే మఱిరెండు ద్వారములుకలవు. ఇట్టిశాత్రవుల కభేద్యమగు నాదుర్గమునందంతట సైన్యముల నిలిపి కోటగోడల యగ్రములందుఁగూడ నక్కడక్కడ ఫిరంగులఁ బెట్టించి జయచంద్రుఁడు జాగ్రత్తమైయుండెను. ఇతనివద్ద నెల్లవేళలందు నొకలక్షయిరువది వేల కుంజరములును, నూటయేబది వేల తురంగములును, రెండులక్షల భటులును గలిగిన సేన సిద్ధముగనుండును. ఈమూఁడువిధముల సేన నుగ్రవర్మ యనువాఁడు సకలాక్షౌహిణీపతి యను పేరఁ బాలించుచుండును. వీనికిఁదోడుగ గహరకంఠరవప్రచండు లనువారు పనిసేయుచుందురు. వీరి క్రిందనొక్కొక్కవిధమగు సైన్యమునకు నాధిపత్యము వహించినవారు మువ్వురుఁగలరు. అందు సుబాహువుఁ డనువాఁడు కుంజరయూథమునకును, ప్రమాథుఁడనువాఁ డశ్వసైన్యమునకును, సిఘ్రాతుం డనువాఁడు పదాతిసేనకు నధిపతులై యుండిరి. వీరిక్రిందను నిట్టే యధికారక్రమమున ననేకనాయకులుకలరు. కడగొట్టువానియధికారమున నూర్గురుభటు లుందురు. జయచంద్రుఁడింతసేనతో దుర్గమును రక్షించుకొనుచు నొకవేళఁ జక్రవర్తిసైన్య మేతెంచుచున్నయెడల దారిలోనే యడ్డగించుటకుఁగాను ప్రచండునియాధీనమున నాలు వేలకుంజరములు, పదివేలతురంగములు, నిరువదివేలభటులుగలవాహినిం బంపెను. సేనంతయునగరమువదలి యిరువదిమైళ్ళువచ్చినపిదప దమకెదురుగఁ దూర్పుదిక్కున మన్నుమిన్నేకమగునట్లులేచి వెనుక నేమియుఁ గానరాకుండఁ జేయుచు హోరుమను రావములతోఁ బ్రచండతరముగఁ దమవైపున కేతెంచుచున్న గాలిదుమారమును బ్రచండుఁ డవలోకించి గొప్పగాలివాన వచ్చుచున్న దను భ్రమను సేన నక్కడనే యాపెను. అత్తరి ముందుబోయియున్న వేగులవా రరుదెంచి యావచ్చునది చక్రవర్తిసైన్యమని ప్రచండున కెఱుకపఱిచిరి. తత్క్షణ మతఁడాస్థలము విశాలమగు బహిరంగప్రదేశ మగుటవలన శాత్రవులు చుట్టుముట్టిన నపాయకరమగునని తలపోసి సేనను వలయాకారముగ దీర్చి పద్మవ్యూహముఁ బన్ని జాగరూకుఁడై తాను నడిమిభాగమున నుండెను. ఇక్కడివార్తనంతయు నిగూఢముగ కొం

డటు చక్రవర్తి వేగులవారు వచ్చి తెలిసికొనిపోయి తమవారల కెఱు కపఱిచిరి. చక్రవర్తిసైన్యము నూరువేల గజములను, నూటయిరు వదివేల గుఱ్ఱములను, నూటడెబ్బదివేల భటులనుఁ గూడియుండెను. యమునానదీప్రశస్తరణమునఁ గుతుబుద్దీను నోడించి ఢిల్లీయందనేక బిరు దులఁగాంచి ప్రఖ్యాతివహించిన యాతతాయియను యుప సకలాక్షౌహి ణీనాయకుఁడు సార్వభౌమ సేననంతయు నతిప్రావీణ్యమొప్ప నడిపిం చుకొని వచ్చుచుండెను. జయచంద్రు సేనయందువలెనే చక్రవర్తి సైన్యమునందును నూరురుభటుల కధికారులగు నాయకులుఁగలరు. వీరియనంతరమును నుద్యోగులు గలరు. అందుఁ గడపటియుద్యోగివశ మున నిరువదిమంది భటులుమాత్రమే యుందురు. వీరందఱు క్రమ మగు రణశిక్ష నలవర్చుకొనియుండిరి. ఆతతాయి ప్రచండునివార్త విన్నవెంటనే తనసైన్యమునఁ గొంతభాగము ప్రకంపనుఁడను సేనానికిచ్చి శత్రువుల కెఱుకరాకుండ దూరమునుండి చని వరాహవ్యూహమున బడమటిదిశను దాకఁబంపెను. సూకరములవలెఁ జిందరవందరగఁ బరు వెత్తుచుఁ శత్రువుల సమీపించిన వెంటనే యొక్కపర్యాయముగ నందఱు గుమిగూడుటే వరాహవ్యూహము. తరువాత గంకటుఁడను వానివశమున మఱికొంత సేనను సూచీవ్యూహమున నుత్తరము ముట్ట డింప నంపెను. ఆదియందు సన్నముగనుండి వెనుకకుఁబోనుపోను విశాలముగునదియే సూచీవ్యూహము. తాము చనుచున్న మార్గమున కెదురుగ ఫిరంగులు మొదలగునవి పెట్టించియుండుట తెలిసికొని మహా మాయుఁడనువానికిఁ గొంతసేననిచ్చి సర్పవ్యూహమున వాని శాసనముఁ గావింప బంపెను. వైరుల కెఱుకలేకుండ నేలపైఁ బడుండి ప్రాకిపోయి పట్టుకొనుటే సర్పవ్యూహమున ముట్టడించు టందురు. ఇట్లు మూఁడు ప్రక్కలకు మువ్వుర నంపి మిగిలిన సేనను వజ్రవ్యూహముక్రింద మార్చి నడిపించుకొనుచు నాత తాయి దక్షిణముదాకఁ జనుచుండెను. వీరందఱకు వెనుక నిపుణులగు సేనానులు కొందఱు సేనతోఁ జుట్టుగొలువఁ జక్రవర్తి పోవుచుండెను. అత్తఱిఁ బ్రభాతకాలమున నాలుగంటలైనను సేనలపాదఘట్టనముల

వలన లేచిన ధూళియంతయు నుదయింపఁ బోవు సూర్యునిగప్పి ప్రొద్దుదెలియకుండఁ జేయుచుండెను. అక్షౌహిణుయున నాతతాయి వలన నేర్పఱుపఁబడిన నాలుగుసేనలు నొక్కపర్యాయముగఁ బ్రచండు నిఁదాఁకి బందూకుల బ్రయోగించిరి. శత్రువులు కంటఁబడినవెంటనే ప్రచండుని సేనాభటులును సాహసధైర్యములతోఁ బోరాడఁదొడఁగిరి. ఒండొరుల బందూకు ప్రయోగములవలన ననేకులు భటులు కూలుచుండిరి. ప్రచండునిసేన సార్వభౌమవాహినికంటె నెన్నియోరెట్లు చిన్నదయ్యుఁ జక్రవర్తి మొదలగువారు సహితము మెచ్చుకొనునట్లు రణముచేయుచుండెను. ఈగతి పగలు పదిగంటలపర్యంతము నందీక పెనఁగుచుండెఁగాని యెంతటికిఁ దఱుగక తండతండములుగనున్న వైరి సేనలఁగాంచి దిగులుపడ నారంభించెను. ఎంతైనను ప్రచండుఁడు ధైర్యమువదలక ప్రోత్సాహంపు వచనములఁ దనవారిఁ బురికొల్పుచునే యుండెను. పదునొకండు గంటలగునప్పటికి యుద్ధము మఱింత ఘోరమయ్యెను. తుపాకులు ఫిరంగులు మొదలగువానివల్ల లేచు పొగయును నేలయందలి ధూళియును లేచి యేకమై గగనతలముఁగప్పి చీకట్లు గ్రమ్మఁజేయుచుండెను. అట్టియల్లకల్లోలమగు సమయమున మహామాయుండతి చాతుర్యముతోఁ దనసేనను దూర్పుప్రక్కనున్న ఫిరంగులవద్దకుఁజేర్చి వానినన్నిటిఁ బ్రచండుని సేనవైపునకే ద్రిప్పించి కాల్పింప నారంభించెను. ఇటు లీప్రక్కన వైరులకు పందుకొరకుటచేఁ బ్రచండుఁ డించుకవిచార మందసాగెను. అయినను జాపృసకుగాలివక తనవారిఁ బురికొల్పుచునే యుండెను. అత్తరి బడమటిదిశనున్న సేనను నాశముఁజేసి ప్రకంపనుఁడు వ్యూహములోపలఁ బ్రవేశించి ప్రచండుని మాఱ్కొనెను. వారిరువురు బందూకులమాని ఖడ్గములఁబూని ద్వంద్వయుద్ధమునఁ బోరాడఁగడఁగిరి. అట్టిస్థితిలో నెక్కడనుండియో తుపాకిగుండొకటివచ్చి ప్రకంపను నెడమభుజమునకుఁ దగిలెను. ఈ

సార్థ నాతతాయి విన్నవెంటనే యతని రణమునుండి తొలగింప నాజ్ఞాపించెఁగాని యతఁడెవ్వరిమాటలను బాటింపక నాప్రాణమున్నంత వఱకు నే రణమొనర్చుట మాననని పెచ్చుపెరిగినరోషమున మఱి యొక దీర్ఘమగు ఖడ్గముఁబూని ప్రచండుని శిరోవేష్టనము నేలఁబడఁ గొట్టెను. వేష్టనహీనుఁడైనను ప్రాణముల కాశింపక తెగించి ప్రచం డుఁడు వెన్నిక నిలచి రణమొనరించుచు వేఱొక బారుకత్తిఁగొని ప్రకంపను బొడువఁబో దాని దప్పించుకొని యతని నొక్కపోటుఁ బొడిచి ప్రకంపనుఁడు విజృంభించెను. ఆదెబ్బతో జయచంద్రుని సేనా పతి నేలకొరిగి పడిపోవ నదివఱకే నాశనమైయున్న తక్కినసైనికు లును బలాయితులు కాసాగిరి. మఱికొంద అంత్యసాహసముంజూపి మడియుచుండిరి. రణరంగమంతయు బీనుంగుపెంటలతో నిండు కొనిపోయి భీభత్సము గొల్పుచుండెను. రక్తము కాలువలు గట్టి పాఱుచుండెను. అంత రణరంగమంతయుఁ జరమాశాఫలకంబునఁ బ్రతిఫలించుచున్నదో యన శోణమరీచులు రాజిల్లుసూర్యుఁ డస్తమిం పఁబోవుచుండెను. ప్రచండుని సేనయందలి తుపాకులు ఫిరంగు లాది గాఁగల యుద్ధసామగ్రు లన్నియుఁ జక్రవర్తిపాలఁబడెను. సంగరము పూర్తియైనపిదపఁ జక్రవర్తియానతి నాతతాయి గాఢమగుగాయముచే వేదనపడుచున్న ప్రకంపను దగువారలచే నచటికిఁ గొంతదూరమున నున్న రాజవైద్యశాల కనిచి తక్కుంగలభటుల నెల్లర మఱియొక వైద్యశాలకుఁజేర్పఁ బరిచారకుల కాజ్ఞాపించెను. వారునుజావక బ్రది కియున్న ప్రతిక్షతదేహుని వైద్యశాలకుఁ జేర్చుచుండిరి. అక్షతదేహు లగు తక్కినసైనికులెల్లరు రణరంగమునకు దూరముగఁబోయి యటనున్న నొకచిన్న ప్రవాహమునందు దేహముల శుభ్రపఱుచు కొని యుచితాహారంబుల భుజించి కన్యాకుబ్జ నగరపుముట్టడినిగూర్చి మాటలాడుకొనుచుఁ బ్రొద్దుగడపుచుండిరి.

ఇరువదియొకటవ ప్రకరణము.

అటు లార్యావర్తమునకంతయు నాధారభూతములైన డిల్లీ కన్యాకుబ్జరాజ్యములు రెండును బరస్పరవైరంబులు పెచ్చుపెరుగఁ బోరాడుకొనుచున్న తరుణమందే కుతుబుద్దీనుచేఁ బ్రేరితులగు మ్లేచ్ఛులు దేశమందుఁ జేయఁగడగిన క్రౌర్యములుఁగణింప నలవికాకుండెను. ఆనాఁడట్లు చక్రవర్తిచే నోటువడి కుతుబుద్దీన్ పరువెత్తిపోయి యమునాతీరమున నొకదట్టమగు పొదరింటిలోపల బగలంతయుఁ బరులకంటఁ బడకుండ దాగుకొని చీఁకటిపడినపిదప బయటకేతెంచి నది నీది యావలిగట్టుఁజేరి తనకు సంభవించిన దురవస్థంగూర్చి తలఁచుకొనుచు రోషావేశుఁడై యార్యావర్తము ధ్వంసముఁజేయఁ బట్టుపట్టి మఱియొక ప్రదేశమం దిటుఁ లేని గూఢముగనున్న మహమ్మదీయుల దండును జేరెను. అచటనున్న వారందఱితఁ డిట్లొంటరిగఁ జనుదెంచుట కేమి హేతువో యని సంభ్రమ మందసాగిరి. కొందఱు మనము జాగరూకతతోఁ బ్రివర్తించుచున్నామో లేదో యని పరీక్షింప నిట్లాకస్మికముగ వచ్చియుండునని యూహించిరి. అనంతరము కొన్నిదినంబు లేగినపిదప యమునాతీరమున జరిగిన సంగతులన్నియు గుతుబుద్దీన్ వారికెఱిఁగించెను. తోడనే వార లందఱు నుగ్రులై హుంకారములొనర్చుచు లేచి యిప్పుడే డిల్లీపైఁ దండెత్తుదమని వక్కాణించిరి. అయిన వారిని శాంతపఱిచి కుతుబుద్దీను మెల్లన నిట్లనియె.

“సోదరులారా! ఆర్యావర్తరాజులపై నొంటిగ దండెత్తఁదగు తరుణ మింకనురాలేదు. మీకేకాదు. మనసేననోడించినవాఁడు చక్రవర్తి యని తెలిసిననాఁటినుండి డిల్లీ నెప్పుడు బ్రింగుదునా యను నభిలాష నాకును మిక్కుటమై యున్నది. వీరింకను వారిలోవారు పోరాడుకొని

నాశనము కావలయును. పదునొకండవ శతాబ్దారంభమున మనసుల్తాన్ మహమ్మద్ గజినీ యీదేశముపై దండెత్తివచ్చి జయించి లెక్కలేని ధనమును గొంపోయి లాహోరున స్వతంత్రరాజ్యమేర్పఱిచిన నాంటి నుండియు నీరాజులెల్ల రదివఱ కున్నటులే యుండక శాస్త్రా నుకూలమగు రణశిక్ష సైనికులకు నేర్పించి సైన్యముల బాగుపఱుచు కొనియున్నారు. ఇప్పు డీ రాజుల సేనలకు రెండింతలు మనపక్షమున నున్నను మనము వారి జయింపఁజాలము. ఏడెనిమిదేండ్లక్రిందట జయ చంద్ర జీవనసింహులు లాహోరునుండి మనసుల్తాన్ గారిని వెడలఁగొట్టుటకుఁ బ్రయత్నముసేసి మరల నేకారణముననో మానివేసిరి. ఇప్పు డా రెండురాజ్యములు పరస్పర వైరము గలిగియున్నవి. మఱియు మన కరీమునకు బదులుగ భట్టుగా రేమనకొఱకనేకప్రయత్నములు జేయుచు నాకు వార్త లంపుచున్నారు. అందువలననే మనకిక్కడనింత మాత్రము నిలుచుట కవకాశముదొరకినది. మొన్న చారులు కొందఱరుదెంచి క నూజియందు జయచంద్రుని పుత్రికకు వివాహము జరుగుచున్నదనియుఁ జక్రవర్తి కవమానముగలుగఁజేసినందున నతఁ డాపురముపైనెత్తిరా నున్నాఁడనియు వచించిపోయిరి. మరల నేసమాచారముఁదెలియలేదు. ఇత్తరి మీర లిదివఱకువలెగాక పెద్దపెద్దగుంపులుగఁగూడి బయలు దేరిపోయి గ్రామముల ధ్వంసముగావింపవలయును. మఱియు నీయా ర్యావర్తము సమస్తశాస్త్రములకుఁ బ్రసిద్ధికెక్కినదనివిందుము. పూ ర్వకాలమున నన్యఖండములవారు సహితమిచ్చటికేతెంచి విద్యలనేర్చు కొని పోవుచుండువారఁట. ఈకాలమున నిదేశప్రజనులు వానివిలువను దెలిసికొననేరక రెండువందల సంవత్సరములాదిగఁ జదువుట మానివే సిరి. గ్రంథములుమాత్రము మిగిలియున్నవి. ఒకవేళముందు వానినెవ రైన జదివినచో మరల మననెత్తికెక్కుదురు. కావున మీకంటఁబడిన ప్రతి పుస్తకభాండాగారమును దగులఁబెట్టి యార్యావర్తమును శాస్త్ర

విహీనముగఁ గావింపుఁడు. రెండు శతాబ్దములనుండి వాసిమొగముఁ జూడకుండ నున్నారుగాన నీతరుణమున నే ధ్వంసముఁ జేయుటమంచిది. ఇఁక మీకుఁజెప్పవలసిన దేమున్నది? మీయిష్టమువచ్చినట్లు రాత్రియనక పగలనక కృషి చేసి జనుల నందఱఁ జిత్రహింసఁ బెట్టుఁడు. ముఖ్యముగ శాస్త్రములనువారిభాండాగారములను బేరులేకుండఁ జేయుఁడు. అప్పుడుమన శాస్త్రములే వన్నెకెక్కును. వీరందఱు మనకే దాసులై వర్తింతురు"

ఆమాటలువినియెల్లరు పరమానందభరితులై చప్పటులుచేరచుచు లేచిరి. తమయేలికయొక్క యాజ్ఞానుసారముగ గుంపులుగఁగూడి గ్రామములపైఁబడి నాశనముగావింపఁ జొచ్చిరి. కొందఱు మ్లేచ్ఛులు వృద్ధులనకఁ బాలురనక, స్త్రీలనక, పురుషులనక కంటబడిన ప్రతిప్రాణిని గత్తికెరఁజేయుచుండిరి. కొందఱు యౌవనవతులగు కాంతలఁ గొంపోయి తమయిష్టానుసారము బాధింపఁగడఁగిరి. కొందఱు పురుషుల నందఱఁ బెడరెక్కలు విఱిచికట్టి యొకచోట నిలువఁబెట్టి వారి కనులయెదుర వారివారితల్లుల నక్కసెల్లెండ్ర భార్యలఁ జెరలవిడిపించి భీభత్సము సేయుచుండ నాఘోరములఁ జూడనోడి కన్నులుమూసికొనువారి గ్రుడ్లను నారసములతోఁ బెరికి పారవైచుచు దలలువంచుకొనువారి ఖడ్గప్రహారములఁ గడదేర్చుచుండిరి. మఱికొందఱు వృద్ధులు పడుచువారలు నగు స్త్రీపురుషుల దిగంబరులగావించి దండతాడనంబులతోఁ బరుగెత్తించుచుండిరి. కొందఱు పెండ్లికాని పడుచుల దమచిత్తమువచ్చిన చోట కెక్కడికో కొనిపోవసాగిరి. మఱికొందఱు మాంసఖాదనులు సృష్ట్యాదిగ వచ్చుచున్న సత్యగ్రంథముల ధ్వంసముకావింపసాగిరి. ప్రఖ్యాతికెక్కిన భాండాగారములందలి గ్రంథ సంచయుంబుల విశాలములగు నగ్నిగుండముల దీసి వాసి

యందువైచి తగులఁబెట్టుచుండిరి. ఒక్కొక్కపుస్తకాగారము దినముల కొలఁది దగులఁబడుచుండెను. సత్యములగు నార్యుల శాస్త్రసమూహంబులన్నియు నాశనమైపోయెను. శిల్పశాస్త్రములన్నియు నడవిపాలయ్యెను. ప్రకృతిశాస్త్రంబులు మన్నుఁగలసె. వైద్యశాస్త్రంబులు రూపుమాసె. భూగోళ ఖగోళశాస్త్రంబు లేటగలసిపోయెను. సత్యశాస్త్రములన్నియు నట్లువినాశములై పోవుటవలననే యిప్పుడు ప్రబలియున్న యసత్యశాస్త్రములు మనకు గతియైనవి. మఱికొందరు కఠినాత్ములు పసిబిడ్డలగొంతులఁ బిసికి చంపఁగడఁగిరి. తల్లులహస్తతలంబులం బరుండి పాలుద్రావు పసికూనల బలవంతముగలాగుకొని "తండ్రులారా! మాకన్నబిడ్డల రక్షించి మమ్ముఁజంపు" డని శిరంబులందించుచున్నను వినక మాతలఁబడదన్ని వారికన్నులముందు నాశిశువుల లేతకంఠముల నరటితూండ్లవలె ద్రుంచి మొగమునవిసరిపారవైచిపోవ దల్లులు "హా" యని గుండెలుపగిలి చచ్చుచుండిరి. మఱికొందఱు క్రూరులు కొంచెము మాటలాడనేర్చినబిడ్డ లమ్మాయని వెనుదగిలి వచ్చుచుండ వారితల్లుల నఱకి పారవైచుచుండిరి. కొందఱు రాక్షసులు చక్కగ బండికొతకు సిద్ధముగనున్న నిండుపైరుల నెక్కడివక్కడ నాశనము సేయఁజొచ్చిరి. గ్రామములందలి ధాన్యపుకొట్లకు నాముదముపోసి నిప్పంటింపఁగడఁగిరి. మఱికొందఱు దయాశూన్యులు గృహోపయోగములగుఁ బశువులఖండించి వానిమాంసము యజమానుల యెదుటనే పక్వముచేసుకొని భుజింపసాగిరి. అకృత్యములకు రోతపడువారి గ్రిందఁబడదన్ని వారినోళ్ళయందు బచ్చిమాంసపుముద్దలదెచ్చి క్రుక్కుచుడిరి. బిడ్డలఁజంప నేడ్చుపితరులయొక్కయు,బితరులఁజంప నేడ్చుబిడ్డలయొక్కయు,మగలఁబరాభవింప మూర్ఛిల్లుకులాంగనలయొక్కయు,హాహాకారంబులును,రోదనంబులునుగలసి భూనభోంతరములునిండ దేశమంతయు నల్లకల్లోలముగ గావింపఁజొచ్చిరి. ఈదుష్టాత్ములధాటికివెఱచి కొంపలవిడ

నాడి యడవులకుఁబరువెత్తువారును, మానముగా పాడుకొనఁ బ్రాణహత్య గావించుకొనువారును, తమ భార్యల బెట్టుగాముల దిలకింపనోడియుండు వారిఁజంపి పిదప దమజీవంబులఁగోల్పోవు మానధనులునునై మనుష్యులు భీభత్సమగుచుండిరి. చదువరులారా! మన దేశంబున శిశుహత్యలు, బాల్యవివాహములు, సహగమనములు మొదలగు దురాచారములు ప్రబలుట కివియే కారణములు. కట్టా! ఇన్ని యాక్రందనములలోఁ గూడిన యార్యావర్తపు నప్పటియవస్థఁ జూచినను, విన్నను, నెట్టివారికైన మనస్సు కలుక్కుమనక మానదుకదా! అట్లు మ్లేచ్ఛులు విసుగు జనించు నంతదాక దేశమంతయు ధ్వంసముచేసిపోయి తమ జయమును కుతుబుద్దీను కెఱుకపఱుప సంతోషభరితుఁడై యతఁడు వారల కనేకబహుమతులొసఁగి మన్నించెను. ఆసమయమున మఱికొందఱు చారు లరుదెంచి ప్రచండునకుఁ జక్రవర్తికి జరిగినసంగరమును గూర్చియుఁ గొన్ని నూత్నవిషయములఁ గూర్చియుఁ దెలిపిరి. అందుపైఁ గొంతసేన నంపవలసినదిగ సుల్తానుగారికిఁ దెలిపి దానికొఱకుఁ గుతుబుద్దీను నిరీక్షించుచుండెను.

ఇరువదిరెండవ ప్రకరణము.

ప్రచండుని నోడించిన మఱుసటి దినమునఁ దెల్లవారినతోడనే చక్రవర్తి నానతి నాతతాయి తమసైన్యమును గన్యాకుబ్జముముట్టడింప నడిపించెను. ప్రచండుని పరాజయంబు విని జయచంద్రుఁ డత్యంతరోష మూని చక్రవర్తిం జంపిగాని రణముమానఁగూడదని తనసేనాపతులఁ బురికొల్పుచుండెను. వినయశీలుఁడు చక్రవర్తితో సంధిగావింప ననేక ప్రయత్నములు సలిపెఁగాని యవన్నియు నిష్ఫలములై నందునఁ దాను గయ్యమున సంబంధము గలుగఁజేసికొనక దూరముగనుండి సమయమువచ్చిన రాజునకుఁ దోడ్పడఁదలఁపూనియుండెను. చక్రవర్తి నగరమున కెనిమిదిమైళ్లదూరమున డేరాలవేయించి సేనను విడియింపఁ జేసి దాని మూఁడుభాగములుగ విభజించి యందొకభాగమునకు గంకటుఁ బతినిజేసి తూర్పుదిశయందలి ద్వారమునుబంధింప నంపెను. కుంభీలకు నాయకత్వమున మఱియొక భాగము నుత్తరము ముట్టడింపఁ బంపెను. తక్కినభాగమును మిహిరుఁడనువాని యాధిపత్యమున దక్షిణము దాకనంపి వీరందఱకుఁ దోడుపడ నాతతాయిం బంచెను. చక్రవర్త్యాజ్ఞానుసారము సైనికులెల్లఱు బందూకులుగాల్చుచు వెడలి కోటకు ముట్టడివేసిరి. లోపలనున్న జయచంద్రుసైనికులు చెలరేగి యెడతెరిపి లేకుండ ఫిరంగులను, బాణములను శత్రువులపైఁ బ్రయోగింప సాగిరి. బహిర్ద్వారంబు భేదింప వెడలిన కంకటుఁడత్యుత్సాహమున దనసేనను ముందుకు నడిపించుచుండెను.

విధివిరామము లేకుండ వచ్చుచున్న బందూకుల గుండ్లవలనఁ బెక్కుమంది చచ్చుటవలోకించి కంకటుఁడు సందులేకుండ దనసేనకడ్డముగ కుంజరయూధమున నిలువఁబెట్టించి వాహినినత్యంత పరాక్రమ

మున ముందుకు నడిపించి ఫిరంగులఁ బెట్టించి ద్వారములఁ బగులఁగొట్టించుచుండెను. ఒక్కొక్క ఫిరంగితాకుడునకు పిడుఁగువడినభంగి గొంతతడవు వణఁకును హోరుమను మ్రోత మ్రోగుచుండెఁ గాని తలుపుమాత్రము స్వాధీనము కాకుండెను. దక్షిణాశయందున్న సేన గోడలపై కెక్క సాహసముసేసి యగాధముగ నున్న కందకమును మనుజాశ్వకుంజర కళేబరవారంబులఁ బూడ్చి కోటగోడల కెగబ్రాకసాగెను. లోపలివారలు శత్రువులు దరికి రాకుండ నిప్పులవర్షము గురిపింపఁ జొచ్చిరి. ప్రాణములకాశింపక సార్వభౌమసైనికులు తమవారలు కుప్పలుగఁ గూలుచున్నను ధైర్యము వీడక గోడల కెగబ్రాకుచుండిరి. వీర లిక్కడ నిట్లు పోరాడుచుండ మిహిరుఁడు తనవారిచే నుత్తరపుగవను నాశనము జేయించుచుండెను. ఫిరంగుల గోడలచివరలకు గురిపెట్టించి కొట్టించుచుండెను. అందువలన నాభాగమంతయు ధ్వంసము కాఁజొచ్చెను. వందలకొలఁది ప్రాణము లొక్కనిమిషమునఁ బోవుచున్నను వెనుదీయక చక్రవర్తిసేన నాలుగువారములపర్యంతము హోరాహోరిగఁ బోరాడుచుండెను. అప్పటికిని గోట స్వాధీనము కాకుండెను. అంతఁ జక్రవర్తి దుర్గమును గైకొనిగాని యావల నడుగిడనని శపథము వట్టి ఢిల్లీనుండి మఱికొంత సేనను గొనిరమ్మని వేగులవారి నంపెను. ప్రాగ్దక్షిణోత్తరపార్శ్వములే శాత్రవులు ముట్టడించియున్నందున లోపలివారలు పడమటిదిక్కున నించుక నజాగ్రత్తగ నుండిరి. చక్రవర్తి యాసంగతి నెఱిఁగి పడమటిభాగమున రెండుఫర్లాంగుల దూరమునుండి కందకము మట్టమున కేటవాలుగ నుండునట్లు గోతిని ద్రవ్వి కోటగోడల యడుగున సొరంగములు దీసి మందుగూరి కాల్చ నాజ్ఞాపించెను. గాతములు తీసి మందుఁగూరు సమయమున నీసంగతి లోపలివారలు కనుఁగొని యాప్రక్కకేగి శత్రువులపై నిప్పులగురిపింప మొదలిడిరి. ఆతరుణమునఁ దూర్పుదిశయందలి సార్వభౌమసేన విజృంభించి మొదటిద్వారపుఁ దలుపులను శకలములు

కావించెను. వెంటనే రెండవదానిభేదింప గడగిరి. పడమటిదిశయందలి వార లెట్లో తమపని బూర్తిజేసికొని మందునకు నిప్పంటింపఁగా సంవర్తకాలమందలి పిడుగులంబలె భయంకరధ్వానంబులు మిన్నుముట్టలేచి గోడలరాళ్లు కొన్ని గూలెనేగాని పూర్తిగఁ బడవయ్యె. అంతమరల గాతములదీసి మందుఁగూర నారంభించిరి. కోటగోడ లీరెండవపర్యాయము గూలునను భయంబున లోపలివారెల్లరు నీవైపునకే చేరి శత్రువుల దగ్గరరాకుండఁ జేయుచుండిరి. వేలకొలఁది గూలుచున్నను పీడకకోటను నాశనముసేయవలయునని పట్టుఁబట్టి చక్రవర్తిసైనికులు గుండ్లకు వెఱవక బందూకులదెబ్బలఁదప్పించుకొనుచుసురంగములఁద్రవ్వి మరలమందుఁగూరసాగిరి. ద్వారములు భేదింపనున్నవారుతమకించుకపై ధాటి తగినందునఁబూర్వముకన్న నెక్కువగఁ బనిచేయుచుండిరి. ఎడతెరిపి లేకుండఁ బ్రయోగింపసాగిన ఫిరంగిదెబ్బలచేనా రెండవద్వారపుదలుపులును వకావకలయ్యెను. అనంతరము మూఁడవకవాటము నాశనమొనరింపఁ గడఁగిరి. పశ్చిమదిశయందలివారతిప్రయత్నముమీఁద గాతముల మందుతో నింపిమరలనగ్నినిడఁ బ్రథమమునవలెనే భీకరధ్వానులుప్పతిలి నేలయంతయు గదలి గోడలకతికినరాళ్ళన్నియు నెక్కడివక్కడ జారిగోడలు శిథిలములయ్యెను. వెంటనే యాప్రక్కనున్న వారెల్లరు చొరవఁజేసికొని లోపలఁ బ్రవేశింపసాగిరి. ఈతరుణమందేతూర్పుదిశయందొక్కపర్యాయముగఁదాకిన నిరువది ఫిరంగులదాకున దలుపులు భిన్నంబులయ్యె. ఈప్రక్కనుండియుఁ జక్రవర్తిసేన లోపలఁ బ్రవేశింపసాగెను. అంతనాతతాయి దక్షిణోత్తరములవారికూడ లోపలఁ బ్రవేశపెట్టెను. చక్రవర్తిసైన్యమంతయు లోపలఁజేరి శత్రువులు నిప్పులఁగురిపించుచున్నను దాళుకొనుచు గోడలమీఁదికెక్కి యచ్చటివారిఁగొందఱఁగ్రిందికిఁద్రోయ నందఱునుదిగిరి. అత్తరి పోరు మహాఘోరమయ్యెను. బందూకనక, కత్తియనక, బాణములనక, లాఠీలనకయిష్టము

వచ్చినయాయుధములతో నందఱుఁబోరాడఁగడఁగిరి. చక్రవర్తిసేన కోపలికేఁగి యుద్ధమారంభింప జయచంద్రుని వాహినినాశనము కాసాగి తుదకు మూఁడువంతులు పూర్తిగ నాశనమయ్యెను. మిగిలినవార లించుక ధైర్యముచెడి పనిచేయుచుండుటఁజూచి జయచంద్రుని యుపసకలాక్షౌహిణీపతియగు కహారకంఠీరవుఁ డనువాఁడు తనసైన్యమునుమరల బురికొల్పుచుఁదాను యుద్ధమునకుదిగెను. కోటముట్టడివలనను లోపలియుద్ధమువలనను, జక్రవర్తిసేనయందును మూఁడువంతులకన్న నెక్కువయే నాశనమయ్యెను. ఎంతనాశనమైనను ఆతతాయి మొదలగువారువలుకు ప్రోత్సాహంపు వచనంబుల శత్రువులకు లొంగక రణమొనరించుచుండిరి. కహారకంఠీరవుఁ డొక్కుమ్మడి సెలరేఁగి చక్రవర్తిసేనయందు నడ్డమువచ్చినవారినెల్ల నఱకుచు నాతతాయిని సమీపించెను. అత్తరి వారిరువురకు ఘోరమగు ద్వంద్వయుద్ధము జరిగెను. కొంతవడికి బందూకు గుండొకటివచ్చి యాతతాయి యెక్కియున్న గుఱ్ఱపుఁగాలికిఁ దగుల నది యాక్షణమందే నేలకొరఁగెను. ఆతతాయి వెంటనే నేలకురికి శత్రుప్రహారములఁ దప్పించుకొనుచు మరలనొకగుఱ్ఱమునారోహింపఁబోవుసమయమున కహారకంఠీరవుఁ డతనిశిరమును నేలగూల్చెను. అతిప్రతాపవంతుఁడగు సేనాధిపతికిట్టి పాటుకల్గుటవలోకించి సైనికులుధైర్యము వీడసాగిరి కాని యింతలోనీవార్తఁ దెలిసి పృథ్వీరాజుపరువెత్తుకొనివచ్చి మరలఁ బురికొల్పఁగడఁగెను. చక్రవర్తివచ్చినాఁడని విని కహారకంఠీరవుఁ డతనిపైకురికెను. ఆత్తరిసైనికులందఱుఁ దమరాజును గాపాడుకొనుటకై తెగించి కహారకంఠీరవుని మీఁదఁబడిరి. కానియాకలిఁగొన్న శార్దూలముభంగి వారినందఱ నురుమాడుచుఁ గహారకంఠీరవుఁడు చక్రవర్తిని సమీపించి యతనితలఁదెగవ్రేయఁగత్తినెత్తెను. ఆసమయమున యౌవనవంతుఁడగు రాకుమారుఁడొకఁ డుత్తమాశ్వముపైవచ్చి చక్రవర్తింజంపనెత్తియున్న హస్తముందెగటార్చి తోడనే వానిశిరముంగూల్చె

భీతినందియున్న పృథివీరాజు సేనను మరలఁ బురికొల్పెను. కహారకంఠీరవుని మరణమువలన జయచంద్రుని సేన పరుగిడఁజొచ్చెను. క్రొత్తగనే తెంచిన రాజపుత్రునియొక్కయుఁ జక్రవర్తియొక్కయు నుత్సాహంపు వచనములచే సార్వభౌమసేన మరల నుప్పొంగి యుద్ధము సేయఁగడఁగెను. ఈతరుణమందే చక్రవర్తి కొనిరానంపిన క్రొత్తసేన డిల్లీనుంచివచ్చి వీరలకుఁదోడ్పడి రణమొనరింపసాగెను. అనంతరము రెండుదినములకు జయచంద్రుని వాహినిపూర్తిగ నాశన మయ్యెను. లెక్కలేని బందూకులు, బాణములు మఱియు రణమునకు వలసిన యితరశస్త్రాస్త్రములన్నియుఁ జక్రవర్తిపాలయ్యెను. జయచంద్రునికొఱకు వెతకగా నతఁడెచ్చోటను గాన్పింపడయ్యె. ఇట్లు సంపూర్ణజయముఁ గాంచి చక్రవర్తి సంయుక్తను దోడితెమ్మని కొందఱు భటుల నంప వారుపోయివచ్చి యంతఃపురము పాడుపడియున్నదనియు, సంయుక్తయెక్కడఁగానరాలేదనియు వచించిరి. తన ప్రియకాంత గానరాలేదని వచింప నత్యంతవిచారమగ్నుఁడై పృథివీరాజేమిచేయుటకుఁ దోఁపకయుండ బైరాగివచ్చెను. చక్రవర్తి యతనిఁగాంచినవెంటనే సంతోషమునుబొంది యుచితసత్కారంబు లొనర్చి సంయుక్తనుగుఱించి యడుగ "రాజా! ఆమె యిప్పుడీనగరంబున లేదు. నీవు విచారింపకుము. ఆమె కేవిధమైన భయమును లేదు. ఇత్తరి నీవు నీ రాజధాని కేగుము. ఆమె నచటనే పెండ్లియాడఁగల" వని నోదార్చి బైరాగి వెడలిపోయెను. అనంతరము చక్రవర్తి సేనాసమేతుఁడై తన్నుఁగాపాడిన రాకొమారుని వెంటఁగొని నిజరాజధానికిఁ బయనమై పోయెను.

ఇరువదిమూఁడవ ప్రకరణము.

కన్యాకుబ్జనగరమున రణము జరుగుచున్నంతకాల మీశ్వరభట్టుగా రాపురమునకుఁ బదిమైళ్ళదూరమున నొక చిన్నయడవిలోనుండి సేవకులవలన నేనాఁటివార్తలానాఁడు తెలిసికొనుచుఁ దుదకుఁ జక్రవర్తి జయమంది దుర్గము నాశనముగావించి పోయినాఁడన్నవార్తవిని యటనుండి బయలువెడలి పట్టణములోనికేతెంచిచూడఁ గోట యెక్కడిదక్కడ శిథిలమై యుండెను. హతశేషులగు సైనికులతనిఁగాంచి యాపురుమని యేడువసాగిరి. వారినందఱ నోదార్చి 'జయచంద్రుఁ డెక్కడ' నని యడుగుడు ప్రతివాఁడును దనకుఁ దెలియదని వచించెను. అంత వారినందఱఁ గొలువుకూటంబున నుండ నాజ్ఞాపించి తా నొంటరిగ నవరోధసౌధములకేగి యందు రహస్యమందిరముఁ బ్రవేశించి వినయశీలునితో సంభాషించుచున్న జయచంద్రునిఁగాంచి యగ్గలమగు నోర్వలేమి నతఁడు వినయశీలునివలలోఁ జిక్కి తన్ను పాటింపఁడను భయంబున మెల్లమెల్లనఁ జేరఁబోయి నమస్కరింప నతఁడు కూరుచుండుమని మఱేమియు మాటలాడక తలవంచుకొని యూరకుండెను. అత్తరి భట్టు రాజు మనసు నిశ్చయముగఁ దిరిగిపోయినదనితలఁచి యెటులైనమరల దనమార్గమునకుఁ ద్రిప్పుకొన నెంచి యిట్లువచింపసాగెను.

"రాజా! ఇట్టిసమయమున మీ రిటు విచారపడుచుఁ గూరుచున్నఁ గార్యమేమయినఁ గలదా? ఎటువంటివారికైనఁ గాసిమ్ము; ఒకానొకవేళఁ గష్టములు రాకమానవు. కష్టములు కలిగినతరి దుఃఖించుచు సౌఖ్యములు కలిగినతరి సంకఁదమయంతవారు తేరసి పొంగిపడుట సజ్జనుల లక్షణముగాదు. సికత్తరి సహజయము కలిగినదని నిరుత్సాహుఁడవు కాకుము. రణమందు జయాపజయంబు లొకరి స్వాధీనములుకావు. ఇప్పు డోడినవాఁడు రేవు గెలుచును. రేపు గెలిచిన

వాఁడు మరల మరునాఁడోడును. క్షత్రియు లగువారికి జయాపజయం బులు కాక వేరేమున్నవి ? కాని యుత్తమక్షత్రియుం డగువాఁ డపజ యముకలిగినప్పుడే యెక్కువ ధైర్యము నవలంబించి యుండవలయును. ఇంతమాత్రమునకే జడుపునొంది నీవిట్లూరక కూరుచుండియుండుట యుక్తముకాదు. ఇత్తరి మనకుఁగలిగిన పరాభవమునకు వెఱచి చక్రవర్తి నింతటితో వదలెద నని తలఁచెదవేమో ! కలయందైన నట్లు తలఁపకుము. చక్రవర్తి నాశనముజూచికాని నేప్రాణముల వదల నని నిక్కముగ నమ్మియుండుము. మన సేనమూలముగనే యతఁడు చచ్చునని తలఁచి తక్కినవిషయములు నీతో వచింపలేదు కాని యిప్పుడు నాపన్నుగడలన్నియు దెల్పెదవినుము. ఢిల్లీయందు గరీమునకును నాకును కలిగినమైత్రివలన కుతుబుద్దీ అను మహమ్మదీయ సేనానా యకునకు నాకు స్నేహముకలిగినది. నేను ఢిల్లీనివదలి యిక్కడకు వచ్చిన తరువాత నక్కడి సంగతులేమో కనుగొని రమ్మని నా సేవకులఁ గొందఱిఁ బంపితిని. వారువచ్చి కరీముచు జెరవైచిరని తెలిపిరి. అనంతరము గొన్ని దినములకుఁ గుతుబుద్దీ వద్దనుండి మాకొఱ కిరువురుభటులు లేతెంచి యట గరీమువార్త విన్నపిదప నాకొఱకై వెదకికొనుచువచ్చి యిక్కడ గలిసికొని కుతుబుద్దీనుకపజ యము కలిగినందున నతఁడు వేరొకస్థలమున నున్నాఁడనియు మఱియు గొన్ని నూత్నవృత్తాంతము లెఱిఁగించిరి. ఢిల్లీపతిని రాజ్యభ్రష్టునిఁ జేయ వారు నన్నాలోచనయడుగ నన్యమతస్థుల నేలప్రోత్సాహపఱుప వలె ననియు మనమే చక్రవర్తినినోడించిన నారాజ్యము మనకేదక్కగల దనియు నూహించియెటువోయి యెటువచ్చునోయని వారితో వైరముమాత్రముపెట్టుకొనక మంచిమాటలంతో నింతవఱకు నాపియుం టిని. అదియుంగాక యతనిమనస్సును సంతోషపఱుప దేశమున గొన్నియల్లరులు గలుగఁజేయుమని చెప్పిపుచ్చితిని. అతఁడు మరలఁ

గొండెకుచారులఁ బంపియున్నాఁడు. చక్రవర్తి నెదురింపఁదగినప్రబల సైన్యమునుంచుకొని దేశమును బాడుచేయుమని యిప్పుడుమరలఁ జెప్పిపుచ్చెదను. గ్రామములం దల్లరులు సాగించినచో నట్టివారి దండించుటకై వచ్చి వారిచేతులలోఁజిక్కెను. చక్రవర్తి దుర్గమునుండ జయించుట మనతరముకాదు. కావున నీవు దుఃఖమునూని బయటికే తెమ్ము" అని కుతుబుద్దీనుఁ దనకు జరిగినవిషయములు దెలిపి కొన్ని లేఖల గనుపఱుప జయచంద్రుఁ డించుక కలఁకఁదేరి మాటలాడ నారంభించెను.

అసూయాపరుఁడగు మూఢుఁడు తన కెంతనష్టము గలుగుచున్నను దనవైరి నాశనసూచకములగు బలుకులు పల్కినంతనే మరల దుర్మార్గములు సేయుటకే కడఁగుఁగాని బుద్ధిగలిగి యూరకుండుననుటకల్ల.) చక్రవర్తిజయమువలనఁ బట్టరాని యీర్ష్యాశోకములకు దావలుఁడై రహస్యమందిరము శరణుఁజొచ్చిన జయచంద్రునకీశ్వరభట్టుగారి కుత్సితంపువాక్యంబు లమృతోపమానము లయ్యెను. పురమంతయు నల్లకల్లోల మగునట్లు రణము జరుగుచున్నంత కాలము నిటుమొగమైనఁ జూపక పారిపోయి యెక్కడనో తలఁదాచుకొనివచ్చిన పిరికిపందలలో నగ్రగణ్యుఁడగు నీభట్టుగారి నీతివాక్యములచే రాజన్యాయముగ మోసపోవుచువచ్చెను. భట్టుగా రెంతకైన మాటకారియే కాని క్రియాశూన్యుఁడు.సమయమువచ్చినదన్న నంతఃపురదాసీల కాళ్లనైనఁ బట్టుకొనును. కాని జయచంద్రుని దగ్గరమాత్రము ధీరత్వము తోపఁ గోటలుదాటునట్లు వచించుచుండును. భట్టుగారు వచించిన మీఁద నారాజు మరల "అయితే మీరిప్పు డేమిచేయ నెంచియున్నా" రని యడిగెను. అందుమీఁద నతఁడుతిరుగ దారిలోనికి వచ్చుచున్నాఁడని తలఁచి "చక్రవర్తి నెదురింపఁ దగినసేనను సుల్తాను వద్దనుండి తెప్పిం

చుకొని యీచుట్టుప్రక్కల నాశనముకాఁగా మిగిలిన గ్రామముల వెండియుఁగొల్ల గొట్టించుమని చెప్పివంపెద” ననిమఱియు నిట్లు వక్కాణింపసాగెను. “రాజా! నీవెంతమాత్రమధైర్యపడకుము. బయటికేతెంచి యథాప్రకారముగ నీరాచకార్యములఁ జక్కఁబెట్టుకొనుము. హతశేషులగు సైనికులు నీకొఱకై యంతటను వెదకుచున్నారు వారి నందఱ నూరడిల్లఁబిలికి నీమిత్రుఁడగు పురిహారరాజకులునకు వర్తమానమంపుము. అతఁడు తత్క్షణమతనిసేననంతయు దీసికొని నీకు సహాయపడఁ జనుదెంచును. ఇంకను నీకు మిత్రులైయున్న యితరరాజులఁ బిల్వనంపుము. వారును సేనాసహితులై నీకుఁదోడ్పడఁ జనుదెంతురు. నేనింతలో సుల్తానుగారినికూడ బిలుపించుకొని చక్రవర్తి నెదురింపుమని కుతుబుద్దీనుకు వ్రాసిపంపెదను. ఒకవేళసుల్తానున కపజయము గలిగినచో మనము ప్రోఁగుఁజేసిన రాజుల నందఱివెంటఁగొనివారికి సహాయులమైపోవుదము. అప్పటికి మనకే పరాజయముగలిగినతర్వాతఁ జూచుకొందము. అవివేకులగు నీముసలివారలమాటల లెక్కగొనకు” మని భట్టుపల్కెను.

ఇంతవఱకును బైకిపొంగివచ్చుచున్న కోపమునంతయు నణఁచుకొని యూరకకూరుచుండియున్న వినయశీలుఁడు రోషపూరితుఁడై చివాలునలేచి “మూఢుఁడా! జయచంద్రు నింతటితోనైన బాగుపడనీయ దలఁచుకొనలేదా? మీమూలముననేగదా యితని కీగతి పట్టినది. దురాత్ముఁడా, మీదుమిక్కిలి నన్నెమెత్తిపొడిచెదవా? చక్రవర్తిపై లేనిపోనివి కల్పించిచెప్పి యుద్ధమునకుఁబురికొల్పి సేననంతయు ధ్వంసము కావించితివి. ఆరణమున నీవెక్కడఁ జచ్చితి” వన భట్టుగారుగ్రుఁడై “అయ్యా! ఈ లేనిపోని కంఠశోష తమకేటికి? మే మిరుపురము దగవులాడుకొని మావాదము దీర్పుడని మిమ్ము వేఁడుకొంటిమా

జరుగవలసిన రాచకార్యములగుఱించి యేమేమో మాటలాడుకొను చుండ నడుమమీ రేటికి సంబంధము గలుగఁ జేసికొనెదరు? చాలు నీపాపాటికిఁ దమరూరకుండుఁడు." అన మితిమీరివచ్చుచున్న యాగ్రహమునాపుకొని "జయచంద్రా! బాగుపడఁ దలఁచుకొంటివేని నేనింతకుముందు చెప్పినట్లుఁ జేయుము. లేకున్న నీయిష్ట"మని వినయశీలుఁడు వెడలిపోయెను. అతఁడు వెడలిపోవుటతడవుగ భట్టుమఱికొన్ని యిచ్చకములువల్కి రాజును బయటకుఁగొనివచ్చెను. జయచంద్రుఁడు సభకేతెంచి హతశేషుల మన్నుపడిపోయినచోట్ల దుర్గమును బాగుపఱుప నాజ్ఞాపించి మఱియు నితరసమాచారములఁగూర్చి ముచ్చటించుకొనుచుండ పరిచారికలేతెంచి సంయుక్తయెక్కఁడను గానరాలేదని వచించిరి. అగ్గలమగు నీర్ష్యాగ్రస్తుఁడై యుహరహము జక్రవర్తినాశనముగావింపఁ దత్పరుఁడైయున్న యాతనిమనస్సుకుఁ బ్రియకుమారిక పోయినదని వచించినను నావంతయుఁ జింతకలుగదయ్యె. కానరాలేదని వచించినతోడనే యుగ్రుఁడై "పోనిండు గతించినదని యూరకుండెద. దానిచింత యేల? మీరుపొం" డనికూతురుపైఁ గలకోపంబునఁ బరిచారికలసహితము కసరికొట్టిపంపెను. అనంతరము భట్టుగారి సలహాప్రకారము బురిహారరాజకులునకు లేఖవ్రాసిపంపి యానాఁటికిఁగొలువుఁజాలించి వెడలిపోయెను.

ఇక్కడ నిట్లుండ రాజధానియందు జక్రవర్తిప్రవేశించినదినమున ననేకములగు వేడుకలు జరిగెను. పురమెల్లెడల నలంకరించి నల్లడల జక్రవర్తిజయము జాటించిరి. చక్రవర్తి నెదురింపవచ్చువారలిట్లే చెల్లాచెదరుగ నెగరగొట్టఁబడుదురని సూచించుభంగి కోటబురుజులపై నాడిన జయస్తంభములకుఁ గట్టిన శ్వేతవనంబులు మిక్కుటముగఁ గొట్టుకొనుచుండెను. మఱునాఁడొకగొప్ప సభజరిగెను. అందుసకలా

క్షౌహిణీపతులు, సేనాపతులు, మంత్రులు మొదలగువార లాసీనులై యుండిరి. అత్తరి చక్రవర్తి సంగరమున తన్ను రక్షించిన రాకుమారుని రప్పించియుత్తమాసనంబొసంగి మన్నించెను. సభయందలివారెల్ల నతని వేయుగతులఁ బ్రస్తుతింపసాగిరి. స్నిగ్ధమై కళకళలాడు నాకుమారుని మోము చక్రవర్తి కడుతడవువీక్షించి యనురాగ మధికముకాఁగా నతనిపేరడిగి కమలాకరుండని తెలిసికొని వివిధములగుఁబతకముల బహుమానముగనిచ్చెను. అత్తరి నారాజపుత్రుఁడులేచి వినయమొప్ప "రాజచంద్రా! నన్నింతఘనముగఁ గొనియాడనేల? మీదయకుఁ బాత్రుండ నగుదునేని యియ్యఁదగిన మీవ్రేలియుంగరము నొసంగవేడెద" నన "కమలాకరా! మృత్యువునోటఁబడనున్న నన్ను రక్షించి పుణ్యంబుగట్టుకొంటివి. అట్టియెడల నాశరీరమే నీస్వత్వమైయుండ దానిపైనున్న భూషణములయెడ నీకుస్వతంత్రములేదా? నీకువలసినది పుచ్చుకొను"మని తనవ్రేలియుంగరము నిచ్చి చక్రవర్తి యతని విడిచి యుండఁజాలక నాఁటినుండియు దనదగ్గరనే యుంచుకొనెను.

ఇరువది నాల్గవ ప్రకరణము.

అట్లు చక్రవర్తి కమలాకరు నొకనిమిషమైన విడిచియుండఁజాలక యతనియం దత్యంతానురాగము కలవాఁడై తుదకు భోజనశయనాదులయందు సహితము తనవద్దనే యుంచుకొని యొక్కొక్క పర్యాయ మహా! ఇతని బురుషునిగ నిర్మించిన యీ పరమేశ్వరు నేమనవలయు? వీని ముఖలక్షణములు కేవలము సంయుక్తనే పోలియున్నవి. నిక్కముగ నితసవదనంబు లక్ష్మీవిలాసమున కాటపట్టయియుండుటచేఁ గమలాకరుఁడను నామము సార్థకమగుచున్నట? అని వాసికులగోత్రాదుల నడుగనుంకించి యతఁడేమని భావించునో యని యడుగమానుచు నడుగకున్న మనసునిలువమిఁ దనలో నెవనిగాని నీకులగోత్రాదు లేమని యడిగిన దప్పగునా యనుకొని వెండియు నిప్పు డడిగినయెడల నిన్నిదినంబుల నుండి నాచేష్టలగాంచుచు సందేహము నొందియున్నందున నేమనుకొనునో యని తుట్టతుద కడుగుటమాని సంయుక్తాకృష్టహృదయుఁడై దినములు గడపుచుండెను. ఇంతలో బైరాగిచను దెంచెద నని చెప్పిన గడువును మీరిపోయెను. అంతఁ బృథివిరాజగ్గలమగు మోహంబున "హా! నాప్రియురాలి సమాచారం బెఱుంగక దుఃఖించుచుండ నాకడకేతెంచి నన్నోదార్చి కొద్దిదినములలో వచ్చి నిన్నుఁ గలిసికొనెదనని వచించిన బైరాగి యింతవఱకు రాకతడయుట కేమికారణము? అతండు రావలసినదినంబు నిన్నటితో గడచిపోయెను. ఆహా! ఆసొగసులాడిం జేపట్టి సుఖించుభాగ్యంబు నాకేనాఁటికైన లభించునా? ఆతన్వంగి కరస్పర్శనంబున మేనుగరుపార నుల్లాసమునొందు భాగ్యము నాకెప్పటికైనఁ జేకూరునా? లజ్జానతాననయై మందహాసమొలుకఁబలుకు నా చిలుకలకొలికి వాక్యామృతధారలచె నామనోరథతృష్ణను బాపుకొను

పున్నే మేనాటికైన సంభవించునా! ఆవన్నెలాడికై కదా! అంత ఘోర రణము గావించితి. తుదకా కన్నెను కన్నులారగాంచు భాగ్యమునకైన నోచుకొననైతి. కట్టా! మే మందఱము రణంబున మునిఁగియుండ దుర్మార్గులెవరైనను నామెం గడదేర్చియుండరుగదా ? కాకున్న నామె జనకుండు నన్నంతనీచముగ రాతిబొమ్మను జేసి యవమానపఱచినతరి నా విగ్రహము మెడను బుష్పహారముదైచి నాయవమానమునంత యుఁ బోఁగొట్టిన యాజగన్మోహిని రణమున జయముగొనియున్న నన్నుఁ వీక్షించుట కేలరాకుండును. తా నవరోధముఁబాసి రాకున్న మానె; నాయందంత ప్రేమగలిగియున్న వనిత నాసమాచార మరయుటకై దాసీజనంబునైన నంపదా? నిక్కముగ నామె కేదో కీడు మూఁడి యుండవచ్చును. నన్నువలచియున్నదను రోషంబున నొకవేళ జయచంద్రుండే యామె కపకారముగావించి యుండఁడుగదా? అయ్యో! నాప్రేమంపుఁదొయ్యలి కట్టియపకారమే కలిగియుండిన యోగి నావద్దకేతెంచి యట్లేలవచించును? 'ఆమె కేవిధమైనభయము లేదు. నీవిప్పుడు రాజధాని కేగుము. ఆమె నచటనే పెండ్లియాడగల'వనికదాఁ బైరాగి చెప్పినాఁడు. అతఁడు నాతో నబద్ధములెన్నటికైన వచించునా! వచింపఁడు. అతనినప్పుడే నావెంటగొని రాకపోవుట నాదే తప్పిదము. పాపమతఁడేయిక్కట్టులఁజిక్కెనో ? ఆ యిందువదన సుందరలావణ్యాంబురాశినిఁ దేలని నాజన్మము నిరర్థకము" అని పెక్కుగతుల విచారించుచు బైరాగిపోవునపు డిచ్చిన సంయుక్తచిత్రపటముం గైకొని "ఆహా ! పటమునందే యింతకళావిలాసమైయున్న నీ మోహనాంగిరూపము బ్రత్యక్షముగఁ జూడఁగల్గిన నెటులుండునోకదా ? దీని చిత్రించిన చిత్రకారునకుఁ బ్రాణముఁబోయు సామర్థ్యము లేకుండుటెంతయు విచారకరము. తెప్పలల్లార్పక సరసీమధ్యమందలి రాయంచలవిహారములు గాంచుచున్నట్లీబాలికెంతయో నిపుణముగఁ జిత్రింపఁబడెనది. ఔరా! మంద

యానంబున నీవనీతలవిహారము లొనర్చు మలయమారుతుండు నాకన్న నెన్ని మడుంగులో ధన్యాత్ముండుగఁ గాన్పించుచున్నాఁడే. లేకున్న వంకరలై ముఖసరోజము నావరించియున్న యాకన్నియముంగురుల స్పృశించి యేల చలింపఁజేయును ?" అని మిక్కుటమైన మదనోన్మాదంబునఁ జిత్రపటమునుమాటుమఱచి " మారుతాధమా ! నేనుకట్టెదుట నుండ నాప్రియురాలివదనమేలస్పృశించెద " వని దండింపఁబోయి మరలఁ దెలివిదెచ్చుకొని తానుగావింపఁబోయిన పనికి సిగ్గుపడుచు నిట్టూర్పుఁబుచ్చి యిటునటుఁ జూడఁ గమలాకరుఁడ చెంతనుండెను.

అత్తరి జక్రవర్తి మనస్సునిలుపలేక యతనిదరిజేరి " కమలాకరా ! ఇటుఁజూడుము. ఈచిత్రపటమునందున్న కన్యకయొక్కరూపవైఖరులు నీయందుఁ గన్పట్టుచున్నవి. ఈపె నీకేమైనఁ గావలయునా?" అని యడుగ " రాజేంద్రా ! శైశవమాదిగ నీకన్యయు నేనును నన్నచెల్లెండ్రభావముతో నొకటిగనుంటిమి. మాయిరువురరూప మొకటియే. ఇందు నీ వేమియుఁ దప్పుదలంపలేదు. రూపమొక్కటి యగుట వలననే జయచంద్రుఁడు మొదలగువారు మాయిద్దఱ నొకరీతిగఁ జూచుకొనుచువచ్చిరి. ఇప్పుడీమె మారువేషముతో నెక్కడనోయున్నదని నా కొకయోగిచెప్పినాఁడు. మఱల కొద్దిదినములలో మేమిద్దఱ మొకటియగుదు మనుధైర్యము నాకున్నది. " అని కమలాకరుండు పలుక " బాలకా ! నీయీచెల్లెలిఁ గాంచకున్కి నాకన్నులు వాచియున్నవి. ఎటులైన నీమెదర్శనలాభముఁ నాకుఁగలుగఁజేయుము ఇన్ని దినంబులనుండియు నీవదనసందర్శనమునఁ బ్రాణంబుల నిలుపుకొనియుంటి. ఈమె ప్రస్తుత మెచ్చటనున్నదో వచింపు" మని దీనముగ వేఁడుకొనుచున్న చక్రవర్తి యవస్థనంతయుఁ గాంచి కమలాకరుఁడేమియుఁ జేయఁజాలక యూరకనిలచియుండెను. అత్తరిఁ జక్రవర్తి యుస్సురని నిట్టూర్పులువిడచుచు " హా ! మనోహారిణీ ! నన్నిట్టిబెట్టిదములకుఁ

బాలుజేసి నీవెచటి కేగితివి? ఇంత యవస్థపడుచున్నుఁగాంచిన నీకు భయముగలుగదా ? నాహృదయస్థురాల వైననాటినుండియుఁ దిన్నగ నిద్రాహారంబులుగూడ లేవు. రమ్మా! ఏల జాలముఁ జేసెద ” వని యొక సోఫాకుఁ జేరగిలంబడి కనులు మూసికొనియుండఁ గమలాకరుండు చెంతకేగి యతనిశరీరము నిమురుచు “ రాజచంద్రా! లెమ్ము! ఇట్టి దీనాలాపంబు లాడుట నీవంటిధీరులకుఁదగునా?” యన స్పర్శసౌఖ్యమునంది చక్రవర్తి దిగ్గునలేచి చెంత గమలాకరుండు దక్క పరులెవ్వరు లేకుండుటఁజూచి విషణ్ణుఁడై “కమలాకరా! నీ కరస్పర్శనంబున నాకమితమగు నానందము గలిగినది. ఆహా ! నీహస్త మెంతమృదువుగ నున్నది ? ఇటురా” మ్మని చేరువఁ గూరుచుండబెట్టుకొని యేమేమో వచించుచుండ నూకొట్టుచు “నయ్యో! నాయుపాధ్యాయుఁడే తెంచి యితనిమనోరథ మెప్పుడుదీర్చునోగదా” యని కమలాకరుండు తలపోయుచుండెను.

ఇట్లు చక్రవర్తి చింతాకులుఁడైయుండ రెండురాత్రులు గడచెను. మూఁడవనాఁడు తెల్లవారి యేడుగంటలగునప్పటికిఁ గమలాకరుండు నిదురలేచి ప్రాతఃకాలకృత్యముల నెరవేర్చుకొని చక్రవర్తి యప్పటి కింకను లేవనందున దానొంటరిగ బయటికేతెంచెను. ద్వారముబయట నడుగుబెట్టినతోడనే యతనికిఁ గల్గిన సంతసముఁగూర్చి యేమనిచెప్పనగును! ఉత్కంఠుఁడై యెవరికొఱకు నింతకాలము గనుపెట్టుకొనియుండెనో యతఁడెదురుగవచ్చుట సంభవింప నతనిపాదముల కెఱఁగి యేకాంతమగుచోటికిం గొనిపోయి పృథివీరాజువృత్తాంతమంతయు నెఱుకపఱిచి “తండ్రీ! ప్రతినిముసము నీరాకకై యెదురుజూచుచున్నాను. వచ్చెదనని చెప్పిన గడువునాఁటికి రాకుండుటకు మీకేమియాటంకములు సంభవించిన” వన నావచ్చిన మనుజుఁడు “ కుమారీ ! ఇల్లుబయలుదేరినది మొద లన్నియు నాటంకములే.చుట్టుపట్ల మ్లేచ్ఛులు

చేయుచున్న యార్భాటము లెక్కువైనవి. గ్రామస్థులున్న యూళ్ల వదలి యడవులపాలగుచున్నారు. ఎవరెట్లగుచున్నను ముందుజన్మింపఁ బోవువారలకు నాధారములగు గ్రంథజాలములు నాశనమై పోవుచున్నవి. నేనుమీతో వచించినప్రకారము మొన్నటికే రాకపోవుటకుఁ గారణము వినుము. ఇక్కడ కరువది మైళ్ళదూరమున నున్న యొక యూరిలోఁగల గొప్ప పుస్తకభాండాగారమును మ్లేచ్ఛులు తగులఁబెట్టి తద్గ్రామవాసుల నాశనము చేయుచున్నారని విని యాయూరి కేగి నిరాధారులై విలపించుచున్న యక్కడివారి నందఱఁ బురికొల్పి మహమ్మదీయులే తెంచిన నెదురింప సిద్ధము సేసితిని. అంతనానాఁడు ప్రొద్దుగ్రుంకిన యెనిమిదిగంటలకుఁ గొందఱుమ్లేచ్ఛులు మండుచున్న కాగడాలఁ బట్టుకొని గ్రామముఁ బ్రవేశింపఁదొడఁగిరి. అత్తరి నే సిద్ధము చేసియుంచిన గ్రామవాస్తవ్యసంఘమును మ్లేచ్ఛులూరిబయటనుండగనే వారిపై నడిపించితి. గ్రామస్థులు నాయుత్సాహంపు వాక్యములచే ధైర్యమూని శత్రువులతోఁబోరాడి చివరకు నందఱివధింపఁ గొద్దిమంది తప్పించుకొని పరువెత్తిరి. మరల నట్టిసమయము తటస్థించినఁ బోరునకుఁ బురికొల్పుకొనిపోవుట కొకని నేర్పఱచి నేనిట్లు బయలువెడలివచ్చితి." అన "తండ్రీ! నాయెడఁ జక్రవర్తికిఁగల యనురాగమంతయు వెల్లడియైనది. అతఁడు నిద్రాహారంబులుమాని కృశించుచున్నాఁడు.ఎటులైననతనివాంఛితంబు ద్వరలోఁదీర్పు" మన కుమారీ! నేఁడె నీకోర్కె నెరవేర్చెదను. నీవిఁక నీపురుషవేషము నుజ్జగించి చెలికత్తెలఁ గూడుకొని చక్రవర్తి యుండు ప్రాసాదము చెంతనున్న కేళీవనిలో విహరింపుచుండుము." అని యానూత్నమనుజుఁ డాజ్ఞాపింప నామెయు నట్లనే యొనరింపఁబోయెను. అనంతర మతఁడు బైరాగివేషముదాల్చియప్పుడే సార్వభౌమ కేళీవనిం జేరి యేమిజరుగునో యని యొకపొదరింట డాగియుండెను.

అంతఁ గొంతసేపటికిఁ జక్రవర్తి సంయుక్తవచ్చి తనయంకతలంబునఁ గూరుచున్నట్లొక కలగని దిగ్గున నులికిపడిలేచి యెవరును లేకుండుటచే విభ్రాంతుఁడై పార్శ్వవర్తులఁ బిలచి కమలాకరుఁ డెక్కడనని యడుగ "నతఁడుదయమున నేలేచి యెక్కడకో పోయినాఁడు. ఇంతవఱకు మఱలిరాలే" దని వారు వచించిరి. చక్రవర్తి యామాటలకు విచారమూని ప్రాసాదము నల్గడల వెతకించి కార్యముగానక వెతంబడుచు "హా! మొన్న నడిగినందుల కలుకవొడమి కమలాకరుఁ డెక్కడికో పోయియుండునని " అయ్యో! నా ప్రియురాలిదర్శనము గలుగక పోయినను నతనిగాంచుటవలన నింతసంతసించుచుంటి. ఇఁక నెవ్వరిఁగాంచి మోదమందుదు" నని వంతనొందుచు నటనుండ మనసొప్పక వనముం బ్రవేశించి యందొక మూల సంచరించుచున్న స్త్రీసంఘముంగాంచి యెవరోయని యించుక దగ్గరకేగి యందఱు తన పరిచారికా జనంబులై యుంట గుర్తించి వారి నచ్చోటుఁబాసి పొండని చెప్పుటకు మఱింత దగ్గరకేగి వారిమధ్య నవకళానిధిబోలెనున్న సంయుక్తంగాంచి పెన్నిధిం గన్న పేదవోలె సంభ్రమాక్రాంతచిత్తుఁడై కొంతతడ వామెను గనురెప్పలువ్రాల్చక గనుంగొనుచు నిలువఁబడి తుదకు "ఆహా! ఈతొయ్యలి యామెకదా! నామోహాంపుమొలక. ఎన్ని దినంబులకు నానేత్రసాఫల్యము గలిగినది. ఈలావణ్యగాత్రి యీయుపవన మెట్లుప్రవేశించెనో" యని యాశ్చర్యపడుచుండ సంయుక్తయు వాల్గన్నులఁదనప్రియుని వీక్షించుచుఁ దన్నతఁడు గాంచినతరి మరియొకవైపున జూచుచుఁ దలవంచుకొని నిలువఁబడియుండెను. చక్రవర్తి యామెవిలాసముంగని పట్టరాని తమకంబునఁ జేరవచ్చుచుండఁ జెంతనున్నపరిచారికలు పొదల మాటునకేగిరి. తోడనే యతఁ డామెపాణిగ్రహణము గావించెను. అప్పుడు వారిరువురకుఁ గలిగిన యానంద మింతింతయని వచింప నలవికాదు. ప్రస్వేదముద్భవింపఁ బులకలునిండార నిరువురు గొంతసేపటివఱకు

దేహములు మఱచియుండిరి. అప్పటివారిసౌఖ్యము కేవలమనుభవైకవేద్యమే గాని వేరుకాదు. చక్రవర్తిస్నిగ్ధమై కళలదేరుచున్న యాబాలికమోమునుగాంచి మోహమగ్గలమై త్రిప్పి ముద్దుకొనఁబోయెనుగాని యామె తటాలున ముఖము నవతలకుఁద్రిప్పుకొని చేయివిడిపించుకొని యించుకదూరమునకేగి నిలచెను. అంత నతఁడుమరల నామెను గలిసికొనఁ బోవుచుండఁ బొదరింటడాగియున్న బైరాగి బయటికేతెంచి యెదుట నిలచెను. చక్రవర్తి యతనిగాంచుటతోడనే తత్తరమంది నమస్కరించి నిలువ "రాజేంద్రా! నీపై మోహముగలిగియున్నను నీపె యింతవఱకుఁ గన్యకయేగదా. గురుజనంబులు లేనియెడ నీమెనొంటరిగఁ జేపట్టుట యుక్తమగునా? ఇప్పు డీమెం దగినపరిచారికలతో నంతఃపురముఁ జేరఁబంపుము. నీవు నీమందిరమున కేగియుండుము. పురమంతయు నలంకరింప నాజ్ఞాపించి రేపే మీవివాహము నెరవేర్చెద"నని బలుక యోగికి మాఱుబల్కనోడి యభీప్సితకార్యసిద్ధికాటంకము లెన్నైనగలుగుచుండు ననుకొనుచుఁ జక్రవర్తి యచ్చోటు విడిచిపోయెను. సంయుక్తయుఁ దరువాతఁదన్నుఁ జేరవచ్చిన పరిచారికలంగూడి రాణివాసమున కరిగెను. బైరాగి వివాహప్రయత్నము లొనరింప వెడలిపోయెను.

ఇరువదియైదవ ప్రకరణము.

యోగి తానువచించినప్రకారము మఱునాఁడు మహావైభవముతోఁ జక్రవర్తికిని సంయుక్తకును వివాహముగావించి నూతనదంపతుల దీవించి మరలవచ్చెదనని సెలవుపుచ్చుకొని వెడలిపోయెను. చక్రవర్తియు గమలాకరుండు సంయుక్తయేయని తెలిసినపిమ్మటఁ బట్టరాని యానందము నొంది తనకట్టియుత్తమసతి యర్థాంగి యగుటచే గర్వము నొంది యుండెను. కొలువుకూటమున కేగుటమాని సదాయంతఃపురమందే యుండుచువచ్చెను.

రాజుఇట్లున్నను మంత్రియగు విజ్ఞానశీలుండు మాత్రమేమరక జాగరూకుఁడై రాచకార్యములఁ జక్కబఱుచుచుండెను. మ్లేచ్ఛులదాడి కోర్వఁజాలకున్నామని పరగ్రామములనుండి యనుదినము లేఖలువచ్చుచుండెను. ప్రధానియుఁ జక్రవర్తికిలభించిన నూత్న సౌఖ్యమునకుఁ బ్రతిబంధకము గలిగింప నిష్టములేనివాఁడై తానే యన్నింటిసవరించుకొని పోవుచుండెఁగాని దినములు గడచినకొలఁది బత్రిక లెక్కువై తమరాజ్యమంతయు నల్లకల్లోలమగుచున్నట్లు తెలియవచ్చుచుండెను. అత్తరి మెల్లనఁ జక్రవర్తిం బిలిపించి సంగతులన్నియు విశదపఱుపగాఁ దనరాజ్యమునందట్టి హంతకు లుండరాదని మ్లేచ్ఛులకుఁ దెలియపఱుపవలసినదిగా నాజ్ఞాపించి యతఁడూరకుండెను. ఎన్నియుత్తరవులుపోయినను మహమ్మదీయు లారాష్ట్రము వదలకుండిరి. తుదకుఁ బ్రజలందఱు ఢిల్లీ రాజ్యమును విడిచిపోవుచున్నామని చక్రవర్తికడకు లేఖలనంపిరి. పృథివీరాజా లేఖఁగాంచి తానంతవఱకు నుపేక్షఁ జేసినందులకు నొచ్చుకొనుచు నాక్షణమున శాత్రవుల సమాచారము తెలిసికొనిరాఁ గొందఱి వేగులవారి నంపెను. వారును వెడలిపోయి మరల జనుదెంచి

మహామ్మదీయులు లెక్కకు మీరిన సేనలతో హిస్సర్‌పురమునద్ద నున్నారనియు వారినుండి కొందఱు గుంపులై బయలుదేరి గ్రామములం గొల్లబెట్టుచున్నారనియు వచించిరి.

అందుపైఁ జక్రవర్తి కిక్కువ హించి కుంభీలకుఁడనువాని సకలాక్షౌహిణీపతిగ నేర్పఱిచి దుర్ధరభీములనువారి వానికిఁ దోడిచ్చి యొకలక్షసైన్యము హిస్సర్‌పురమువైపున కంపెను. చక్రవర్తియాజ్ఞం దలఁదాలిచి కుంభీలకుండు నడుమ దటస్థమగునట్టి మ్లేచ్ఛులయొక్క బందిపోటు మూకల నాశనముగావించుచు హిస్సర్‌పురమున కఱుగుచుండెను.

సార్వభౌమసైన్యము వచ్చుచున్నదనివిని మ్లేచ్ఛసేనానాయకుఁడగు కుతుబుద్దీన్ సుల్తాన్‌గారిని దక్షిణము కొనిరమ్మని చారుల నంపి తాను జాగరూకతతోఁ గాచుకొనియుండెను. మఱియు గ్రామములపైఁబడి దోచుకొనఁబోయిన గుంపులును వచ్చి యతని గలిసికొనెను. కాని కుతుబుద్దీన్ లక్షసైన్యము వచ్చుచున్నదని విని తనవద్ద నేబదివేలసైన్యమే యుండుటవలన యమునాతీరమునందువలెనే మరల నపజయము కలుగునేమోయని భయమందుచుండెను. సుల్తాన్‌గారి కొఱకు ప్రతినిమేష మెదురు చూచుచుండెను. ఇంతలో సార్వసేన దృష్టిగోచరమై ప్రబలాట్టహాసంబున జనుదెంచుచుండెను. మ్లేచ్ఛులును దమతమ యాయుధములదాల్చి రణమునకు దిగిరి. సుమారు పగలు రెండుగంటలవేళ యుద్ధము ప్రారంభమయ్యెను. తమ కదివఱకుఁ గలిగిన పరాభవము దీర్చుకొననెంచి మహమ్మదీయు లత్యంత పరాక్రమముతోఁ బోరాడఁగడఁగిరి. కాని తగినట్టి రణశిక్షలేనివారగుటచే వందలకొలఁది నాశనమగుచుండిరి. ఆర్యులత్యంత నిపుణముతో నొక్కొక్కవ్రేటున కనేకమందిని నేలకు బలియిచ్చుచుండిరి. రణము మహాఘోరముగ నుండెను. నిమిషనిమిషమునకు సుల్తాను వచ్చుచు

న్నాఁడో లేదోయని కనుఁగొనుటకుఁ జాసులనంపుచు కుతుబుద్దీన్ సేన నుత్సాహపఱుచుచుండెను. మరునాటిదినము పగలు పదునొకండు గంటలవఱకు మహమ్మదీయు లత్యుత్సాహముతోఁ బోరాడుచుండిరి. అప్పటికిని సుల్తాన్ గారిజాడ లేమియు లేవయ్యె. అంతఁ గుతుబుద్దీన్ తాఁదలఁచినంత యైనదని చింతించుచు వైరిసేన ప్రబలముగ నుండుట వలనఁ దన కపజయము గలుగుట రూఢియని తలఁచి కొంచె మించు మించుగ నొంటిగంట వేళ సేననంతయు వెనుకకు మఱలవలసినదని యుత్తరవుజేసెను. కుతుబుద్దీ నాజ్ఞాపించిన మ్లేచ్ఛవాహిని వెన్నిచ్చి పాఱుచుండు టవలోకించికుంభీలకుఁడు వారి వెంటఁదగిలితరుమఁదన వారి కాజ్ఞాపింప నార్యులువిజృంభించి మహమ్మదీయుల దరుముకొనిపోవసాగిరి. ఇటులు సార్వభౌమసేనచే వెంబడింపఁబడినవారలై మ్లేచ్ఛులు స్థానేశ్వరమువద్ద కేగునప్పటికి సుల్తాన్ ప్రబలసేనాపరివృతుఁడై యెదురుగఁ జనుదెంచుచుండెను. సుల్తాన్ పరుగెత్తుకొనివచ్చుచున్న తన సేననాపి మరల యుద్ధమునకుఁ బురికొల్పెను. సుల్తాన్ మహమ్మద్ గోరీ వెంటవచ్చిన సైన్యమునందు బదివేల యూఫ్గన్లును, నెనిమిది వేల యరబ్బులు నిరువది వేలతురుష్కులు, మొగలాయిలునుండిరి కుంభీలకుఁడు వైరిసేన మిక్కుటముగ నుండుటగాంచి తనసేన నర్ధచంద్రాకారవ్యూహమున దీర్చి శాత్రవులఁ దాకఁబంచెను. అంత మరల పోరుమహాఘోరమయ్యెను. వివిధశస్త్రాస్త్రతాకుడులముల వేలకొలఁదిసైనికులు మడియుచుండిరి. ఇట్లిక్కడ ఘోరసంగ్రామము జరుగుచుండ నీవార్తలన్నియు కుంభీలకుఁడు చక్రవర్తికిఁ దెలియబఱిచెను.

కుంభీలకుని లేఖలవలన సుల్తాన్ తనయావత్తుసేనను గైకొని లాహోరు దుర్గమును విడచివచ్చినాఁడని తెలిసికొని, చక్రవర్తి, తనప్రాణస్నేహితుఁడును, బావమఱఁదియు మేవాడ్ పరిపాలకుఁడునగు సామర్సికి లాహోరును ముట్టడింప వర్తమాన మంపెను. సామర్సియుఁ జక్రవర్తి యాజ్ఞాపించినట్ల తనవద్దనున్న యేబది వేలసైన్యమును వెంటఁగొని లాహోరును ముట్టడించెను. ఆదుర్గమును సుల్తాన్ లేనికాలమున నస్రాఫ్ అనువాఁడు నలువదివేలసైన్యముతోఁ గాపాడు

చుండెను. సామర్స్ దండెత్తి వచ్చుటవిని యష్రాఫ్ తన సేనను దగుస్థల
ములందు నమర్చి రణమొనర్చి శాత్రవులఁ బారఁదోలవలయునని
యాజ్ఞాపించెను. వారునట్లే యుద్ధమొనరింపసాగిరి. సామర్స్ సైనికులు
ఫిరంగులఁ గోటగోడలచివరలకు గురిపెట్టికాల్చుచు గోడలపైకి మహా
మ్మదీయులురాకుండఁ జేయుచుండిరి. మ్లేచ్ఛులును సుల్తాన్ లేనితరి
నెటులైన మాటదక్కించుకొననెంచి పరాక్రమముమీరవైరులకుదారి
దొరకకుండఁ బోరాడుచుండిరి. సామర్స్ యెటులైన లాహోరును
మరల నార్యులవశముచేయ నదను కలిగెనని తనవారల కత్యంత
ప్రోత్సాహమొసఁగుచు రణము సేయించుచుండెను. ప్రాణముల
కాశింపక సాహసధైర్యములతో నార్యసైనికులు పోరాడుచు వారము
దినములకుఁ గోటబహిర్ద్వారములభేదించుకొని లోపలఁబ్రవేశించి రిపుల
నురుమాడఁగడఁగిరి. ఇక్కడ థానేశ్వరమువద్దనున్న మ్లేచ్ఛులు కుంభీ
లకుఁ జేర్పఱచిన యర్థచంద్రాకారవ్యూహమును భేదింపఁజాలక వేల
కొలఁది మడియుచుండిరి. ఒకవార మగునప్పటికి మహామ్మదీయసేన
సగమునాశనమయ్యెను. అత్తరి కుంభీలకుఁడు కపిలుఁ డనువానికి
గొంతసేననిచ్చి శత్రువుల వెనుకవైపునఁ దాకఁబంచెను. మహామ్మ
దీయు లార్యసేన సకలము దమముందున్న దనియే భావించిరిగాన
నిపుణులగు సేనానులు మొదలగు వారలీప్రక్కనే యుండిరి. అత్తరి
నాకస్మికముగఁ గపిలుఁడు వెనుకఁ దాకెను. గోరీ సంభ్రమాన్వితుఁడై
బాక్షా, షాప్దర్ జంగులను నిరువురునిపుణులగు సేనానులఁ గపిలుని
నెదురించి పోరాడఁ బనిచెను.నల్దిక్కులనార్యులు ముట్టడివైచియుండుట
వలనమ్లేచ్ఛవాహినియల్లకల్లోలమగుచుండెను.అంటలాహోరుదుర్గమున
నార్యులుక్కుమీరినరోషమునఁ దెగఁబడి మహామ్మదీయులనఱకి పార
వైచుచుండ వారిధాటికోరువఁజాలక తుదకు మఱియొకవారమగునప్పటికి
నష్రాఫ్ కాలికిబుద్ధిచెప్పి పారిపోయెను. సేనానాయకుఁడు కానరాకుం
డుటవలన మిగిలియున్న మ్లేచ్ఛసైనికులు నిరుత్సాహులై యంత్యసా
హసముఁజూపి మడియుచుండిరి. మరికొంద ఱష్రాఫ్మార్గము నవలం
బించుచుండిరి. మూఁడువారములు కడచునప్పటికి మహామ్మదీయులు

పూర్తిగ నాశనమై కోటసామగ్రి స్వాధీనమయ్యెను. తనవిజయవార్త చక్రవర్తికి దెలియఁబఱిచి, దుర్గముయొక్క శిథిలములైనగోడల బాగుచేయించి వానిపై ఫిరంగులనెక్కించి మరల దన్నెవరైన నెదురింపవచ్చిన నోడించుటకు సామగ్రి సంసిద్ధుఁడై యుండెను.

ఇట స్థానేశ్వరమువద్ద నొకమాస ముగునప్పటికి మ్లేచ్ఛసేన విస్తారభాగము నాశనమయ్యెను. అంతసుల్తాన్ దాను లాహోరునుంచివచ్చిన సైన్యముం గొనిరమ్మనిచారులవల్ల సమాఫకు వర్తమానముంప వారు తిరిగివచ్చి యక్కడిసమాచారము నెఱిఁగించిరి. సుల్తాన్ మహామ్మద్ గోరీ లాహోరు శత్రువులపాలైనదని విస్మయాపేతుఁడై యిఁక నట నున్నఁ దనకు మరణము సంభవించుట నిశ్చయమని తలఁచి చతురులగు నూర్గురు సైనికులను, గుతుబుద్దీనును వెంటగొని యొకరాత్రివేళ పాఱిపోయెను. మఱునాఁడు రణమునందుసుల్తాన్ గానరాకుంటచే నతఁడు రణములోఁ జచ్చియుండఁబోలు నని మహామ్మదీయులు శౌర్యహీనులై పరుగిడఁజొచ్చిరి. ఆర్యులొకనినైన దప్పించుకొనిపోకుండ మట్టుపెట్టుచుండిరి. కొన్నిదినము లగునప్పటికి సుల్తాన్ సైన్యము సంపూర్ణముగ ధ్వంసమయ్యెను. హతశేషులగువారిఁ బట్టించి డిల్లీకి ఖైదీలుగఁబంపి కుంభీలకుఁడు తనజయవార్తను జక్రవర్తికిఁ దెలియఁబఱిచెను. శాత్రవుల యుద్ధోపకరణములన్నియు నార్యులపాలఁబడెను. కుంభీలకుఁ డట్టి మహాజయముతో డిల్లీనిప్రవేశించెను. అతఁడురాజధానిఁ జేరినదినమున ననేకములగు నుత్సవములు జరిగెను. చక్రవర్తియు మహోల్లాసమునొంది రణప్రావీణ్యము గనుబఱిచిన సేనానులకనేక బహుమతులొసఁగిమన్నించెను. సంయుక్తయు దననాయకునకుఁ గలిగిన జయమువలనఁ బరమానందభరితయై రణమునగతించినశూరుల కాంతల రప్పించి వారిననేకగతులనోదార్చి మన్నించుచు నట్టివారలకుఁ దగిన జీవనోపాయంబులఁ గల్పించెను. మ్లేచ్ఛుల యార్భాటము లడుగంటనందున దేశమంతయు నెమ్మదియై పౌరజనంబులెల్ల సౌఖ్యాంబురాశి నోలలాడుచుండిరి.

ఇరువదియాఱవ ప్రకరణము

సుల్తాన్ షహాబుద్దీన్ మహమ్మద్ గోరీ యిట్లు ఆర్యచక్రవర్తి సేనచే నోడింపఁబడి లాహోరుదుర్గము సైతము పోయినందున విచార మగ్నుఁడై యార్యావర్తము జయించునాస యడుగంట నాకస్మికముగ నెవరైన నెత్తివచ్చిన నెదురింపఁదగిన సేనయు లేమి నిఁక నిఁటనున్న ప్రాణాపాయకరమని తత్క్షణము నాఫ్గన్ స్థానమున కేగ బయలువెడలి సింధునదిం జేరి కుతుబుద్దీన్ సలహా ప్రకారము ఘాజీఘాటుయొద్ద విడిసెను.

ఈవార్తలన్నియుఁ గన్యాకుబ్జనగరమునఁ దెలిసినవెంటనే జయచంద్రునకుఁ గలిగిన కడుపుమంట యింతింతని వచింప నలవికాదు. ఇతనికి మఱింతరోష మెక్కించుటకుగా నీశ్వరభట్టు పూనుకొనియుండెను. ఆ మఱునాఁడు సుల్తాన్ గారికి సహాయ్య మొనరించుటంగూర్చి యొక పెద్దసభ గావించిరి. దానియందు ప్రధానులు, మంత్రులు, దండనాయకులు మొదలగువారందఱు బరివేష్టించి యుండిరి. ఈశ్వరభట్టుచే ప్రేరేపింపఁబడినవారలై సేనాపతులందఱు సుల్తాన్ గారికి దోడుపడ వలయుననియే వచించుచుండిరి. వినయశీలుఁ డొక్కఁడుమాత్రము వలదని వారించుచుండెను. అత్తరి రాజుగారు మ్లేచ్ఛులకు సహాయ మొనరించియే తీరవలయునని వచింప వినయశీలుఁ డిట్లనియె. "జయచంద్రా! పూజనీయఁబగు నార్యావర్తమును గోహంతకులగుఁ గ్రూరులపాల నేలఁబడవైచెదవు? ఇదివఱకు మనప్రజ లనుభవించిన బాధలవినియు మరల నిట్లేలకావించెదవు? చక్రవర్తిపైగల ననూయ విడనాడుము. నీకతఁడు చేసిన యపకారమేమి కలదు? నీవే విచారహీనుండవై మున్నొందతనికి నిష్ఠూరముగ లేఖనంపిన పిదప నీపైదండెత్తివచ్చెనఁట గాని నీ

వలెని నవమానపఱిచిన సంగతి వినియు నూరకుండెనని వినియుంటిని. స్వార్థపరులును దురాలోచనాసంగతులునగు నీశ్వరభట్టు మొదలగు వారి పల్కు లాలించి నిష్కారణముగ నేల చెడిపోయెదవు? ఇతఁడు నిన్ను నాశనముగావించి తానును నాశమగునట్టి కుయుక్తులే వచించుచుండుఁ గాని నీమేలుగోరి చెప్పుటలేదు. పరదేశముల రాజులు మనదేశముపై దండెత్తి వచ్చినపుడు మన కదివఱకున్న మనస్పర్థల సహితము వదలుకొని యందఱు మొకటిగాఁగూడి దేశమును రక్షించుకొను నుపాయముఁ జూడవలయుఁగాని పరులకు సహాయ మొనరించు టెక్కడనైనఁగలదా? నీవును జక్రవర్తియుఁ గలిసి మ్లేచ్ఛులఁ బారఁ దోలుటకు మాఱు నీవూరకుండనైన నూరకుండక మనదేశమందు నిలువ నీడలేక పాఱిపోవుచున్న సుల్తానును మరలఁ బిలిపించి యతనికిఁ దోడ్పడు టెంత వెఱ్ఱితనము. ఇదివఱకు లాహోరు వాస్తవ్యులగు నార్యు లెందఱు తమ దేశమును త్యజించి మనకడ కేగుదెంచి మ్లేచ్ఛులు పెట్టిన బాధలఁ జెప్పుకొని యేడువలేదు. నీవు సహాయ్య మొనరింపకున్నను జక్రవర్తి యతనిఁ బాఱఁదోలినాఁడని వినుటకు నాకెంతయు సంతసముగనున్నది. నామాటఁ బాటించి నీవింతటితో నూరకుండుము. కుత్సితుఁడగు నీ భట్టువాక్యములు వింటివా నిక్కముగఁ జెడిపోదువు." అన భట్టుగారుగ్రుఁడై లేచి "రాజేంద్రా! మానాభిమానములు కలవా రెవ్వరు నిట్లువచింపరు. నీవు సుల్తానుకు సాహాయ్యపడఁ బోవుచున్నావనుకొల? అతనినే నీవు సాయముగఁ దోడ్కొని చక్రవర్తిపై దండెత్తనున్నావని యేల తలఁపరాదు. నేను నీనాశనముగోరి యొక్కనాటికి వచింపను. క్షత్రియుండగు వాఁడు తనవైరము దీర్చుకొనంజాలక యాఁడుదానివలె నింటఁగూరుచుండి యున్నచోఁ దనప్రజలకే తనపైఁగల యభిమానము దప్పిపోవును. అట్టియెడ నిన్ను బ్రోత్సాహము చేయుచుంటిమే కాని మేమేమియు నాశనము చేయుటలేదు. మీఁదు మిక్కిలి యీప్రధాని

వంటి వారలే నిన్ను నిరుత్సాహపఱుచు నడ్డంకులఁ గల్పించి చెప్పుచున్నా" రనెను. దండనాయకులు మొదలగువార లంతకుమును పే భట్టుగారిచే బోధితులై యుండుటవలన వారును సుల్తానునకు సాహాయ్య మొనరింపవలయుననియే పలుకుచుండిరి. జయచంద్రుఁడు నట్టియుద్దేశమునే కలిగియుండెను. ఇంతమంది మూర్ఖుల లోపల నొక్క వినయశీలుఁ డేమిచేయఁగలుగును? అయినను వినయశీలుం డూరకొనక మరల "రాజచంద్రా! అన్యాయపరుఁడవై కుమార్గగాములగు వారివాక్యము లాలించి యేల నిష్కారణముగఁ జెడిపోయెదవు? పక్షపాతవిహీనమతివై బాగుబోగుల విచారించి చూచుకొనుము. ముందు నీవంశమున జన్మింపఁబోవు వారల కీదేశంబునఁ గాలునిలుపరాకుండఁ జేయకుము. అనేకవేల సంవత్సరముల నుండియుఁ బరదేశముల వారిచే మన్ననలందుచు వచ్చుచున్న మనదేశమును ధ్వంసముచేయకుము. అదియుంగాక యీ భట్టుగారు నీయెడ నేవిధమైన ద్రోహము దలపెట్టి యుండలేదని వచించుచున్నాఁడుకదా? ఒకనాఁ డీమూర్ఖుఁడును వీని యనుచరులిరువురును నీకొమార్తెను గడతేర్ప నిశ్చయించినారు. దేవశర్మమూలమున నీనిమిత్తుల కిరువుర కానాఁడే మృతిగలిగి సంయుక్త కాగండము గడచిపోయినది. ఇతఁడు నీయొద్ద దప్పించుకొనుటకై వారిని సుల్తాను కడకు బంపియుంటినని వచించినాఁడు. వీనిరహస్యములన్నియు నితనివద్దనున్న కంచుకికి బాగుగఁ దెలియును. కావలయునన్న నతనిఁదెప్పించి యడిగిచూడుఁ" డన గంచుకిని బిలుపించియడుగ నతఁడు వినయశీలుఁడు వచించినప్రకారమే చెప్పెను.

అత్తరి భట్టుగారు వినయమంతయు దనమొగముననే తాండవమాడ లేచి "మహాప్రభో! వీరలు వచించునదియేమో నాకుఁ దెలియకున్నది. ఈ వినయశీలుఁడు మెల్లగ నాకడనున్న కంచుకిని లోఁబఱ

చుకొని వానిచే నిట్లు బలికించినాఁడు. అదియుంగాక నీతఁడు చెప్పిన దినమున నే నిల్లువదలి బయటఁబోకుండినట్లు మీకు సాక్ష్యమిప్పించెద" నని నల్గురు మనుజుల బిలువనంపి వారిచే నట్లే చెప్పించి వెండియు నిట్ల నియె. "ఇతఁడు నామిత్రులనిరువుర దేవశర్మచంపినట్లు వచించుచున్నాఁడు గదా! వారల నిద్దఱి గుతుబుద్దీన్‌ వద్ద కనిచి యుంటినో లేదో యతని దగ్గరనుండియే లేఖదెప్పించి మీకుఁ గనుపఱిచెదను." అని ఖండిత ముగఁ బలుక జయచంద్రుఁడును దనకూఁతురువిషయమై యంతగా విచారింపకున్నాఁడు కాన భట్టుగారి వాక్యములనే విశ్వసించెఁగాని వినయశీలునిమాటలఁ బాటిగొనఁడయ్యెను. అంత దా నెన్నిగతుల వక్కాణించినను దన్ను లెక్కగొననందున వినయశీలుండు కోపమూని "దుర్మార్గులారా! మీబోటివారలున్న రాజ్యమెన్నటికైనఁ గుదుటఁ బడునా? మీ మూలముననే యిదివఱకు జక్రవర్తితో యుద్ధము కలిగి లక్షలకొలఁదిగనున్న సేనయంతయు నాశనమైనది. అనేకతర ములనుండి ప్రఖ్యాతిమీరి వచ్చుచున్న గన్యాకుబ్జరాజ్యము నేఁటికి మీ కారణమున నిర్మూలము కావలసివచ్చినది." అని సభవారింగూర్చి పలికి నృపుని వంకకుఁదిరిగి "జయచంద్రా! నావాక్యముల నించుక విశ్వసింపుము. చక్రవర్తితో వైర మూనకుము. మ్లేచ్ఛులఁ జేరదీయ కుము. అట్లు చేరఁదీయుటవలన నీమాతృభూమికంతయు నపకారము గావించినవాఁడ వగుదువు. నీమౌర్ఖ్యము విడువుము." అన జయచం దుఁ డేమియుఁ బ్రత్యుత్తరమీయకుండెను. అంత మగల వినయశీ లుఁడు "ఏమి! ఇంతగా వచించుచున్నను నామాటలయందు నీకించు కైనవిశ్వాసము గలుగలేదుగా. ఆసన్నకాలము సమీపించినవాఁడు తనమేలుగోరి చెప్పు మిత్రులఁ బాటింపఁడనుట కిప్పుడు నీవు నిదర్శన ముగ నగపడుచున్నావు. అంత నామాటలయందు నీకు నమ్మకము గలుగనిచో నాకీకష్టమంతయు నేటి"కని తనప్రధానిత్వమునకు రాజీనా మాయొసంగి వెడలిపోయెను.

వెంటనే భట్టుగారులేచి "రాజా! ఇతఁడు తాను బెదరించి పోయిన నీవు భయపడి మరల నతని కాళ్లు పట్టుకుందువని యిట్లు కావించినాఁడు. ఇప్పుడు నీ కెంతమాత్రము భీతికలుగుట కవకాశము లేదు. ఇతఁడు పోయిన నిన్ను నిరుత్సాహపఱుచువారు లేకుండఁబోయి రంతియే చాలు. నీ వింతకాల మితని ప్రథానిగఁ బెట్టుకొని రాజ్య మెటు లొనరించుచుంటివో నాకాశ్చర్యముగ నున్నది. ఇటువంటి పిరికిపందల మంత్రులుగానుంచుకొనుట నీదేతప్పిదము. అందుకొఱకే యితనివిషయమై నీతో నెన్నిపర్యాయములో వచించియుంటి. అప్పుడు నామాటవినకపోతివి. ఇప్పుడెవరు పొమ్మనకుండఁ దనంతఁ దానే వెడలిపోయినాఁడు. శత్రువుపైకి నేతెంచి తల నరుక నున్నప్పుడుకూడ నూరకుండుమని వచించు నంతటివాఁడే. కానిమ్ము! ఇఁకనైన నీవు బాగుపడు నుపాయము చూచుకొనుము. మనమిదివఱకు వ్రాసిపంపిన లేఖలఁ జూచుకొని కొందఱు వచ్చిరికదా! తక్కినవారికి మరల వ్రాసిపంపుము. ఇంతలో నేను గుతుబుద్దీనుకు వర్తమాన మంపెదను. ఒకవేళఁ జక్రవర్తిచే నోటమికలిగిన మరల లాహోరునకుఁబోక సింధునదీతీరమున ఘాజీఘాటువద్ద నుండవలసినదని యతనికిదివఱకే తెలిపియుంటిని. ఇప్పుడు వారికి లాహోరుమార్గమునసహింతము పోయినందున నక్కడనే విడిసి యుందురు. ఆఫ్గనిస్థానమునుండి నూతన సైన్యమును దెప్పించుకొనవలసినదిగా వారికిప్పుడు తెలియపఱిచెదను" అన జయచంద్రుఁడు యుక్తాయుక్తముల విచారింపక భట్టుగారు వచించునదంతయుఁ దనకు లాభకరమేయని తలంచి పట్టియున్న యనుమానపిశాచమును వదలించుకొనఁజాలక రాకతక్కిన తనమిత్రులగు నితర రాజులకు మరల వర్తమానముల నంపెను. అంత నాఁటికి సభజాలించి యందఱు వెడలిపోయిరి. ఈశ్వరభట్టు వినయశీలుఁడు పోయినందుల కత్యంత సంతోషభరి

తుఁడయి తన నిలయమునకేగి కుతుబుద్దీనున కీక్రిందివిధమున లేఖ వ్రాసెను.

"ఆలీసర్కార్ కుతుబుద్దీన్ నవాబ్‌గారి దివ్యసముఖమునకు మీమిత్రుఁడీశ్వరభట్టు విన్నవించుకొనున దేమన:—

ప్రస్తుతము మీకుఁగలిగిన బరాజయమువలన నాకపరిమితమగు దుఃఖము గలిగినది. అయినది కానిండు. మీరెంతమాత్ర మధైర్యపడ వలదు. ఇక్కడ జయచంద్రునిఁ బూర్తిగ నా వలలో వేసికొన్నాఁడను. నాపలుకన్న జవదాటఁడు. మీకుఁదోడ్పడి చక్రవర్తినెదురింప నిశ్చ యించుకొన్నాము. మఱియు వినయశీలుండను నేఁడు తనపనికి రాజీనామా యొసంగిపోయినాఁడు. ఇఁక జయచంద్రునకు నాకు విరుద్ధముగఁ జెప్పువారెవరును లేరు. మీరు మీదేశమునుండి తగినంత సేనను దెప్పిం చుకొని నా కాసమాచారము దెలియఁజేసినతోడనే యితనివెంటగొని నే మిమ్ము గలిసికొనెదను. తమరు మీమాట జెల్లించుకొనుకాలము సమీపించుచున్నది".

ఆయుత్తరములో ఘూజీఘాటువద్దకేగి కుతుబుద్దీను కియ్యమని చారులచేతి కిచ్చిపంపెను. కతిపయదినంబుల కాచారులు ఘూజీఘాటు జేరి కుతుబుద్దీను కాజాబులనియ్యఁ నతఁడదిచూచుకొని సంతోషభరి తుఁడై వానిసమాచారము సుల్తాన్‌గారి కెఱుకపఱిచెను. గోరీయు మరల నార్యావర్తమున నిలుచుటకు నీడ దొరికెనని సంతసించుచు గజినీయందున్న తనతమ్మునకు చేతనైనంత సేనను వెంటగొని ఘూజీఘాటు వద్దకు రావలసినదిగఁ దెలియఁబఱిచి పెచ్చుపెరిగిన మచ్చరమున నెప్పు డార్యావర్తపుఁ జక్రవర్తిని గడతేర్తునా యని కాచుకొనియుండెను.

ఇరువదియేడవ ప్రకరణము.

స్థానేశ్వరమునద్ద సుల్తానోడిపోయినపిదపఁ దనరాష్ట్రములలోని ప్రజ లెల్లరు వేనోళ్ళఁ బొగడుచుండఁ జక్రవర్తి రాజ్యమేలుచు సుఖముగఁ గొన్నిదినములు గడపెను. అనంతరము పరదేశముల మెలఁగుచున్న వేగులవారరుదెంచి జయచంద్రుఁడు జేయుచున్నకుట్రలఁ దెలియబఱిచిరి. చక్రవర్తి యందులకింతసేవు విచారించి యూరకున్నఁ గార్యము లేదని మఱునాఁడొక గొప్పసభ జరిగించెను. అందు ప్రధానులు అక్షౌహిణీపతులు మున్నగు రాజ్యమునకు సంబంధించిన గొప్పయధికారులందఱు వచ్చి పరివేష్టించియుండిరి. అత్తరి బృథ్వీరాజు తానున్న పీఠమున లేచి నిలువఁబడి "సభికులారా! నిన్న మనచారులు కొనివచ్చిన వృత్తాంతముల వినియేయుందురు. మరల నిప్పుడు చెప్పుచున్నాను. జయచంద్రుఁడు మనతోఁ బూనుకొన్న వైరమును మానక మనదేశమునఁ గాలుపెట్టుటకైన వీలులేక పాఱిపోవుచున్న సుల్తానునకుఁ దోడ్పడి నాపై దండెత్తింపఁ బ్రయత్నములఁ జేయుచున్నాఁడఁట. మఱియు మనదేశంబునఁగల యితరసామంతులనుగూడ దోడ్కొని వచ్చెదనని మ్లేచ్ఛునకు వర్తమాన మంపినాఁడఁట. ఈజయచంద్రు నెంత బుద్ధిహీనుఁ డనవచ్చును. వీని మూలమున మనదేశ మన్యులపాలగుకాలము వచ్చినటులున్నది. ఈవిధముగ రణములపై రణములు చేయుచున్న నెన్నాళ్ళని నిలువఁగలము? ఇదివఱకైన యుద్ధములవలననే యమితమగు ధననష్టమును సేనానష్టమును సంభవించియున్నదికదా! ఈనిచునితోఁగల వామాడ మొదలిడిన నాటినుండియు మనప్రజల కెక్కడలేని యిక్కటులు కలుగుచున్నవి. అయ్యో! ఈజయచంద్రున కింతమాత్రము యుక్తాయుక్త వివేచనజానమెందులకు లేదా యని నాకుఁ జింతకలుగు

చున్నది. ఇంతవఱకును మనయార్యావర్తమునందలి రాజులేకీభవించి యుండుటచేతనే కదా పరదేశములవారు దీని మ్రింగివేయఁ గాచుకొని యుండియు నేమియుఁ జేయఁజాలక యూరకున్నారు. ప్రస్తుతపుస్థితినిఁ బట్టి విచారింప మనదేశ మన్యులపాలగుట రూఢియని తోఁచుచున్నది. తనకంత నాపైఁగోపమున్న స్వయముగఁ దానొక్కఁడె నాపైదండెత్తి వచ్చి జయముఁగొనరాదా! అటులొనరింపఁ జేతకాక మనకుఁ బ్రత్యక్ష వైరులగు మహమ్మదీయులకా తానుతోడ్పడుట. వీఁడు కావించు చున్న కృత్యములఁ దలఁచినకొలఁది నాయొడలు మండుకొని పోవుచు న్నవి. ” అనిబయటికి వచ్చుచున్న కోపము నాపుకొని మరల నక్షౌహిణీపతులతో “సేనానులారా! మీ సేనాసమూహంబుల నన్నింటిఁ జక్కపఱచుకొని రణమున కేగ సిద్ధముగనుండుఁడు. మీదేశమును రక్షించుకొనవలసిన సమయము వచ్చుచున్నది. జీవముల కాశింపక పోరాడి ప్రఖ్యాతిఁగాంచవలయు. పిరికితనము వహించి రణరంగమున వెన్నిచ్చి పాఱువార లిక్కడనే యాగిపొండు. అట్టివారల నేనెంతమాత్రము బలవంతపఱచను. ఇక్కడ ప్రగల్భములు పలికి రణమున బరువెత్తువారల కెట్టి కఠినశిక్షనైన విధించెద. భారతయుద్ధమైనతర్వాత నింతగొప్పసంగ్రామము జరిగినటు లెన్నఁడు వినియుండలేదు. కావున లేశమాత్రమైనఁ బ్రాణములపై నాసబెట్టుకొనక తుదవఱకు యుద్ధమొనరించి పాండవసేనానాయకులంబలె శాశ్వతకీర్తుల నందుఁడు. ”

ఇట్లు చక్రవర్తి పలుక సేనాధిపతులందఱొక్కపర్యాయమున లేచి “ రాజేంద్రా! దేవరవా రింతగ సెలవియ్యవలయునా? మా రణకౌశలము గాంచి మీరే యప్పుడు మెచ్చుకొందురుగాక. ఇప్పు డూరక వచించినఁ బ్రయోజనమేమి? శక్తిహీనమగుపర్యంతముఁ బోరాడుచుందు మని నిక్కముగ నమ్మియుండుఁడు. ” అని యేకవాక్యముగఁ

బలుకఁ జక్రవర్తి సంతసించి వెండియు "మీనేర్పు నేనెఱుంగనా! అయినను జెప్పవలసినమాటలు చెప్పితి" ననెను. అత్తరి విజ్ఞానశీలుఁడు లేచి "మహాప్రభో! నాదొకచిన్న మనవికలదు. ఇప్పు డాజయచంద్రుఁడు చేయుచున్న కార్యములఁబట్టి యాలోచింప మనకెల్లను పోరు తప్పదు. అది నిశ్చయమే అయినను నేకార్యమును గాని సాధ్యమగునంతవఱకు సామ్యముననే చక్కఁబఱుచుకొను టుచితముకాన మరల మిత్రబంధుభావములతో నాజయచంద్రున కొక లేఖవ్రాసి పంపుము. పిదప సంగతులన్నియు విశదములగును" అంతఁ జక్రవర్తి. "విజ్ఞానశీలా! నీవుచెప్పునవి యన్నియుఁ బక్షపాతరహితుఁడును నసూయావిహీనుండును నగువానియెడ ఫలించుఁగాని యీదుర్మార్గునియెడ సఫలములగునా? మఱియు మనమెంతసామ్యమున వేఁడుచున్న యంత మనతల కెక్కుఁగాని యతఁడు మంచిమార్గమునకు వచ్చుననుట కల్ల. అయినను నీమాటఁగాదనను. నీయాలోచనప్రకారమటులే పత్రిక వ్రాసిపంపెద" నన యొకలేఖ నీక్రిందివిధముగ వ్రాయఁ దొడఁగెను:—

"స్వస్తిశ్రీ కన్యాకుబ్జపురాధీశుఁడగు జయచంద్రుని సన్నిధికి. నీ వార్యసంతతివాఁడ వైనందున మనమందఱము బంధువులమైయున్నాము. అదియుంగాక మనకిద్దఱ కిప్పుడు మఱింత దగ్గఱబాంధవ్యము చేకూరినది. బాంధవ్యముమాట యటులుండనిమ్ము. పరస్పరకలహములులేక మన మందఱము గలిసియుండి మాతృభూమిని రక్షించుట మనకు విధియైయున్నది. పరదేశములవార లీదేశముపై దండెత్తివచ్చినప్పు డొక్కభావముతో నందఱ మేకమైవారిఁ దఱిమివేయకున్న మనకీరాజ్యములు నిలుచుట దుర్లభము. ఇదివఱకే మనలో మనము వైరముఁ బెట్టుకొని మనప్రజల కనేకగతులబాధలు కలుగఁజేసియున్నాము. అట్టివిషయములో నాచేనోటువడి యావల లాహోరుదుర్గమును బోగొట్టుకొని యార్యావర్తమునందు నిలువనీడలేక స్వదే

శమునకుఁ బరువెత్తి పోవుచున్న సుల్తానునకు నీవు తోడుపడుచున్నా వని వినుటకు నాకెంతయుఁ జింతగనున్నది. నీవింతటియజ్ఞాని కేటికైతివో యూహింపఁజాలకున్నాను. మన మందఱముఁ గలసి పరులఁ బారఁదోలుట లేకపోవఁ బరులకే సాహాయ్యమొనర్చి నాపైఁ బంపు టెంత వెఱ్ఱితనము. మనచుట్టుప్రక్కలనున్న దేశములవారిట్టియజ్ఞానంపుగృత్యముల సలిపిరని యెన్నఁడైన వినియుంటివా? కావున నిఁకనైన నిట్టియవివేకపుఁ గార్యముల నొనర్పు టుడిగి సుల్తానుతో మైత్రి వదలుము. నీ భావిసౌఖ్యమునకు భంగము కలిగించుకొనకుము. నీకు భయపడి యిట్టిలేఖల వ్రాసితినని తలఁపకుము. అన్యులేతెంచిన మనమెల్లర మేకీభవించి వారిఁ దరిమి వైచి మాతృభూమిఁ గాపాడుకొనువిధి మనదై యుండుటవలన నిట్లు లిఖించినాఁడ గాని వేఱొండు గాదు. నాతోఁగల వైరమే ప్రధానముగఁ జూచుకొనకుము. మాతృదేశరక్షణోపాయ మరసికొనుము."

ఇట్లు వ్రాసి ధీయుతుండగు నొకరాయబారిచేతి కొసఁగి పంపి నాఁటికిఁ గొలువుఁ జాలించి వెడలిపోయెను. రాయబారి కతిపయదినంబులకుఁ గన్యాకుబ్జమున కేగి రాజసభాద్వారముఁ జేరి లోపలికిఁ జెప్పిపంప నిపుడు సందర్శింపవలను కాదని జయచంద్రుఁడు ప్రత్యుత్తర మంపెను. మఱునాఁడు నట్లే జరిగెను. అనంతరము నాలుగైదుదినములు గడచిపోవ నప్పుడు నట్లే జరిగెను. వచ్చినప్పుడెల్ల రాయబారిం జూడ వలను కాదని తిరస్కరించుచు యుద్ధమునకుఁ బ్రయత్నములఁ జేయించుచుండెను. రాయబారి యిదంతయు గ్రహించి తత్క్షణము డిల్లీ కేతెంచి కనూజియందు జరిగినసమాచారముఁ జక్రవర్తికిఁ దెలియఁబఱిచెను. అతఁడును రోషపూరితుండై యిఁక నాలస్యముఁ జేసిన కార్యము లేదని సేనాపతుల నెల్లరఁ బిలిపించి యుద్ధమునకు సర్వసిద్ధులై యుండవలసినదని యాజ్ఞాపించి తాను సంయుక్తమందిరమున కేగెను. అట రాణివాసముననున్న సంయుక్తయుఁ దనతండ్రి చేయుచున్న చేష్టలకుఁ జింతాకులయై కూరుచుండియుండఁ బరిచారిక లేతెంచి చక్రవర్తి వచ్చుచున్నాఁడని తెలిపిరి. తోడనే యామె లేచి మగని కెదురువోయి నమస్కరించి కొని వచ్చి తల్పమున నాసీనుం జేసి యతని ముఖ మించుక వన్నె దరిగియుండు

టవలోకించి మెల్లగ నిట్లనియె. "నాథా! నేఁడు మీవదనము క్రొత్తగ నున్నది. అందులకుఁ గారణ మే నెఱుఁగుదు. దీనికి మీరు చింతింపవలసిన పనిలేదు. నా తండ్రి యిట్టి కుమార్గగామి యయ్యెనని వినుటకు నా కెంతయో లజ్జగ నున్నది. యుక్తాయుక్తవివేచనలేక యతఁడు చేయఁగడఁగిన దుష్కార్యములఁగూర్చి విన్నకొలఁది నాకమితమగు రోషము గలుగుచున్నది. ఇతఁడు నాజనకుఁడైనమానె. ఇట్టిదేశద్రోహులు బ్రతికియుండుటకన్న మరణించుటయే మేలు. అయ్యో! అతఁడే సజ్జనుఁడై మనయందఱితోఁగలసియున్న నేనిప్పు డెట్టి యుల్లాసస్థితియం దుందునో కదా. అట్టిభాగ్య మీనిర్భాగ్యురాలి కీజన్మంబునఁ గలుగ నేరదు. అతనివిషయమై మీ రెంతయైనఁ జింతఁ బెట్టుకొనకుఁడు. మీదేశక్షేమమునకై నాపైఁగల మోహముం ద్యజించి సంగరమున కరుగుఁడు. తమసెలవైనచో నాతండ్రియని శంకింపక నేనును దమకు సాయముగ జనుదెంచెదను. సంభవించిన మన కిరువురకు రణముననే మరణము సంభవింపనిండు. అందులకు నా కావంతయైన విచారము కాని భీతికాని లేదు" అని ధీరత్వము తోఁపఁబల్కిన తనప్రియాంగనవాక్యము లాలకించి చక్రవర్తి సంతోషపరవశుఁడై యామె నాలింగన మొనరించుకొని "సతీ! నీవంటియుత్తమసాధ్విం జేపట్టిన నా కేకొఱంతయైన గలుగునా? నాపురాకృతపుణ్యవశంబున నీవు నాకు లభించితివి కాని వేరొండు కాదు. పురుషునిమదికిఁ జింతకలిగినతఱి సమయోచితంబులగు మృదుమధురవాక్యములచే నతని దేర్చునదియే యతని పాలిటి భాగ్యదేవత యనం జెల్లుగాని లేకున్న మృత్యుదేవతయే యగుగదా. నీ విప్పుడు వచించిన పల్కులెంతయు నాదరణీయములు. చెలీ! నీ రణకౌశలము నే నిదివఱ కనేకపర్యాయములు గాంచియేయున్నాను. ఘోర సంగ్రామమున నాతలఁ దెగవ్రేయనున్న కహారకంఠీరవు నొక్కవ్రేటున దునిమి నన్నుఁ గాపాడినదానికంటె వేఱుగఁ జూడవలయునా? నీ వీ భూచక్రమునంతయుఁ బాలింపఁదగియున్నావనుట కెంతమాత్రము సందియము లేదు. అయినను యుద్ధమునకుఁ గొనిపోవుతలఁపున మన నగరమందలి యౌవనవంతు లందఱకు రణశిక్ష నేర్పించి యుంచినాను.

వారందఱిపుడు నాతో రా సిద్ధముగనున్నారు. మేమందఱము రణ స్థలికేగ నగరమున నుండు కొద్దిసేనకును తక్కిన స్త్రీతోడి కాంతలకును నిచట రక్షకు లెవ్వరు నుండరు అట్టి తరుణమున నాభారమంతయు నీ యదియే.” అన సంయుక్తమరల “నాథా! నాసఖియగు మంజరిని మీ రెఱింగియేయున్నారుగదా. ఆకన్నియ యేవిషయమందును నాతో దీసిపోవునది కాదు. నాకన్న మిన్నయనియే చెప్పనొప్పును. ఆమెను మనము లేనికాలమున నిక్కడ నుంచవచ్చును. ఆమె యిప్పుడు కన్యాకుబ్జనగరముననే యున్నది. ఆమెకడనుండి జాబురాని దినములేదు. మఱియు లేఖఁదెచ్చినవార లామె నాకొఱకై పరితపించుచు గృశించి పోవుచున్నదని వచించినారు. నాకు నామెం బాసియుండుటవలన నెట్లోయున్నది. ఇత్తరి బిలిపింపఁదగిన సమయమువచ్చినది కావున జాబునంపి రప్పించెద. నాయుత్తరముగాంచినవెంటనే బరువెత్తుకొని వచ్చును. ఆమె నిటనుంచిపోయిన మనకేమియు భయములేదు. నాకు మీతోయుద్ధమునకే తేరగడు నభిలాషగ నున్నది కాన నింతగా వేఁడు కొనుచున్నదానను. కాదనక యనుగ్రహింపుఁ” డని పలుకుచున్న తన ప్రాణకాంతను వలదన నోపక చక్రవర్తి యామెధైర్యపరాక్రమముల స్వయముగఁ జూచియున్నాఁడు కాన నటులేయని సమ్మతించెను. అంత నామె మంజరి కొకలేఖవ్రాసి యొకనికిచ్చి మాతండ్రిగారి పట్టణమున కేగి యీయుత్తరముఁజూపి మంజరి వెంటగొనిరమ్మని పంపెను. పరి చారకుఁడు లేఖఁగైకొని చనినపిదప నాదంపతు లిరువురు రణమును గూర్చి మఱిగొన్ని సంగతులు మాటలాడుకొన వేరొక మందిర ములోని కరిగిరి.

ఇరువది యెనిమిదవ ప్రకరణము.

అంట జయచంద్రుఁ డంపిన లేఖలఁ జూచుకొని యార్యావర్తమునంగల కొద్దిమంది సామంతులుదప్పఁ దక్కినవారందఱు స్వార్థపరత్వమూని స్వతంత్రరాజ్యములు లభించునను కోరికఁ దమతమ సేనల వెంటగొని కన్యాకుబ్జమునఁ జేరవచ్చిరి. అందు జయచంద్రుని ప్రాణస్నేహితుఁడు మందూరు పాలకుఁడును నగు పురిహార రాజకులుండు నలువదివేల సైన్యముతోడను నేపాల కోసల వంగ దేశాధిపతులు తొంబదివేల సేనలతోడను, కాశ్మీరపతి ముప్పదివేల బలముతోడను, మగధనాథుఁడు నలువదివేల సైన్యముతోడను జనుదెంచిరి. వీరందఱిరాకకు జయచంద్రుఁడు సంతసమందుచు నందఱ ననేకగతుల మర్యాదలొనర్చి మన్నించుచుండెను. ఇఁక నీశ్వరభట్టుగారి సంతోషమునకు పరిమితియే లేదు. రాజ్యకార్యదురంధరుండగు వినయశీలుఁడు దనపనికి రాజీనామా యొసంగి చనినపిదప నతనిస్థానమున భట్టుగారే యుంచబడిరి గావున రాజుగారికి మంత్రాలోచనములన్నియు నితఁడే బోధించుచుండెను. జయచంద్రునకుఁ దోడ్పడఁ జనుదెంచిన రాజులకుఁ జక్రవర్తిపై లేనిపోని ద్రోహములఁ గల్పించిచెప్పి యసూయ బుట్టించుచుండెను. సమస్తసామంతులువచ్చినపిదప కుతుబుద్దీన్ వద్దనుండి సమాచారమెప్పు డేతెంచునా యని భట్టుగారెదురుచూచుచుండిరి. అంతలోఁ గొందఱుమ్లేచ్ఛభటు లేతెంచి కుతుబుద్దీనొసంగిన లేఖల భట్టుగారికియ్య నవి చూచుకొని పరమానందము నొంది వానినన్నింటి జయచంద్రునకుఁ జూపింప నతఁడును మోదమగ్నుఁడై యలీఘురువద్దకు వచ్చి తమ్ము గలిసికొనవలసినదిగా మ్లేచ్ఛలకు వర్తమానమంపెను. ఆమరుసటి దినమున వచ్చిన రాజమండలి గూడుకొని యలీఘురునకుఁబోవు ప్రయాణమును గూర్చి ముచ్చటించు

కొనుచుండ దేవశర్మయే తెంచి నృపునిచే మన్ననలంది యొకపీఠమున నాసీనుండై మెల్లన నిట్లనియె. 'జయచంద్రా! ఈసంరంభమంతయు నేటికి?

జయ:—అయ్యా! మీకన్నం దెలిసియేయుండును తెలిసియుండియు నిట్లేల యడిగెదరు? చక్రవర్తిపై దండెత్తంబోవుచున్నాము.

అని నృపుండు పలుక దేవశర్మ యెక్కడవచ్చెనాయని విసువుకొనుచు మొగము మాడ్చుకొని కారుచుండియున్న భట్టుగారాఖండితంపువాక్యములకు సంతుష్టులైరి. దేవశర్మ రాజుదిక్కు మొగంబై "జయచంద్రా! నీ వింతట యవివేకుండ వెట్లైతివో తెలియంజాలకున్నాను. ఇంచుకైన యుక్తాయుక్త విచారమొనరింపవా? అయ్యో" యని యింకను నేమియో వచింపంబోవుచుండ నతండు విసువుకొనుచు "అయ్యా! ఈనీతివాక్యముల వినివిని నాచెవులు తడకలు కట్టిపోయినవి. మరల మీకీ శ్రమయెందుకు? క్షమింపుండు. ఇత్తరుణమున మాత్రము తమవాక్యముల మన్నింపనోప"నని మొగమోటమించుకైన లేక నిష్ఠురముగం బలుక దేవశర్మమనస్సు కలుక్కుమన వేరొండువచింపనోడి "యటులనా" యని కొలువు వెడలిపోయెను.

నిజపురోహితుం డట్లు కోపమున బోవుచుండం జూచుచునూరకుండెనేకాని జయచంద్రుం డావంతయు లెక్కంగొనడయ్యెను. ఈర్ష్యాగ్రస్తులకు మర్యాదామర్యాద వివేచన జ్ఞానము సహితము నుండదుకాబోలు. మఱునాండతండు సకలసేనాసమన్వితుండై సామంతులం గూడుకొని యలీఘరుప్రాంతమున కేగి కాళీనదియొడ్డున దండును విడియించి డేరాలవేయించి సుల్తానుగారిరాకకై యెదురుజూచుచుండెను అంట డిల్లీనగరమున వేగులవారివలన బయట జరుగుచున్న సంగతులను విని చక్రవర్తి పట్టరాని యాగ్రహమూని యొకసభం జేసి యందు దండనా

యకులు మొదలగువారలకు యుద్ధసంబంధములగు విషయములఁ గొన్ని వక్కాణించుచుండెను. అత్తరి రాజప్రతిష్ఠానమందలి కొందఱు సామంతులును, ఘూర్జరదేశాధీశుఁడును జక్రవర్తి కడకేతెంచి యిట్లు విన్నవించుకొనిరి. "రాజేంద్రా! మనదేశముపై మహమ్మదీయులు దండెత్తి వచ్చుటయు, జయచంద్రుఁడు మొదలగువారు వారికిఁ దోడ్పడుటయు నాదిగాఁగల సకలవృత్తాంతముల నెఱిఁగియే యున్నాము. తనకుసహాయముగ రమ్మని జయచంద్రుఁడు మాకును లేఖల నంపినాఁడు. మేమతనికి సహాయముగాఁ బోవుట కచ్చగింపక యేలినవారి సామంతుల మగుటచే రణసమయమున మీకు మే మొనరింపఁ దగుదాని సలుపుటకై సర్వసిద్ధులమై వచ్చితిమి. మీయాజ్ఞానుసార మెట్లునడచుకొమ్మనిన నట్లువర్తించెదము. యుద్ధమున మీకొఱకై మాప్రాణములసహిత మర్పింప సన్నద్ధులమై యున్నా" మని పలుకఁ జక్రవర్తిమిక్కిలిమీఱిన సంతసమున "ఆహా! నేటికి నేనునిక్కముగ ధన్యుఁడనైతి. మన యార్యావర్తమునంగల నృపులెల్లరు మాతృద్రోహులును, స్వామిద్రోహులును, స్వార్థపరాయణులు నని తలఁచియుంటిగాని నేఁ డాతలఁపు మారిపోయినది. మనకు జయముకాకున్నఁ బోనిండు. మన యార్యావర్తమునందు మిమ్ముఁబోలుపరోపకారపారీణులు గొందఱున్నారుకదా యని సంతోషముకలుగుచున్నది." అని వారలకందఱకుఁ బసదనంబులొసంగి వారు వెంటఁగొనివచ్చిన సేనల దన యక్షౌహిణీసేనలఁ జేర్పించెను.

ఆసమయమందే లోకులందఱు సౌందర్యమునకు మెచ్చి పెట్టిన యలంకారుఁడను పేరుగల బాలుఁడొకఁడు రోషావేశమున నెఱ్ఱబారినముఖముతో సభామధ్యమున కేతెంచి చక్రవర్తితో "మహారాజా! ముందుశత్రువులతోఁ బోరాడ నన్ననుగ్రహింపు" డని వేఁడుకొనెను. పృథివీరా జాశ్చర్యకలితుఁడై నీవి ట్లడుగుటకుఁ గతమేమన నా బుడుతఁ డిట్లనియె, "రాజా! నాతండ్రిగారు తమకొఱకై పోరాడుచు మహా

బానంగరమున మృతినొందినాఁడు. కాని తరువాత శరీరము కొఱకు వెదక నది యెచ్చోటను గన్పింపలేదు. ఇప్పుడు నాతోఁగలిసి యున్న నాస్నేహితులుగొందఱు మాతండ్రి రణమున కేగ లేదనియు నతఁడందు లేనేలేదనియు వచించుచున్నారు. అందుచే మావంశీకులు యుద్ధములందు నిలువ సమర్థులని స్వయముగఁ దెలియఁబఱచుటకై యిట్టులడిగితిని." అని చక్రవర్తి యతనియెడల దృఢానురాగము గల వాఁడై తనదగ్గఱకు రాఁగుకొని యతని దక్షిణకరమునుబట్టి పైకెత్తిన వెంటనే సభానములెల్లరు నిశ్శబ్దముగ గూరుచుండియుండిరి. అత్తరి చక్రవర్తి కోపమును, దుఃఖమును పొడమనిట్లనియె. "బుద్ధిహీనులగు నావంశము వారలందఱెక్కడ ? నాప్రక్కఁనొకఁడై నిలిచి ప్రాణముల కాశింపక పోరాడిన సత్వవంతునిచరిత మూలకింప వారినందఱి నిటకుఁ గొనిరండు. మహోబాయందు జరిగిన ఘోరసంగ్రామమున నితని తండ్రియు నేనునుగాఢమగు గాయములు దగిలి పడిపోయితిమి. మొదట నాకుస్మృతియేలేదు. మరల నాకించుక తెలివి కలుగునప్పటికి రణముపరిపూర్తియయినది. జయము మాకే కలిగినది. ఆసమయమున శక్తిహీనుఁడనై నెత్తురువరదలు కారుచుండ బడియుండ నేనుచచ్చితి ననుతలఁపున డేగలు మొదలగు పీనుఁగుల దినుపక్షులు బలహీనములై వ్రేలాడుచున్న నానరముల పీకుకొనఁతినుటకై తటతట రెక్కలల్లార్చు కొనుచు నాపై వ్రాలవచ్చుచుండెను. అట్టియెడ నే నేమని వచింపుదు. పాపమీ చిన్నవానిజనకుఁడు నాకుఁ గొంచెము దూరముగాఁ బడి యుండి మోకాళ్లవఱకునఱుకబడి యుండుటచేఁ బొరలియాడుచునైన నాదగ్గఱకురాలేక నగము తునిగిన మొండికత్తితోఁ దనశరీరమందలి మాంసపుఁగండలఁ బెఱికి నాపైకి వ్రాలవచ్చుపక్షులకు వైచుచు నన్నంటకుండఁజేసి తనఋణము దీర్చుకొన్నాఁడు. తరువాత నాకుమరల స్మృతితప్పిపోయినది. అంత నేమి జరిగినదియు నాకుఁదెలియదు.

తిరుగ నాకుఁ దెలివివచ్చునప్పటికి నా సేనాధిపతుల నడుమ నుంటిని. అతనికొఱకు వెదకించితిగాని యెచటను గాన్పింపలేదు. బుద్ధిహీను లారా! అట్టి యుత్తమసాహసికు నా రణమునందుఁ లేడని యూరువచించుట? అట్టి పరాక్రమశాలి ధవళకీర్తికా! మీరు కళంకము గల్పించుట? ఇఁక ముందెన్నటికి నిట్టి దుష్కుతనంపు మాటలాడక గౌరవమున నతని స్మరించుచుండుఁడు. సమ్యమరాయుఁ డెప్పుడును వెన్నిచ్చిపారు వాఁడు కాఁడు. రణమునఁ బృథివీరాజు కతఁడు సోదరుఁడై మెలఁగినాఁడు." అని యా కుఱ్ఱవాని వంకకుఁ దిరిగి బుజ్జగించు వాక్యములతో " నాయనా! నీవింకను పసిపాపవు. రణమున కేతెంచుట యుక్తము కాదు. సద్విద్యలం దారితేరి నీ జనకునివలె శాశ్వతకీర్తినంద ప్రయత్నింపు" మని యతనిబంపివేసి తాను రాణివాసమున కఱిగెను. అంతఃపురద్వారముల సమీపించినవెంటనే మంజరీసంయుక్త లేతెంచి ప్రణమిల్లి యతని లోనికిఁ గొనిపోయిరి. చక్రవర్తి లోపలికేగినపిదప మంజరి క్షేమసమాచారమడిగి కొంతతడవునకు " మంజరీ! నీ నెచ్చెలి నాతోఁ గూడ సంగరమునకు వచ్చెదనని యడుగుచున్నది. మేమిట లేనితరి పురమును రక్షించు భారము నీదే" యన సంయుక్తచే నదివఱకే యొప్పింపఁబడియున్నది. గావున నట్లేయని యామె సమ్మతించెను. అనంతర మెల్లరు మరల వేగులవారేమి వర్తమానము గొనివత్తురోయని కాచుకొనియుండిరి. కొన్నిదినములు కడచిన వెన్కనిట నలీఘురువద్దనున్న జయచంద్రు సుల్తానుగారు సేనాసమేతముగఁ జనుదెంచి కలిసికొనిరి. నాఁటినుండియు మహమ్మదీయు లార్యులు ననుభేదము లేకుండ నుండవలయునని యొప్పందము చేసికొనిరి. అటు పిమ్మట సుల్తాను జయచంద్రు లిరువురుగలసి తమ సేనల గొన్ని భాగములుగ విభజించి కోసలాధిపుని యాధిపత్యమున నొక భాగమును చోళాపురి ముట్టడించుటకును, వంగదేశపతి నాయకత్వమున

నింకొకభాగమును ఫరుక్నగరమును స్వాధీనముచేసికొనుటకును, బుర హార రాజకులునివశమున మఱియొకభాగమును గైజినీపట్టణము నాక్రమించుకొనుటకును బంపిరి. వారు లరుదెంచి బయటజరుగుచు న్నవార్తల నిటఁ జక్రవర్తి కెఱుకబఱుపగా నతఁడు నప్పుడే యక్షౌహి ణీపతులు మొదలగువారి రావించి ఘూర్జరపతిని గసలు నెదురించు టకు, రాజపుత్రస్థానమునుండి వచ్చినవారిలో నచలమహాబుద్ధులను నిరువుర మందూరువంగపతుల నెదురించుటకునుదగిన సేనలనిచ్చి పంపి యూఫ్గిన్‌స్థానమునుండి మరలసైన్యములురాకుండ నాదారుల నన్నిఁ టియందు గాచుకొని యుండవలసినదని లాహోరుననున్న సామర్సికి వార్తనంపి, పురరక్షణకు మంజరినిలిపి సంయుక్తాసమేతుఁడై యక్షౌహి ణీపతులు సేనాపరీవృతులై ముందునడున నలీఘురువద్దనున్న సుల్తాన్ జయచంద్రుల నెదురింపఁ బయునమై వచ్చుచుండెను.

ఇరువదితొమ్మిదవ ప్రకరణము.

జయచంద్రుఁ డట్లు చక్రవర్తిపురగుల మూఁడింటి ముట్టడింప సేనలనంపి వారు పోయిన మూఁడవనాటి ప్రాతఃకాలమున దానున్న శిబిరమునువిడచి యొంటరిగఁ గాళీనదిలోనికేగి యందొకవైపునఁ జల్లగనున్న స్వచ్ఛసికతాతలమున నాసీనుఁడై నెమ్మదిగఁ బారుచున్ననది నవలోకించుచుఁ దానుగావింపుచున్న కార్యములన్నియుఁ దలఁపునకు రానేమేమో యాలోచించుకొనుచుండెను. అట్టితరుణమున నాకస్మికముగసంయుక్తయేతెంచి నమస్కరింప నతఁడు విభ్రాంతుఁడై చూచుచు నేమియుబల్కరింప కూరకుండెను. అప్పుడు సంయుక్త మెల్లన "తండ్రీ! నీపరివారమును విడచివచ్చి యొంటరిగ నీవిట నేమి యాలోచించుచున్నావు. నీమాతృభూమియగు నార్యావర్తముపైఁగల నభిమానమునంతయుఁ ద్యజించితివా? కడుగారాబమునఁ బెంచిన నాపైఁగల మక్కువను సహితము వదలితివా ? కట్టా! కన్నకూఁతుల నిట్లుగారియలంబెట్టు తండ్రు లెందైనఁ గలరా? ఇదివఱకు మహమ్మద్‌గజనీ దాడివెడలివచ్చి మనదేశము నెట్లునాశనముఁ జేసిపోయినది నీవెఱుఁగవా? అయ్యో! బిడ్డలవంటినీప్రజలనందఱ మ్లేచ్ఛుల కేల సమర్పించెదవు. గోహంతకులగు నీక్రూరుల జేరనీసి నాప్రాణకాంతునిపై నేలకత్తిగట్టనెంచెదవు? వీరి నమ్మికొనిన నీకావంతయు లాభములేదు. నాప్రార్థన మాలకించి యిప్పుడైన నీసేనల మరలించుకొని వెడలిపొమ్ము. నన్నుఁ గటాక్షింపు" మని కడుదీనముగ వేఁడుకొనుచున్న పుత్రికను గన్నులెఱ్ఱచేసి చూచుచు "ఓసీ! దుర్మార్గురాలా! హీనాభిసారికభంగి నాయిష్టములేని యెవనినో చేపట్టి సిగ్గులేక తగునని నాకు బుద్ధులు గఱపనేతెంచితివా? చాలు. నాయెదుటనుండి వెడలి పొ"మ్మని కసరుకొన మరల నామె వినయపూర్వకముగ " నాయనా! నాపై

నింత కోపమేటికి ? హీనాభిసారికవలె నే నేనీచునైన వరించితినా? ఆర్యావర్తమున కంతయు సార్వభౌముఁడై, దీనదయాపరుఁడై, ధీశాలియై మన్ననలకెక్కిన మూర్ధన్యశిరోరత్నమును నే వరించి పరిణయమైనది. అయ్యో! చక్రవర్తి యంతటివాఁ డల్లుఁడయ్యెనని సంత సించుటకుమారుగ నతనికిఁ గీడుగావింపఁదలఁచు టెంత వెఱ్ఱిదనము. చక్రవర్తి జామాతయయ్యెనని నీకుఁ గలుగుప్రఖ్యాతికి మేరకలదా? తండ్రీ! మనమందఱము గలసి ప్రసన్నహృదయులమై యొకచోట నివా సముఁ జేయుటమాని యిట్లు పోరాడుకొనుచుండు టెందైనఁగలదా? ఈర్ష్యావేశుఁడవై యేల యీలీల నకార్యములఁ గావింప నొడిగట్టె దవు? ఋషిజనసేవ్యమానమై యలరారు మనపుణ్యదేశమును గిరాతు లపాల నేలపడవై చెదవు. పతివ్రతాతిలకములని ప్రసిద్ధివడయుచు నుత్త మవిద్యావంతురాండ్రై స్వచ్ఛందసంచారంబుల జీవనములఁ గడపు నీసోదరీమతల్లుల కందఱకు మానభంగమగురీతి నేలసల్పెదవు? సౌంద ర్యవతులకెల్ల బందీగృహవాసము ప్రాప్తమగుభంగి నేలకలుగఁజేసె దవు? తండ్రీ! నీవు పూనియున్న యసూయను ద్యజించినచో నింతదా రుణములు గలుగ నేరవుగదా? పక్షపాతరహితుఁడవై మంచిచెడ్డల నా లోచించి చూచుకొనుము. ప్రస్తుతము నీసహాయ మవసరమగుటచే వీరందఱు గ్రుక్కినపేలవలె యూరకుండియున్నారుకాని లేకున్న బట్ట బగ్గము లుండెడివా? ఈదుష్టులొనరించు భీభత్సములవినియు, గనియు మగల నిల్లల యజ్ఞానంబున మునిఁగెదవు? మఱియు నిత్తరి మనదేశం బున జరుగుచున్న సంఘసంస్కారము లన్నియు నీకార్యముల మూలము ననేకదా? నాయనా! నీసోదరీజనంబులకుఁగల స్వాతంత్ర్యములన్నియు నడఁగి దాసీలకన్న నీచమగుబ్రతుకు చేకూరుపనులఁ జేయబూనుట నీకనైన మానుము. ఇంతకుమును వేమియోకాని యిప్పుడు నిన్ను నిందింపనివాఁడు ముందునకైనఁ గానరాఁడు. జయచంద్రా ! నీమూలముఁ

నంగదా నేఁటికి మా కిట్టియిక్కట్టులు సంప్రాప్తములైనవని రోదనము లొనర్చుచు నెందఱో పుణ్యాంగనలు తమప్రాణములఁ గోల్పోవుచున్నా రఁట. వెండియు మనదేశమున నిదివఱకే ప్రబలియున్న వామమార్గుల వలన సాధువులగు పశువు లనేకములు నాశనమైపోవుచున్నవి. ఇఁక వీరు ను వారికిఁ దోడ్పడినచో నాపశువులకు బ్రతుకుదెరు వెక్కడిది! అయ్యో! నీకుఁగల భూతదయ యంతయు నేఁగంగలో గలసిపోయినది? తండ్రీ! ఏకరణి విచారించినను నార్యావర్తమునంతయు ధ్వంసము కావిం చినవాఁడ వగుదువుగాని వేరొండు కాదు. ఇప్పటివారిమాట యటులుండ ముందుజన్మించువారెల్లరు నిన్నాడిపోసికొనక మానరు. ఇఁకనైన నసుల్తాను తోఁగల మైత్రి వదలుకొనుము. నీవు నా నాథునకు సహాయ మొనరింప కున్న మానె మ్లేచ్ఛులకు సహాయము సేయకున్నఁ జాలు. నానమస్కృ తులంగైకొని కరుణింపు"మని యభివాదన మొనర్ప నొక్కతన్నుఁదన్ని "ఓసీ! కన్నకూఁతురవని యేమియు సేయక చూచుచు నూరకున్న కొలఁది నోటికివచ్చినట్లెల్ల వదరసాగితివా? నీకీకంఠశోషణ మెందు లకు? నాయిష్టమువచ్చినట్లు కావించెద. నన్నాజ్ఞాపించుటకు నీ వెవ తెవు? నాదృష్టిపథమునుండి తొలఁగిపో" మ్మన మరల నామె కడసారి చెప్పి చూచెదంగాకని "నాయనా! ఏటికిట్టి బెట్టిదంపువాక్యము లాడె దవు? నే మిమ్ము వేఁడుకొనుచుంటిఁ గాని యాజ్ఞాపించు చుంటినా? తండ్రీ! కృతఘ్నులగు నీమ్లేచ్ఛులు దమయవసరము తీరినవెనుక నిన్నును నాశనముఁ జేయుదురుగాని మన్నింపఁజూతురా? అయ్యో! నీవు వీర లకుఁ దోడ్పడుట కాలాహికిఁ బాలుపోసి పెంచుటే. ఈ క్రూరుల దరిజేర్చుట శార్దూలములదగ్గఱఁ జేర్చుటే. వీరలకే నిక్కముగ జయము కలిగెనా నీ వేకొండలకైనఁ బాఱిపోవలసినదే గాని యిక్కడ నుండు టకుట కల్ల. నీవు నాయెడల నింత కాఠిన్యము వహించియున్నను నిన్ను గాంచిన నాకపరిమితమగు జాలి కలుగుచున్నది. కట్టా! ఈ నీచులు

ని న్నట్టిబాధలఁ బెట్టుదురో గదా? నీ కీయజ్ఞాన మెక్కడ కలిగినది? చిన్న దాననైనను తండ్రివగుటచే నీమేలుగోరి యింతగ వచించుచున్న దానను. మఱియు మన తాతలనాఁటి నుండివచ్చుచున్న నుత్తములగు వినయశీల దేవశర్మల వెడలఁగొట్టించితివని వినుటకు నాకెంతయో సంతాపకరముగ నున్నది. ఇంతవఱకైనది కానిమ్ము. ఇప్పుడైనఁ దెలివి కలిగి జాగ్రత్తపడుటకుఁ దగినంత సమయమున్నది." అని వినయవినమితోత్తమాంగయై పలుకుచున్న కూతుంగాంచి పట్టరాని కోపమున "ఓసి దౌర్భాగ్యురాలా! నీ కీయధిక ప్రసంగ మేటికి? నీవీతక్షణమున నాయెదుటనుండి లేచిపోయెదవా లేదా"యని యతఁడుహుంకరించి పల్కిన నింతగ వేడుకొన్నను గార్యము లేకపోయెనని యామె యత్యుగ్రము నంది "కుత్సితుఁడా! నీవు నాతండ్రివైన నగుదువుగాక. నీవు నాజనకుఁడ వనుకొనుట కెంతయు సిగ్గగుచున్నది. ఏపాపముననో నీకుఁ బుత్రికనై జన్మించితిఁ గాని వేరొండుకాదు. స్వోదర పరాయణులును, గుమార్గగాములు నగు భట్టుమొదలగువారి వాక్యములే యమృతప్రాయములై నీతలకెక్కెనా? పవిత్రవంతమగు తోరూవంశపారావారంబున హాలాహలముఁబోలి జన్మించితివికదా? తరతరంబులనుండి ప్రఖ్యాతికెక్కి వచ్చుచున్న నీకన్యాకుబ్జరాజ్యమును ధ్వంసముఁజేయ నీ వెక్కడనుండి దాపరించితివి? దుర్మార్గుడా! నీవు నాతండ్రి వేటికైతివి? లేకున్న నీవంటి నీచుని నీ నాఖడ్గమున నొక్క ప్రేటున నేల కర్పించియుందునే. నీవొక్కరుఁడవే యిట్టి యకార్యముల సలుపుటగాక తక్కుంగల సామంతులఁగూడ పురికొల్పి దెచ్చితివా? ఆహా! ఆర్యావర్తమునం గల యైకమత్యము నంతయు ధ్వంసము గావించి విడచితివి కదా? ఛీ! ఇఁక నీముఖము వీక్షించినఁ బాతకమగు" నని యుగ్గలంపు రోషమున నాచోటువదలి పోయెను. జయచంద్రుఁడును నిరాఘాటముగ నెదురించి పల్కు పుత్రిక యెదుట నోరుమెదల్పనోడి వెడలిపోయిన వెంటనే తన శిబిరమున కేతెంచి సుల్తాను వలనఁ జక్రవర్తివచ్చినాఁడన్న వార్తవిని

తన సేనానాయకులకు రణముగావింప నుత్తరు వొసంగెను. మఱియు నత్తఱిఁగొందఱుచారు లరుదెంచి కోసలపతి యోడి పారిపోయినాఁ డనియు, మందూరువంగపతులు మఱికొంత సేన నంపవలసినదని కోరి నారని వచింప నట్లే వారికడకు మఱికొంత సేన నంపెను. అలీఘురువద్ద నిరువాగులవారును హోరాహోరిగఁ బోరాడఁగడఁగిరి. ప్రాణముల కాశింపక తమతమనాయకులచే హెచ్చరింపఁబడు దినముల కొలఁది సంగర మొనరించుచుండిరి. ఇటులిక్కడ ఘోరమగురణము జరుగుచుండ మఱికొంత సేన నంపవలసినదని యచలునికడనుండి చక్రవర్తికి లేఖవచ్చెను. సేనానాయకులందఱు రణమున మునిఁగియుండ నెవని బంపుదునా యని చక్రవర్తియోచించుచుండ వేరొకవైపున సైనికులఁ బ్రోత్సాహపఱచుచున్న సంయుక్త కావార్త తెలిసి వెంటనే భర్తకడ కేతెంచి "నాథా! మీ రేటికిట్లు యోచించెదరు? అచలునికిఁ దోడ్పడఁబోవుట కేనుసిద్ధముగ నున్నదానను. నన్నుఁబంపుటకు మీ రెంత మాత్రము సందేహింపఁబనిలేదు. వేవేగ సెలవొసఁగు" డని వెనుదీయక పలుకుచున్న తనప్రాణప్రియను వదల నిష్టములేనివాఁడయ్యు నేమియు సేయఁజాలక యటులే పొమ్మని సమ్మతించెను. అంత నామె కొంతసైన్యమును బ్రయాణమునకు సిద్ధపఱచి బయలువెడలి పోవుటకు ముందుచక్రవర్తికడ కేతెంచియతని గాఢాలింగన మొనర్చుకొని "ప్రాణనాథా! యుద్ధమున జయాపజయంబులు దైవాధీనములుగదా? నాకచట నొకవేళ నేదైన నపాయము సంభవించినచో మీరు ధైర్యమువదలక మీ కార్యముల నప్రమత్తులరై యొనరించుకొన బ్రార్థించుచున్నదాన" నన నతఁ డత్యంతవిచారమున "సతీ! నిన్నొంటరిగఁబంప మనసొప్పకున్నను విధిలేక పంపుచున్నాను. జాగ్రత్తతోడ రణభూమిని సంచరింపుము. మరల మనమిరువురము గలిసికొనుభాగ్యమున్న నెట్లును గలసికొనఁగలము. పోయిర" మ్మని బిగియార గౌగిలించుకొని దీవించిపంప నామెయు నతనికిఁ బ్రణమిల్లి లేచి బయలుదేరి సేననంతయు నతినిపుణముగ నడిపించుకొని గైజియాపురమున కేగుచుండెను.

ముప్పదియవ ప్రకరణము.

అట్లు సంయుక్త తన మనోకాంతుని చరణంబుల స్మరించుకొనుచు సేనల నతిప్రావీణ్యముతో నడిపించుకొని గైజియాపురమున కతిగెను. ఆమె యచటి కేగునప్పటికి నచలుని సేన విస్తారము హతమైయుండెను. రాజకులుం డత్యంతపరాక్రమవంతుడు స్వయముగ యుద్ధమునకు దిగి సైనికులకుం బ్రోత్సాహము కలుగఁ జేయుచుండెను. సంయుక్త తానువెంటఁగొనివచ్చిన సేనల నచలుని సేనలం గలిపి యతనివారలించుకధైర్యము చెడి యుంటఁగనిపెట్టి "సైనికవర్గములారా! మిమ్ముఁజూడ నిరుత్సాహులైనట్లు గాన్పించుచున్నారు. ఇదివఱ కెన్నఁడు లేని పీటికి తనము నేఁడేల పూనెదరు? మీమీశౌర్యముల వెల్లడిపఱచుకొనఁదగు నిట్టిసమయము మఱియొకప్పు డెప్పుడైన దొరకునా? మనమందఱ మేనాటికైన మృతినొంద వలసిన వారమే కదా? ఎక్కడనో నీచమగు చావు చచ్చుటకన్న శత్రువులతో నెదురించిపోరాడి మరణంబునొందుటయే మేలు. ఈ తుచ్ఛశరీరంబులపై నావంతైన నభిమానముఁ బెట్టుకొనకుఁడు. ఇంతకాలము మిమ్ముఁ బోషించినవారియెడలను, మీ మాతృదేశము నెడలను సంపూర్ణాభిమానము గలిగియుండుఁడు. పొండు. మీ కార్యముల నప్రమత్తులరై యొనర్చుకొనుఁ" డన నందఱు రోషావేశులై విజృంభించి రణమున కేగి యొక్కుమ్మడి వైరిసంహారముగా వింపనారంభించిరి. అట ఫరుక్కనగరమున మహాబుద్ధి తన సేనలఁజక్క దీర్చి యుద్ధము సేయించుచు వంగపతిని భీతిల్లఁ జేయుచుండెను. కోసలపతి నెదురింపఁబోయిన ఘూర్జరనాయకుఁడవలీల సంపూర్ణజయముం గొని మరలశత్రువులెవరైన నెతెంతు రేమోయని కొన్నిదినంబుల వఱకు జోలంపురియందే యుండి వేగులవారివలన జయచంద్రుఁడు తన్న

గరపుముట్టడిని మానుకున్నాఁడని విని తనకడనున్న సేనయందు కొంత భాగము నట కావలిగనుంచి మిగతదానింగూడుకొని మహాబుద్ధికిఁ దోడ్పడ నేతెంచెను. ఇట్లార్యావర్తమునఁ బ్రఖ్యాతిగాంచిన వానిలోని నగుదుర్గములు రణసంకులములై యుండ నాలుగైదువారములు గడచి పోయెను. అప్పటి కలీఘురుదగ్గఱనున్న జయచంద్రుని సేన విస్తారభాగము నాశనమయ్యెను. లక్షలకొలఁదిగనున్న తమసేనయంతయు నష్టముగుచున్నందులకు సుల్తాను జయచంద్రు లిరువురు నిరుత్సాహులై విచారపడసాగిరి. అట గైజియూపురమందలి సైనికులు శాహుపరాక్రమము లుల్లసిల్ల ధైర్యసాహసములతోఁ బోరాడుచుండ వారిధాటి కోరువలేక రాజకులుఁ డానగరముదు ముట్టడించుట మానుకొని పరువెత్తిపోయి జయచంద్రుని దగ్గఱకేగుట లజ్జాకరమని వంగపతికిఁదోడ్పఁడఁబోయెను. సంయుక్తకావార్త తెలిసినవెంటనే యచలు నక్కడనే నిలిపి తాను మహాబుద్ధికి సహాయపడఁబోయెను. ఫరుక్నగరముననున్న సార్వభౌమసేనాధిపతు లీమెఁగాంచిన వెంటనే మన్నించి గొంపోయి యామె రణకౌశలముగని విని యున్నందున సర్వసేనాధిపత్య మామెకే యొసంగి తాముపసేనాధిపతులై రణముఁ జేయఁ దొడఁగిరి. సంయుక్త రణరంగమున బ్రవేశించినదాది మందూరువంగపతు లామె నెటులైనజంప ననేక ప్రయత్నములు చేయుచుండిరి. ఆమె తనయుపసేనాను లిరువురు వేరొండుదిక్కుల రణముఁ జేయుచుండ రెండుచేతుల రెండుకత్తులఁబూని సేనామధ్యమునకుఁజొకి లెక్కలేని భటులఁ జంపుచు వంగపతిని సమీపించి యతని గడదేర్చెను. వేరొకప్రక్క యుద్ధముఁ జేయుచున్న రాజకులునకీవార్త తెలిసినవెంటనే భయమంది యెదుటఁబడి పోరాడిన శాత్రవులఁ గెల్వఁజాలమని సహాస్యమార్గమున నామెం జంప నిశ్చయించుకొని యుపసేనానులున్న స్థలమును వదలకుండునట్లు యుద్ధము చేయుచుండవలసినదని తనక్రింది

వారల కాజ్ఞాపించి యతఁడు మహాబుద్ధి వేషమూని యామెకడ కేతెం
చుచుండెను. సంయుక్తయు నాఁకలిగొన్న యాఁడుసింగములీల విజృం
భించి రణము సేయుచు దూరమున వచ్చుచున్న రాజకులునిగాంచి
మహాబుద్ధి యనుతలంపునఁ దానుగావించు పనియందే మునింగియుండెఁ
గాని యతని విషయమై జాగ్రత్తపడదయ్యెను. అట్టితరుణమున మెల్లన
రాజకులుండు వెనుకప్రక్కగ నామెను సమీపించి దీర్ఘమగు కరవాల
ముంగొని కంఠమునకు గురిఁజూచి కొట్టెను. వెంటనే యామె భయం
కరలీల సింహనాదముఁ జేయుచుఁ దుపాకిదెబ్బ తగుల దెబ్బవెంటనే
యెగిరి వేటకానిపైఁబడు సింగములీల రాజకులునిపైఁబడి యొక్క నిమి
షమున నతని పొడిచి చంపెను. కాని వెంటనే యామెయు దన
గుఱ్ఱముపై వ్రాలెను. రాజకులుండు విసరినదెబ్బ కంఠమునకు దప్పి
భుజముకడదగిలి మొడవరకును దిగెను. నెత్తురు వెల్లువమై పారుచుం
డెను. సైనికులెల్లరు తనురాణికి సంభవించిన పాటునకు దత్తరమం
గుచు నామెచుట్టుఁ జేరి శత్రువులదరిఁ జేరకుండ దూరము చేయుచుం
డిరి. ఆవలివైపున యుద్ధము సేయుచున్న యుపసేనానులిరువురివార్త
విన్న వెంటనే యొక్కపరుగున సంయుక్తదగ్గఱ కేతెంచి మాఁగుబారిన
చంద్రునిబలె గుఱ్ఱముపైఁ బడియున్న యామెఁగాంచి ప్రబలార్తిమ
గ్నులై యాక్షణమందే యచటి కొక్కమైలు దూరముననున్న రాజవై
ద్యశాల కనిచి మితిమీరిన రోషంబున హతశేషులగు జయచంద్రుని
సైనికులనెల్ల దునుమాడి పారఁదోలి సంపూర్ణజయోపేతులై
వారును వైద్యశాలకడ కేగిరి. వీరు వైద్యశాలఁ జేరునప్పటికి సంయుక్త
మరణవేదన ననుభవించుచుండెను. లెక్కలేనిదాసీలు చుట్టుఁ జేరి
యనేకగతుల నుపచారముల సలుపుచుండిరి. భుజముపైనుండి మొడ
వఱకు లోపలగల రక్తనాళములన్నియుఁ దెగియుండుటచే శరీరమునంగల
నెత్తురంతయుఁ బోయి యతిశీతలత్వ మందియుండుటచే ధీవిశారదుఁడగు

వైద్యుఁ డత్యుష్ణముఁబుట్టించు నౌషధముల వాడుచు తెగిననాళముల దగ్గఱఁజేర్చి రక్తము బయట రాకుండఁ బ్రయత్నములఁ జేయుచుండెఁ గాని గాయ మతని కలవి గాకుండెను. సంయుక్త యప్పటి యవస్థం గాంచి సేనాను లిరువురును ధైర్యహీనులయి దుఃఖింప మొదలిడ నామె కొంచెము స్మృతిగల్గి చెంతనున్న వారి గుఱించి మిక్కుటమగు నాయాసమున హీనస్వరముతో " సేనాపతులారా! మీరిట్లు విలపించిన ప్రయోజనంబేమైనఁ గలదా? నాకుఁ గాలమాసన్నమైనది గానఁ బోవుచున్నాను. మరణమునొందుటకు నాకేమియుఁ జింత లేదుకాని కడసారి నామనోహరు వదనారవిందముఁగాంచు భాగ్యము లేకపోయెగదా యనువిచారము నన్ను బాధించుచున్నది" అని యొకలేఖవ్రాసి మహాబుద్ధిచేతి కొసఁగి "అయ్యా! నామరణానంతరము దీని నాప్రియున కందఁజేయుము. నేఁడు నాప్రాణములు నిలుచునట్లులేదు. అత్యంతమగు నాయాసము పొడముచున్నది. కన్నులు దృష్టివిహీనము లగుచున్నవి. మీరు వచించువాక్యములును దిన్నగవినరావు. మీరందఱు నాకొఱకై చింతింపకుఁడు. నేపోయిన పిదప నీలేఖ నాప్రియునకొసఁగి యందులకతఁ డేమైన నకార్యములు గడంగసమకట్టినచో నాటంకపఱిచి యోదార్పుఁడు. అతని చరణారవిందములకు నాలింగనపూర్వకమగు వేనవేలు నమస్కారము లొనర్చితి నని విన్నవింపుఁడు. వెండియు నే రణమున కేతెంచుచుండ నామనోహరుఁడు నన్నుఁజూచి"సతీ! సంగరతలంబునఁ గడు నప్రమత్తురాలవై సంచరింపు" మని వచించెను. నాయజాగ్రత్తచే నిటులయ్యె నని తలఁచునేమో? విధివశంబున నిట్టి పాటుకలిగినదని నుడువుఁడు మఱియు నా తోడి నీడయగు మంజరికడ కేగి నావచనములుగా నిట్లని తెలియఁజెప్పుఁడు." చెలీ! మంజరీ! చిన్ననాఁటనుండియు మనమిద్దఱ మొకటిగఁ దిరిగి కలిసియుంటిమి. నేఁడు నీవు నాకు దూరస్థురాలవైయుంటచే నాకుగల్గిన పరితాప

మింతింతని వచింప నలవి గాదు. నీవు నాచావునకై బెంగపెట్టుకొనక చక్రవర్తి వచ్చువఱకు నగరము నతిజాగరూకతఁగాపాడియుతివి మన్ననలందుము. ఒకవేళ నానాథున కేయపజయము గలిగినచో మ్లేచ్ఛులవాతఁబడకుండఁబురకాంతలనందఱ రక్షించుభారము నీదేసుమీ' అని" వెండియు "సేనానీ! ఇంకొకటిగలదు. ఎవనిమూలమున నాయజ్ఞానాంధకారము మాసిపో జ్ఞానసూర్యుఁడు వెలుఁగఁగల్గెనో, యెవని కారణమున నామదింగల పిరికితనముపోయి శౌర్యమంకురించెనో, యెవనివల్ల నస్త్రశస్త్రాద్యనేకాయుధ ప్రయోగముల గుర్తెఱింగి సంగరరంగమందు సంచరింపఁదగుదాన నైతినో, యెవనిమూలమున నామనోరథములెల్ల నెరవేర్చుకొనుచుందునో, యెవనియుపాయమున నీశ్వరభట్టు మొదలగువారి మాయావాగురులఁ జిక్కి ప్రాణములఁ గోల్పోవక బ్రతికితినో యట్టిసుగుణసమేతుఁడు, దీనదయాపరుండు, పరోపకారపారీణుండగు నా ప్రియోపాధ్యాయు దేవశర్మంగాంచఁగల్గితి రేని నాసంగతినంతయు విన్నవించి నా నమస్కృతు లందఁజేయుఁడు. మీరూరడిల్లియుండుఁ" డన నెల్లరును భరింపనోప కత్యంతముగ విలపింపసాగిరి. అత్తరి మరల సంయుక్త 'అయ్యా ఈప్రాణ మెప్పటికైన నిర్యాణమున్న దేగదా? ఇందులకై మీరింతగ వగవ నేటికి? అనవరతంబు సన్మార్గవర్తనులై, సత్యవంతులై, స్వార్థపరిత్యాగులై, మిమ్ముఁ బాలించువారియెడల భక్తిగలిగి మెలఁగుచుండుడు. అందువలన మీ కెనలేని సౌఖ్యంబులు చేకూరు" నని వెండియు "మీలో నెవరైన నాజనకుని దగ్గఱకేగి యిట్లువచింపుఁడు. 'తండ్రీ! సవంతియువివేకుండవై కావింపఁగడగిన యకార్యముల మూలమునఁగదా నాకట్టిదురవస్థ వాటిల్లినది. ఇందులకు నీపై నాకావంతైన గోపము లేదు. నే మరణించినపిమ్మటనైన యించుక మంచిచెడ్డల విచారించుకొని సన్మార్గమున నడువుము. పరలోకంబున కేగుచు నీప్రియతనూజ సంయుక్త సమర్పించు వందనముల ననుగ్రహింపు" మనిపల్కెను. అంతకొంత

తడవునకు మఱింత యాయాసము గలుగసాగెను. మాటలాడ దలంపు గలిగియు శక్తిలేమి కనులుమూసికొని పరుండియుండెను. దాసీలుమున్నగువారు దగ్గఱంజేరి పిలువఁ గనులువిచ్చి చూడసాగెను. కొంతసేపటి కదియు నడఁగిపోయెను. దండనాయకులు, దాసీలు, వైద్యులు మొదలగువారు చుట్టుఁజేరి విలపించుచుండఁ గొంతవడికి నాధీరసాధ్వి తనప్రాణమువదలెను. అతులితధైర్యసాహసపరాక్రమవంతులైన, యొక్క యార్యావర్తమువారిచేఁ గాక సకలవిదేశీయులచేఁ బొగడ్తలఁగాంచి, నిజయశోమరీచుల దిక్కుడ్యభాగంబుల వెలుఁగఁ జేసిన మహారాణియగు సంయుక్త యట్లు జీవములవదల నక్కడనున్న వారందఱు మహాసంక్షోభమున మునిఁగిపోయిరి. అందఱామెచుట్టుఁజేరి " హా! లోకజననీ! హా! దివ్యమంగళవిగ్రహా! హా! మహారాణీ! సంయుక్తాదేవీ! అనాథలమగు మమ్మందఱ నిట్లుదయమాలి నీవొంటరిగ నెచ్చటకేగితివి? తల్లీ! కన్నబిడ్డల కన్న నెక్కుడగు ప్రేమంబున మమ్ముఁ జూచుచుందువే! ఎవరింక మమ్మట్లాదరించి కన్గొనువారు? ని యీవృత్తాంతము మేమెట్లు నినాధునకుఁ దెలియఁబఱచఁగలము. అతఁ డవార్తవిన్నపిదపఁ బ్రాణములభరించి యుండుననిన తో...చదు. నీవులేని మాజన్మమేటికి? హా! ఢిల్లీనగరరాజ్యలక్ష్మి! పోయితివా" యని యెచ్చుచు చేయునది లేక రాజోపచారంబుల నామెశరీరము దహనముగావించి మఱపోయినవారలై యందఱు నలిఘురుపద్దకురాఁ బయలుదేరిరి.

అఁట నలీఘురుదగ్గఱ ఘోరమగురణము జరుగుచుండ జక్రవర్తి శిబిరమునఁ గూరుచుండి తనప్రాణకాంతకిడనుండ రెండు దినములైనను వార్తానందుల కాలోచించుచుండెను. అత్తరి మహాబుద్ధి మొదలగువారు దీనవదనులై శిబిరముఁ బ్రవేశించి యతనికి నమస్కృతులఁజేసి నిలువ "సంయుక్తయెక్కడ" నని యతఁడడిగెను. అందుల కొక్కరు ప్రత్యుత్తరమీయక తలలువంచుకొని నిలువఁబడియుండిరి. వీరిస్థితింగాం

చి చక్రవర్తి యనుమానోపేతుఁడై "మీరంద ఱేల మాటలాడరు? నిక్కముగ నా ప్రాణకాంత కేమైనదో వచింపుఁడు. నామనస్సు నేల నిట్లుకలఁతఁబెట్టెదరు; వచింపుఁ" డన నొక్కఁడును మాటలాడక విలపింపసాగిరి. అంత నతఁడు ధైర్యము చెడి "హా! ప్రాణనాయకీ" యనిమూర్ఛిల్లెను. వెంటనే దగ్గఱనున్న వారు సేదదేర్చ లేచి దుఃఖపరీతచిత్తుఁడై హా! నామోహాంపుమొలక, నా ప్రియభామిని, నా ప్రాణము, నా సంయుక్త యెక్కడ నని యడుగ మీ రేల ప్రత్యుత్తర మీయరు? నాహృదయమున నేటికిట్లు వ్యథగలుగఁ జేసెదరు? చెప్పు" డన మహాబుద్ధి ధైర్యము దెచ్చుకొని సంయుక్త వ్రాసియిచ్చిన లేఖ నతనిచేతి కొసఁగెను. చక్రవర్తియు లేఖనందుకొని చదువుకొననోపక చెంతనున్న మఱియొకనిచేతి కియ్య నతఁడిట్లు చదువ నారంభించెను.

ప్రాణేశ్వరా!

తమచరణదాసినగు నే కాలంబుతీరి పరలోకమున కేగుచు విన్నవించుకొను దీనాలాపంబుల కొంచె మాలింపుఁడు. మీచే నట్లనుజ్ఞాతనై గై జయాపురముఁ జేరి రాజకులుని నోడించి పాఱఁదోల నతఁడు పోయి వంగపతితోఁ జేరుకొనెను. వెంటనే నేనును మహాబుద్ధికిఁ దోడ్పడ నేగితి. రణమున బ్రవేశించినదాది మందూరు వంగపతులు నన్నుజంప నెన్ని యుపాయములో సల్పిరికాని వారికి సాధ్యము కాలేదు. తుదకు నేవంగపతిం జంపి యుద్ధము సేయుచుండ రాజకులుఁడు మహాబుద్ధి వేషమునఁ జనుదెంచి నన్నుఁ బొడిచినాఁడు. తోడనే వానిఁ జంపితి కాని యతని వ్రేటు గురితప్పి భుజముపైనదగిలి మెడ వఱకు దిగినది. వెంటనే మహాబుద్ధిమొదలగు వార లేతెంచి నన్ని రాజవైద్యశాల కనుపఁ బాపమా వైద్యుఁడును సంపూర్ణాదరమున నాకుఁ దగినచికిత్సలఁ జేయుచున్నాఁడుగాని నే బ్రతుకుటమాత్రము దుర్ఘటము. రక్తనాళములన్నియు భిన్నభిన్నములైనవి. శరీరమునంగల

రక్తమంతయుఁ బోయినది. నాథా! నిర్భాగ్యురాలనగుటనాకు భవ
దీయదర్శనంబు మరల గలుగుభాగ్యము లేకపోయె. నాయంతమునకు
మీరు బెంగపెట్టుకొనక ధైర్యమూని మీకార్యముల నప్రమత్తులరై
యొనర్చుకొనఁ బ్రార్థించుచున్న దానను.

ఇట్లు విన్నవించుకొను మీప్రియురాలు

"సంయుక్త"

అని చదివినంతోడనే కనులవెంట నెక్కుమ్రాడి బాష్పములుఁ
జాల్గొన మూర్ఛిల్లి లేచి "హా! పరిహాసితపూర్ణిమాశశాంకవదనా?
హా! రణరంగచరణకళావిశారదా! హా! వినీలకుంతలాచ్ఛాదితార్ధేందు
నిటలా! హా! ఠోరూవంశకలశార్ణవలక్ష్మీ! హా! మదీయమనోమోద
సంధాయినీ! హా! ప్రియసఖీ! హా! సంయుక్తా"! యని విలపిం
చుచు మరల మూర్ఛిల్లెను. దగ్గఱనున్నవారు శోకపరీతచిత్తులై
యావల నట్లు దారుణమగురణము జరుగుచుండ నిక్కడ నిట్లగుటకు
వెతనందుచు ననేకగతుల నోదార్ప లేచి చక్రవర్తి తనకాంత వ్రాసిన
లేఖంగొని కనుల కద్దుకొనుచు "హా! మదీయకులకమలినీరాజహంసి
నీ! నీకింతటిలోనే నూరేండ్లునిండెనా? నన్నిట్టిదుఃఖభాజనుగఁజేసి
నీ వెచటికేగితివి? తన్వీ! నీసుందరవదనారవిందముగాంచి సంతసించు
భాగ్యము నాకుఁ దీరిపోయెనా? నీవులేని యీరాజ్యభోగంబులు
నాకేల? కట్టా! నీవంటియుత్తమ కులాంగనలకెల్లసంపూర్ణాయువు
నొసంగని యావిధాత నేమన నగును. ముద్దులొలుకఁబలుకు నీవచ
నామృత పూరంబులఁ గ్రోలుభాగ్యమే నిర్భాగ్యుండనగుట దప్పిపోయె.
తరుణీ! ముందు జన్మింపఁగల నీతోడికాంతలకెల్ల గురుభూతవైతివి.
పుట్టినింటికి మెట్టినింటికి యశంబుదెచ్చితివి. నీవు మాతృదేశముపైఁగల
యభిమానమును వెల్లడిపఱచుకొంటివి. అయ్యో! భుజముదగ్గఱనుండి

మెడవఱకు తెగినంతమాత్రముననే ప్రాణంబుల నిలుపుకొనఁజాలక పరలోకమున కేగితివికదా? అర్థాంగివగు నీవుపోయినపిదప నర్థశరీరుఁడనైన నే నెట్లు మనియుండఁగలను? నేనును నీవెంటనే చనుదెంచెద"నని ఖడ్గమునకై వెతకికొనఁబోవఁ దటాలున విజ్ఞానశీలుండు లేచి యతనిహస్తమును బట్టుకొని "రాజేంద్రా' కాలముతీరుటచే నాసాధ్వి పోయినది. ధీవిశారదుఁడవగు నీవే యిట్లు సేయఁబూనిన నీరణసంరంభ మంతయు నేటికి? నీవిట్లు చేయుచున్నాడవని తెలిసిన జయచంద్రుఁ డాదిగాఁగలవారల కెంత చుల్కనయగునో తలఁపుము. నీవుపోయినపిదప మేముమాత్ర మెందుకు? మున్ముందు మున్ముఁగడదేర్చి యావల నియిష్టమువచ్చినట్లు కావించుకొను" మన నతఁడు మారువల్కనోడి తనప్రియకాంతం గడసారి చూచివచ్చెదనని వేఁడుకొనెను. మహాబుద్ధి మొదలగువారు జరిగినసంగతుల సవిస్తరముగ నెఱుఁగనెత్రిచిరి. అంతఁ జక్రవర్తి మనస్సు రాయిచేసికొని జయచంద్రునివలన నింత చేటుగల్గినదిగదా యని త్వరలో నతనిజంప శపథమువట్టి దండనాయకులఁ బురికొల్పి తానుస్వయముగ రణమునకుఁదిగెను.

ముప్పదియొకటవ ప్రకరణము

అట్లు చక్రవర్తి రణమునకుఁ దిగి రోషభీషణాకారుండై శత్రు సంహారముఁగావింప మొదలిడ నొకవార మగునప్పటికి జయచంద్రుని సేన పూర్తిగ నాశనమయ్యెను. అనేకవేల మ్లేచ్ఛులును హతులైరి. అంత నిఁక నాలస్యమొనరించిన మోసమగునని సుల్తాన్ తనసైన్యమును వెనుకకు మఱలించెను. సుల్తానుయాజ్ఞప్రకారము సేనలు●బరుగెత్తిపో వుచుండ స్వసైన్యములేమి ముందుఁబోయిన యెటువచ్చునోయని జయ చంద్రుఁడొకరాత్రివేళ నెవరికి దెలియకుండ నీశ్వరభట్టును వెంటఁ గొని వెండియు యుద్ధమారంభమైనది మొదలు దనకు బార్శ్వవర్తులుగ నుండి మిక్కిలి నమ్మకముతో మెలఁగుచువచ్చిన జలీమ్‌సేక్, హైదా ఖాన్, మిర్జాఖాన్ అనుముగ్గురుసేవకులఁగూడ గైకొని వేరొకమా ర్గమున వెడలిపోయెను చక్రవర్తి పరువెత్తుచున్నవారి నేలచంపవల యునని యూహించి వారిమ్లేచ్ఛదేశము వఱకుఁ దఱుమఁ దనవారల కాజ్ఞయిచ్చెను. ఇట్లుమ్లేచ్ఛులుముందు నార్యులువెన్కయై రెండుసేనలు మరల స్థానేశ్వరము దగ్గఱకుఁ జేరెను.

సుల్తాన్ తనకపజయము కలిగినందున ననారతము చక్రవర్తి నెట్లు చంపుదునా యని యుపాయముల వెదకుచున్నవాఁడుగానఁ దుట్ట తుదకు మోసముఁజేసి యార్యులఁ బరిమార్చఁగోరి స్థానేశ్వరము చేరిన పిదపఁ దా నార్యావర్తమువదలి మార్గమునం దేవిధమైన యల్లరులు చేయకుండ నాఫ్గన్‌స్థానమున కేగునట్లును తనదేశముఁ జేరువఱకుఁ గొంత చక్రవర్తిసేనను వెంటనుంచుకొని దానికగుఖర్చులు తానేభరిం చునట్లును, యిఁక ముందెన్నటికిఁ జక్రవర్తియనుమతిలేక యార్యావ ర్తమునకు రాకుండునట్లును, సార్వభౌమునితో సంధిగావించుకొని యెను. అట్లు సంధిఁజేసికొనుటవలనఁ జక్రవర్తిహృదయమునఁగల

రోష మంతరింప మరల దుఃఖ మంకురింపసాగెను. సంధి గావించుకొన్న పిదప మ్లేచ్ఛు లెట్లుండిరో చూచిరండని చక్రవర్తి మొదలగువారు కొందఱు వేగులవారినంప వారు తిరిగివచ్చి మహమ్మదీయులు శస్త్రాస్త్రముల సజ్జగించి నెమ్మదిగ నున్నారని వచించిరి. అంత నాదినము ప్రొద్దుగ్రుంకినవెంటనే హాయిగ భుజియించి సార్వభౌమసైనికులెల్లరు సకలలోకానందకరముగఁ గాయుచున్న నిండువెన్నెలలో కొంతసేపటివఱకు నిష్టమువచ్చిన ప్రసంగములాడుకొని తరువాత నెక్కడివారక్కడ నిదురించిరి. చక్రవర్తియు ప్రత్యేకముగఁ దనకొఱకు నిర్మింపఁబడిన శిబిరముఁజేరి మంత్రులు దండనాయకులు మొదలగువారు చుట్టు నిదురించి యుండ దా సంయుక్తం దలఁచుకొని విలపించుచుఁ గొంతసేపటికల్లో నిదురగూర్కెను. అటు లార్యసైనికులెల్లరు మైమఱచి గాఢనిద్రాపరవశులై యుండ రాత్రినొంటిగంటవేళ మ్లేచ్ఛులందఱును సుల్తాను యాజ్ఞప్రకారము ఖడ్గపాణులై వారిమధ్యఁజొచ్చి యొక్కొక్కని దీర్ఘనిద్రబుచ్చసాగిరి. సుల్తాను బలశాలులగు నిరువది మంది భటులఁగూడుకొని చక్రవర్తియున్న శిబిరముఁ బ్రవేశించి నలుప్రక్కల బరుండియున్నవారల నధించి చక్రవర్తి గొంతుఁ గోయఁబోవుతరుణమున నతఁ డుల్కిపడిలేచి మ్లేచ్ఛులఁగాంచి విభ్రాంతుఁడై తనఖడ్గమును జేబూని వారిపైఁ దిరుగఁబడెను. ఈలోపలనే రెండుమూఁడు ఖడ్గప్రహారములు వెన్నునఁదగిలెఁగాని వానికి వెనుకదీయక పోరాడ మొదలిడి సుల్తాను వెంటవచ్చిన వారిలో నొకని దక్కువగ నందఱఁ గడదేర్చెను. అత్తరి సుల్తాను చక్రవర్తిమీఁదికి రానతనిక్రింద పడతన్ని నరుకబోవ మ్లేచ్ఛభటుఁడు వెనుకనుండివచ్చి చక్రవర్తి కంఠముపై బలమగుదెబ్బ కొట్టెను. ఆదెబ్బతో నతఁడు నేలగూల సుల్తాను పరువెత్తిపోయెను.

తెల్లవారులోపల మిగిలిన యార్యులఁ జంపి మ్లేచ్ఛులందఱు

సుల్తాను కావార్త నెఱిఁగింపఁ గృతకృత్యుఁడై యతఁడు కన్యాకుబ్జము నాక్రమించుకొన కొంతసేనతో గుతుబుద్దీనును బంపి తాను మిగత సైన్యముం గూడుకొని డిల్లి కేగఁ బయనమై పోయెను. అంత నిక్కడ ప్రబలమగు నార్యసేనయంతయు దుర్దశంబడియుండఁ, దెల్లవారిన పిదప శత్రువుల కంటఁబడక మిగిలినకొందఱు చిన్న చిన్న కాలువలుగట్టి పారుచున్న రక్తమునందడిసి లేచి సంభ్రాంతమనస్కులై మహమ్మదీయులు గావించిన మోసమని తెలిసికొని యీవార్త నెఱిగింప వారును డిల్లీకేగిరి. సుల్తానుకుఁగాని మఱి యితరులకుగాని తెలియకుండఁ బారిపోయిన జయచంద్రుఁడు తనరాజధాని కేగఁబయనమై పోవుచుండెను.

మార్గమధ్యమున సీశ్వరభట్టుకుఁ గలిగిన దురూహలకు మితి లేదు. కన్యాకుబ్జముఁ జేరులోపల జయచంద్రునిఁజంపి తానుపోయి యీరాజ్యము నాక్రమించుకొనఁ గోరి పార్శ్వవర్తులు మువ్వురత్యంత జాగరూకులై యుంటచే యనేక పర్యాయములతనిఁజంప గడఁగియు మానుచు నిఁక వారి కెఱుకలేకుండ తనకార్యము నెరవేర్చుకొనుట దుర్ఘటమని తలంచి యొకనాఁడు రాజావలకు జనియుండ వారితో రహస్యముగ "మిత్రులారా! మీరు నాకత్యంత స్నేహితు లగుటచే నిప్పుడు నేనొక రహస్యము జెప్పుచున్నాను. దుర్ఘటమని యెంచకుఁడు. పాపమని తలపోయకుఁడు. మన మీరాజుగారి నెన్ని దినములనుండి యో కొలుచుచున్నాముగదా! మన క్షేమైనసౌఖ్య మనిపించుచున్నదా? ఇత్తరి నేనొక యుపాయముఁ జెప్పెదను. నలుగురముచేరి యీరాజుం గడదేర్చితిమా నిక్కముగ మనకుఁ గన్యాకుబ్జరాజ్యము లభించును. పట్టముఁ జేరినపిదప నక్కడివిషయములు చక్కపఱుచు భారము నాది. ఇట్లుచేయుటవలన మనకీకష్టములన్నియు నణగి రాజభోగములు ప్రాప్తములుగాఁగలవు. నామాట కాదనకి యిందున కొడంబడుఁడు. మీరతనికిఁ దోడ్పడకుండిన జాలు. నే స్వయముగ నతనిఁ గడముట్టించెద.

మీరిందులకు సమ్మతింపనిచో మనము పడవలసినబాధలకు మితియుం డదు. కాన నాలోచించుకొనుఁడు" దన వారుమువ్వురు మొగములు చూచుకొనుచు 'నారా! వీని దుశ్చింత' యని తలపోయఁ గడఁగిరి. అంత మరల భట్టు "మీ రీరక మొగములు చూచుకొనుటవలన నేమి ప్రయోజనము? మనమిప్పుడు కొంచె మించుమించుగఁ గన్యాకుబ్జముఁ జేర వచ్చినాము. ఆపట్టణ మిచ్చుటకు నైదారామడలకంటె యెక్కువ లేదు.పురముఁ జేరినపిదపనతనిజంపుటసునతరముకాదు. ఆకార్యమిటువం టిస్థలమందేజరిగినయెడలఁ బులి యెత్తుకొని పోయినదనిగాని రణమున నే మృతినొందినాఁడని గాని చెప్పి పౌరుల నెమ్మదిపఱచగలము. కావున నేదోయొకటి నిర్ధారణ జేసికొని నాలోచింపుఁ" డన వారుమువ్వురు రేపాలోచించి చెప్పెదమనిరి. తరువాత జయచంద్రుఁడు వచ్చుటచే నాఁటికాప్రసంగమాపివేసిరి.

ఆ మఱునాఁడు భట్టు స్నానమొనరింప నక్కడికిఁ గొంచెము దూరమున నున్న నొక సెలయేటికిఁ బోయియుండ మ్లేచ్ఛసేవకులు రాజదగ్గఱ కేతెంచి "రాజేంద్రా! మీరింతకాలము మీభట్టు నెట్లు నమ్మి యుంచుకొంటిరో యూహింపఁజాలకున్నాము. వీఁడు మిమ్ముఁ గడతేర్చి కన్యాకుబ్జము నేలఁ దలఁపుఁ గలిగియున్నాఁడు. నిన్న మీరా వలకేగియున్న సమయమున నతఁడు మావద్దకు వచ్చి మిమ్ముఁ జంప మమ్ముంగూడ సహాయపడవలసినదని కోరినాఁడు. అన జయచంద్రుఁడు వారివాక్యముల విశ్వసింపక "మీరు చెప్పునదంతయు నాకాశ్చర్యముగ నున్నది" అనెను. అత్తరి వారు మువ్వురు "రాజా మీకతని యెడఁగల చిరపరిచయమున నిట్లనెదరుకాని కావలయునన్న నిప్పు డతఁడు వచ్చు లోపల నాపొదరింట దాగి యుండుఁడు. మాకందఱకు జరుగు సంభాషణ విందురుగాక" యనిరి. అందుల కతఁడును సమ్మ తించిపోయి పొదరింట దాగియుండెను. అంత గొంతసేపటికి భట్టు

చనుదెంచి జయచంద్రుఁ డెక్కడ నని యడుగ నవతలకు వెళ్లిరని వారు చెప్పిరి. అత్తరిమరల "నే నిన్న మీతో ముచ్చటించిన దానిఁ గూర్చి యేమిచేసితి."రన నామువ్వురు " అయ్యా! రాజ్యమువచ్చు నన్న సంతోషము మాకునుగలదు కాని మమ్ముఁబోషించువారి యెడ నట్టిద్రోహంబుఁ గావింప మామనంబులు జంకుచున్నవి. మఱియు నావిషయమై తలఁచుకొన్నప్పుడెల్ల మితిలేనిభయము గలుగుచున్న" దని వచించిరి. అందుల కతఁడు "మీరు వట్టి తెలివితక్కువవారుగఁ గన్పించుచున్నారు. మనలఁ బోషించువారని యభిమానము పెట్టుకున్నచో మన మొక్కనాఁటికి నెగ్గఁజాలము. అయినంతవఱకు మనకు సౌఖ్యము కలుగు మార్గము చూచుకొనవలయుఁగాని రాజనితలఁచి యూరకున్నచో మన మేనాఁటికి బాగుపడఁజాలము. నేను మొదటినుండి యింతవఱకుఁ గావించుచున్న వానివిన్నచో మీరెంతైన నాశ్చర్యపడుదురు. నాకు బుద్ధివచ్చినప్పటినుండి రాజ్యము సంపాదింపవలెనన్న కోరికను మనస్సునఁబెట్టుకొని సాధ్యమైనన్ని కుట్రలఁ బన్నుచున్నాఁడఁగాని యింతవఱ కాకోరిక సఫలము గాలేదు. ఇప్పుడు మంచి తరుణము దొరికినది. ఈసమయమును జెడఁగొట్టుకొంటిమా యిఁకమనకు వేరొండు తెరువులేదు. కావున మీ 'రట్లే'యన్నఁజాలు. ఒక్కక్షణమున నే నతనిఁ గడదేర్చెదను. మనము నల్వురముగలిసినట్లైన జయచంద్రుని రహస్యముగఁ జంపనవసరముండదు. బహిరంగముగ నెదిరించి పోరాడి చంపవచ్చును. నేనింతకుమునుపు గోరీమూలమున నాకార్యమే నెరవేర్చుకొనఁ దలఁచియుంటిఁగాని యతనికే యపజయము కల్గినది. కాన నిప్పు డింత ప్రయత్నము చేయవలసివచ్చినది. మీ రేమాత్రము భయమందవలసిన కారణములేదు. నేను చిన్నతనంబు నుండియుఁ జేసినవానిఁ జెప్పఁబూనినచో నొక పెద్దగ్రంథమగును. కాన కొంచెముఁగ దెల్పెదను. డిల్లీయందున్న కాలమున నొక మహా

మ్మదీయునితోఁ గలిసి చక్రవర్తిపై ననేకములగు గుట్రలఁబన్నితి. కన్యాకుబ్జముఁ జేరినదాది నితని భరతముఁ బట్టింపఁ బ్రయత్నములఁ జేయుచున్నాఁడను ” అనుమాటలు భట్టునోటివెంట వెడలుటయే తడవుగ నంతవఱకును బెరుగుచున్న కోపము నాపుకొని లోపలనున్న జయచంద్రుఁ డిక నాపుకొనఁజాలక 'యారా' యనుచుఁ దటాలునఁ బొదవెడలివచ్చెను. భట్టతనిగాంచిన వెంటనే నిశ్చేష్టితుఁడై యొక్క క్షణమాత్రము నిలచి తరువాత చప్పునఁ బారిపోవఁ దలఁచి కొన్నియ డుఁగులువైన చివాలునపైదాఖాణ బరువెత్తి:తనచేతికత్తితో నతనిపా దముల తెగఁగొట్టెను. భట్టు కెవ్వునఁ గేకవైచి నేలకొరిగి ప్రాణముల వదలెను. దూరముననుండి చూచుచున్న జయచంద్రుఁ డాదుర్మార్గున కుఁ దగినశిక్షయైనదని తలఁచుకొనుచు సేవకులఁగూడిమరలఁ బయన మై పోవుచుండెను. నాఁటినుండియు జయచంద్రుని మనసంతయు మారిపోయెను.

అంతవఱకు దానుకావించిన యవివేకపుఁ గార్యములకుఁ బశ్చాత్తాప మందఁజొచ్చెను.అన్యాయముగ నీశ్వరభట్టును నమ్మి మోసపోయితిగదా యని తలంపసాగెను. అట్లు పశ్చాత్తాపతప్తుఁడై తననగరమున కేగుచు మార్గమధ్యమున నొక వృక్షముక్రింద విడిసియుండ రాత్రి రెండుజాములవేళ గొందఱు బాటసారు లాచెట్టుక్రిందికే వచ్చి మరియొక వైపునవిడిసి నిట్టూర్పులు విడచుచు “ హా! జయచంద్రా ! మమ్మందఱ నరణ్యములపాలు కావించి పోయితివిగదా” యని తనపేరు నుచ్చరించుచు దుఃఖించుచుండ వారిసమాచారమరయుటకై తనే మువ్వురు సేవకులతో నెదుటకేగి నిలువ వారుభీతిల్లి “అయ్యో! మన కిక్కడగూడ మ్లేచ్ఛులదర్శన మయ్యెనే” యని యఱచుచుఁ బరుగిడఁ బొచ్చిరికాని జయచంద్రుఁడు వారలనాపి “అయ్యా! మీరెవరు? ఏటికిట్లు మమ్ముగాంచి భయంపడెదరు? మేము మీకేవిధమైన యపకారము

చేయుటకు రాలేదు. సావకాశముగ మీ వృత్తాంతముఁ దెలియఁ జేయుఁ" డన "అయ్యా! నిన్నుఁ గాంచిన మాకేవిధమైన భయము లేదు కాని యీ ముప్పూరఁ జూడ మా గుండెలు కొట్టుకొనుచున్నవి. మేము మీదినము సాయంతనము వఱకు సిట్టివేమముల వారి చేతులలో జిక్కఁబడి చావు దప్పి కన్నులుఁ గొట్టపోయి తప్పించుకొని వచ్చి యిటఁ జేరినాము. ఇక్కడఁ జేరిన వెంటనే మరల వీరి దర్శనమయ్యెఁ గదా యని భయము కలిగినది. ఇత్తరి నీ వభయహస్తము నిచ్చియున్నావు కాన భయము వదలి మా వృత్తాంతముఁ జెప్పెదము వినుము. మేముందఱముఁ గన్యాకుబ్జనగ వాసులము. మా రాజగు జయచంద్రుఁడు సద్గుణవంతుఁడే కాని యీశ్వరభట్టను నొక దుర్మార్గునిఁ జేరదీసి యతని కుత్రపు మాటలవిని మంచి చెడ్డ లాలోచింపక చక్రవర్తితో వైరముఁ బెట్టుకొని మాకెన్న రాని కష్టముల గలిగించినాఁడు. రాజ్యకార్యధురంధరులును, సద్గుణశీలురును, మంత్రిపురోహితులు నగు వినయశీల దేవశర్మ లెంత చెప్పినను వినక వారల వెడలఁగొట్టి మా రాజు వివేకహీనుఁడై భట్టు సలహాప్రకారము మ్లేచ్ఛులఁ దోడు చేసికొని చక్రవర్తి మీదికి దండెత్తిపోయినాఁడు. నేఁటికి వారము రోజుల క్రిందట జయచంద్రుఁ డెక్కడికో పారిపోయినాఁడనియు, చక్రవర్తియు సంయుక్తయు మరణంబు నొందిరనియు దెలిసినది. ప్రజలందఱియెడ సమానభావము గలిగి సకలసద్గుణసమన్వితయై బరగిన సంయుక్త మరణమునకును, నతులితప్రతాపశాలియగు చక్రవర్తి గతించుటకును జయచంద్రుఁడే కారకుఁడు గదా యని పౌరులెల్ల రతని ననేకగతుల దూషింపసాగిరి. ఎట్టులైనను రాజు కావున నతని పోకకు నొకవైపున జింతింపసాగిరి. ఇటులుండ పురిసిన పుండు మీద కారము జల్లినట్లు కుతుబుద్దీను మహమ్మదీయుఁ డొకఁడు సేనాపరివృతుఁడై వచ్చి మానదుర్గమును స్వాధీనముఁ జేసికొని పౌరులనెల్ల ననేకగతుల బాధింప మొదలిడ వానికోర్వఁజాలక మా వలెనే యనేకు లిదివఱకే

యడవులపాలైరి. నగరమందలి గొప్పవారందఱొకటియై వాని దగ్గఱకేగి ' మహారాజుగారు లేని తరి మీరిట్లువచ్చి యాక్రమించుకొను టుచితమగునా! కావున న్యాయ మాలోచించి మీరువెళ్లు' డన నవ్వుచు నతఁడు ' మీ రాజుగా రప్పుడే పరలోకగతులైనారు. బ్రతికివచ్చినను నతనికి మేము రాజ్యమియ్యము. చక్రవర్తి నోడించినపిదప జయచంద్రునిగూడఁ జంపి యీ రాజ్యము నీశ్వరభట్టున కిచ్చునట్లు లతఁడు మేము నొప్పందముఁ జేసికొనియుంటిమి. కాన మీ దారిని మీరుపొండన వారు మఱలివచ్చిరి. అంతఃపురవాసులెల్లరు నెక్కడనైనఁ దలఁదాచుకొన రాత్రివేళల ననేకమార్గములఁ బోఁగడఁగిరి. మేము నిట్లు చనుదెంచితి" మని వచింప జయచంద్రుఁ డత్యంతలజ్జాక్రాంతుఁడై విచారమున మునిఁగి " అయ్యా! మీకిఁక నేవిధమైన భయము లేదు. మేమును మీవలెనే బాటసారులము. మఱియు మీరు నిద్రించుతరి నే మేల్కొని కావలియుండెదను. తెల్లవారినపిదప మన మందఱ మెక్కడకైనఁ బోవుదము. శయనింపు" డన వారు నట్లే పరుండి నిద్దురపోయిరి.

జయచంద్రుఁ డా రాత్రి నంతయుఁ గావలికాచి ప్రభాతమగు సమయంబున నావల కేగి కాల్యకరణీయములఁ దీర్చుకొనివచ్చి కూరుచుండి యుండెను. అంత బాగుగ దెల్లవారినపిదపఁ బౌరులెల్లరు మేల్కొని ఖడ్గపాణియై తమకు గావలిగఁగూరుచుండియున్న రాజుం గాంచి శోకముప్పొంగ హా! జయచంద్రా యని యొక్క పర్యాయముగ నతని పాదములపై వ్రాలిరి. అత్తరి రాజును దుఃఖమున శిరము వంచుకొని " పౌరులారా! లెండు, మిమ్ము ట్లడవులపాలుగావించిన కూ్రరుఁడగు నీ జయచంద్రుని పదములపై నేల బడెదరు? అయ్యో! మీకు నిలువ నీడయైనను నాపురంబున లేకపోయెగా" యని వారి నోదార్చ లేచి వారందఱు " ఆహా! నేఁడు మే మెంతధన్యులమైతిమి?

ఎన్నాళ్లకు భవదీయదర్శనం బబ్బెను ! రాజచంద్రా ! మీకును గహ
నవాసమే చేకూరెనా ? మాగతి యెట్లైనఁ గానిమ్ము. అయ్యో !
పుట్టుభోగంబులగాంచిన రాకుమారుఁడవే ! సామ్రాజ్యపాలకుఁడవే !
ఎట్లీయరణ్యంబుల వేగించెదవు. హా ! దైవమా ! నీవెంతనిర్దయుఁడవు?
మాకును మారాజునకును గాననమే గతిచేసితివా " యని విలపించు
చుండ " అయ్యో ! నాకు రాజ్యముపోయినదనుచింత యెంతమాత్రము
లేదుకాని యవినీతుఁడనై వెడలఁగొట్టిన నామంత్రిపురోహితు లేమైరో
యనిదుఃఖము గలుగుచున్నది. కట్టా! నిష్కారణముగ నిండుసభ వారి
నవమానపఱిచి వెడలఁగొట్టితి. నాహితము గోరువారిని తలఁపనైతి.
క్రూరుఁడగుభట్టునే నమ్మితి. అయ్యో ! ఆమహాత్ములిప్పుడు నాకంటఁ
బడిన నే నెంతయైన ధన్యాత్ముఁడ నగుదు " నని చింతించుచుఁ గూరు
చున్న తరుణమున మ్లేచ్ఛసేవకులు ముప్వురు ముందర కేతెంచి
" రాజేంద్రా ! నీమంత్రి పురోహితులింతవఱకు సౌఖ్యముగ నున్నా
రు. నీవు వివేకహీనుఁడవై పారఁదోలినను వారు నీసహజగుణము
నెఱిఁగియున్నారు కాన భట్టుమూలమున నట్లుకావించితి వనుకొనుచు
మరల నీవు సన్మార్గమునకు రాఁబరమేశ్వరు ప్రార్థించుచునొక వేళ నీకే
మైన నపాయముగలిగినదోడ్పడ నీవెనువెంటనే మెలంగుచున్నారు. వారే
యీవేషము " లని తమమ్లేచ్ఛవేషములఁ దీసివైచి వినయశీలదేవశర్మ
కంచుకులై యెదుట నిలిచిరి.

అత్తరి జయచంద్రునకు గల్గినసంభ్రమము వచింప నలవికాదు.
మిక్కుటంబుగ విచారమును సంతోషము నుప్పతిల్ల నోటిమాటలేక
యొక్కక్షణకాలము వారివంకనే దృష్టినిగుడించుచుఁ గూరుచుండి
యుండి వెంటనేలేచి వారిపాదములపై వ్రాలెను. ఆసమయమున వార
నురాగపూరితులై యతని లేవనెత్తి "రాజా! భృత్యులమగు మా

పాదములపైఁ బడుట నీ కుచితముగాదు. నీవు మరల సన్మార్గమునఁ బడినందులకు మాకు మితిలేని సంతసము కలుగుచున్నది. గతించిన దానికి వగచిన నేమిప్రయోజనము. పోయినరాజ్యము మనకు మరల రానేరదు; దుర్మార్గుఁడగు నీశ్వరభట్టు మనలకిట్టిగతి గలుగఁజేసినాఁడు కాని" మ్మని పౌరులవంకకుఁ దిరిగి "అయ్యా! మీరిప్పుడెక్కడి కేగ బయనమైతి" రని యడుగ "ధీమంతులారా! మే మీయరణ్యములందే వసింప వచ్చినాము. ఏపురముఁ జేరఁబోయినను మహమ్మదీయులపోరే గదా! అట్లుకాని యెడల మీ రెట్లుచెప్పినసట్లు నడుచుకొనఁ గలవార" మని పౌరులు వచించిరి. అత్తరి వారితో దేవశర్మ "పౌరులారా! మన మందఱము నడవులయందే వసింపవలసినవారమైనను వేరువేరు తావులందుఁ బ్రత్యేకముగ నుండఁదగినవారమే కాని యొకటిగఁ గలిసియుండుటకు మాత్రము వలనుపడదు. అనేకు లొక్కచోటఁ గూడియుండు నప్పుడు వేర్వేరు పనులమీఁదఁ బలుప్రదేశములకుఁ బోవలసివచ్చును. మన మెంతరహస్యప్రదేశమున వాసముచేయుచున్నను గ్రహచారము చాలక మనలో నొక్కఁడు శాత్రవులకంటఁ బడుట సంభవించెనేని వారెన్ని కష్టములనైనఁబడి గుట్టుకనిపెట్టి మనల నందఱ వధింతురు. కావున మేము నల్వుర మెక్కడకైనఁ బోయెదము. మీరు మఱియొక త్రోవనుబొం"డన సమ్మతించి జయచంద్రుఁడు మొదలగువారలకు నమస్కృతు లొనరించి పౌరులు తమదారింబోయిరి. అనంతరము వారు నల్వు రక్కడకుఁ గొంతదూరమందున్న నొకకొండదరి కేగి యచ్చోట నొకరహస్యమగు ప్రదేశమున బర్ణశాలను నిర్మించుకొని యందు నివాసముసేయఁ దొడఁగిరి.

అనుదినమును జయచంద్రుఁడుపడు పరితాపమునకుఁ బరిమితి లేకుండెను. దేవశర్మాదుల కతసినోదార్చుట దుర్ఘటముగఁదోఁచుచుం

డెను. ఇట్లుండ నొకనాఁడు మంత్రి పురోహితభృత్యులు మువ్వురుఁ బ్రభాతకాలమునలేచి వాడుకప్రకారము నిత్యకృత్యముల నెరవేర్చుకొనుటకుఁ గొండదిగువనున్న సెలయేటివద్దకు వెళ్ళిరి. అంతఁగొంతసేపునకు జయచంద్రుఁడు మేల్కాంచి యొంటరిగనున్నందునఁ దలంపులన్నియు మనస్సునకురా "హా! నేనెంతక్రూరకర్ముఁడను? నా కాయీశ్వరభట్టెక్కడదాపరించె? అయ్యో! నిక్కమైనమిత్రుఁడనినమ్మితిఁగాని నాకింత ద్రోహము గావించువాఁడని కలనైనఁ దలఁచితినా? సర్పమునకుఁ బాలుపోసి పెంచునట్లు వానిఁ బోషించితి. దైవమా! నాప్రజలకందఱకు నిలువ నీడలేకచేసి యడవులపాలు కావించితివా? ఇఁక నేను జీవించియేమిప్రయోజనము? రాజ్యమాపోయె. బంధువులానశించిరి. ప్రియతనూజయా మరణించె.నాకు గష్టములుకల్గినయెడఁ దోడ్పడి రక్షింపఁగలవాఁడని తలఁపక నిష్కారణముగ నతిధీమంతుఁడగు జామాతతో వైరముబెట్టుకొంటి.తుదకతఁడును నాశనమయ్యె. హా! ప్రియకుమారీ! సంయుక్తా! నీవచనంబు లెంతయాదరణీయములే! అమ్మా! తండ్రినని దయదలంపకనన్నప్పుడే చంపియుండిన నింతకానేరదుగదా! సుగుణగణసమేతవగు నిన్నుఁ దిరస్కారము గావించి యింత దెచ్చుకొంటి. తల్లీ! అప్పటికి నీవచనసుధాధారలు విషతుల్యములై యాక్రూరునివిషవాక్యములే యమృతోపమానములయ్యె.అయ్యో! నీవెంతపరితపించి యుంటివోగదా? నేను నిన్నంతనీచముగ నొవ్వనాడినను నాపైఁ గిన్కఁబూనక నీమరణకాలంబున నాతోఁ జెప్పఁబంపిన వాక్యము లెంతశ్లాఘాపాత్రములు! అమ్మా! నీవన్నట్లు నాకు గహనసంవాసమే ప్రాప్తమైనది. హా! జామాతా! చక్రవర్తీ! నీవు నన్ను కన్యాకుబ్జనగరవుముట్టడియప్పుడే యేల చంపవైతివి? అయ్యో!తలఁచుకొన్నకొలఁది నా కడుపు తఱుగుకొనిపోవుచున్నది. ఛీ! జయచంద్ర

పాతకా! మాతృదేశఘాతకుఁడవగు నీవింకను బ్రతికియుండ నెంచెదవా? పోయియిప్పుడే యెక్కడనైన మృతినొందరాదా' యని తన్ను దాన దూషించుకొనుచు మిక్కుటమైన శోకమునఁ దనఖడ్గము గైకొని కొండ యావలిప్రక్కకుదిగెను. అక్కడఁ గొందఱు పుణ్యాంగనలు "హా జయ చంద్రా! మావంటి మానవతులకెల్ల భరింపశక్యముగాని యవాచికములగు నిక్కట్టులఁ గలుగఁజేసి పోయితివిగదా' యని రోదనములు చేయుచుఁ గాష్ఠముల బేర్చుకొని వానికి నిప్పంటించుకొని పైఁబడుండి చచ్చుచుండిరి. జయచంద్రుఁడాదారుణకృత్యముల నవలోకించి విభిన్న చేతస్కుఁడై 'ఓ సాధ్వీమతల్లులారా! పూజనీయంబగు పరలోకంబున కేగుచు బాపాత్ముఁడగు జయచంద్రుని పేరేల యుచ్చరించెదరు? అయ్యయ్యో! మీకిట్టిపాటుఁగల్గఁజేసిన యాదుర్మార్గుఁడుగూడఁ జావఁబోవుచున్నాఁడు. మీకందఱుకు స్వస్థతఁ జేకూరుఁగాక" యని ఖడ్గముతోఁ బొడుచుకొని తనమిత్రులఁదలఁచుకొనుచుఁ బ్రాణముల వదలెను.

అంత నట స్నానములొనరింపబోయినవారు తిరిగివచ్చిపర్ణశాల యందు రాజులేకుండుటచే ననుమానగ్రస్తులై యతనివెదకుటకు ముప్వురు మూఁడుత్రోవలబోయిరి. అందు దేవశర్మ రాజుపడియున్నవైపున కేగి తగులఁబడుచున్న కాష్ఠములఁగాంచి విస్మితుఁడై కొంచెమనతలికిబోయి చేతిఖడ్గము కంఠమున గ్రుచ్చుకొనియుండ విగతజీవుఁడై పడియున్న యతనిగాంచి హా యని మతిదప్పిపోయినవాఁడై కళేబరముమీఁదబడి "హా! సార్వభౌమా! హా!జయచంద్రా! మమ్మందఱ మోసము గావించిపోయితివా! ఓ! ఆర్యావర్తమా! నీకుఁ బ్రేమాస్పదులగు రాజులెల్లరు నశించిరికదా? ఇక నీగతియేమగు" నని విలపించుచు నాఖడ్గము లాగుకొని దానితోనే పొడుచుకొని తానును మరణంబునొందెను. అంత కొంతతడవునకు వినయశీలుఁ

డేతెంచి రెండుకళేబరములఁజూచి శోకమున “ హా! ఇదియేమి నేను నిక్కముగ నావారికళేబరములఁ జూచుచున్నానా? లేక నాకేమైనభ్రమ చేకూరినదా! హా! జయచంద్రా ! నీకీదుర్మరణంబేలకల్గె! హా! నెచ్చెలీ ! దేవశర్మా! ఇప్పుడేకదా మమ్మంటుబంపి నీ విటువచ్చితివి? ఇంతలో నింతఘోరమా ! హా ! నీవు యమునంబడిన నాటఁగోలె నేటివఱకు గావించిన కృత్యములఁదెల్పి యవి మనజయచంద్రునకుఁ దెల్పనేతెంచితిమిగదా? కష్టా! నీసాహసకృత్యములఁ బరలోకమందైన నెఱింగించెదఁగాక యని పోయితివా? నేనుమాత్ర మేలవినకుండవలయు. ఇదిగో నేనును వచ్చుచున్నాఁడ” నని తనదగ్గఱనున్నకత్తిం బొడుచుకొని ప్రాణములవదలెను. కొంతతడవునకుఁ గంచుకి చనుదెంచి మూఁడు శవముల వీక్షించి భయోపేతుఁడై రోదనసేయుచు నఁట మందుచున్న యొకకాష్ఠముపైకురికి మృతుఁడయ్యెను. అఁట డిల్లీ నగరమందున్న మంజరి జరిగిన వార్తలన్నియు విన్న వెంటనే దుర్గమందున్న సేనను గోరీని నెదురింపఁ బంపి యనంతరము పురమునంగల యంగనలనెల్ల రావించి వారితో “సాధ్వీమతల్లులారా ! కన్నబిడ్డలంబలె మనలఁ బోషించుచువచ్చిన రాజదంపతు లిరువురు మృతినొందినపిదప మనముజీవించి యున్న ప్రయోజనంబేమి ? మఱియు గోరీ మనపురంబున కేతెంచుచున్నాఁడఁట. మ్లేచ్ఛులచేఁ జెఱపట్టఁబడుటకన్న వేరుమార్గముల మృతి నొందుటమేలు? అదియుంగాక నాప్రియసఖియగు సంయుక్తాను మరణించు తరుణమున ‘చెలీ ! మంజరీ! ఒకవేళ నానాధున కపజయంబైన డిల్లీపురకాంతలమానభంగముగాకుండ రక్షించుభారము నీదేసుమీ’ యని సందేశమంపియున్నది. ఇత్తరి మిమ్మట్లు రక్షింప నాకు వేరొండువెరవుగన్పించుటలేదు. గోరీ వచ్చులోపలఁ జితులం బేర్చుకొని యగ్నినిడుకొని వానిపైఁ బడి మృతినొంది మామర్యాదలఁ గాపాడుకొ

ను” దన నందఱు శోకాక్రాంతలై యాక్రందనముల జేయుచు మంజరి దారిఁజూప దామును ప్రాణముల బాసి స్వస్థతనొందిరి. సుల్తాన్ మహమ్మద్ గోరీయు దన్నెదురింపవచ్చిన సేనల నవలీలనుక్కడించి రాజధానిం జేరి దుర్గపుఁదలుపులు తెరువఁబడియుంటచే నేయాటంకములు లేక లోపలఁ బ్రవేశించి పురమున నెక్కడఁజూచినను భస్మరాశులుంట కాశ్చర్యకలితుఁడై యార్యకాంతల సాహసమునకు మెచ్చుకొనుచు నన్నికడల బాగుసేయించి మహమ్మదీయ రాజ్యము స్థాపించెను.

స ం పూ ర్ణ ము.

విక్రయమునకు సిద్ధము!   విక్రయమునకు సిద్ధము!!

ఓం

పురుషార్థప్రకాశము

రాణీసంయుక్తయను నవల గ్రంథకర్తగారగు
శ్రీ వేలాల సుబ్బారావుగారిచే తెనుగున వ్రాయఁబడినది.
అన్నివిధములయిన సంఘసంస్కరణోద్యమములకు తోడుపడుట
యందు ఇంతటియుపయోగకరమైన గ్రంథము ఇంతవఱకు
తెనుగులో లేదు.

ఇందు రెండుప్రకరణములు కలవు. మొదటిదగు బ్రహ్మచర్య ప్రకరణమందు మనుజులు విద్యాభ్యాసము నిమిత్తము ఎంతకాలము వఱకు ఏయేవిధుల ననుసరించి యెట్లునడచికొనవలసినదియు వ్రాయబడియున్నది. వేదాదిశాస్త్రముల వినుటకునైన నర్హులుకారని పాతాళము నకు అణగద్రొక్కబడిన స్త్రీ శూద్రాది సమస్తమానవ మాత్రులకు ఉపనయనాధికారము, వేదాధ్యయనాధికారము నుండినటుల అనేక స్మృతులనుండి ప్రమాణము లిందు చేర్కొనబడినవి. రెండవదియగు గృహస్థాశ్రమ ప్రకరణమందు వివాహానంతరము దంపతులు పాలింప వలసిన అత్యుత్తమములైన విధులంగూర్చి విపులముగ వ్రాయబడి యున్నది. 450 పుటలుండును. ఖరీదు రు 1—4—0

వలయువారు:—

వి. వి. కె. లక్ష్మోజీరావు,

గుంటూరు.

ఆంధ్రులు చదువుచున్నారు! మీరేల చదవరు!

ప్రొద్దుపొడుపుం బువ్వులు

అనగానేమి?

నిడుదవోలునుండి ప్రతివారమున కొకటి చొ॥ మూడుమాసములకుం బండ్రెండు చిన్నగ్రంథము లిట్టివే (1) నవల (2) గీతము (3) చరిత్రము (4) కథలు మొదలగునవి ప్రకటింపఁబడుచుండును. ఈ అణాగ్రంథమాల పుష్పములకే "ప్రొద్దుపొడుపుంబువ్వులని పేరు"

ఇందు

1	జగన్నాథమూర్తి (విచిత్రకథ)	0	1	0
2	సుభాషిణి (బంకించంద్రుని నవల)	0	1	0
3	మాళవిక (చమత్కార రచనము)	0	1	0
4	యతికిబ్రతి (రబీంద్రుని నవల)	0	1	0
5	మంజువాణి (చక్కని చిన్నినవల)	0	1	0
6	ఇందిర (ఉన్నతపారితోషికము నొందిన కరుణారసపూరితమగు నవల)	0	1	0
7	జలజమాలిక (ప్రభాతకుసుమము)	0	1	0
8	బసివిరెడ్డి (ఆంధ్రవర్తకశేఖరుని చరిత్ర)	0	1	0
9	పారిజాతము (పార్వతీశ్వరప్రసాదము)	0	1	0
10	చంద్రవదన (సాంఘికనవల)	0	1	0
11	భానుమతి (శాంతరస సమంజసమగు సంస్కృత నాటక కథాసారము)	0	1	0
12	తిరుమల (చరిత్రవిషయకమగు నవల)	0	1	0

అను మొదటి 12 గ్రంథములు సిద్ధముగానున్నవి.

మాదిరి పుస్తకముగోరువారు రెండణాలబిళ్లలనుపంపవలెను.

ఈ ప్రొద్దుపొడుపుం బువ్వులకు శాశ్వతచందాదారులుగ నుండగోరువారికి మూడునెలలకొకసారి పండ్రెండుగ్రంథములుగల సంపుటమును, వి. పి. ఖర్చులు మేమేభరించి 0-12-0 లకు మాత్రమే పంపెదము. వలయువారు:— సాహిత్యసమితి

నిడదవోలు,

కృష్ణాజిల్లా